Regd. No. A 136

స్వాతంత్ర్య దినోత్సవ
ప్రత్యేక సంచిక

ఆంధ్రప్రదేశ్

సంపుటి 6 సంచిక: 10

శ్రావణ-భాద్రపద 1884 శకం
ఆగస్టు, 1962





1962 జులై 7వ తేదీన రాష్ట్రపతి డాక్టర్ యస్. రాధాకృష్ణన్ 'లేక్ వ్యూ' అతిథిగృహంలో
మాజీ రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాదును కలిసినప్పటి చిత్రం.

సంపుటి 6 సంచిక: 10

స్వాతంత్ర్య దినోత్సవ
ప్రత్యేక సంచిక

ఆంధ్రప్రదేశ్

సచిత్ర మాస పత్రిక

ఆగస్టు, 1962

శ్రావణ-భాద్రపద 1884 శకం

సంవత్సర చందా:
3 రూపాయలు

విడిప్రతి వెల
25 నయాపైసలు

విషయసూచిక

ముఖచిత్రం;— గోలకొండ దుర్గంపైగల 'బాల హిస్సార్' పరిసర ప్రదేశాల దృశ్యం...

వెనుకఅట్ట మీది చిత్రం: హైద్రాబాదు జిల్లా, మేడ్చల్‌లోని ప్రాథమిక పాఠశాల బహిరంగ తరగతి.

ఆగస్టు-15

"తంగిరాల"

ఆగస్టు పదిహేను।
ఆదె చూడు, వచ్చేను।
దశదిశలు వెలిగేను।
పులకించు మనమేను॥

అఖిల భారత జాతి
ఆలపించెను గీతి।
ఈరేడు లోకాల
మారు మ్రోగెను గీతి।

జగతి తిమిరంబెల్ల
చెదరిపోవగ నేడు
పాడరా సోదరా
పరవసింపగ మేను।
ఆడవే సోదరీ
కనుల పండువగాను॥

* * *

ఝాన్సీరాణీ కత్తి
ఝళిపించె తొలుదొల్త!
తెల్లవారలగుండె
ఝల్లుమన్నదియంత॥
నాజాతి 'నానా'లు.
'టంటియా తోపీ'లు
ప్రాణాలు బలిచేసి
పోరాడి ఆనాడు...॥

బాలగంగాధరుడు
భారతాంబకు పుట్టె।
సంకెళ్లు సడలింప
యజ్ఞంబు సమకట్టె॥
హోమగుండంనుండి
ఉబికింది త్రేతాగ్ని –
"లాల్, పాల్, బాల్,"॥

'చిత్తరంజనదాసు'
శంఖంబు పూరించె
తెల్లరక్కసిగుండె
శతవ్రక్కలుగ చించె॥

ఏళ్లుపూళ్లూ కాగ
యాగంబు సాగింది....
ఋత్విక్కు 'గాంధీ'...॥
ఉపదర్శి 'నెహ్రూ'...॥

'నేతాజీ', 'అల్లూరి' +
'భగత్‌సింగు'లూ
ఘృతముగా హోమాన
ఆహుతులు అయ్యారు....।
రక్తదాహంతీర్చి
రక్కసిని తరిమారు....॥

* * *

తిమిరంబు చెదరింది...
బంధనం సడలింది...
తొలికోడి కూసింది...
తెల తెల్లవారింది॥
పసిడి రెక్కలపక్షి
పంజరం వదలింది...॥
మనసార మనఅమ్మ
ఒకసారి నవ్వింది...॥

ఆ వెలుగు – ఈ వెలుగు
ఆగస్టు పదిహేను॥
ఆరోజు – ఈ రోజు
ఆగస్టు పదిహేను॥
ఆనవ్వు – ఈనవ్వు
ఆగస్టు పదిహేను॥

\+ శ్రీ అల్లూరి సీతారామరాజు.

హైద్రాబాదులో మన రాష్ట్రపతి



డాక్టర్
యస్. రాధాకృష్ణన్



"హైదరాబాదునగరం ఉత్తర, దక్షిణాలకు సంగమస్థానం. భిన్న భిన్న మతాల మిశ్రమ సంస్కృతిని ప్రతిబింబించే "కాస్మాపాలిటన్" నగరం ఇది. జాతి మతాల సమైక్యతకు ఈ నగరం ఆదర్శప్రాయం కాగలుగుతుంది", అని రాష్ట్రపతి డాక్టర్ ఎస్. రాధాకృష్ణన్ 1962 జూలై 12 వ తేదీన హైద్రాబాదు నగరపాలక సంఘం సమర్పించిన పౌర సన్మానానికి సమాధానమిస్తూ అన్నారు. క్రమశిక్షణకు లోబడి ప్రజలు కలిసిమెలిసి కృషి చేసినట్లయితే హైదరాబాదు ప్రముఖపాత్ర వహించగలదని రాష్ట్రపతి నొక్కి చెప్పారు.

రాష్ట్రపతి డాక్టర్ రాధాకృష్ణన్ మూడు వారాలపాటు మకాంచేయడానికి జూలై 7 వ తేదీన హైద్రాబాదుకు విచ్చేసినప్పుడు బేగంపేట విమానాశ్రయంలో స్థానికులు వారికి ఘన స్వాగతమిచ్చారు. గౌరవవందనం స్వీకరించిన పిమ్మట రాష్ట్రపతి బొల్లారంలోని తమ అధికార నివాసమయిన "రాష్ట్రపతి నిలయానికి" వెళ్ళారు.

రాష్ట్రపతి లేక్‌వ్యూ అతిథిగృహంలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్‌ను కలుసుకున్నారు.

జూలై 9 వ తేదీన ఆంధ్రప్రదేశ్ గవర్నర్ "రాజభవన్" లో ఇచ్చిన విందులో పాల్గొన్నారు. ఉస్మానియా జనరల్ ఆసుపత్రిని సందర్శించారు.

డాక్టర్ రాధాకృష్ణన్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టును సందర్శించారు. ఆ సందర్భంలో హైకోర్టు న్యాయవాదుల సంఘంవారు వారికి స్వాగతపత్రం సమర్పించారు. రాష్ట్రపతి దానికి సమాధానమిస్తూ న్యాయవాద వృత్తిలోనున్నవారిని కొనియాడారు. సాంఘికమైన బాధ్యతను పెంపొందించుకొనవలసిందిగానూ, దేశ ప్రయోజనాలపట్ల శ్రద్ధ వహించవలసిందిగాను రాష్ట్రపతి న్యాయవాదులకు ఉద్బోధించారు.

డాక్టర్ రాధాకృష్ణన్ జూలై 14 వ తేదీన సచివాలయ సిబ్బంది కళాశాలను సందర్శించి, కళాశాల సిబ్బంది, సభ్యుల సమావేశంలో ప్రసంగించారు. తమ బాధ్యతల నిర్వహణలో మానవతాభావాన్ని ప్రదర్శించవలసిందిగా రాష్ట్రపతి వారికి హితవు చెప్పారు. డాక్టర్ రాధాకృష్ణన్ జూలై 14 వ తేదీన లేక్‌వ్యూ అతిథి గృహంలో డాక్టర్ రాజేంద్రప్రసాద్‌ను రెండవ పర్యాయం కలుసుకున్నారు. వైద్యుల సలహాపై డాక్టర్ రాజేంద్రప్రసాద్ వర్షాకాలం హైదరాబాదులో గడుపుతున్నారు.

రాష్ట్రపతి జూలై 22 వ తేదీన బయలుదేరి శ్రీశైలం, తిరుపతి పర్యటన చేసి తిరిగి 26 వ తేదీన హైద్రాబాద్‌కు వచ్చారు.

రెండు గ్రామాల కథ

[ఈ సంవత్సరం రెండు ఉత్తమ గ్రామాలుగా ఎన్నికైన గుడిపల్లి, మోటూరు గ్రామాల కథ ఇది. మా ప్రతినిధి ఇటీవల ఈ రెండు గ్రామాలలో పర్యటించి వచ్చారు.]

ఆ రెండు గ్రామాల అద్భుతగాధను వార్తా పత్రికలు రెండు కాలంలలో ప్రముఖంగా ప్రచురించాయి. వార్తా పత్రికలలో ఆ గ్రామాలను గురించి అంత గొప్పగా ప్రచురించడాన్ని తలచుకుంటే ప్రతి ఒక్కరికీ నేడుదేశంలో త్వరిత గతిని వస్తున్న మార్పు గోచరిస్తుంది. అంతే కాదు. ఆ రెండు గ్రామాల ప్రజలు తమ గ్రాములను భూలోక స్వర్గంగా రూపొందించడానికి రేయింబవళ్ళు తమ శక్తి సామార్థ్యాలను ధారవోసి పడిన శ్రమ కళ్ళకు కనబడుతుంది. ఆ శ్రమజీవన సౌందర్య సంగీత ధ్వని చెవులలో మార్మోగుతుంటుంది.

ముందు నల్గొండకు వెళ్ళి అక్కడి నుంచి గుడిపల్లికి వెళ్ళాలి. గుడిపల్లి గ్రామం దేవరకొండ పంచాయతీ సమితిలో వుంది. ఇదివరకు ఆ గ్రామంచుట్టూ అనేక గుళ్ళు, గోపురాలుండడంవల్ల ఆ గ్రామానికి గుడిపల్లి అనే పేరు వచ్చిందట. నిజానికి ఆ గ్రామం తెలంగాణాలోని అన్ని గ్రామాల వంటిదే— అయితే ఒకటే తేడా: ఆ గ్రామం 15 వేల రూపాయల ప్రభుత్వ బహుమతిని చేజిక్కించుకుంది. ప్రజలలోని ఉత్సాహం, పట్టుదల ఇందుకు ప్రబల కారణాలు.

తమ గ్రామం తెలంగాణా ప్రాంతంలో ఉత్తమ పంచాయతీగా ఎన్నికైనట్లు ఆ గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షుడు (ఉప సర్పంచ్) శ్రీ విడియాల రాములు ప్రకటించారు. ఆయన వయస్సు 40 సంవత్సరాలుంటుంది. ఒక మహత్కార్యాన్ని సాధించిన తృప్తి ఆయన కళ్ళలో మిలమిలా మెరుస్తున్నది. ఈ ప్రకటన వెలువడి నప్పుడు గ్రామ పంచాయతీ అధ్యక్షుడు హైదరాబాద్‌లో వున్నారు. ముప్ఫయి సంవత్సరాల యువకుడు; ఉస్మానియా విశ్వ విద్యాలయ పట్ట భద్రుడు. శాంత స్వభావుడు. చూపులో నిర్లిప్తత గోచరిస్తుంది. మితభాషి. అయన నోటినుంచి రెండు ముక్కలు వెలువడేసరికి బ్రహ్మ ప్రళయం అయింది.

"ఈ వార్త వినగానే మీరేమనుకున్నారు? టెన్సింగ్ ఎవరెస్ట్ శిఖరా రోహణ చేసినట్లు, గగారిన్ అంతరిక్షంలో దిగ్విజయ యాత్ర చేసి వచ్చినంతగా భావించారా?" అని అడిగాం మేము.

ఆయన పెదవులపై సన్నని చిరునవ్వు నృత్యం చేసింది.

"నా బాధ్యత ఇప్పుడు మరీ ఎక్కువైనట్లు భావించుకుంటున్నాను." అని ఆయన జవాబిచ్చారు.

రెండు వేల ఐదు వందల మంది జనభా వున్న ఆ కుగ్రామాన్ని ఉత్తమ పంచాయతీగా నిర్ణయించడం ఆ గ్రామ చరిత్రలో ఒక గణనీయమైన సంఘటన. దురదృష్ట వశాత్తు ఆ గ్రామం 1948 లో అగ్ని దేవునికి బలియై దగ్ధమైంది. గ్రామీణుల కున్నదంతా బూడిద పాలైంది. అంతమాత్రాన వారు నిరాశాపూరితులు కాలేదు. వారిలోని ఉత్సాహం అణగార లేదు. వారు స్వయంసహాయంతో మళ్ళీ ఇళ్ళు కట్టుకున్నారు. మళ్లీ గ్రామం పునర్నిర్మిత మైంది. వారి స్వయం శక్తికి తోడుగా ప్రభుత్వం కూడా సహాయాన్ని ఇచ్చింది.

ఆ సమితి ప్రాంతంలో పన్నులను విధించి వాటిని పూర్తిగా వసూలు చేసిన మొదటి గ్రామం అనే ఖ్యాతి గూడా గుడిపల్లికి దక్కింది. తను ఇంటింటికీ వెళ్ళి పన్నులను చెల్లించవలసిందని ఎలా విజ్ఞప్తి చేసిందీ, అవి తమ సంక్షేమానికీ అభివృద్ధికీ తోడ్పడుతాయని ప్రజలకు ఎలా నచ్చచెప్పిందీ పంచాయతీ అధ్యక్షుడు తెలిపారు. ఈ పద్ధతి ఫలవంతమైంది.

ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణానికి ప్రజలు పదివేల రూపాయల మొత్తాన్ని విరాళంగా ఇచ్చారు. ఈ పని త్వరలోనే ప్రారంభమవుతుంది. ప్రస్తుతం ఆ కేంద్రాన్ని పంచాయతీ గృహాలలోనే ఏర్పాటు చేశారు. ఆ కేంద్రంలో సగటున ప్రతిరోజూ 120 మంది చికిత్స పొందుతున్నారు. సమాజంలో వెనుకబడిన వర్గాలకు చెందిన లంబాడీలు మొదలైనవారి నుంచి పూర్తి సహ

కారం లభించడం ఇక్కడ గణనీయమైన విషయం. ప్రణాళికల వల్ల కలిగే లాభాలు వారినమితంగా ఆకర్షించాయి. శ్రీ సముద్రాల మారయ్య అనే ఒక స్థానిక వర్తకుడు వెయ్యి రూపాయల విరాళాన్నిచ్చారు. రోడ్లు, మంచినీటి బావుల త్రవ్వకం, పంచాయతీ భవన నిర్మాణం, పాఠశాల భవనాల విస్తరణ, హాస్టల్ నిర్మాణానికి ప్రజలు 11 వేల రూపాయలను విరాళంగా ఇచ్చారు.

ఆ గ్రామంలోని ఉన్నత పాఠశాల అనన్య సాధ్యమైన ఫలితాలు సాధించింది. గత సంవత్సరం ఆ పాఠశాలలో నూటికి 99.99 మంది ఉత్తీర్ణులయ్యారు. "ఆరవ తరగతిలో మాత్రం ఒకే ఒక విద్యార్థి పరీక్ష తప్పాడు" అని ఆ పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులైన శ్రీ దామెర పాండురంగారావు తెలిపారు. ఆ పంచాయతీలోని యువజనుల క్లబ్బు సమితి స్థాయిలో వివిధ క్రీడలలో ఎక్కువగా బహుమతులనిచ్చింది.

గ్రామ పురోభివృద్ధికై ఆ పంచాయతీ ఒక సమైక్య ప్రణాళికను రూపొందించి రవాణా సౌకర్యాలు, బావులు, మురుగు పారుదల, వీధి దీపాలు మొదలైనవాటికి సంబంధించిన 16 కార్యక్రమాలను చేపట్టింది. ఆ పంచాయతీ మందుచల్లే స్ప్రేయర్లు, కలుపుతీసే సామగ్రి మొదలైన వ్యవసాయ సామగ్రిని కొని రైతులకు ఉచితంగా ఇచ్చింది. పారిశుధ్యం, గ్రామీణ ఆరోగ్యం, పశువుల అభివృద్ధి కార్యక్రమాలలో అక్కడ చెప్పుకోదగిన కృషి జరిగింది. నాలుగు వందల పుస్తకాలు గల ఒక గ్రంథాలయం, ఒక పయోజన విద్యా కేంద్రం, స్త్రీలకు సవారు నేత శిక్షణ కేంద్రం కూడా నెలకొల్పబడినవి.

ఆ గ్రామంలో వరి, ఆముదాలు ముఖ్యమైన పంటలు. గ్రామ పంచాయతీవారు పంచాయతీసమితి సహకారంతో గ్రామంలోని చెరువును బాగు చేయించారు. ఇందువల్ల అదనంగా మూడు వందల ఎకరాలు సాగుక్రిందకు వచ్చాయి.

నల్గొండ-దేవరకొండ రోడ్డును కలుపుతూ రెండుమైళ్ళ పొడవుగల ఒక రోడ్డును వేశారు. ఈ రోడ్డు నిర్మాణానికి తొమ్మిది వేల రూపాయల ఖర్చు అయింది. ఈ ఖర్చులో మూడింట ఒక వంతును ప్రజలే భరించారు. ఇప్పుడు నల్గొండ-దేవరకొండ బస్సు గుడిపల్లి మీదుగా వెడుతున్నది.

గ్రామంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధికి ఆ పంచాయతీ ప్రత్యేకశ్రద్ధ తీసుకున్నది. గ్రామంలోని హరిజనులకై 11 బావులను త్రవ్వారు. వెనుకబడిన కులాలు, నిమ్న జాతులవారి అభివృద్ధికై ఇంతవరకూ రూ. 19,630 లను ఖర్చు పెట్టారు. "విద్యార్థులు హాస్టల్‌లో చేరడానికి అర్హత లేవిటి"? అని మేము పంచాయతీ అధ్యక్షుడిని అడిగాం. దానికాయన "కుల ప్రసక్తి లేకుండా బీద విద్యార్థులందరినీ చేర్చుకుంటాం. కుల వ్యవస్థలో మాకు నమ్మకం లేదు. ఆర్థిక పరిస్థితులే విద్యార్థుల అర్హత" అన్నారు. నవభారత్ కంఠస్వరం విన్నట్లయింది మాకు.

బహుమతిగా వచ్చిన 15-వేల రూపాయలను ఏవిధంగా ఖర్చుపెడతారని అడిగాం. వ్యవసాయం, నీటి సరఫరా, రోడ్ల నిర్మాణానికి వెచ్చిస్తామని ఆయన జవాబిచ్చారు. "మాకు విద్యుచ్ఛక్తి కూడా కావల్సి వుంది. అయితే తుది నిర్ణయం గ్రామసభ తీసుకోవాలనుకోండి." అని కూడా అన్నారు.

ఆ తర్వాత మేము ఆయన సంతానాన్ని గురించి అడిగాం "నేను ఇద్దరు మగపిల్లల తండ్రిని. నాకు కుటుంబ నియంత్రణ పట్ల నమ్మకం వుంది. మా గ్రామంలో ఒక కుటుంబ నియంత్రణ చికిత్సాలయాన్ని కూడా ప్రారంభించాం" అన్నారాయన. ఒకరికి చెప్పేముందు చేసిచూపించడం మంచిది. ఉత్సాహవంతుడైన, ఒక యువ పంచాయతీ అధ్యక్షునితో ఆ గ్రామం సౌభాగ్యాన్ని సంతరించుకున్నది. సమాజాభివృద్ధి కార్యక్రమాన్ని అమలు జరిపిన తర్వాత దేశంలో వచ్చిన వినూత్న జీవనానికి చిహ్నం గుడిపల్లి. ఒక దశాబ్దంకిత్రం నల్గొండ జిల్లావంటి వెనుక బడిన ప్రాంతంలో అభివృద్ధి కార్యక్రమాలను గురించి మనం ఆలోచించి వుండక పోవచ్చు. కాని నేడు ఆ ప్రజలే ఒక మహోన్నత స్థానాన్ని పొందారు. వారు ఎంతో కృషి చేశారు. ముమ్ముందు ఇంకా చేస్తారు కూడా!

నల్గొండ జిల్లాలోని గుడిపల్లి నుంచి కృష్ణా జిల్లాలోని మోటుపల్లికి అట్టే దూరం లేదు. ఈ రెండు గ్రామాలు—రెండు వైపులా అందాలు చిందే చిత్రాలు కల—ఒక చిత్రపటంలా వున్నాయి. మోటూరు గ్రామ ప్రజలు తమ పంచాయతీని ఆంధ్రలో ఉత్తమ పంచాయతీగా ఎన్నిక చేసినట్లు ఎలా తెలుసుకున్నారో తెలుసా? ఒక రోజు యిన్‌స్పెక్షన్ కోసం గుడివాడనుంచి ఆ గ్రామానికొచ్చిన మత్స్యశాఖ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టరొకరు ఈ వార్త తెలుసుకొని ఆ సంతోషాన్ని నిలుపుకోలేక ఆ వార్తను గ్రామీణులకు చదివి వినిపించి వారి నభినందించారు.

" ఈ వార్త వినగానే మీకేమనిపించింది " అని బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసరు నడిగాం మేము.

"ఇంకా పెద్ద బహుమానాలను పొందడానికి మేము కృషి చేస్తే బాగుండేదనిపించింది " అన్నారాయన.

ఎక్కడా వేలుపెట్టి చూపించడానికి వీల్లేని పారిశుద్ధ్యం, అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనాలనే ప్రజల అకుంఠితమైన

దీక్ష మోటూరు పంచాయతీ విశిష్ట లక్షణాలు. మేము ఆ పంచాయతీలోని రైతులను, గృహిణులను, పంచాయతీ సభ్యులను కలుసుకున్నాం. ప్రణాళికా శకానికి ముందు అక్కడ రోడ్లు అధ్వాన్నంగా వుండేవని వారందరూ ముక్తకంఠంతో చెప్పారు. ప్రక్క గ్రామానికి వెళ్ళడమంటే కష్టసాధ్యమయ్యేదట. కాని వారు నేడు తమ రోడ్లను గురించి సగర్వంగా చెప్పుకుంటున్నారు. ఆ రోడ్లే ఆ గ్రామానికి గర్వకారణం.

మోటూరు పంచాయతీ సమితి కేంద్రస్థానం మోటూరు. జనాభా మూడు వేలుంటుంది. ఆ పంచాయతీ విశిష్టత ఏమంటే అది వ్యవసాయ భూములపై ఎకరానికి పదిరూపాయలు చొప్పున ప్రత్యేక పన్నును విధించి 1960–61 సంవత్సరంలో రూ. 27,852 లను వసూలు చేసింది. ఆ సంవత్సరంలో మొత్తం రూ. 36,264 ల పన్నులు వసూలయ్యాయి.

గ్రామీణ ప్రాంతాలలో మార్పు రావడంలేదని ఎవరనగలరు? అన్నారు పంచాయతీ ఉపాధ్యక్షులైన శ్రీ సేలంకాయని గంగాధరరావు. ప్రణాళికల పుణ్యమా అని మంచి జీవితాన్ని గడపాలనే ఇచ్ఛ ప్రజలలో ఏర్పడింది. "ఈ ప్రణాళికలొచ్చాక, గ్రామానికి మురుగునీటి పారుదల అవసరాన్ని గురించి మా యావిడ కూడా నాతోచెప్పేది" అన్నారాయన నవ్వుతూ. ఇప్పుడా గ్రామంలో మురుగునీటి కాల్వలు ఏర్పడినయ్.

గ్రామంలో వరి ముఖ్యమైన పంట. ఆ గ్రామీణులు వ్యవసాయంలో ఆధునిక విధానాల నవలంభించారు. మీరు నమ్మండీ నమ్మకపోండి, ప్రతి ఇంటి ప్రక్కనా ఒక్కొక్క ఎరువుగోతిని త్రవ్వారు. ఆ గ్రామంలో చెరువు ఎప్పుడూ ఆకూ, అలముతో దోమలకు నిలయంగా వుండేది. మలేరియా, ఫైలేరియా వ్యాధులు ఉధృతంగా వస్తుండేవి. ఒక ఉదయాన ఏవరో ఒక మేధావియైన యువకునికి మెరుపులాంటి ఆలోచన తట్టింది—ఆకూ అలముని ఎరువుగా తయారు చేయడానికి ఎందుకుపయోగించుకో కూడదని: ఈ ఆలోచన వచ్చిందే తడవుగా అతను పంచాయతీ అధ్యక్షుడైన శ్రీ ఘంటా కృష్ణమూర్తి దగ్గరకు పరుగెత్తాడు. ఆయన వయస్సు 40 సంవత్సరాలుంటుంది. అకుంఠితమైన దీక్షకల వాడాయన. వెంటనే ఆ ఆకూ అలముని తీసివేయడం ప్రారంభించారు. పంచాయతీ అధ్యక్షుని దగ్గిరనుంచి వీధిలో పేడ పోగుచేసుకునే పిల్లవరకు ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పంటలకు వచ్చేవ్యాధులు, పట్టే తెగుళ్ళ నివారణకై ఆ పంచాయతీ ప్రత్యేక సామగ్రినికొని వాటినుపయోగించుకోడానికి రైతులకిచ్చింది ఆ గ్రామంలో ఒక పెద్ద సహకార సంఘంవుంది. దానికి 32 వేల రూపాయల ఖరీదయిన ఒక గిడ్డంగి కూడా వున్నది. ఆ సహకార సంఘం భవన నిర్మాణానికి శ్రీ జి. నాగభూషణం ఐదు వందల చదరపు గజాల స్థలం దానం చేశారు. ఆ సహకార సంఘం ఎరువులను పంపకం చేస్తుంది. ఇనుము, ఉక్కు విక్రయానికి కూడా సంఘానికి అధికారం వుంది. ఆ ప్రాంతంలోని అన్ని కుటుంబాలకు ఆ సంఘంలో ప్రాతినిధ్యం వుంది.

41 మంది సభ్యులతో అక్కడ ఒక గ్రామ రక్షణ సంఘం వుంది. భవనాలు, చెరువులు, రోడ్లకు సంబంధించిన 20 కార్యక్రమాలను ఆ పంచాయతీ చేపట్టింది, కొబ్బరి మామిడి చెట్లను నాటింది. వివిధ సౌకర్యాలను కల్పించడానికై ఆ పంచాయతీలో నూటికి 89 కుటుంబాలు విరాళాలనిచ్చాయి. 1959వ సంవత్సరం నుంచి చేపట్టిన కార్యక్రమాలకు ఖర్చు రూ. 5,17,100 లు, వాటిలో రూ. 1,16,067 లు ప్రజలనుండి విరాళాలుగా వచ్చినవే,

ఆ గ్రామానికి 1958 ఫిబ్రవరిలో విద్యుచ్ఛక్తి వసతి కల్పించారు. ప్రస్తుతం ఆ గ్రామంలో 64 వీధి విద్యుద్దీపాలున్నాయి. అంతేగాక గ్రామంలో ముఖ్యమైన రోడ్ల కూడలిలో ఎనిమిది ఫ్లోరోసెంట్ దీపాలను ఏర్పాటు చేశారు. ఉన్నత పాఠశాల భవన నిర్మాణానికై చిన్నా, పెద్ద రైతులు ముందుకువచ్చి 57వేల రూపాయల విరాళాల నిచ్చారు.

స్త్రీల సంక్షేమానికి స్థానిక మహిళా మండలి గణనీయమైన కృషి చేస్తున్నది. భవన నిర్మాణానికి ఆ మండలి తొమ్మిదివందల రూపాయలను సేకరించింది.

హరిజన వాడలోవున్న చెరువులను, రోడ్లను ఆ పంచాయతీ మరమ్మతు చేయించి, బాలల పార్కును, వీధి దీపాలను, మరుగుదొడ్లను హరిజన వాడలో నిర్మించింది. అర్హులైన బాలబాలికలకు ఉచిత మధ్యాహ్న భోజనవసతిని కల్పించింది. మేలుజాతి కోడి పిల్లలను, పందులను, విత్తనాలను హరిజనులకు సరఫరా చేసింది.

ఆ గ్రామ ప్రజలువార్తలు తెలుసుకోడానికి వీలుగా అక్కడ ఒక 'వార్తల బల్ల' ను ఏర్పాటు చేశారు. ఆ బోర్డుపై తాజా వార్తలను సీమసున్నంతో వ్రాస్తారు. వాటిని ఆ గ్రామస్థులు ఎంతో ఉత్సాహంతో చదువుతుంటారు.

ప్రభుత్వం బహుమతిగా ఇచ్చిన 15 వేల రూపాయిలను ఎలా వెచ్చిస్తారని మేం అడగ్గా రోడ్లకు తారు వేయడానికుపయోగించే సామగ్రిని కొంటామని శ్రీ కృష్ణమూర్తి జవాబిచ్చారు. "అంతేకాదు. మేము ఒక ఆయిల్ ఇంజన్‌ను కూడా కొనవచ్చు" అన్నారాయన.

"తెలిసీ తెలియని విమర్శకులు, ప్రజాస్వామ్యవికేంద్రీకరణ విఫలమైందని అంటారు. ఎప్పుడూ అపశకునాలు పలుకుతారు. వాళ్లేంమాట్లాడుతున్నారో వాళ్ళకేఅర్థంకాదు. మాకుఇంకా వికేంద్రీకరణకావాలి. దాన్నే మేం వాంఛిస్తున్నానాం. మన సమాజంలోని లోటుపాట్లను పంచాయతీరాజ్యం ఒక్కటే నిర్మూలించగలదు." అని కూడా అన్నారాయన స్థిరచిత్తంతో. ఆ తర్వాత మేము ఆయన దగ్గర్నించి బయల్దేరి వచ్చేశాం. ప్రాచీన భారతదేశ వైభవం మా మనసుల్లో మెదిలింది. అప్పుడు మా కనిపించింది– మనం ధర్మపథంలోనే నడుస్తున్నామని. నేటి ఆధునిక భారతదేశపు సౌభాగ్యం లక్షలాది పంచాయతీ అధ్యక్షుల, ఉపాధ్యక్షుల కృషిమీద, వారు సాధించే ఫలితాలమీద ఆధారపడి వుంటుంది.

వారు ఎంతో ధన్యులు–ఎందుకంటే వారికి కృషి విలువ తెలుసు.

వెలుగుబాటలు

"ఉదయభాను"

నార్వే, జపాన్ లాటి దేశాల జాతీయ ఆదాయంలో 60 శాతం వరకూ మత్స్య పరిశ్రమ, దానికి సంబంధించిన యితర పరిశ్రమలద్వారా లభిస్తున్నదంటే దేశ ఆర్థిక వ్యవస్థలో యీ పరిశ్రమ పాత్ర ఎంత ప్రధానమైనదో స్పష్టపడుతుంది. మనకున్న సహజ సంపదలలో యిది ఒకటి.

మనదేశంలో మనిషికి రోజుకు 6.65 గ్రాముల మాంసకృత్తులు లభిస్తున్నాయి. వీటిలో మూడోవంతు చేపలవల్లనే లభిస్తున్నది. నిజానికి మాంసకృత్తులను చౌకగా, సామాన్యులకు అందుబాటులో ఉండేటట్లు లభింపజేసేవి చేపలేనని చెప్పవచ్చును.

ఆంధ్రప్రదేశ్‌కు — దేశంలో ఏ రాష్ట్రానికీ లేనంత—600 మైళ్ళ తీర ప్రాంతం ఉంది. ఇంకా 8 లక్షల ఎకరాల విస్తీర్ణంగల జలాశయాలు, నాలుగు లక్షల ఎకరాల కమ్మ ప్రాంతాలు ఉన్నాయి. సముద్రంలోచేపలుపట్టి జీవించే బెస్తలు మన రాష్ట్రంలో 17600 మంది 350 గ్రామాలలోఉన్నారు. వీరి దగ్గర 2000 పడవలు, 10504 వలలు ఉన్నవి.

కొన్ని సంవత్సరాలక్రితం వరకూ మన రాష్ట్రంలో మత్స్య పరిశ్రమ శాఖ పశు సంవర్ధక శాఖలో అంతర్భాగంగా ఉండేది. ఇప్పుడు యీ శాఖను వేరుచేసి ప్రత్యేక డైరక్టరేట్‌ను నెలకొల్పడం జరిగింది. శ్రీ జి. వి. ఎస్. మణి, ఐ. ఏ. ఎస్. ప్రస్తుతం మత్స్యపరిశ్రమ శాఖకు డైరక్టర్‌గా ఉన్నారు. ఈ శాఖ పర్యవేక్షణలో రాష్ట్రంలో యీ పరిశ్రమాభివృద్ధికి విస్తృతమైన కృషి జరుగుతున్నది.

చేపలు లభించే ప్రాంతాలు

సముద్ర తీరంగాక గోదావరి, కృష్ణ, పెన్నా-నదులు, పశ్చిమ గోదావరి జిల్లాలోని కొల్లేరు నెల్లూరు జిల్లాలోని పులికట్టవంటి పెద్ద పెద్ద సరస్సులు, నిజాంసాగర్, కనిగిరి రిజర్వాయర్లు, రాష్ట్రం అంతటా విరివిగా ఉన్న అనేక వేల చెరువులలో కూడా చేపలు విస్తారంగా లభిస్తున్నాయి. వీటిలో కొన్నిచోట్ల — చేపపిల్లల్ని పట్టకుండా చేయడానికి-బెస్తలకు కొన్ని నియమ. నిబంధనలు అమలు జరపబడుతున్నాయి.

సముద్రతీరం

రాష్ట్రంలోని 600 మైళ్ళ తీరప్రాంతాన్ని మూడు ప్రాంతాలుగా విభజించవచ్చును. శ్రీకాకుళం జిల్లా పెద్దకరివాని పాలెంనుండి తూర్పుగోదావరి జిల్లా ఉప్పాడవరకూ ఉత్తరభాగం. అక్కడి నుండి గుంటూరు జిల్లా నిజాం పట్నం వరకూ మధ్య ప్రాంతం. అక్కడినుండి నెల్లూరు జిల్లా పులికట్ట సరస్సువరకు దక్షిణ ప్రాంతం.

ఉత్తర ప్రాంతంలో బెస్తలు పూర్తిగా చేపలు పట్టడంలోనే నిమగ్నమై ఉంటారు. మధ్యప్రాంతంలో ఉప్పాడ, కాకినాడలలో మినహా మిగిలిన చోట్ల దాన్ని ఉపవృత్తిగానే స్వీకరిస్తారు. దక్షిణ ప్రాంత సముద్రంలో పగడాలు లభిస్తాయి.

సాధారణంగా తీరంలో పది నిలువెత్తుల లోతున్న ప్రాంతంలోనే చేపలు పట్టబడుతున్నవి. 15 నుండి 30 నిలువెత్తుల లోతుకు పోవడానికి తెర పడవలు ఉపకరించవు. ఎఫ్.ఏ.ఓ. మత్స్య పరిశ్రమ ఇంజనీర్ యిటీవల చేపలు ఉండే ప్రాంతాలపై కొంత సర్వేజరిపారు. మన రాష్ట్రంలో కూడా యీ విధంగా సర్వేజరిపించి చేపలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలేవో స్పష్టపరచడానికి ఎఫ్. ఏ. ఓ. నిపుణుని సహాయం తీసుకోవాలని సంకల్పించబడింది. ఈ వివరాలు తెలియక మనరాష్ట్రంలోని బెస్తలు ప్రాచీనమైన దేశీయ విధానాలనే అవలంబిస్తున్నారు.


పరిశ్రమాభివృద్ధి

చేపలు విస్తారంగా లభించే ప్రాంతాల పట్టికలు రూపొందించడం, సముద్రంలోని చేపల్ని పట్టడానికి తగినబోట్లు, పరికరాల్ని రూపొందించడం, యీ సంపదను అధికంగా వినియోగించుకొనేటట్లు బెస్త

లకు శిక్షణ యివ్వడం, ఆలుచిప్పల సేకరణ, చేపల పరిరక్షణ, వాటినుండి యితర పదార్థాల్ని తయారు చేసే విషయమై ప్రత్యేక కృషి జరుగుతున్నది.

ఉష్ణదేశాలలో చేపలు తొందరగా చనిపోతూ ఉంటాయి. బెస్తలు తాము పట్టిన చేపలలో మిగులును ఉప్పులోవేసి ఎండ బెట్టి విక్రయిస్తారు

రాష్ట్రంలోని మత్స్య పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యల్ని తీసుకొంటున్నది. దాని వలన ప్రభుత్వం విదేశీ మారకాన్ని సంపాదించవచ్చును. బెస్తల ఆర్థిక వ్యవస్థను పెంపొందించవచ్చును. తృతీయ ప్రణాళిక మొత్తానికి మత్స్య పరిశ్రమకు రు. 115 లక్షలు కేటాయించబడినవి. 1962–63 బడ్జెట్‌లో రు. 40.75 లక్షల మొత్తం కేటాయించబడింది. ఇందులో రు. 17.83 లక్షలు ప్రణాళికా పథకాలకు, రు. 22.9 లక్షలు ప్రణాళికేతర పథకాలకు వినియోగించబడుతుంది. రు. 6.13 లక్షలు వివిధ పథకాల క్రింద ఋణాలుగా యివ్వబడుతాయి.



మత్స్య పరిశ్రమలో శిక్షణ, మత్స్య కేంద్రాల స్థాపన, చేపపిల్లల సేకరణ, పంపిణీ, పడవలకు యంత్రాలు అమర్చడం, మంచు మరియు కోల్డుస్టోరేజి యంత్రాగారాల స్థాపన, షార్క్‌లీవర్ ఆయిల్ ఫ్యాక్టరీల స్థాపన, చేపల హార్బర్ల నిర్మాణం, చేపలు పట్టడానికి కృత్రిమదారపు వలలు, ట్వైన్ తెప్పలు, గాలాలు మొదలయిన పరికరాల సరఫరా, 20 బ్లాకులలో విస్తృత ఆహార కార్యక్రమాన్ని అమలు పరచడం, నాగార్జున సాగర్ వద్ద మత్స్య కేంద్రాన్ని నెలకొల్పడం, రిజర్వాయర్లలో చేపలను అభివృద్ధి చేయడం మత్స్యపరిశ్రమ శాఖ అమలు జరుపబోయే పథకాలలో ముఖ్యమైనవి.

చేప పిల్లల సేకరణ, పంపిణీ

తొందరగా పెరిగే చేప పిల్లల్ని సేకరించి రాష్ట్రంలో పలి జలాశయాలలో నిల్వచేయడం జరుగుతుంది. మరికొన్ని రాష్ట్రాలనుండి వీటిని కొనడం కూడా జరుగుతుంది.

ఉప్పు సరఫరా

అదనపు చేపల్ని నిల్వచేసుకోగోరే బెస్తలు అవి చెడిపోకుండా శాస్త్రీయ పద్ధతులలో ప్రభుత్వ క్యూరింగ్ కేంద్రాలలో క్యూర్ చేసుకోడానికి ఉచితంగా ఉప్పు యివ్వబడుతుంది. ఇలా చేస్తున్నది మన రాష్ట్రం ఒక్కటే:

దేశీయాలైన బోట్లు

ప్రస్తుతం బెస్తలు ఎక్కువగా తెరచాపలున్న పడవలు, బోట్లు వాడటం వలన అవి చేపలున్న ప్రదేశాల్కి త్వరితగతిని చేరలేకపోతున్నాయి. అందువలన పడవలకు యంత్రాలు అమర్చే కార్యక్రమం చేపట్టబడింది. సబ్సిడీ ధరలకు యాంత్రిక పడవల్ని శిక్షితులైన బెస్తవారికివ్వడం జరుగుతున్నది. కాకినాడలోని శిక్షణ కేంద్రంలో బెస్తవారికి శిక్షణ యివ్వడం జరుగుతున్నది. ఇప్పటికి 47 మరపడవలు పంపిణీ చేయబడినవి. ఈ సంవత్సరం 47 పంపిణీ చేయబడుతాయి.

రవాణా సౌకర్యాలు

చేపలు త్వరితంగా చెడిపోతాయి గనుక వాటిని జాగ్రత్తగా పరిరక్షించడానికి, త్వరితగతిని పంపిణీ ఏర్పాట్లు కావించడం అవసరం. అనేక "బెస్త"గ్రామాలకు యిలాంటి సత్వర రవాణా సౌకర్యాలు లేవు. అందువల్ల మత్స్య పరిశ్రమ శాఖ అనేక వేన్‌లు కేరియర్ బోట్లు కాని స్వల్ప ఛార్జీలకు రవాణా చేస్తున్నది.

వలలు

మామూలు వలలు చాల బలహీనంగా ఉండటంవలన ఒక్కొకసారి చేపలు త్రెంచుకొని తప్పించుకొని పోతాయి. అందువలన ప్రభుత్వం తగ్గింపు రేట్లకు నైలాన్ వలలు; టెరివిన్‌లను సరఫరాచేస్తున్నది.

చెరువుల అభివృద్ధి

శాస్త్రీయ పద్ధతులపై చెరువులను అభివృద్ధిపరిచే కార్యక్రమం చేపట్టబడింది. అనేక చెరువులు ముందుగా సర్వే చేయబడుతాయి. వాటిలో చేపపిల్లల్ని నిల్వచేయడం జరుగుతుంది.

మత్స్య కేంద్రాలు

రాష్ట్రంలో విరివిగా మత్స్య కేంద్రాలు నెలకొల్పబడి పని చేస్తున్నవి. ప్రయోగాత్మకమైన కేంద్రాలు కొన్ని పని చేస్తున్నవి. వీటిలో నిలువ చేయబడిన చేప పిల్లల్ని చేపల్ని పెంచడంలో అభిరుచి గలవారికి పంపిణీ చేస్తారు.

లోతు నీటిలో చేపలు పట్టడం

లోతు నీటిలో కూడా చేపలు పట్టేందుకు ప్రయోగాలు విరివిగా జరుగుతున్నవి. లోతునీటి చెరువులు అనేకం అలాగే ఉండిపోతున్నవి. కొందరికి లోతునీట చేపలు పట్టడం తెలియక పోవడం కూడా యిందుకు దోహదం చేస్తున్నది. అందువల్ల నైలాన్ వలలతో లోతునీట చేపలుపట్టేందుకు ప్రయోగాలు జరుగుతున్నవి.

రోడు సౌకర్యాలు

"బెస్త" గ్రామాలు చాలా వరకు రవాణా సౌకర్యాలు లేకుండా ఉండటంవల్ల సత్వరం చేపల్ని రవాణా చేయడానికి ప్రతిబంధకం అవుతున్నది. అందువలన ఈ గ్రామాలలో విస్తృతంగా రోడ్లు వేసే కార్యక్రమం అమలు జరుగుతున్నది.

బెస్తవారికి శిక్షణ

మరపడవల్ని ఉపయోగించడంలో బెస్తవారికి శిక్షణ ఇచ్చే కార్యక్రమం కూడా అమలు జరపబడుతున్నది. శిక్షణ పొందిన వారికి మరపడవలు కేటాయించబడుతున్నాయి. ఇప్పటికే వారిలో 70 శాతానికి మరపడవలు లభించాయి. ఇక 30 శాతం మిగిలి ఉన్నారు. మరపడవల్ని నిర్మించేందుకు కాకినాడలో ఒక కర్మాగారం నెలకొల్పబడింది. ఒక బోటు నిర్మాణానికి రు. 13,000 ఖర్చవుతుంది. ఒక్కొక్కటి రు. 5000 విలువ చేసే ఇంజన్‌లను మాత్రం విదేశాల నుండి దిగుమతి చేసుకోవాలి.

మత్స్య పరిశ్రమలో శిక్షణ

మత్స్య పరిశ్రమ శాఖలో ఇన్‌స్పెక్టర్లు, అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్లు, ఓవర్సీర్లు, ఫీల్డుమెన్‌లాటి వారందరికీ విస్తృతమైన శిక్షణగరపబడుతుంది. దీనివలన మత్స్యపరిశ్రమాభివృద్ధికి మరింత ఉపయోగకరంగా ఉంటుందని ఆశించబడుతున్నది.

చేపలు పెంచేవారికి ఋణాలు

తమతమ చెరువుల్ని అభివృద్ధిపరిచి చేపల్ని పెంచేందుకు ప్రయివేటు వ్యక్తులకు సహాయం చేసే నిమిత్తం వారికి ఋణాలిచ్చే పద్ధతిని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ పథకంలో సులభ దఫాలలో, సరసమైన వడ్డీతో వారు ఋణాల్ని తిరిగి చెల్లించవచ్చును.

బ్లాకులలో మత్స్య పరిశ్రమాభివృద్ధి

పంచాయతీరాజ్‌ను ప్రవేశపెట్టడంతో పంచాయతీసమితి బ్లాకు ప్రాంతాలలో మత్స్య పరిశ్రమాభివృద్ధి కృషి విస్తృతపరచబడుతున్నది. కొన్ని నిర్ణీత బ్లాకులలో ముందుగా యీ కృషి ద్విగిణీకృతం చేయబడింది.

షార్కు చేప నూనె

మరపడవల్ని ప్రవేశపెట్టడంతో షార్కు చేపలు ఎక్కువగా లభిస్తున్నవి. అందువలన బెస్తవారి నుండి కొని వాటి నుండి కూడా నూనె తీసేందుకు ఉప్పాడ, పాతపట్నం, నిజాంపట్నం, శ్రీకాకుళం మున్నగు చోట్ల కేంద్రాలు పనిచేస్తున్నవి. సుమారు 5 వేల పౌన్ల నూనె యీ విధంగా లభిస్తున్నది. రు. 1.90 లక్షల ఖర్చుతో కాకినాడలో నూనె తీసే ఫ్యాక్టరీని నెలకొల్పాలని సంకల్పించబడింది. దానిని ప్రభుత్వ రంగంలో నెలకొల్పాలా ప్రయివేటు రంగంలోనా అనే విషయాన్ని ప్రభుత్వం ఇంకా నిర్ణయించలేదు.

విస్తృతాహార పథకం

విస్తృతాహార కార్యక్రమం క్రింద ఎన్నుకోబడిన చెరువులలో చేపల పెంపకం జరుగుతున్నది. దీనికి కొంత సామగ్రిని "యునిసెఫ్" సంస్థ యిస్తున్నది. ఈ కార్యక్రమంలో పట్టిన చేపలు సరిగా ఆహారం లభించని పిల్లలకు గర్భిణీ స్త్రీలకు ఉచితంగా పంచబడుతాయి.

చేపల ఎగుమతి

ఎండు చేపలు, రొయ్యల ఎగుమతి వలన విశేషంగా విదేశీ మారకం లభిస్తుంది. అమెరికాలో కూడా వీటికి మంచి డిమాండ్ ఉంది. భారత ప్రభుత్వ వ్యవసాయ శాఖవారి ఆధ్వర్యంలో ఎగుమతిని-ప్రత్యేకించి చలవ చేసిన ప్రాసెస్ చేసిన రొయ్యల ఎగుమతిని-వృద్ధి చేయడానికి తీవ్ర ప్రయత్నాలు చేయబడుతున్నవి. విశాఖపట్నంలో నెలకొల్పబడిన శీతల గిడ్డంగి (కోల్డు స్టోరేజి) లో ఏర్పాటు చేయబడుతున్న దేవ్‌ఫ్రేజ్ యూనిట్ ప్రయివేట్ సంస్థ ఎగుమతికోసం రొయ్యలను చలవచేస్తుంది. ఇప్పటికే ఒక ప్రయివేటు సంస్థ ప్రయోగాత్మకంగా చలవచేసిన ఒక టన్ను రొయ్యల్ని విశాఖపట్నం నుంచి అమెరికాకు ఎగుమతి చేసిందికూడా. అకివీడు ప్రాంతం నుంచి, పులికట్ట ప్రాంతం నుంచి, ఎండు రొయ్యలు

సగం ఎండిన రొయ్యలు కలకత్తా, మద్రాసు రేవుల గుండా బర్మాకు దూర ప్రాచ్యానికి ఎగుమతి చేయబడుతున్నాయి. ఈ పథకం యింకా విస్తృతం చేయబడుతుంది.

కొత్త బడ్జెట్

1962_63 సంవత్సరానికి మత్స్యపరిశ్రమ శాఖ బడ్జెట్ పద్దుల్ని మంత్రి శ్రీ మల్లిపూడి పళ్ళంరాజు రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెడుతూ మూడో ప్రణాళికా కాలంలో యీ శాఖ పథకాల మూలంగా చేపలఉత్పత్తి జలాశయాలలో మరో 30,000 టన్నులు సముద్ర జలాలలో 3,800 టన్నులు- అధికమౌతుందన్నారు. దాని మూలంగా రు. 3.38 కోట్ల ఆదాయం లభిస్తుంది. తెలంగాణ ప్రాంతంలో రిజర్వాయర్లు దశలవారీగా అభివృద్ధి కాగలవు. నిజాం సాగర్ రిజర్వాయరు ప్రతిరోజూ ఒకటన్ను చేపల్ని అందజేస్తున్నది. నైలాను ఫిలమెంట్ ఫ్యాక్టరీ, నైలాన్ స్పినింగ్ ట్విస్టింగ్ ప్లాంట్, మెరయిన్ డీసల్ ఇంజన్ ఫ్యాక్టరీ, కోల్డు స్టోరేజి ఐసు ప్లాంటు, షార్కు లివరు నూనె ప్లాంట్ వంటి మత్స్య పరిశ్రమాభివృద్ధికి సంబంధించిన ప్రధాన పరిశ్రమల్ని, ఉపపరిశ్రమల్ని నెలకొల్పుకొనే విషయంలో ప్రయివేటు వ్యాపారస్తులకు కూడా యీ శాఖవారు సలహాలిస్తారు.

వచ్చే మూడు సంవత్సరాలలో నిజాంసాగర్, కాకినాడ, ఆకివీడు, కృష్ణా పట్టణాలలో కోల్డు స్టోరేజి సౌకర్యాలు లభ్యమవుతాయి. నిజాంపట్టణంలో ప్రస్తుతం ఉన్న కోల్డు స్టోరేజి ప్లాంటుకు డీప్ ఫ్రీజింగ్ యూనిట్ కూడా చేర్చబడుతుంది. నెల్లూరు, విశాఖపట్టణం, హైద్రాబాద్‌ల మధ్య ఇన్సులేటెడ్ వేన్‌లను నడపవలసిందిగా రైల్వేవారిని కోరుతున్నారు. మొట్టమొదటి ఫిషరీస్ హార్బర్ కాకినాడలో నెలకొల్పబడుతుంది. నిర్వహణలో ఆలస్యం జరగకుండా చూడడానికై అధికారులందరితో పరిశీలక బృందం ఏర్పాటు చేయబడుతుంది.



"ఇతగాడేమో అది కుదరదన్నాడట. దానిమీద అతనికి ఆగ్రహం వచ్చిందట. ఒకరిమీద ఒకరు కేకలు వేసుకున్నారట."

ఇప్పుడింతకూ యిదంతా నిజంగా జరిగిందంటావా జరిగిందో లేదో అనుమానమంటావా ?

ఎబ్బే అనుమానమేమీ లేదు నిజంగా జరిగిందే_ఆ రామయ్య అబద్ధమెందుకు చెప్తాడు ?

అంత నమ్మకం ఉన్నప్పుడు అట అట అంటూ అట లెందుకు ?

ఆఁ అదేదో అలవాటు లేరా !

అలవాటేమిటి ! చివరవాడే ఊతపదమన్నమాట !

సూరి యశోమండనము

శ్రీ కొత్త సత్యనారాయణ చౌదరి

కవిబ్రహ్మ యనఁగా తిక్కన సోమయాజియే కనిష్ఠకకెక్కును. సూరి యనఁగా చిన్నయసూరియే గణనకు వచ్చును. అవి రెండును నవీనులు పెట్టుకొను బిరుదముల వంటివికావు. తల్లిదండ్రులు పెట్టినవియుఁగావు. ఆ యిర్వురి కీర్తిమూర్తికి అవి దీపస్తంభములు. సృష్టిలో బ్రహ్మకున్న అధికారము కవితాసృష్టిలో తిక్కన్నకున్నది. సూరి శబ్దార్థములోని సారము చిన్నయ్య భాషా సేవలో గర్భితమైయున్నది.

చిన్నయ సూరి కేవలము వ్యాకర్తయేకాదు. కావ్యకర్తయే కాదు. శాస్త్రవేత్తయేకాదు. మహావక్తయేకాదు. మహాపండితుఁడే కాదు. భాషాభిజ్ఞుఁడేకాదు. నన్నయ్యవోలె తెలుఁగునకు అతఁడొక యుగకర్త. తెలుఁవాఙ్మయములో నన్నయ్య—చిన్నయ్యలు చిర స్మరణీయులు. పద్యగద్యములలో నన్నయ్య చిన్నయ్యలకు ఆద్య స్థానమిచ్చిరనఁగా వారి రచనాశిల్ప మట్టిదని మనము గుర్తింపవలెను. నన్నయ్యకు మున్ను పద్యరచన లేదనికాదు, చిన్నయ్యకు మున్ను వచనము పుట్టలేదనికాదు. గాసట బీసటగా నున్న వాఙ్మయములో ఆంధ్ర కవిత్వమును ఒక దారికిఁ దెచ్చినవాఁడు నన్నయ్య కావున ఆంధ్ర కవిత్వ విశారదుండని అతఁడనిపించుకొన్నాఁడు. సంస్కృత వాఙ్మయములోని గద్యపద్యములను కేవలము దండాన్వయముగా దించి గజిబిజిగా సాగియున్న తెలుఁగు వచనమునకు ఒక దారి తెన్నుచూపినవాఁడు కావున—చిన్నయ, వచనరచనలో యుగకర్త అయ్యెను.

అదేమి విశేషమోకాని తెలుఁగు వాఙ్మయములో వారిర్వురకు ఒకానొక యనుబంధము అనుస్యూతమాయెను. పేరులో సైతము అతఁడు నన్నయ్యకాఁగా ఈతఁడు చిన్నయ్య అయ్యె. చాళుక్యుల దర్బారులో అతఁడు మన్నన పొందఁగా కుంఫిణీ కొలువులో ఈతఁడు ఎన్నికకెక్కెను. నన్నయ్య వంశము చాళుక్య భూపతులకు 'కులబ్రాహ్మణులు' కాఁగా, చిన్నయ్య వంశము వైష్ణవ మతములో కుల బ్రాహ్మణస్థాన మధిగమించినది. అనఁగా చిన్నయ్య తండ్రి వేంకటరంగయ్య, రామానుజ జన్మవాసమైన శ్రీ పెరుంబూదూరు పట్టణములోని కోవెలలో ద్రవిడ వేదపారాయణాధ్యాపకుఁడయ్యెను. నన్నయ్య, అపార శబ్దశాస్త్ర పారగులైన వైయాకరణులును భారతరామాయణాద్యనేక పురాణ ప్రవీణులైన పౌరాణికులును మృదుమధుర రసభావభాసుర నవార్థ వచన రచనా విశారదులయిన మహాకవులును వివిధ తర్క విగాహిత సమస్త శాస్త్రసాగరగరీయః ప్రతిభులైన తార్కికులును నాదిగాఁ గలుగు విద్వజ్జనంబులతో నిండియుండిన రాజమహేంద్రపురంబు నందు వన్నెకెక్కియుండెను. చిన్నయ్య, దురవగాహములైన శాస్త్రములలో వ్యాసంగమొనర్చి సాహిత్య చక్రవర్తియై శమదమాదిగుణ విరాజితుఁడై కవియై ఉద్యోగియై చెన్నపురి పౌరులలో పేరు ప్రతిష్ఠలు పొందెను. నన్నయ్య ఉన్ననాఁటికి తెలుఁగులో పద్యకావ్యముల పరిస్థితి ఎట్లున్నదో చిన్నయ్య వచ్చునాఁటికి వచన కావ్యముల పరిస్థితియు అట్టిదేయగుట ఆశ్చర్యము. నన్నయ్య తెలుఁగు భారతమును వ్రాసి సంస్కృతములో తెలుఁగు వ్యాకరణమును రచించినట్లు చిన్నయ్య నీతిచంద్రికను వ్రాసి తెలుఁగు వ్యాకరణమును సంస్కృతములో నిర్మించియిచ్చెను. నన్నయ్య భారత రచనలో పూర్వవాఙ్మయము సర్వము అణఁగిపోయినట్లే, చిన్నయ్య వచనరచనచే పూర్వవచనరచన మాటుమణగెను. నన్నయ్య చెప్పినదే చిన్నయ్యకు వేదము. అతఁడు 'చింతామణి' వ్రాయఁగా ఈతఁడు బాలవ్యాకరణము వ్రాసెను. ఆ చింతామణి ముందు తక్కిన వ్యాకరణములు అణఁగినట్లే ఈ బాలవ్యాకరణము ముందు తక్కినవి లెక్కకు రావయ్యెను. అదేమి చిత్రమో కాని నన్నయ్య వ్రాసిన చింతామణికి అన్య కర్తృత్వ మంటఁగట్టినట్లే బాలవ్యాకరణమునకు సైతము అన్య కర్తృత్వము అంటఁగట్టిన పాక్షిక బుద్ధులు పుట్టిరి. ఇతర మతముల తాకిడికి బక్కచిక్కి అకటావికటము కానున్న ఆర్ష మతమును ప్రచారము సేయుటకయి నన్నయ్య ఆంధ్ర భారతమును సృష్టించి యిచ్చెను. ఆంగ్ల భాషా ప్రాభవము

వలన విదేశ్య పరిపాలన వలన ఎత్తువడ్డ తెలుఁగును ఉద్ధరింపవలెనని చిన్నయ్య. శాస్త్రముతోపాటు సాహిత్యమును నవ్య మార్గములో నడపించెను. 'వింటే భారతమే వినవలె'నన్న ఆమెత వంటి సామెత నన్నయ్య రచననాఁడే పుట్టినట్లు, వచనముగాని వ్యాకరణముగాని చిన్నయ్య చెప్పినదే మనకు శిరోధార్యమన్నంత సంప్రదాయము పుట్టినది.

కాకతాళీయమో కాలకర్మవశమో గాని, నన్నయ్య వ్రాసిన భారతములో మూఁడు పర్వములకావల "కవిబ్రహ్మ" కావలసి వచ్చెను. చిన్నయ్య వ్రాసిన నీతి చంద్రిక శేషమునకు "గద్యకవి బ్రహ్మ" రావలసివచ్చెను.

"ఆదిఁదొడంగి మూఁడు కృతులాంధ్రకవిత్వ విశారదుండు
విద్యాదయితుండొనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్"

అని తిక్కనసోమయాజి, నన్నయభట్టును స్తుతింపగా—

"చిన్నయసూరి, దీరులెదఁజేరిచి సారెకునాదరింపఁగా
మున్నురచించి మించెసగమున్ వచనంబుగ నీతిచంద్రికన్,

అని, కందుకూరి పంతులు చిన్నయసూరిని అభినందించెను.

నన్నయ పలికిన పలుకులెల్ల తెలుగునకు లక్షణభాగమై రాణించినట్లు చిన్నయ్య చేసిన రచనలన్నియు ప్రామాణికములై పరిఢవించినవి. ఆతఁడు పద్యరచనలో యుగకర్త కాఁగా ఈతఁడు గద్యరచనలో యుగకర్త అయ్యెను. చాళుక్యుల అండదండలచే నన్నయభట్టు, పంచమ వేదమును తెలుఁగునకుఁదెచ్చి వైదిక సభ్యత నిలఁబెట్టినట్టులు, చిన్నయ్య చెన్నపురిలో ప్రాచ్య విజ్ఞానము గల భారతీయోద్యోగులు పెక్కు మంది ప్రోత్సాహముచే బలము చేకూర్చుకొని స్వసంఘ సమావేశమేర్పరిచి విశిష్టాద్వైతమతమును బోధించెను. నన్నయ్య కేవలము, కుల బ్రాహ్మణుఁడే కాదు; అవిరళ జపహోమతత్పరుడు. విపుల శబ్ద శాసనుఁడు. సంహితాభ్యాసుఁడు. బ్రహ్మండాది నానా పురాణ విజ్ఞాననిరతుఁడు. లోకజ్ఞుడు. ఉభయ భాషా కావ్యరచనా శోభితుఁడు. సజ్జనుఁడును. చిన్నయ్య సైతము సర్వశాస్త్రవేత్త. సాహిత్యచక్రవర్తి. మహావ్యాకర్త. విగర్వచూడామణి. హయగ్రీవ మంత్రోపాసకుఁడు. విద్యా వినయభూషితుఁడు.

సరస్వతీమూర్తి. లోకజ్ఞుడు. ఉభయ భాషాకావ్యరచనా విరాజితుఁడు. మహా మహోపాధ్యాయుఁడును. నన్నయ్య వ్రాయఁబూనిన భారము ఏకారణమువలననో మూడు పర్వములతో ఆఁగిపోఁగా చిన్నయ్య ప్రారంభించిన ఆంధ్రనిఘంటువు రెండు సంపుటములతో ఆఁగిపోయెను. శేషించిన భారతమును పూరించిన మహాకవులు నన్నయ్య మహాకవిని బ్రహ్మండముగా ప్రస్తుతించి మార్గదర్శిగా ఎన్నుకొనిరి. అట్లే ఆఁగిపోయిన నీతి చంద్రికను పూరించిన ఇరువురు పండితులు సూరిని గొనియాడిరి. కాని, ముత్యాలను బోలు చేతివ్రాలతో తానుగా ఎన్నో పదములను ఎత్తి వ్రాసి వానికి, పూర్వ మహాకవి ప్రయోగముల మూలమున క్షుణ్ణముగ అర్థనిర్ణయము చేసి ఒక దారికిఁ దెచ్చిన 'అకారాద్యాంధ్ర నిఘంటువు' రెండు సంపుటములను ఆయన మరణానంతరము ఆఁడువాండ్ర నడిగి పుచ్చుకొని పోయి అక్కడ పడినంతవఱకు అందలి యంశములో సేకరించుకొని సొమ్ము చేసికొన్నవారు కొందఱు కాఁగా—ఆ వ్రాతప్రతినే చేతికిఁ దెచ్చుకొని అమ్మిన వారు అమ్మఁగా విలిచినవారు విలిచికొని ఎట్లో తుదకు కాకినాడకు చేర్చిరఁట. అది నేఁడు కోవెలలో విగ్రహమువోలె సురక్షితముగా ఉన్నదని వినకిడి. ఇటీవల వెలసిన తెలుఁగు కావ్యములన్నింటికి నన్నయ్య భారతమే మూలపీఠమైనట్లు చిన్నయ్య కీవల వెలసిన నిఘంటువులన్నింటికి చిన్నయసూరి నిఘంటువే మేలుబంతి అయినది.

అక్షర రమ్యత నాదరించి ప్రసన్న కథాకలితార్థయుక్తిలో పేరు వడసి నన్నయభట్టు, నానారుచిరార్థ సూక్తులకు నిధియైనట్లే చిన్నయసూరి, ఛందోగర్భిత వచని రచన చేసి లలితోక్తులతో వ్యాకరణమును లోకోక్తులతో నీతి చంద్రికను రచించి రుచిరార్థ సూక్తులకు నిధి యయ్యెను. నన్నయ్య అన్నమాటలే చిన్నయ్య "లక్షణభాగము"నకు లక్ష్యములు. 'అతిమానుష మత్సదృశ మతి దుష్కర మయిన కేశవార్జున కృతి' వంటి నన్నయ్య పలుకులు దొరకినంత వఱకు 'లక్ష్యము' చేసికొనుటయే చిన్నయ్య లక్ష్యము. చిన్నయ్యను పరిశీలించి చూఁడగా నన్నయ్య భాషకే చిన్నయ్య వ్యాకరణము వ్రాసెనా అన్నట్లు స్ఫురించును. నన్నయ్య ఎన్నుకొన్న తెన్నులే చిన్నయ్యకు శిరోధార్యములు. నన్నయ్య రచన అనఁగా చిన్నయ్యకు చెవుల పండువు. నన్నయ్య, కేవలము పద్య కవనములోనే ఆద్యకవి కాదు; మహా సముద్రమువంటి ఆ భారత రచనలో వచనమును వేఱుగా మనము రుచి చూడముగాని, ఆ వచనమువంటి వచనమును తెలుఁగులో వ్రాసినవాఁడు—వ్రాయం గలవాఁడు ఈ చిన్నయ్య ఒక్కఁడే అనుట సత్యేతరముకాదు.

'విద్వజ్జనంబుల యనుగ్రహంబునంజేసి నానేర్చు విధంబున నిక్కావ్యంబు రచియించెదనని నన్నయ్య,

'హరిహరా జగజ్జాననార్క షడాస్యమాతృ సరస్వతీ
గిరి సుతాదిక దేవతాతతికి' నమస్కృతి చేసి మహాభారత సంహితా రచన బంధురుఁడైనట్లే, చిన్నయ్య

'కరుణ తెఱుంగున హరి యెద నిరవుకొనియ ఘూళినరయనీ కయితనిచే నితము సంశ్రితజనులంబరి రక్షింపించు తల్లి భజయింతు మదిన్'

ఇత్యాదిగ దైవస్తుతి–ఆదికవిస్తుతి చేసి,

'ఒనరఁగాఁ బంచతంత్ర హితోపదేశములను బరికించి వానిలో వలయునంశములను గొవి కొంత యభినవంబుగను గూర్చి కృతి యొనర్చెద నీతి చంద్రికయనంగ'– అని నీతి చంద్రిక నుపక్రమించెను. బాలవ్యాకరణ ప్రారంభములో 'శ్రీలతకుం బ్రాకయి వృషశైలంబున వెలసి తనదుచాయ కేలయుధ న్యాళిదగ మాన్చి కోర్కులు చాలంగా నొసఁగు కల్పసాలమును గొలిచి, లలితోక్తులతో నొనరుపడునట్లు ఆంధ్రమునకు లక్షణ మొనర్తునని చెప్పుకొనెను. అల్పాక్షరములుగల వృత్తములలో మధురమైన నడకలో నన్నయ్య మనకు చింతామణిని సృష్టించి ఈయఁగా, అల్పాక్షరములుగల రచనలో అనంతమైన అర్థము నిమిడ్చి అవ్యాప్త్యతివ్యాప్తులు లేని సూత్ర నిర్మాణముచేసి చిన్నయ్య మనకు బాలవ్యాకరణ మిచ్చెను. సూత్ర వాఙ్మయమును బరిశీలించి చూడఁగా సూత్ర నిర్మాణ దక్షతలో సంస్కృతములో పాణినియు తెలుఁగులో ఒక్క చిన్నయసూరియు ముఖ్యులుగాఁ గానవత్తురు. నన్నయ్య వ్రాసిన చింతామణికి శేషగ్రంథముగా అధర్వణ కారికలు వచ్చినట్లే చిన్నయ్య వ్రాసిన బాల వ్యాకరణమునకు ప్రౌఢ వ్యాకరణము శేషగ్రంథమై వెలసినది.

సూరి చేసిన రచనలలో వ్యాకరణ భాగమొక యెత్తు; వచన భాగమొక యెత్తు. సూరి వ్రాసిన 'రాజ్ఞీమకుటాళి[illegible]కము–పచ్చయప్పనృపయశోమండనము' వంటి మధురాతి మధురములైన పద్యరత్నములు నేఁడు ప్రచారములో లేకుండుట శోచనీయము. చిన్నయ్య, ఎన్నెన్నో చాటు పద్యములను వ్రాసెనఁట. 'సంస్కృత బాలబోధ' మొదలు 'విశ్వనిఘంటువు' వఱకు సృష్టించెను. అకారాది నిఘంటువు – ఆంధ్ర ధాతుమాల–ఆంధ్ర కౌముది–అక్షర గుచ్ఛము–చింతామణి వృత్తి–పద్యాంధ్ర వ్యాకరణము ఇత్యాదులు సూరి చేతిలో సృష్టింపఁబడ్డవని వినఁగా వానిని జదువను నోరూరని పండితుఁడెవఁడుండును? భట్టబాణుని కాదంబరి సూరి చేతిలో వచనముగా వచ్చెననఁగా దాని రామణీయకమేమని చెప్పవలెను? ఆదిపర్వము వచనముగా వ్రాసి అచ్చు వేయించెను గాని దానిని జదివెడి భాగ్యము మనకిప్పుడు దక్కదు. 'లా' చట్టములు భాషాంతరీకరణము చేసెనఁట. యాదవాభ్యుదయమను మహాకావ్యము ఆతని చేతిలో పుట్టినదఁట. 'సుజనరంజని' యను మాస పత్రికను వెలువఱిచి, పరీక్షార్థులకేగాక పండితులకు సైతము కలిగెడి భాషా సందేహములను ఆ పత్రికలో సూరి పరిష్కరించెడివాఁడఁట. ఈతని సంస్కృతాంధ్ర కవితారీతికి ఇచ్చట రెండే రెండు పద్యము లిత్తును :–

'గగనంబట్లు రసప్రపూర్ణ విల సత్కందంబులన్మీఱియు
భ్రగ సాలంబుగతిన్ సితచ్ఛదములన్ భాసిల్లి మేరుక్రియన్
జగదామోద సువర్ణ భాస్వరముగా జానొంది పచ్చావనీ
శగుణంబుల్ గణుతించు కోశమిదియిచ్చన్మెచ్చు గావించెడిన్.

గుణస్య బాధికాం వృద్ధిం కృతవాన్, పాణినిః పురా
అబాధితగుణాం వృద్ధి మకరోత్పచ్చప ప్రభుః ॥

భారతమువంటి పద్య కావ్యము నీతిచంద్రికవంటి వచన గ్రంథము బాల వ్యాకరణమువంటి వ్యాకరణ శాస్త్రము తెలుఁగులో ఇప్పటికి పుట్టలేదనుట అతిశయోక్తికాదు. నన్నయ్య చిన్నయ్య మాటలలో ఉన్న ఆ కూర్పు నేర్పులు–తీయఁదనముట్టిపడునట్టు జాలువాఱిన ఆ యక్షరరమ్యత–లలితోక్తులతో ప్రసన్నమైన ఆ శైలి–మనోహరమైన ఆ వాక్యసరణి మఱియొకరికబ్బవు. ఆ రచనలలో ఏదియుఁ జదువనివాఁడు ఏదియుఁ జదువనివాఁడే. ఆ రచనలనన్నింటిని ఎందఱో పరిష్కరించుటయు ప్రకటించుటయు నిత్యము చూచుచున్నాము. ఎన్నో ప్రతులు పుట్టినవి; పుట్టుచున్నవి. కవి హృదయ మెఱుఁగని వారి చేతిలోఁబడి ఎన్నెన్నో రూపాంతములెత్తినవి. పఠన పాఠనములలో తమకుఁదోఁచిన రీతిగా పాఠము లెన్నియో సవరించుచు సమర్థించుచు సరిపెట్టుకొనవలసిన దుర్గతి నన్నయ్య–చిన్నయ్య రచనలకే పట్టినదనఁగా సాహిత్యపరముగా ఇంకేమి చెప్పవలెను? సంస్కృతాంధ్ర సారస్వత మహోదధిని నిశ్శేషముగా చుళుకించిన చిన్నయసూరి రచనలకే ముద్రణాభాగ్య మబ్బక, అవి మూమూచు భాగ్యమైన మనకు దక్కలేదనఁగా మన యదృష్టమేమని చెప్పఁగలము? పేరైన బయటికి రాక ద్రవిడ దేశములోనే పుట్టి అందే అణఁగిపోయిన రచనలెన్నో చిన్నయ్యవి ఉన్నవని పెద్దలన్నమాట విన్నవారికి విచారము గలుగదా! జగదేక పండితుఁడైన చిన్నయ్యవంటి మహావ్యక్తి స్వయము చేతితో వ్రాసిన గ్రంథములే ఇంకను ముద్రితములు కాలేదన్నమాట తెలుఁగువారికి తలవంపులొనర్పదా! ఆతఁడు కూర్చిన ప్రత్యక్షరము ఆణిముత్తెమై ఆంధ్ర సరస్వతికి అమూల్యాభరణమై యుండుననుట పొగడ్తకాదు. విశ్వవిద్యాలయములవంటి మహా విద్యాపీఠములుగాని ప్రభుత్వ సంస్థలుగాని సూరి రచనలు సేకరించి కన్పించినవన్నియు ముద్రింపించి సవరింపవలసినవన్నియు సవరింపించి అక్కఱయైనచో టీకలు వ్యాఖ్యలు వృత్తులు భాష్యములు వ్రాయించి వాఙ్మయ పరముగా ఇంత పున్నెము కట్టుకొనఁగూడదా? విశ్వకవి రవీంద్రుని కవితా ప్రతిభను ఇటీవల విశ్వమయము చేసినట్లు, చెన్నపురి ప్రభుత్వము–ఆంధ్ర ప్రభుత్వము రెండును ఈ చిన్నయసూరి ప్రతిభాపాండిత్యములను గూర్చి చేయవలసినది సర్వము చేసినచో మనకింకేమి కావలయును?

* *

ఝాన్సీరాణి సమాధి

"చిత్రభాను"

ఈ సమాధిలో దాక్కొని వుంది
ఒక బూడిద రాశి
స్వాతంత్ర్యంకోసం తిలాంజలి యిచ్చి
అయి పోయింది మశి
ఈ సమాధి, ఈ రుధిర సమాధి
ఝాన్సీ రాణీది
వీరాంగన లక్ష్మి అంతిమ
క్రీడాస్థలం యిది.
భగ్న హృదయ మాలలా
అక్కడక్కడ వెదజల్లి బడివుంది.
ఆమె స్మృతి చిహ్నంగా
ఆమె అస్థికలు సంచితమై వున్నాయ్.
ఆఖరి వరకు వీరకన్యలా
ఆఘాతాలన్నింటిని సహించింది
ఆహుతియై పడిపోయింది
జాజ్వల్యమాన జ్వాలలా
చితిపైకి ఎక్కింది.
హేమం కన్న ఆ బూడిద
మూల్యవంత మవుతుంది.

ఆ వీరాంగన ఆనిలో బలికావడంచే
గౌరవాధిక్యమును పొందుతోంది
రాణికన్న అధికంగా ఇప్పుడు మనకు
ఆ సమాధే ప్రియతమమైంది
ఇక్కడ స్వాతంత్ర్యపు ఆశాజ్యోతి
గుప్తపరచి వుంచబడింది.
ఇంతకన్న సుందర సమాధుల్ని
క్షితిపై తిలకిస్తుంటాం.
నిశీధిలో వాటి గాథల్ని
క్షుద్ర జంతువులే చెప్పుకొంటాయ్
ఈమె అపూర్వ గాథను
వీరయశో గానాల్ని
కవుల అమరవాణులు
ప్రేమతో, భక్తిభావంతో ఆలాపిస్తాయ్.
ఈ సమాధి, ఈశాశ్వతసమాధి
ఝాన్సీ రాణీది
వీరాంగన లక్ష్మిబాయి
అంతిమ క్రీడాస్థలం యిదే.

[హిందీ ఆధారం]

తైలమ నలమ

పద్మశ్రీ
శ్రీ సి. నరసింహం
ఐ. ఏ. యస్.

పట్టణాలు పెరిగిన కొద్దీ, సమస్యలు పెరుగుతున్నాయి. జనాభా యెక్కువైతే పౌర సౌకర్యాలు కూడా పెరగాలిగదా. అట్టి పెరుగుదల కొంచెం మందంగానే జరుగుతున్నదని పురవాసులంటారు. రవాణా సౌకర్యాలు సరిగ్గా లేవని, ఆక్రమణలేనని ఒక పౌరుడు విసుక్కుంటాడు. మురికి నీరు, చెత్త ఎక్కడికక్కడ నిలిచిపోయి దుర్గంధంతోవున్నాయని, ఇంట్లో కుల్లాయిలో నీళ్లు రానేరావని ఇంకొకరుబాధ పడతారు. ఆసుపత్రులలోను, మాతా శిశు సంరక్షణ శాలలోను, మందులు లేనేలేవని, ఉన్నా ఆదరింపు లేదని ఒకావిడ అంటుంది. ఆరు నైలలై వచ్చినా అద్దెకొంపే దొరకలేదని, మంచి పాలు మచ్చుకైనా దొరకవని మరొకరు చెబుతున్నారు. జనన మరణాల సమాచారం సకాలంలో అధికారులకు అందచెయ్యలేదని, పన్నులు కట్టలేదని లైసెన్సులు పొందలేదని కేసులు పెడుతున్నారని ఫిర్యాదులు వినిపిస్తూంటాయి. దానింతకు పురపాలక సంఘాలు, గవర్నమెంటు, బాధ్యులని కొందరంటూ ఉంటారు. అంత పెద్ద పట్టణంలో పనులు ఎంతకూ తెమలక, సౌకర్యాలు లేక పౌరుల జీవితంలో ఆనందమే కరువైపోయిందా అనిపిస్తుంది. ఏమిటి దీని కీలకం?

నగరం ఆనందంగా విలసిల్లాలంటే కొన్ని సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలి. పుష్కలంగా మంచినీటి సరఫరా ఆధునిక నగర జీవితంలో మంచినీటి సరఫరా ఎంతైనా అవసరం. ఆరోగ్యానికి పరిశుభ్రతకు నీరు కావాలి. నీరు కావలసినంత ఉంటే సరిపోదు. అది మంచి నీరై ఉండాలి. శాస్త్రీయ పద్ధతిలో వడగట్టి ఆరోగ్యానికి అవసరమైన నీరుగా ఉండాలి. పరిశ్రమలు అభివృద్ధి కావాలన్నా, తద్వారా ఆయా ప్రాంతాలు బాగుపడాలన్నా నీరు అవసరం. చాలినంత నీరు లేక కొన్ని పట్టణ ప్రాంతాలలో పారిశ్రామికాభివృద్ధి దెబ్బతింటూ ఉన్నది.

నీటి సరఫరా తర్వాత మురుగు పారుదల సౌకర్యాలు ముఖ్యమని చెప్పాలి. జన సమ్మర్దమైన నగర జీవితం ఆరోగ్యకరంగా ఉండాలంటే మురుగు నీటి కాల్వలు తప్పనిసరిగా ఏర్పాటు చెయ్యాలి. ఇండ్లలోనుంచి, ప్యాక్టరీల్లోనుంచి వచ్చే మురుగు నీటినంతా కాల్వల గుండా విర్జీత స్థలాలకు చేరుకునేటట్లు చేయాలి. భూగర్భంలోనుంచి పోయే పద్ధతినే అవలంబించాలి. భూమిపై పారే కాల్వలైనట్టయితే పాయిఖానా మురికి వాటిలోనికి వదలుటకు వీలుండదు. పాయిఖానాలు రోజు ఎన్నిసార్లు తుడిచినా, కొంత మలినం తప్పక ఉంటుంది. దుర్వాసనతో పాటు ఈగల, పురుగుల బాధ తప్పదు. మురుగును చేరీలలోకి తోసికొనిపోయి పంటలు పండించుట ద్వారాను, ఎరువులు చేయుట ద్వారాను పౌర సంఘానికి క్షేమం చేకూర్చి రాబడి తీయవచ్చు. అంతే కాదు, అధిక ఆహారోత్పత్తికి సహాయ పడవచ్చు. ప్రజలు రకరకాల చెత్త వీధుల్లోను, బజార్లలోను పారేస్తారు. మునిసిపాల్టీయే తీస్తుందని ఇంట్లో త్రవ్విన మట్టినీ దొడ్లో కొట్టిన చెట్లనూ వీధిలోనే పారవేస్తారు. ఇది అక్రమం. ఇవి మునిసిపల్ చెత్త క్రిందికి రావు. వాటిని పట్టణం బయటికి తీయడానికి గృహస్థులే ఏర్పాటు చేసుకోవాలి.

మంచినీటివసతి, మురికినీటి పారుదల సౌకర్యం ఏర్పాటు చేయాలంటే చాలా ధనం కావలసి వస్తుంది. గవర్నమెంటు వీటికై గ్రాంట్లు ఇచ్చే స్థితిలో లేదు. అప్పు మాత్రము ఇవ్వగలదు. అది కూడా ప్రణాళికలో నిర్దేశించిన మేరకు మాత్రమే ఇవ్వగలదు. మూడవ ప్రణాళికలో 6 కోట్ల 80 లక్షలు మాత్రమే వీటికై ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌కు మంజీరా నీటి సప్లయి స్కీము, విశాఖపట్ట

ణానికి తాట్పూడి స్కీము—ఈ రెండింటికి 8 కోట్లుకు పైగా కావాలి. ఈ పరిస్థితిలో మన రాష్ట్రములోని అన్ని మునిసిపాలిటీలకు యీ సౌకర్యాలు ఏర్పాటు చేయాలంటే అనేక సంవత్సరములు పట్టవచ్చు. ఇతర దేశములలోవలె ఇక్కడ కూడ "Water supply and Sewage Boards" ఏర్పాటు చేసి ఆ బోర్డుల ద్వారా యీ సౌకర్యాలు కలుగచేయుటకు, ఆలోచించిన మంచిదవి తోస్తుంది.

ఇండ్లలో వెల్తురు, గాలి, వీధులపై ఆధారపడి ఉంటుంది. వెడల్పు వీధులు వీటికెంతైనా ఉపయోగపడ్తాయి. మంచి రోడ్లు నగర సౌందర్యానికి దోహదం చేస్తాయి. నగరం పెరుగుదల కూడా వాటినిబట్టే ఉంటుంది. వ్యాపార పారిశ్రామిక సంస్థలు కూడా రాకపోకల సౌకర్యాన్ని బట్టి ఆయా స్థలాల్లో అభివృద్ధి చెందుతాయి. వీటిననుసరించే దీపాలు కూడా. నగరం శోభాయమానంగా ఉండాలంటే దీపాలుండాలి. దీపాలే నగరాన్ని ఎంతో అందంగా తయారుచేస్తాయి. రద్దీరోడ్లలోను, రోడ్ల కలయికల్లోను, కాంతివంతమైన దీపాలుండాలి. దీపాలు అందాన్నే కాదు ప్రజలకు సంరక్షణను కూడా చేకూరుస్తాయి. దీపాలు లేనిచోట్ల ప్రమాదాలు, చిల్లర దొంగతనాలు రౌడీల బాధ ఎక్కువవుతాయి. అందుకని నగరానికి సరిపోయేటన్ని దీపాలు ఉంచడం అవసరం.

నగరాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇండ్లు క్రిక్కిరిసిపోతున్నాయి. ఎప్పుడూ ఆ యిళ్ళలోనే ఉండాలీ అంటే విసుగు అనారోగ్యకరం కూడాను. అట్టివారికి పార్కులు క్రీడా స్థలాలు ఎంతైనా ఉపయోగపడతాయి. పార్కులు క్రీడాస్థలాలు ఉంటే సరిపోవు. అవి అందరికీ ఉపయోగపడేటట్లు అందుబాట్లో ఉండాలి. అవి సరైన పద్ధతిలో పెంచి, వేడుకకు, విశ్రాంతికి అనుగుణ్యంగా ఉండేలాగు చూడాలి. నగరం చుట్టూ ఒక అరమైలు వెడల్పున పచ్చని బయిళ్లు ఏర్పాటు చేయాలి. దానికి చుట్టూ ఒక రింగు రోడ్డు ఉండాలి. ప్రతివారు యింటిముందు పూల మొక్కలు దొడ్లో కూర పాదులు పెంచుకుంటే కంటికింపుగా ఉండడమే గాక అప్పటికప్పుడు కోసిన ఆకు, కాయకూరలు అనుభవించవచ్చు. ప్రతిపౌరుడు తన గృహాన్ని సంవత్సరానికి రెండుసార్లు పండగల పేరుజెప్పి వెల్లవేసుకోవాలి.

నగరం పారిశ్రామిక కేంద్రమేగాక, వ్యాపార కేంద్రం కూడా. అయితే దుకాణాలు, చిల్లరకొట్లు, పెద్ద వ్యాపారసంస్థలు, అన్నీ ఒకేచోట కేంద్రీకం కాకూడదు. ఆయా ప్రాంతాలలో రోజు అవసరాలకు కావలసిన వస్తువులు అమ్మటానికి చిన్న చిన్న షాపులుండాలి. వీటికంటె పెద్ద షాపులు నగర వాసులందరికి సులభంగా అందుబాట్లో ఉండేచోట్ల ఏర్పాటు చేయాలి. ఈ షాపుల నిర్మాణంలోకూడా కొంత ప్రత్యేకత ఉండాలి.

నగరం అంటే పారిశ్రామిక కేంద్రం కదా అని ఎక్కడంటే అక్కడ పరిశ్రమలను స్థాపించడానికి వీలులేదు. కొన్ని పరిశ్రమలద్వారా ఎక్కువగా ధ్వని, పొగ, దుర్వాసనలు వెలువడుతాయి. అందుకని వాటిని కాపురముండే ప్రాంతాలకు దూరంగా ఉంచుకోవాలి. అలాంటి భారీ పరిశ్రమలతోపాటు చిన్న చిన్న పరిశ్రమలు కూడా చాలా ఉంటాయి. ప్రజల ఆరోగ్యానికిగాని, విశ్రాంతికిగాని అడ్డురాని అనువైన స్థలాల్లో వాటిని ఏర్పాటు చేసుకోవాలి. వీటివల్ల బాధ అనిపించనప్పుడు వీటినన్నీ కార్మికుల అందుబాటులోనే ఉంచుకోవడంలో ఏమీ తప్పులేదు.

పరిశ్రమల నిర్మాణంలో ఎంత శ్రద్ధ వహించాలో అదే విధంగా పురవాసుల సౌకర్యాలకోసం ఏర్పరచిన ఆస్పత్రులు, పాఠశాలలు యిత్యాదులు కూడా అందరికీ అనుకూలంగా ఉన్న చోట ఏర్పరచుకోవాలి. నగరాలలో బిచ్చగాండ్రు, దిక్కులేనివారు, అనాధులు ఉంటారు. వారికి వసతి ఏర్పాట్లుచేసే ఐచ్ఛిక సంస్థలతో పూర్తిగా సహకరించాలి. వాటికి తగు ప్రోద్బలమిచ్చి బలిష్ఠమైన సంస్థలుగా రూపొందించాలి.

నగరాలు క్రమబద్ధంగా అభివృద్ధి చెందాలంటే టౌను ప్లానింగు పద్ధతి తప్పనిసరిగా అవలంభించాలి. దీనికి మొదటి మెట్టుగా, స్థూలంగా పట్టణ స్థలాల వినియోగ పంథాలను నిర్ణయిస్తూ తాత్కాలిక ప్లానులను తయారు చేసుకోవాలి. వెనువెంటనే దీనికి అనుగుణంగా వివరమైన సమగ్ర పథకాలను తయారు చేయాలి. టౌన్ ప్లానింగు చట్టము, దానిక్రింద నిర్ణయించిన విధులను పూర్తిగా అమలుజరపాలి. అంతేకాదు. తగు తర్ఫీదు పొందిన సాంకేతిక సిబ్బందితో టౌను ప్లానింగు సంస్థను ఏర్పాటు చేయాలి.

గృహవసతి సమస్యను అదుపులోనికి తేవడానికి అనేక చర్యలు తీసుకోవాలి. పట్టణాలలో ఉండే మురికివాడలను తొలగించడానికి, లేదా అభివృద్ధి పరచడానికి, గృహవసతి ఏర్పాటు చేసుకొనుటకు ప్రణాళికలో వున్న అన్ని వనరులనూ పురపాలక సంఘాలు, నగర వాసులు పూర్తిగా ఉపయోగించుకోవాలి. నివా

పాలకు, కార్యాలయాలకు కనీస నియమావళిని రూపొందించుకోవాలి. ప్రస్తుతం పట్టణాలల్లో కట్టబడుతూయున్న డాంబిక గృహ నిర్మాణాన్ని తగ్గించి ఉన్న స్థలాలను వృథా చేయకుండా చేస్తే ఎక్కువ మందికి సరిపడే గృహాలను నిర్మించుకోగలుగుతాం. వీటిని సాధించాలంటే.

1. డాంబిక గృహాల నిర్మాణాన్ని నిరుత్సాహపరిచే విధంగా పన్నుల విధానాన్ని రూపొందించాలి.
2. గృహ నిర్మాణ ప్లానువిషయంలో విడివిడిగా సలహాల నివ్వాలి.
3. ప్రస్తుత గృహ నిర్మాణ నియమావళి తక్కువ వ్యయంలో కట్టే ఇండ్లను ప్రోత్సహించేవిధంగా మార్పు చెయ్యాలి.
4. స్థానికంగా దొరికే చవక సామగ్రితో ఇండ్లు కట్టుటకు ప్రోత్సహించాలి.

నగర సమస్యలు జనాభా పెరిగే కొద్ది ఎక్కువవుతూ ఉంటాయి. ఒకవైపు పల్లెటూళ్లనుంచి వలస వస్తున్నారు. మరొకవైపు జనాభా సంఖ్య కుటుంబ నియంత్రణ లేక పెరుగుతూంది. అందుకని దీని విషయంకూడ ఆలోచించి కుటుంబ నియంత్రణ కేంద్రాలను స్థాపించాలి. ఒక నిర్ణీత సంఖ్యలలోపుగా కుటుంబం లేకుంటే వారి అవస్థ ఆర్థికంగాను, మానసికంగాను చాలవరకు ఎక్కువైపోతుంది. వారి బాధలతోపాటు నగర సమస్యలుకూడ మరింత ఎక్కువైపోతాయి.

ఈరోజు నగరాలలో కల్తీలేని సరకులు దొరకడం అరుదే. ముఖ్యంగా పాలు, నెయ్యి, నూనె, పప్పు అందరికీ కావలసిన ముఖ్యావసర వస్తువులే. కాని కల్తీలేకుండా మాత్రం దొరకవు. ఈ కల్తీలను అరికట్టాలంటే దానికుద్దేశింపబడిన చట్టాన్ని మరింత కఠినంగా అమలు పరచాలి. ఆహార పదార్థాల తనిఖీ కొరకు ఉద్దేశించిన సిబ్బందిని పెంచి, వాటి ఉత్పత్తి విక్రయాలలో నియమావళిని రూపొందించాలి.

నగరాలు పెరుగుతూ ఉన్నాయి. కాని అందమైన నగరాలు మాత్రం అరుదుగా ఉన్నాయి. అందమైన నగరాలను సృష్టించుకోవడం క్లిష్టమైన సమస్య. దీనికి కృషి చేయవలసింది పురపాలక సంఘం వారేకాదు. పౌరులు కూడా. మరొక విషయం. నగరం కంటికింపుగా ఉంటే చాలదు. నగర జీవితం హాయిగా కూడా ఉండాలి. అంటే మన సంప్రదాయ, సంస్కృతికి కూడా అనుగుణంగా నగరంలో పౌర జీవితం సౌఖ్యప్రదంగా రూపొందించాలి. భారతీయ నాగరికత, సంస్కృతి నగరాల ప్రజా జీవితలో ప్రతిఫలించాలి. దీనికోసం అందరికి బాధ్యత ఉంది.

ఈ సందర్భంలో రవీంద్రునికి కలకత్తా కార్పొరేషను 1931 వ. సంవత్సరంలో పౌర సన్మానం జరిపినప్పుడు ఆయన చెప్పిన మాటలు ఎంతైనా యుక్తంగా ఉంటాయి. ఆయన ఇలా అన్నారు : "ఈ పురపాలక సంస్థ నా జన్మస్థానాన్ని, జీవిత సదుపాయాలలోను, ఆరోగ్య పరిశుభ్రతలలోను, గౌరవమర్యాదల్లోను, ఆత్మాభిమానంలోను ఉత్కృష్టమైనదిగా చేయుగాక. శిల్ప, చిత్ర, సంగీత, లలిత కళలు దీని ఆదరణతో పెంపొంది పౌరులకు ఆనందాన్ని చేకూర్చుగాక. అవిద్యతోపాటు నగరంలోగల అపరిశుభ్రత, మురికి, నిర్మూలింపబడుగాక. ఆనందంతోకూడిన పౌరతత్వంవలన ప్రేరేపింపబడి పౌరులంతా సర్వ సమృద్ధితో ఆరోగ్యంతో, బుద్ధి వికాసంతో పొందగలరుగాక. నగరంలో అన్ని జాతులవారు, అన్ని తెగలవారు, అన్ని కులాలవారు ప్రేమతో మెలసి ఉంటూ నగరానికిగల మంచి పేరు నిలబెట్టి శాంతిని చేకూర్చుదురుగాక యని నా ప్రార్థన". నగరం సౌందర్యరాశిగా వెలగాలంటే వారు చెప్పిన మాటలను ప్రతి నగరం కూడా ఆదర్శంగా ఉంచుకోవాలి.

(ఆలిండియా రేడియో హైద్రాబాద్ కేంద్రం వారి సౌజన్యంతో)

విశేషాలు

చెవిటివారి శిక్షణ కేంద్రం.

చెవిటివారైన వయోజనులకై కేంద్రప్రభుత్వ విద్యామంత్రిత్వశాఖ 1962 సెప్టెంబర్‌నుంచి హైదరాబాదువద్ద ఒక శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించ నున్నది.

బధిరులకు ఇటువంటి శిక్షణ కేంద్రాన్ని నెలకొల్పడం దేశంలో ఇదే ప్రథమం కాగలదు. ఈ కేంద్రంలో మొదట 30 మందిని చేర్చుకొని వారికి వైర్‌మెన్‌షిప్, షీట్ మెటల్‌పని, ఫిట్టింగులలో శిక్షణ గరుపుతారు.

తృతీయ ప్రణాళికాంతానికి ఇందులో సీట్లసంఖ్య 126 కి పెరగగలదని, తొమ్మిది వృత్తులలో శిక్షణ సౌకర్యాలు లభ్యమప గలవని ఆశించబడుతున్నది.

15 వేల రూపాయల ఒంగోలు వృషభం

పశువులను కొనడానికి ఒంగోలు వచ్చిన బ్రెజిలియా దేశస్థులు ఒంగోలు తాలుకా కరవడి గ్రామస్థుడైన శ్రీపొలవరపు హనుమయ్య వద్ద ఒక ఎద్దును 15వేల రూపాయలకు కొన్నారు. ఈ వృషభం అఖిల భారత ఛాంపియన్ బహూమతిని పొందింది. ఈ బృందం ఒక్కొక్కటి 12 వేల రూపాయల నుంచి 15 వేల రూపాయల వరకు గల మూడు ఆవులను కూడా కొన్నది.

ఎక్స్-రే టెలివిజన్

దేశం మొత్తంమీద ప్రప్రథమంగా వైద్యచికిత్సకు సంబంధించిన ఎక్స్-రే టెలివిజన్, సినీ-రేడియోగ్రఫీ యూనిట్‌ను కర్నూలులోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ప్రారంభించారు. వైద్యపరీక్షకై ఎక్స్-రే సినీ ఫిల్ములనుతీయడానికి ఈ యూనిట్టు ఉపయోగిస్తుంది. దీనివల్ల టెలివిజన్ బొమ్మలను ఒకేసారి చూడవచ్చు. కిరణ ప్రసారంలో (రేడియేషన్) వుండే ప్రతిబంధకాలు తొలిగి టెలివిజన్ తెరపై ఎక్స్-రే బొమ్మలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. ఇది అధ్యాపకులకు, విద్యార్థులకు ఎంతో సహకరిస్తుంది.

అంతేగాక, ఎక్స్-రే బొమ్మలను ఫోటోగ్రఫిక్ రికార్డింగ్ పై తీస్తారు. ఈ సినీ సాంకేతికాభివృద్ధితో ఇప్పుడు భౌతిక సంబంధమైన వ్యాధులను తేలికగా తెలుసుకోవచ్చు. అంతేకాదు. ఈ ఎక్స్-రే బొమ్మలను వైద్యనిపుణుని ఇష్టప్రకారం టెలివిజన్ ద్వారా ప్రసారం చేయవచ్చు. ఈ నూతన ఎలక్ట్రానిక్ విధానం ఎక్స్-రే బొమ్మలను రికార్డు చేయడంలోను, ప్రసార పద్ధతుల లోను నూతన రీతులను ప్రారంభించింది.

టెలివిజన్‌పై ఎక్స్-రే బొమ్మ చాలా ప్రకాశవంతంగా వుంటుంది. అందువల్ల గుండెజబ్బులను, మూత్ర పిండాలలోని రాళ్ళను కనుగొనడం, విరిగిన ఎముకలను సరిచేయడం, మొదలైన వాటికి ఇదివరకు వలె చీకటిగది (డార్క్-రూమ్) అవసరం వుండదు. మామూలు కాంతివుండేగదిలోనే ఈ ఎక్స్-రే బొమ్మలను తీయవచ్చు. ఈ ఎక్స్-రే పరిమాణాన్ని. తగ్గించవచ్చు. ఈ టెలివిజన్ ఎక్స్-రేలో బొమ్మ సాంకేతికమైన ఫ్లొరోస్కోపిక్ తెరమీదకన్నా స్పష్టంగా వుంటుంది.

ఉపన్యాస భవనంలో ప్రదర్శనకై ఈఎక్స్-రే బొమ్మలను ప్రసారం చేయడానికి వీలున్నందున బోధనావసరాలకు ఈ టెలివిజన్ ఎక్స్-రే ఎంతో ఉపయోగిస్తుంది. సామూహిక సంప్రదింపులకై విష్ణాతులైన బృందాలకు ఇది ఎంతో ఉపయోగిస్తుంది. ఒక బృందం అవసరమైన సాధారణ శస్త్రచికిత్స శాలలోను, గుండె జబ్బుల నిర్ణయానికి, ఇది ఎంతో తోడ్పడుతుంది.

హృదయ సంబంధమైన నాళాలను రికార్డుచేసే సినీ ఫిల్ములను, వాటిని టెలివిజన్ ఎక్స్-రే ద్వారా ప్రసారం చేసే కార్యక్రమం ప్రస్తుతం కర్నూలు ఆస్పత్రిలో ఒక నిత్య కార్యక్రమం. దేహారోగ్యం సరిలేక బాధపడుతున్న మానవాళికి ఈ ఆధునిక వైద్య శాస్త్రాభివృద్ధి ఒక వరం.

రాయలసీమ

శ్రీ ఎన్. రామచంద్రారెడ్డి
రెవిన్యూశాఖామాత్యులు

"రాయలేలిన సీమ రతనాల సీమరా" అంటూ మన కవులు గర్వంగా గానం చేస్తుంటారు. రాయలసీమ అనగానే అనాటి శ్రీ కృష్ణ దేవరాయల పరిపాలనా సామర్థ్యం, ఆ ప్రభువు కళల పట్ల చూపిన ఆదరణ, అనాటి ప్రజల సుఖజీవన సౌందర్యం అన్నీ ఒక్కమారు చటుక్కున స్ఫురణకు వస్తాయి. ఆంధ్ర సారస్వతానికి మూల స్థంభాలైన అష్టదిగ్గజాలు మన కండ్ల ఎదుట ప్రత్యక్షమవుతారు. ఆంధ్రుల చరిత్రకు వన్నెతెచ్చిన ఆ బంగారు కాలంలోకి ఒకక్షణం వెళ్ళి మన పూర్వ ఔన్నత్యానికి మనమే మురిసిపోతాం. కావ్యం చదివి రసానందానుభూతి పొందిన పాఠకుడిలా మరుక్షణమే మనకు లౌకిక స్మృతి కలుగుతుంది. ఇప్పటి మన రాయలసీమ, మన అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలు కనిపిస్తాయి. మనకు బాగా పరిచితములైన కొండలు, గుట్టలు, రాళ్ళు నాలుగు చినుకులకోసం నాలుగు నెలలుగా ఎదురు చూస్తున్న ఎర్ర మట్టి పొలాలు, బిక్క మొగాలతో ఆకాశం వేపు చూస్తున్న పేద రైతులు యివీ నేటి రాయలసీమ దృశ్యాలు.

నేటి రాయలసీమలో క్షామ దేవత పిలిస్తే పలుకుతుంది. ఏయేటికాయేడు, యీ సంవత్సరం ఎట్లా గడుస్తుందా అని రైతులు భయపడుతుంటారు. ఏఏ చర్యలు తీసుకుని ప్రజలను కొంతలో కొంత ఆదుకోవాలా అని ప్రభుత్వం ఆలోచిస్తుంటుంది. చీటికి మాటికి వానదేవుడికి కోపంవచ్చి బిర్ర బిగుసుకుంటాడు. వర్షాభావంవల్ల ఏదో ఒక ప్రాంతంలో మెట్టపంటలు దెబ్బ తింటూనే ఉంటాయి. మరి దీనికి పరిష్కారమేమిటి? ఎల్లకాలం యీ విధంగా రాయలసీమ వాసులు యిబ్బంది పడుతూ ఉండవలసిందేనా? అంటే, అవసరంలేదు. ఒకవేపునుంచి నరుక్కువస్తున్నాం. సమస్యకు పూర్తి పరిష్కారం, శాశ్వత పరిష్కారం క్రమేణాగాని సాధ్యంకాదు. ప్రణాళికలు ప్రారంభమైననాటినుండి, ముఖ్యంగా ద్వితీయ, తృతీయ ప్రణాళికలలో చిన్నతరహా, మధ్యతరహా ప్రాజెక్టుల నిర్మాణంలో రాయలసీమ ప్రాంతానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడం జరిగింది. రాయలసీమను ఇప్పటికంటె భాగ్యవంతమైన ప్రాంతంగా రూపొందించడానికి ప్రభుత్వం శాయశక్తుల కృషి చేస్తున్నది.

ఐతే, మనం వేసే పథకాలు అమలు పరుచుకోడానికీ, వాటి ఫలితాలు అనుభవించడానికీ కొంతకాల వ్యవధి అవసరం. ఉదాహరణకు తుంగభద్ర ప్రాజెక్టు, కె. సి. కాల్వ పథకం పనులు రెండో పంచవర్ష ప్రణాళికలో జరిగాయి. మిగిలిన భాగం పని మూడో ప్రణాళికాకాలంలో పూర్తి జేసుకోవాలి. తుంగభద్ర ఎగువ కాలువ పథకంక్రింద మూడో ప్రణాళికాకాలంలో అదనంగా లక్ష యకరాలకు సాగునీటి సౌకర్యం కల్పించాలని ఉద్దేశించాం. అలాగే కడప-కర్నూలు కాలువ క్రింద అదనంగా 78 వేల ఎకరాలు సాగులోకి వస్తుంది. స్వర్ణముఖి ఎడమ కాలువ పథకం, కల్యాణి రిజర్వాయరు పులివెందల పథకం మొదలైన వాటివల్ల కూడా మూడో ప్రణాళిక కాలంలో రాయలసీమ ప్రాంతానికి ప్రయోజనం చేకూరుతుంది.

ఇటువంటి పథకాలు అమలుపరచడంతోపాటు కరువు వాతబడిన ప్రాంతాల ప్రజలకు ఎప్పటికప్పుడు అవసరమయ్యే తాత్కాలిక సహాయం అందజేసి ఆదుకోవడం ప్రభుత్వంయొక్క బాధ్యత. అనంతపురం జిల్లా తీసుకుందాం. గడచిన అయిదేండ్లలోనూ అక్కడ వరుసగా పంటలు దెబ్బ తింటూనే ఉన్నాయి. ఆ జిల్లాలో సుమారు ఏడెనిమిది వందల గ్రామాల్లో పంటలు పంటలు పాడైపోవడంవల్ల తీవ్రమైన కరువు పరిస్థితి ఎదుర్కోవలసి వచ్చింది. ప్రభుత్వం వెంటనే కదిలింది. వీలైనంత సహాయం అందజేసింది. రూపాయిలో నాలుగణాలవంతు, అంతకు తక్కువ పంట మాత్రమే పండిన ప్రాంతాలలో శిస్తు పూర్తిగా మాఫీ చేశారు. ఆపైన ఆరణాలవరకు పండిన ప్రాంతాలకు సగం శిస్తు తగ్గించారు.

ఆదేవిధంగా వాణిజ్య పంటలమీద వేసిన ప్రత్యేక పన్ను. ఆరణా లకు తక్కువ పంట పండినచోట పూర్తిగా రద్దు చేయడం జరిగింది. భూమి శిస్తు. తక్కావీ అప్పుల వసూళ్ళు వాయిదా వేయడం కూడా జరిగింది.

1371 వ ఫసలీలో జిల్లాలోని పదకొండు తాలూకాలలోనూ మొత్తం 811 గ్రామాల్లో పంట నష్టం జరిగింది. ఈ ఫసలీకికూడా శిస్తు మాఫీ చేయడానికీ, పాత బకాయీల వసూళ్ళు విలువు చేయడానికీ ప్రభుత్వం ఆలోచిస్తున్నది. ఈ ఫసలీకి శిస్తు మాఫీవల్ల ప్రభుత్వానికి పది పన్నెండు లక్షల రూపాయల ఆదాయం తగ్గిపోతుంది. పైగా 1367 వ ఫసలీ బాపతు భూమి శిస్తు బకాయీలను, సుమారు 84 వేల రూపాయల వరకు ప్రభుత్వం పూర్తిగా రద్దు చేసింది. అలాగే 1368 ఫసలీకి కూడా శిస్తు బకాయీలను రద్దు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నది. వీటి మొత్తం సుమారు ఆరు లక్షల 88 వేలుంటుంది. తక్కావీ ఋణాలు విరివిగా మంజూరు చేయడానికీ, కొత్తగా బావుల నిర్మాణానికి. మంచినీటి బావులను బాగు చేయడానికీ ఉద్దేశించిన అనేక యితర పథకాలను గూడా మంజూరు చేసి ప్రభుత్వం అమలు పరిచింది.

రైతులకు సహాయం చేసే ఉద్దేశంతో ఇటువంటి చర్యలు వెంటవెంటనే గైకొనడర అవసరం. కరువు బాధకు గురి అయ్యే వారిలో వ్యవసాయ కార్మికులు, యితర వృత్తులు చేసుకుని జీవించే బీద ప్రజలు కూడా ఉంటారు. వీరు ఒక పూటకు కూడా తిండి దొరకక అల్లాడే దౌర్భాగ్య పరిస్థితి అనుభవిస్తుంటారు. ఇండ్లూ, వాకిండ్లూ, ఆస్తులూ అంతగా లేకపోయినా పుట్టి పెరిగిన స్వగ్రామాలను వదిలి, పిల్లా మేకనూ చంకపెట్టుకుని ఏ దూర ప్రాంతాలకో వెళ్లి ప్రాణాలు నిలబెట్టుకోవలసిన నిస్సహాయస్థితిలో ఉంటారు. ఏది ఎట్లా వున్నా, పది చినుకులుపడి, మళ్లీ పరిస్థితి కుదుటపడేవరకూ వీరికి ఇంత కలో, గంజో పోసి ఆదుకోవలసి ఉంటుంది. ఇందుకోసం కరువు ప్రాంతాల్లో ప్రభుత్వం గంజి కేంద్రాలు నిర్వహించడం, కరువు పనులు ప్రారంభించడంవంటి బాధ్యతలు స్వీకరిస్తుంది. కొత్తగా రోడ్డు నిర్మాణం తలపెట్టామనుకోండి—లేదా ఒక మైనరు ఇరిగేషన్ పని ప్రారంభించామనుకోండి. ఇటువంటి వాటివల్ల పది మందికి పనులు చూపించనూ వచ్చు. ఆ ప్రాంతంలో శాశ్వతంగా పనికివచ్చే నిర్మాణ కార్యక్రమం జరిగినట్లూ ఉంటుంది. ఈ కరువు పనులు రెండు విధాలా ప్రయోజనకరంగా ఉంటాయి. వీటికోసం అనంతపురం జిల్లాలో గత రెండు సంవత్సరాల్లోనూ మొత్తం 44 లక్షల 66 వేలు మంజూరు చేయడం జరిగింది. ఇదిగాక ప్రధాన మంత్రి కరువు నివారణ నిధినుండి 17 వేల రూపాయలు మంజూరైంది. ఇదేవిధంగా గడచిన రెండేండ్లలో కరువు పనులకోసం కర్నూలు జిల్లాకు 41 లక్షలు, కడప జిల్లాకు 25 లక్షలు, చిత్తూరు జిల్లాకు 27 లక్షలు మంజూరైంది. కర్నూలు జిల్లాలో ఆలూరు, ఆదోని, పత్తికొండ, కోయిలకుంట్ల తాలుకాలు, కడపజిల్లాలో రాయచోటి, జమ్మలమడుగు, కమలాపురం, పులివెందుల తాలూకాలు, చిత్తూరు జిల్లాలో మదనపల్లి, వాయల్పాడు, తిరుత్తని, చంద్రగిరి, చిత్తూరు, పుంగనూరు, కుప్పం తాలూకాలు, తరుచుగా క్షామదేవతకు గురి అవుతూ ఉంటాయి. ఈ ప్రాంతాలన్నిటిలోనూ ప్రభుత్వం ఆవసరమైన సహాయక చర్యలను గైకొనడం జరిగింది. ఇదేవిధంగా మన రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో— అంటే విశాఖ, శ్రీకాకుళం జిల్లాలు, హైదరాబాద్, వరంగల్లు, ఖమ్మం, నల్లగొండ, ఆదిలాబాద్ మొదలైన జిల్లాలలోకూడా, ఏకారణం చేతనైనా పంటలు పాడైన పరిస్థితిలో ప్రభుత్వం రైతులను ఆదుకున్నది. ఈ అన్ని జిల్లాల్లోనూ కలిసి గత రెండేండ్లలో కరువు పనుల నిమిత్తం ప్రభుత్వం కోటి రూపాయలకుపైగా మంజూరు చేసింది.

రాష్ట్రికలో కరువు ప్రమాదమేర్పడి నప్పుడల్లా ప్రభుత్వ యంత్రాంగంకదిలి పనిచేసింవంటే, ఇదంతా గొప్పకోసం చెప్పడం కాదు. అది ప్రభుత్వం బాధ్యత. ప్రభుత్వంలో వున్న ప్రజా ప్రతినిధుల బాధ్యత. ఈ సహాయం చాలనికూడాకాదు. ఇంకా ఎంతో చేయవలసి ఉంది. నిజానికి యీ కరువు ప్రాంతాలు చంద్రుడిలో మచ్చలాంటివి. దక్షిణ భారతావనికి ధాన్యాగారమని ప్రసిద్ధికెక్కిన మన రాష్ట్రంలో కరువులు రావడం మన ప్రతిష్ఠకే భంగకరం. అయితే రాష్ట్రం నాలుగు మూలల సేద్యపు నీటి పారుదల విషయాలలో తగు ఏర్పాటు పూర్తికానిదే యీ ప్రకృతి వైపరీత్యాల బాధ తప్పదు. ఒక ప్రాంతంలో వర్షాలు పడక మెట్టపంటలు పండవు. ఆ ప్రాంతంలో కరువు తాండవిస్తుంది. మరొక ప్రాంతంలో అధిక వర్షాలవల్ల పండిన పంట అంతా నాశనమై పోతుంది. నదులూ, వాగులు పొంగి, చెరువు కట్టలు తెగి, గ్రామాల మీద విజృంభించి ఆస్తినష్టం, ప్రాణ నష్టం కలుగుతుంది. మనం కన్న బిడ్డల్లా పెంచుకుంటున్న పశువులు వరదలో కొట్టుకుపోతాయి. ఇండ్లూ వాకిళ్లూ జలదేవత తన పొట్టను పెట్టుకుంటుంది. ఇటువంటి చోట్ల వరద బాధితులకు

తక్షణ సహాయమందించడం. వారికి పునరావాసం కల్పించే చర్యలు గైనడం, శాశ్వతంగా వరద నివారణ పథకాలు తయారు చేసుకొని అమలు పరచడం అవసరం. అలాగే తెలంగాణా ప్రాంతంతో తరచు వడగండ్ల వానలమూలంగా పంట నష్టం జరుగుతుంటుంది. 'తానొకటి తలిస్తే దైవమొకటి తలచినా దన్నట్లు' ఏడాది పొడుగునా తన రక్తం ధారపోసి శ్రమచేసి పండించిన పంట ఏదో ఒక ప్రకృతి వైపరీత్యంవల్ల పాడైపోతే, అది ఒక ప్రాంతంలోనే జరిగినా దాని ప్రభావం రాష్ట్ర మంతటి మీదా ప్రసరిస్తుంది. డెల్టా ప్రాంతాలలో వరదలు వచ్చి నష్టం జరిగితే రాష్ట్రం మొత్తానికి దాదాపు కరువు పరిస్థితి ఏర్పడుతుంది. ఇటువంటి ప్రకృతి పైసరీత్యాలనుండి మానవుడు పూర్తిగా తప్పించుకోలేడు. కాని సాధ్యమైనంతవరకు కృషిచేసి, చాలా భాగం వీటి ప్రభావం పడకుండా తప్పించుకోవచ్చు. రాయల సీమకు ప్రధానమైన సమస్య కరువు బాధ. మనకున్న జలాలనన్నిటినీ పొలాల మీదికి మళ్లించేకృషి విజయమైనకొలది క్రమ క్రమంగా కరువు రాక్షసి మాయమై పోతుంది.

ఆ నాడు విజయనగర వీధుల్లో రత్నాలు రాసులు పోసి అమ్మేవారని చెప్తారు. వజ్రకరూరులో వజ్రాలు దొరుకుతాయని అంటారు. అచిరకాలంలోనే రాయలసీమ, పూర్వ ప్రాభవాన్ని అందుకోడానికి అందరం కృషి చేద్దాం. రాయలసీమను నిజమైన రత్నాల సీమగా రూపొందించుకుందాం.

గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా

1962 మే నెలలో తూర్పు గోదావరి జిల్లాలోని నల్లిమిల్లి గ్రామానికి విద్యుచ్ఛక్తిని సరఫరా చేశారు.

అనంతపురం జిల్లా ధర్మవరం తాలూకా శివారు గ్రామం గుట్ట కిందపల్లి, పెనుకొండ తాలూకాలోని బుచ్చయగారిపల్లి గ్రామాలకు కూడా అదే నెలలో విద్యుచ్ఛక్తిని సరఫరా చేశారు.

చిత్తూరు జిల్లా, సత్యవేడు తాలూకాలోని కొత్తూరు-వెంకటాపురం, దాని శివారులోని శ్రీరాంపురం గ్రామాలకు, మే నెలలో విద్యుచ్ఛక్తిని సరఫరా చేశారు.

కృష్ణా జిల్లా, గుడివాడ తాలూకాలోని పోలుకొండ గ్రామానికి కూడా విద్యుచ్ఛక్తిని సరఫరా చేశారు.

నెల్లూరు జిల్లా, సూళ్ళూరుపేట తాలూకాలోని యేకొల్లు గ్రామానికి కూడా అదే నెలలో విద్యుచ్ఛక్తి లభించింది.

నాటిక :

"మహాదానం"

శ్రీ రామకృష్ణ భరద్వాజ

పాత్రలు

శివయ్య ... నారాయణ

గోపాలం ... సీత

[నారాయణ_సీత అన్నాచెల్లెళ్లు. వీరి తండ్రి శివయ్య ఒకరి జోలీ_మాటా అక్కరలేకుండా కూలిపన్లమీదా_వ్యవసాయం మీదా గడుపుతూ తన బ్రతుకేదో తాను బ్రతికే మనిషి. నారాయణ మాత్రం కొంచెం స్వేచ్ఛగా తిరుగుతూంటాడు సీత కూలీనాలి చేసి తండ్రికి భారం కాకుండా మసలుతూంది. గోపాలం వీరి కుటుంబం మీద అభిమానమున్న ఓ దూరపు బంధువు.. నాగరికుడు. గవర్నమెంటు కాంట్రాక్టులమీద తిరుగుతూంటాడు... ఒకనాటి సాయంత్రం:]

(నే పథ్యంలో_కారుహారన్ బ్రమోతలు_జనం కలకలం_సైకిలు గంటల చప్పుళ్లు విన్పిస్తాయ్_స్థలం; నడివీధి తెలు తొలుగుతుంది_ సీతను తరుముకుంటూ నారాయణ వస్తూంటాడు. గబగబా వచ్చి సీత చేతిని పట్టుకుంటాడు..)

సీత: (వగరుస్తూ) ఏం_ఎందుకొగాలి!

నారా: ఆగకేం సేత్తావ్... ఇప్పుడు...(గట్టిగాపట్టుకుంటాడు)

సీత: (బిగ్గరగా) అమ్మో...సంపేశాడు బాబో...

నారా: నోరుముయ్ (ఆమెనోరు నొక్కేస్తాడు)

సీత: (విదిలించుకుంటూ) నన్నొదిసిపెట్టు మరి...ఊఁ...పోలీసుని పిలుత్తా...

నారా: మరి బాబుకాడికెల్లకుండా ఉంటావా!

సీత: నాడబ్బు నాకిచ్చేయ్ మరి...

నారా: నాక్కాసిన డబ్బులిత్తేనే?

సీత. ఇయ్యను_బాబునే అడుగు...

నారా తాగడానికంటే ఈడు మరి...

సీత: అందుకని నాడబ్బు ఎత్తుక పోతావా?...
అయినా నీకిదేం రోగం?...ఎంత తంతూన్నా రోజూ తెగమీరిపోతన్నావ్...నాడబ్బునాకిత్తావా...పోలీసుని పిలమన్నావా?

నారా: నీయిట్ట మొచ్చినట్టు సేసుకో...

సీత: అలాగా! అయితేసూడు...(బిగ్గరగా) ఇదుగో పోలీసుగోరూ!!

(నారాయణ సీతనోరు నొక్కేస్తాడు.)

సీత: (విదిలించుకుంటూ) నానోరు నొక్కుతావేం...నా యిట్టమన్నావుగా...పోనీ బాబుతో సెప్తాలే (పరుగెత్తబోతుంది.)

నారా: (ఆమెనాపుతూ) బాబ్బాబు...ఓ యాభైపైసలియ్యమ్మా!!

సీత: ఒక్కపైసకూడా యీను.

నారా: ఈవూ!

సీత: ఊఁ హూఁ!!...

నారా: సరే కాసుకో...(పరుగెత్తబోతాడు.)

సీత: (గట్టిగా పట్టుకుని) ఒరే ఆగరా! అన్నయ్యా!!

(విదిలించుకుని వెళ్లిపోతాడు.)

సీత: (గట్టిగా) నారిగోప్!!

గోపాలం: (ఎదురుగా వచ్చి నారాయణని పట్టుకుని) అరే నారాయణా! ఎక్కడికిరా అలా పరుగెడుతున్నావ్...ఆగవేంరా??

నారా: ఉండవయ్యా! నన్నాపకు...ఒదులు...

గోపాలం: ఆగవోయ్ ... ఏంసీతా! ఏవిఁటా వగర్పు...ఈ తొందరేవిఁటి? ఈ భయమేవిటి??

సీత: సూడండి గోపాలంగోరూ! ఈ యదవకి తాగుడికి డబ్బు కావాలంట!!...నేను కూలిసేసి దాసుకున్నడబ్బు-డబ్బీతో సే తన్నుకు పోతున్నాడు ..

గోపా: ఏరా నారాయణా! నిజమేనా?...ఏంపన్లురాయివి...? ఈ నిర్వాకానికి చెల్లిడబ్బే కావాల్సి వచ్చిందేరా?...ఎందుకురా పాడుబ్రతుకు?...నిన్నకాక మొన్న కొట్లోంచి వచ్చేవ్... మళ్లీ మొదలన్నమాట!! ఛీఛీ ఏదీ ఆడబ్బీ...ఇలాయియ్యి (లాక్కుని) పో... పాడుముఖమాని... ఈ మాట మళ్లీ నాకు వినిపించిందో-డొక్క చీరేస్తా..ఇంకెప్పుడూ ఇలాంటి పన్లు చెయ్యనని లెంపలు వాయించుకో....

నారా: ఛమించయ్యా... తప్పైపోనాది. (గద్గదంతో) ఇంకెప్పుడూ సెయ్యను..

గోపాలం: బతకలేకపోతే ముష్టడుక్కోవాలి కాని యిలాగేనా... మీబాబు ఎంతమర్యాదగా ఉన్నాడ్రా....?....కూలో నాలో చేసుకోవాలి... నాలుగు డబ్బులు చేదుకోవాలి గాని యిలా అందరిచేత తలో మాటా పడడమేనా నీబతుకు . పో.... రేపొద్దున్నే కనిపించు..చిన్నటౌన్లో గవర్నమెంటు ఆస్పత్రిపనిచేస్తున్నారు మనవాళ్లు.. అందులో చేర్పిస్తా ...

నారా: (దుఃఖంతో) సిత్తమయ్యా!... (నిష్క్రమణం)

గోపా: ఇదుగో సీతా! నీ డబ్బీ తీసుకో...

సీత: సాలా దండాలు గోపాలం బాబూ!... ఇట్టాగైపోతన్నాడు మా నరిగోడు...నా అన్న పెద్దోడౌతాడు...సదువుకుంటాడు — ఉద్దోగాలు సేత్తాడనుకున్నాను...సదువూలేదు-సంపాదనా లేదు...ఒట్టి గాలిబతుకోడయ్యాడు ..

గోపా: ఏం పరవాలేదు—వాణ్ణి సరైన కట్టుబాటులో పెడితే యిలా తయారౌతాడా?...మీ బాబు గారాబంగా పెంచాడు-వాడిలా తయారయ్యాడు...ఇంక చూసుకో—మీ అన్ననెలా మారుస్తానో మరి!!

సీత: అంతా మీ దయ...ఒత్తా బాబూ!! (వెళ్ళబోతుంది)

గోపా: ఆఁ.. ఇలా చూడు సీతా!!

సీత: ఏం బాబూ!

గోపా: ఇందులో ఎంత డబ్బుందేం ??

సీత: (నవ్వుతూ...) ఎంతోనా...వందపైన ఓ పాతిక...

గోపా: నయాపైసలా !!

సీత: మంచోరే!! రూపాయలు...

గోపా: నిజమే? ఇంత డబ్బెలా దాచేవు సీతా!!

సీత: ఏదోబాబూ! రెండేళ్లు కూలిసేసి మిగుల్చుకుంటే యింతైంది!!

గోపా: ఏం—ఇదంతా నీ పెళ్లికోసమేనేమిటి ?

సీత: సాల్లేద్దురూ! ఎవురేనా నవ్వుతారు...

గోపా: అంత రహస్యమేమిటో...

సీత: రగస్సానికేముంది బాబూ!!

గోపా: అవును—మీ బాబు రెండు చేతులా సంపాదిస్తున్నది చాలకేనా నీ దాపరికం కూడా!

సీత: మీ కేమీ తెల్దు బాబూ!!

గోపా: అందుకేగా చెప్పమనేది—

సీత: (రహస్యంగా) మరీ...ఎవ్వరితోనూ సెప్పకండేం...

గోపా: ఏమీ చెప్పందే...

సీత: మీతో అంతకన్నా...మన గవుర్నమెంటు అయేయో బగుమతు లిత్తారట!

గోపా: దేనికి ?

సీత: అదే బాబూ పోష్టాపీసులో అమ్ముతారూ...!! అయి కొంటే మూణ్ణెల్లకల్లా సీటీ కలుపుతారంట!—అప్పుడు ఎవరి సీటికి బగుమతి వత్తే ఆరికి సానా డబ్బిత్తారంటగా...

గోపా: (నవ్వి) చంపేశావు.. ప్రయిజు బాండులా...?

సీత, అయే కాబోలు...మొన్న మా సత్తెం బాబాయికి ఏడు ఏలపైగా ఎంతో ఒచ్చిదంట...

గోపా: ఆఁ...ఆఁ...ప్రైజుబాండుల్లోనే... ఏం నువ్వుకూడా కొంటావా ?

సీత: అందుకే బాబూ! ఈ డబ్బు దాచుకున్నా...మా నారిగోడి కళ్లు పడ్డాక ఇంకా ఏముంది...? ఆ ఆశ బదులుకోవాల్సిందే...

గోపా: ఆహాఁ!...నువ్వూ పొదుపు ఉద్యమంలో చేరుతున్నావన్న మాట!...మంచిదే...ఇంత మంచి ఊహ ఉన్నందుకు నిన్నభినందించాలి సీతా!...మీ నారాయణ విషయమై నువ్వేమీ భయపడకు...వాడింక అల్లాంటివి చెయ్యడులే... ఇంతకీ ఎన్ని రూపాయిలివి కొంటావేమిటి ?

సీత: నూరు రూపాయిలిది...

గోపా: అబ్బో! పెద్ద ఎత్తులోనే ఉన్నావే!

సీత: మా సత్తెం బాబాయి అయిదు రూపాయిల్దే కొన్నాడు... ఆడికి ఏడు ఏలే ఒచ్చింది...అయితే నాకు నూరు రూపాయిలికి ఓ పదేలేనా రావా బాబూ!!

గోపా: (నవ్వుతూ) పదివేలేం కర్మం! పాతిక వేలొస్తాయి అదృష్టముంటే

సీత: అలాగా! గోపాలంబాబూ!! అయితే నాకు తెలీకడుగుతా! నూట పాతిక రూపాయిలికి ముప్పైయేలు రావా?...

గోపా: (పకపక నవ్వుతాడు...)

సీత: (గునుస్తూ) నవ్వుతుండారుకాని...

గోపా: నీ కింకా తెలీదన్నమాట...

సీత: ఏంటండీ!

గోపా: చీటీ అంటే—గాజుల బేరమనుకుంటున్నావేమిటి?

సీత: సీటీలు కలిపి మన పేరొచ్చినప్పుడు సానా డబ్బిత్తారంతేగా!

గోపా: అలాగా...ఎంతాశా! ఇలా విను. బహుమతి మొత్తం నువ్వు కట్టిన డబ్బుని బట్టే కొన్న పత్రాన్నిబట్టే ఉండదు నువ్వెంత డబ్బు కట్టినా చీటీలన్నీ కలిపి నీ నంబరు వస్తే ఆ బహుమతి నీకిస్తారు. నూరు రూపాయల పత్రానికి బహుమతి 25000...ఎంతో అదృష్టముంటేనే గాని అది రాదు...

సీత: అదుట్టానికేంటి గోపాలంగారూ! నాకు తప్పకుండా వత్తది..

గోపా: ఎంచేతో!!

సీత: నాకు మా బాబాయి ఓ ఉపాయం సెప్పాడు...

గోపా: (ఆత్రంగా) ఏమిటది?

సీత: మీరెవురితోనూ సెప్పకూడదు మరి...

గోపా: ఫరవాలేదులే చెప్పు.

సీత: (రహస్యంగా) అయన కళ్లు మూసుకుని దేవుణ్ణి తలుసుకుని • క్యాలెండరంకెలమీద ఏలు పెడతాడంట... ఆ తారీకునాడు టిక్కట్టు కొనేత్తే బహుమతి వచ్చేత్తుదంట!...

గోపా: ఆఁ...!

సీత: ఆఁ... ఒట్టు

గోపా: అయితే నీకు వచ్చేస్తుందంటావ్!

సీత: ఆఁ...!

గోపా: అయితే కొనేస్తానంటావ్:

సీత: ఓ...

గోపా: వంద రూపాయిలికి ఒక్కటే కొంటావా: అయిదేసి రూపాయిల చొప్పున కొంటావా??

సీత: నూరూ రూపాయిల్దే కొంటా!

గోపా: సరే—శుభం... గెలిస్తే నా కేమిస్తావ్...

సీత: ఏమో!— మా బాబునడగండి...(వెళ్ళబోతుంది...)

గోపా: ఇదుగో సీతా!...మాట!!...

సీత: (ఆగి) ఏం...

గోపా: అయితే మీ బాబాయి నాక్కూడా చెప్తాడా!

సీత: ఏమో నాకు తెల్దు బాబూ! ఈ మాట అందరికీ సెప్పేత్తారా ఏంటి?? తెలీక సెప్పాను.

గోపా: అబ్బే నాకోసమే!!

సీత: అమ్మో! ఎంతాశా!! నే సెప్పనివ్వనుగా!...పోతా బాబూ!!!

(వెళ్ళిపోతూంటుంది...)

గోపా: ఇదుగో సీతా!?... మా...ట!!! (వెళ్ళిపోతుంది)

గోపా: వెఱ్ఱి పిల్ల!!! (తెర)

రెండవ దృశ్యం

స్థలం : నడివీధి

గోపాలం: ఏం నారాయణా!... ఈ వేళ పేపర్లోనేగా బహుమతి పత్రాల ఫలితాలు తెలిసేది?...పేపరొచ్చిందేమో చూశావా?

నారా: ఇదుగో బాబూ... నాకు సదువురాదుగా... పేపరు కొని అర గంటయ్యింది. మీరొత్తే సూపిద్దామనే కూకుండా....

గోపా: ఏదీ యిలా యియ్యి... అరే మొదటి పేజీలోనే ఉందే... "ఆంధ్ర వనితకు పాతిక వేలు—ఆమెకుగాని—ఆమె గార్డియనుకుగాని అందచెయ్యబడును."

నారా: ఆఁ... నిజమేనా అయ్యగోరూ... మా సీత...ఎంత గొప్పది...

[గబగబా పరుగెత్తుతాడు—తెరలో మోటార్ కార్ల హారన్లు—బండ్ల చప్పుళ్ళు...వెనకాలే గోపాలం పరుగెత్తుతాడు...)

గోపా: అరే నారాయణా! అదేమిటోయ్...ఎందుకా తొందర—మెల్లిగా వెడదాం నేనూ వస్తున్నాగా—ఆగు (అంటూ లోపలికి పరుగెత్తుతాడు—తెర పడుతుంది...తెరలో గోపాలం : నారాయణా... ఆగవోయ్!... ఆగమంటూంటే—మెల్లిగా—జాగ్రత్త... లారీ వస్తోంది—తప్పుకో...తప్పుకో—అయ్యో!! నారాయణ : "అమ్మా!"అని కేక వేస్తాడు...హారన్ కొడుతూ లారీ—బస్సు ఆగిన ధ్వని..జనం కలకలం...)

మూడవ దృశ్యం : ఆస్పత్రి

గోపా: ఊరుకో శివయ్యా ! .. అలా బెంబేలుపడితే ఎలా ! పసి దానికోసమేనా కొంచెం ధైర్యంగా ఉండు. నారాయణకేమీ. ఫరవారేదు... నలుగురు డాక్టర్లు చూస్తున్నారు. తప్ప కుండా మళ్ళీ మనవాడౌతాడు.

శివ : (దుఃఖంతో) ఏమో బాబూ... తల్లిపోయిన కాణ్ణుంచీ యీ శ్వద్దర్నీ రెండు కళ్లలా' సూసుకొంటుండా.. నిన్నటిదాకా గాలికి తిరిగేడు. ఏదో నీ సేతికింద యియ్యాల నాలుగు రాళ్లు తెచ్చుకుంటున్నాడంటే .. ఇంతలోకే యీ ఉపద్దరం ఒచ్చిపడింద.

గోపా: ఏమీ ఫరవాలేదు...! ఈ ఆస్పత్రి మునపట్లా అనుకొంటు న్నావా ? ఆసుపత్రీ పెరిగింది. డాక్టర్లూ పెరిగారు. మంచి మంచి డాక్టర్లు వచ్చారు. ఏమీ బెంగ పెట్టుకోక.

శివ : సీతా ! ఒసేయ్...ఊరుకో... అన్నయ్యకేమీ పరవాలేదు.

గోపా: ఏఁటది సీతా! ఛ—అలాగేనా... అన్నయ్యకేం .. అతడు మళ్ళీ ఖుభంగా మనలో ఒకడుగా ఉంటాడు.

సీత : ఏంటో బాబూ ! మాయదారి డబ్బు రాకపోయినా బాగుండి పోను. ఈడి పాణం సుకంగా ఉండేది

గోపా: ఛ— అవేం మాటలు ... రోడ్డు మీద అడ్డంగా పరిగెడితే ఎవరేం చెయ్యగలరు ? ఆ డబ్బుకి—నాడి ప్రమాదానికి ఏం సంబంధం ?.... ఊరుకో శివయ్యా ! నే లోపలికెళ్ళి చూసి వస్తా ! మీరిక్కడే ఉండండి...

శివ : నేనూ వత్తా బాబూ !!

గోపా: సీత నొక్కర్తినీ వదిలి వస్తావా ?... ఇప్పుడే వస్తాగా (వెడతాడు)

సీత : బాబూ !...

శివ : ఏం తల్లీ !!

సీత : అన్నయ్య.... బతుకుతాడా ! (దుఃఖంగా)

శివ : (మరింత దుఃఖంతో) ఏమోనమ్మా... అంతా ఆ పరమే శ్వరుడి దయ...

సీత : అదుగో అన్నని తీసుకొత్తన్నారు.. (తెరలోకి చూస్తుంది.)

శివ : ఆఁ... వత్తన్నారే... ఏంటది గోపాలంగారూ !!

గోపా: (విచారంగా ప్రవేశిస్తూ) కుడికాలు తీసెయ్యాలట...

శివ : (దుఃఖంతో) హరిదేవుడా ! ఏం కర్మరా బాబూ !!

సీత : నీ కాలిని పొట్టపెట్టుకున్నారా అన్నయ్యా (దుఃఖం..)

(అంటూ యిద్దరూ తెరలోకి వెడతారు)

గోపా: అతని మీద పడి అలా ఏడవకండి... మంచంమీదనేనా విశ్రాంతిగా పడుకోనివ్వండి. ఇంకా పెద్ద డాక్టరుగారు రావాలి... అప్పుడు గాని యింకా ఏ సంగతీ చెప్పలేరుట..

శివ : (
సీత : ((లోపలి నుండి కళ్లు వత్తుకుంటూ వస్తారు.)

శివ : ఇంకా తేలేదేంటి బాబూ !... (దుఖంతో) నా కొడుకు కుంటోడు...

గోపా: అబ్బా గొడవ చెయ్యకయ్యా !! అదుగో డాక్టరుగారు వచ్చే స్తున్నారు. ఆపరేషన్ చేస్తారు.

శివ : ఆపరేషనే...అమ్మో !!

గోపా: భయపడకు— ఇదుగో లోపలికి తీసుకెడుతున్నారు...

సీత : ఈయన బాగా సేత్తారండీ !

గోపా: ఏం భయపడకు సీతా ! ఈయనకోసమేగా ఇందాకటినుంచీ నలుగురు డాక్టర్లూ చూస్తున్నారు... ఈ హాస్పిటలు పెంచే కనే గవర్నమెంటు ఈయన్నిక్కడ వేశారు. ఈయన విదేశాలు కూడా వెళ్ళి వైద్యం నేర్చుకుని వచ్చారుట... దేవుడంటారీయన్నిక్కడంతా !!

సీత : అయితే నారిగోడు తప్పకుండా బతుకుతాడు బాబూ...

గోపా: బతకడానికేమీ సందేహం లేదు.. ఈయన వచ్చాడుగా.. ఇంక కాలు కూడా పరవాలేదనుకుంటాను.

సీత : అదుగో మిమ్మల్ని పిలుత్తన్నారు బాబూ !

గోపా: శివయ్యా ! ఇక్కడే ఉండండి... ఇప్పుడే వస్తా... (వెడతాడు.)

శివ: సీతా! అబ్బాయి తప్పకుండా బతుకుతాడే!

సీత : బతుకుతాడు బాబూ ! గోపాలం బాబు సెప్పేడుగా...

శివ : ఈ డాట్టరు సానా గొప్పోడంట. అబ్బాయి బతకడూ ?

సీత : మరి—పెద్దాసుపత్తిరిగా... గోపాలంగోరనాగే సెప్పేడు. అదుగో గోపాలంగోరు. ఏంబాబూ—అన్నయ్య...

గోపా: (ఖంగారుగా వచ్చి) ఏం ఫరవాలేదు. నెత్తురు బాగా పోయింది—రక్తం కావాలన్నారు.

శివ : (
సీత : (నేనిత్తా బాబూ !

గోపా: నువ్వు ముసలాడివీ_ఈమె నీరసంగా ఉంది...మీ రక్తం పనికిరాదు... నేనే యిస్తా... ఏమీ గాభరాపడకండి వస్తా.. (వెడతాడు)

సీత : బాబూ! గోపాలం బాబూ !!... ఎంత మంచోడు...

శివ : నిజంగా దేవుడు... ఆయనే లేకపోతే నా బాబు అక్కడే (దుఃఖంతో) పాణాలొదిలేవోడు...

సీత : ఊరుకో బాబూ! ... ఆలా చూడు బాబూ! గోపాలం గోర్ని మంచంమీదేసి తీసుకొత్తన్నారు. అయ్యో అలా పడున్నారేం... (ఇద్దరూ లోపలికెడతారు..)

(తెరలో)

శివ : ఆ కూజాలో నీళ్లు కాసిని ముకంమీద సల్లు.. లేత్తారు... ఆఁ సాల్లే...

సీత : అదుగో కదుల్తున్నారు.

గోపా: (నిట్టూర్చి) అబ్బ! దాహం !!

శివ : ఇదుగోనయ్యా !!

గోపా: (మెల్లిగా) శివయ్యా !... అబ్బాయికెలా ఉంది...

శివ : అదుగో బాబూ... అబ్బాయి మంచం వత్తాంది...

గోపా: చూశావా శివయ్యా !... నిజంగా భగవంతుడే అవ్వాళ ఆ డాక్టరు రూపంలో వచ్చి మన నారాయణని బ్రతికించారు. మరి ప్రభుత్వానికి మనం ఎంత ఋణపడి ఉన్నామో చూశావా! మునుపటి ఆసుపత్రే అయితే యీనాడు మనం ఇలా ఉండేవాళ్ళమా! ఆ ప్రణాళికల ధర్మమా అని.. ఏదో మన టౌన్లోనూ ఓ పెద్ద ఆసుపత్రి_ఓ పెద్ద డాక్టరూ వెలిశారు.

శివ: నిజమే బాబూ! ఆయాల ఆ డాట్టరు దేవుడటూ_ఈ గోపాలం దేవుడిటూ మా నారిగోణ్ణి మనిసిని సేశారు...

గోపా: ఇంతకీ సీతా! నీ పాతికవేలూ బ్యాంకిలో పడేశావా?

నారా: ఇంకెక్కడున్నాయి బాబూ, నాకు కాళ్లొచ్చి బతికేనన్న సంబరంలో మా సీత ఆ పాతిక యేలల్లో ఇరవై యేలు ఆస్పత్రి కట్టించిన గవుర్నమెంటుకి దానం సేసేసింది...

గోపా: ఆఁ.. నిజమేనా సీతా!:

సీత: అవును గోపాలంగారూ:.. అనాంటి ఆస్పత్త్రిలు-అనాంటి డాట్టర్లు నేకపోతే మా అన్నయ్యనాంటి అన్నయ్యలెంత మందేమయ్యేవోరోకదా! నిజంగా పెబుత్తంవోరు ఎంత కర్చు పెట్టి అంతంత పన్లు సేయిత్తన్నారో_ఎంతకట్ట పడుతున్నారో యీటికోసం... నేనేం కట్టపడి సంపాయించానా ఆ పాతికేలూ...? అందుకని అందులో ఇరవై ఏలు ఆసుపత్తిరి కిచ్చేశాను... పెబుత్తం మల్లీ మానాంటి ఓళ్ళకే కర్చుపెడతదిగా!...

గోపా: చాలా మంచి పని చేశావు సీతా! నిజంగా నీలాగే ప్రతి భారతీయుడు ఉదార హృదయంతో చేయూతనిస్తే మన ప్రణాళికలు ఒకటికి నూరింతలుగా ఫలిస్తాయి....శివయ్యా! నీలాంటి దేశభక్తుడికి తగిన బిడ్డని కన్నావయ్యా!

శివ: ఇప్పుడు మీరిద్దరూ ఇంతకంటె గొప్పవారిని దేశానికందివ్వాలి!

గోపా: అంటే ?

నారా: మా సెల్లి మిమ్మల్నేగాని పెళ్ళాడదంట గోపాలం బాబూ!!

సీత: సాల్లే_ఊరుకో...

గోపా: ఏం_సీతా... ఇదేనా_ఆవేళ చెప్పిన బహుమతి...!!

(ఆకాశవాణి సౌజన్యంతో..)

దీక్షాదానమ్

శ్రీ ముదివర్తి కొండమాచార్యులు

[బుద్ధభగవానుడు భిక్షువులతో రాజగృహ నగరము వెలువడి ప్రియ శిష్యుడైన ఆనందునితో "ఆ వీధి నూడ్చుచున్నవానిని గమనించితివా?" యని ప్రశ్నించును. "అతడు మాల. ఆహీన జన్మని జూచి పౌరులే వగించుకొందురు" అని బదులాడిన ఆనందునితో "అతడు దీక్షనందుటకు తగియున్నాఁడు" అని చెప్పుచు స్వామి గృధ్రకూట పర్వతముపైగల పర్ణకుటీరములు చేరును. ఒకనాటి ప్రభాతమున బుద్ధుడు సునీతుని కడకు వచ్చి భిక్షుసంఘములో చేరుటకు ఆతడంగీకరింపగా వెంటనిడుకొనివచ్చి శిష్య సముఖమున వానికి దీక్షలొసగును.]

"మన మిపుడు పురము వెలువడి
చను దెంచెడువేళ వీథి సమ్మార్జనిఁజి
మ్మ నతని ననుశీలించితె?"
యని భగవానుఁడు వచించె నానందునితోన్.

"అనుశీలించుట కేమి యున్నదిప్రభూ. ఆయీపురీమార్గమా
ర్జనమున్ సల్పెడు మాలఁడాతఁడు; జుగుప్సాహేతు వేతన్నిరీ
క్షణ మీ నాగరకోటికెల్ల; స్వతనుచ్ఛాయా సమీపస్థల
మ్మున కేనిన్ బ్రజచేరనీ దతని చీపొమ్మంచు తర్జించుచున్.

పౌర పరిహృత కశ్మల వస్తువితతి
నీతఁడిట్టులు తొలికోఁడికూఁతలేచి
ప్రోవిడి దహించు నొకయెడ; పొగల సెగల
వేగెడి తదీయహేయజీవితము సతము.

అధర పల్లవమున దరహాసరేఖ
వికచకుంద ప్రసవశోభ విరియఁజిమ్మ
భ్రాతృనిందా వినిష్పంద వాక్యములకు
ప్రభుముఖోద్గతమై యొప్పె ప్రతివచస్సు.

ఆనందా, సమకూడ దిప్పటికి సమ్యగ్దృష్టి నీ కింతయున్
దానఁ శిక్షితుఁజేయుఁగాక నిను మౌద్గల్యాయనుం; డీవిటుల్
వానిఁ బంచముఁడంచుఁ జుల్కనగఁ బల్కంబూని; తభ్యర్థితుం
డానిర్ధూత సమస్త కిల్బిషుఁడు సన్న్యాసమ్ము గై సేయఁగన్

అవలోకించితి కాచకుంభగత దీపాంకూర ముంబోలె సం
స్తవనార్హమ్ముగ నిండివెల్గెడిని ప్రజ్ఞానామృత జ్యోతివా
ని విశుద్ధాత్మ సరోజసంపుటమునన్; విద్యాసవద్యుండు భూ
దివిజోత్తంసుని కంటె నాకతఁడ యెంతే ప్రేమ పాత్రుండగున్."

"అదియేటు; లతండు ప్రవ్రజ్యకర్హుఁడగునె
పామరుం?" డని యానందుఁడా మహాత్ము
పల్కులకు మాఱువల్కె; సంబరము మీర
అవునవు నటంచు భిక్షువు లందుకొనిరి.

జినమౌని ప్రవరుండు నూత్నవిక సత్చ్ఛేఫాలికా పుష్పవా
సనలంజిమ్ము ప్రభాతశీతల నభస్వత్సాధు సంసేవనల్
గను చభ్రంకష గృధ్రకూటతట రేఖా భాసురమ్ముల్, ప్రశాం
తినిధానమ్ములు పర్ణగేహములు ప్రీతింజేరె సచ్ఛాత్రుఁడై.

కరుణామూర్తి తథాగతుండొక యుషఃకాలమ్మునందున్ ద్రిచీ
వరముల్ దాలిచి, కేల పాత్ర గొని గ్రావప్రస్థమున్ డిగ్గి దు
ర్భర సంసార నిమగ్న పుల్కసుని సంరక్షింపఁగా చేరె చె
చ్చెర తద్రాజగృహాభిధాన పురలక్ష్మీకూట శృంగాటముఁ

భగవానుండిటు తన్ను డగ్గఱిల గంపన్ బెంట ప్రోవెత్తు మా
ల గగుర్పాటొదవన్ తదీయ ముఖమున్ లక్షించి తోడ్తోనద
వ్వగనిల్చెన్; భయసంశయాద్భుతములన్ పొంగారుడెందమ్ముపైఁ
దగఁగీల్కొల్పిన మోడ్పుకేలుగపతో తారాడు కందోయితో.

కనుగొనలఁ ప్రసాద మొలుకన్ యతిచంద్రముఁడాసునీతుదా
పును మెలమెల్లసేరి దయ పొంపిరి వోవవచించె: "తెల్లవా
ఱినది మొదల్ కుమార! నడురేయగుదాఁక నిదేమి కష్టజీ
వనమొ? శరీర సంభరణ భారముచే నిటుక్రుంగుచుంటివో?"

మూడవ దృశ్యం: ఆస్పత్రి

గోపా: ఊరుకో శివయ్యా! .. అలా బెంబేలుపడితే ఎలా! పసి దానికోసమేనా కొంచెం ధైర్యంగా ఉండు. నారాయణకేమీ ఫరవారేదు... నలుగురు డాక్టర్లు చూస్తున్నారు. తప్ప కుండా మళ్ళీ మనవాడౌతాడు.

శివ : (దుఃఖంతో) ఏమో బాబూ... తల్లిపోయిన కాణ్ణుంచీ యీ ఇద్దర్నీ రెండు కళ్లలా సూసుకొంటుండా. నిన్నటిదాకా గాలికి తిరిగేడు. ఏదో నీ సేతికింద యియ్యాల నాలుగు రాళ్లు తెచ్చుకుంటున్నాడంటే .. ఇంతలోకే యీ ఉపద్దరం ఒచ్చిపడింది.

గోపా: ఏమీ ఫరవాలేదు...! ఈ ఆస్పత్రి మునపట్లా అనుకొంటు న్నావా? ఆసుపత్రీ పెరిగింది. డాక్టర్లూ పెరిగారు. మంచి మంచి డాక్టర్లు వచ్చారు. ఏమీ బెంగ పెట్టుకోక.

శివ : సీతా! ఒసేయ్...ఊరుకో... అన్నయ్యకేమీ పరవాలేదు.

గోపా: ఏమిటది సీతా! ఛ—అలాగేనా... అన్నయ్యకేం... అతడు మళ్ళీ శుభంగా మనలో ఒకడుగా ఉంటాడు.

సీత : ఏంటో బాబూ! మాయదారి డబ్బు రాకపోయినా బాగుండి పోను. ఈడి పాణం సుకంగా ఉండేది

గోపా: ఛ— అవేం మాటలు... రోడ్డు మీద అడ్డంగా పరిగెడితే ఎవరేం చెయ్యగలరు? ఆ డబ్బుకీ—వాడి ప్రమాదానికి ఏం సంబంధం?.... ఊరుకో శివయ్యా! నే లోపలికెళ్ళి చూసి వస్తా: మీరిక్కడే ఉండండి...

శివ : నేనూ వత్తా బాబూ!!

గోపా: సీత నొక్కర్తిని వదిలి వస్తావా?... ఇప్పుడే వస్తాగా (వెడతాడు)

సీత : బాబూ!...

శివ : ఏం తల్లీ!!

సీత : అన్నయ్య.... బతుకుతాడా! (దుఃఖంగా)

శివ : (మరింత దుఃఖంతో) ఏమోనమ్మా... అంతా ఆ పరమే శ్వరుడి దయ...

సీత : అదుగో అన్నని తీసుకొత్తన్నారు.. (తెరలోకి చూస్తుంది.)

శివ : ఆఁ... వత్తన్నారే... ఏంటది గోపాలంగారూ!!

గోపా: (విచారంగా ప్రవేశిస్తూ) కుడికాలు తీసెయ్యాలట...

శివ : (దుఃఖంతో) హారిదేవుడా: ఏం కర్మరా బాబూ!!

సీత : నీ కాలిని పొట్టపెట్టుకున్నారా అన్నయ్యా (దుఃఖం..)
(అంటూ యిద్దరూ తెరలోకి వెడతారు)

గోపా: అతని మీద పడి అలా ఏడవకండి... మంచంమీదనేనా విశ్రాంతిగా పడుకోనివ్వండి. ఇంకా పెద్ద డాక్టరుగారు రావాలి... అప్పుడు గాని యింకా ఏ సంగతీ చెప్పలేరుట..

శివ : (
సీత : ((లోపలి నుండి కళ్లు వత్తుకుంటూ వస్తారు.)

శివ : ఇంకా తేలేదేంటి బాబూ!... (దుఃఖంతో) నా కొడుకు కుంటోడు...

గోపా: అబ్బా గొడవ చెయ్యకయ్యా!! అదుగో డాక్టరుగారు వచ్చే స్తున్నారు. ఆపరేషన్ చేస్తారు.

శివ : ఆపరేషనే...అమ్మో!!

గోపా: భయపడకు— ఇదుగో లోపలికి తీసుకెడుతున్నారు...

సీత : ఈయన బాగా సేత్తారండీ!

గోపా: ఏం భయపడకు సీతా! ఈయనకోసమేగా ఇందాకటినుంచీ నలుగురు డాక్టర్లూ చూస్తున్నారు... ఈ హాస్పిటలు పెంచే కనే గవర్నమెంటు ఈయన్నిక్కడ వేశారు. ఈయన విదేశాలు కూడా వెళ్ళి వైద్యం నేర్చుకుని వచ్చారుట... దేవుడంటారీయన్నిక్కడంతా!!

సీత : అయితే నారిగోడు తప్పకుండా బతుకుతాడు బాబూ...

గోపా: బతకడానికేమీ సందేహం లేదు.. ఈయన వచ్చాడుగా. ఇంక కాలు కూడా పరవాలేదనుకుంటాను.

సీత : అదుగో మిమ్మల్ని పిలుత్తన్నారు బాబూ!

గోపా: శివయ్యా: ఇక్కడే ఉండండి... ఇప్పుడే వస్తా... (వెడతాడు.)

శివ: సీతా: అబ్బాయి తప్పకుండా బతుకుతాడే!

సీత : బతుకతాడు బాబూ! గోపాలం బాబు సెప్పేడుగా...

శివ : ఈ డాట్టరు సానా గొప్పోడంట. అబ్బాయి బతకడూ?

సీత : మరి—పెద్దాసుపత్తిరిగా... గోపాలంగోరనాగే సెప్పేడు. అదుగో గోపాలంగోరు. ఏంబాబూ—అన్నయ్య...

గోపా: (హుంగారుగా వచ్చి) ఏం పరవాలేదు. నెత్తురు బాగా పోయింది—రక్తం కావాలన్నారు.

శివ : (
సీత : (నేనిత్తా బాబూ!

గోపా: నువ్వు ముసలాడివీ—ఈమె నీరసంగా ఉంది...మీ రక్తం పనికిరాదు... నేనే యిస్తా... ఏమీ గాభరాపడకండి వస్తా.. (వెడతాడు)

సీత : బాబూ! గోపాలం బాబూ !!... ఎంత మంచోడు...

శివ : నిజంగా దేవుడు... ఆయనే లేకపోతే నా బాబు అక్కడే (దుఃఖంతో) పాణాలొదిలేవోడు...

సీత : ఊరుకో బాబూ ! ... ఆలా చూడు బాబూ ! గోపాలం గోర్ని మంచంమీదేసి తీసుకొత్తన్నారు. అయ్యో అలా పడున్నారేం... (ఇద్దరూ లోపలికెడతారు..)

(తెరలో)

శివ : ఆ కూజాలో నీళ్లు కాసిని ముకంమీద సల్లు.. లేత్తారు... ఆఁ సాల్లే...

సీత : అదుగో కదుల్తున్నారు.

గోపా: (నిట్టూర్చి) అబ్బ ! దాహం !!

శివ : ఇదుగోనయ్య !!

గోపా: (మెల్లిగా) శివయ్యా !... అబ్బాయికెలా ఉంది...

శివ : అదుగో బాబూ... అబ్బాయి మంచం వత్తాంది...

గోపా: చూశావా శివయ్యా !... నిజంగా భగవంతుడే అవ్వాళ ఆ డాక్టరు రూపంలో వచ్చి మన నారాయణని బ్రతికించారు. మరి ప్రభుత్వానికి మనం ఎంత ఋణపడి ఉన్నామో చూశావా ! మునుపటి ఆసుపత్రే అయితే యీనాడు మనం ఇలా ఉండేవాళ్ళమా ! ఆ ప్రణాళికల ధర్మమా అని.. ఏదో మన టౌన్లోనూ ఓ పెద్ద ఆసుపత్రి—ఓ పెద్ద డాక్టరూ వెలిశారు.

శివ: నిజమే బాబూ! ఆయాల ఆ డాట్టరు దేవుడటూ—ఈ గోపాలం దేవుడిటూ మా నారిగోణ్ణి మనిసిని సేశారు...

గోపా: ఇంతకీ సీతా! నీ పాతికవేలూ బ్యాంకిలో పడేశావా ?

నారా: ఇంకెక్కడున్నాయి బాబూ, నాకు కాళ్లొచ్చి బతికేనన్న సంబరంలో మా సీత ఆ పాతిక యేలల్లో ఇరవై యేలు ఆస్పత్రి కట్టించిన గవుర్నమెంటుకి దానం సేసేసింది...

గోపా: ఆఁ.. నిజమేనా సీతా!!

సీత: అవును గోపాలంగారూ:...అనాంటి ఆస్పత్రులు-అనాంటి డాట్టర్లు నేకపోతే మా అన్నయ్యనాంటి అన్నయ్య లెంత మందేమయ్యేవోరోకదా! నిజంగా పెబుత్తంవోరు ఎంత కర్చుపెట్టి అంతంత పన్లు సేయిత్తన్నారో—ఎంతకష్ట పడుతున్నారో యీటికోసం... నేనేం కష్టపడి సంపాయించానా ఆ పాతికేలూ...? అందుకని అందులో ఇరవై ఏలు ఆసుపత్తిరి కిచ్చేశాను...పెబుత్తం మల్లీ మానాంటి ఓళ్ళకే కర్చుపెడతదిగా!...

గోపా: చాలా మంచి పని చేశావు సీతా! నిజంగా నీలాగే ప్రతి భారతీయుడు ఉదార హృదయంతో చేయూతనిస్తే మన ప్రణాళికలు ఒకటికి నూరింతలుగా ఫలిస్తాయి....శివయ్యా! నీలాంటి దేశభక్తుడికి తగిన బిడ్డని కన్నావయ్యా!

శివ: ఇప్పుడు మీరిద్దరూ ఇంతకంటె గొప్పవారిని దేశానికంది వ్వాలి !

గోపా: అంటే ?

నారా: మా సెల్లి మిమ్మల్నేగాని పెళ్ళాడదంట గోపాలం బాబూ!!

సీత: సాల్లే—ఊరుకో...

గోపా: ఏం—సీతా... ఇదేనా—ఆవేళ చెప్పిన బహుమతి...!!

(ఆకాశవాణి సౌజన్యంతో..)

శాక్యసింహుని మృదుల వచశ్శిరీష
కుసుమ శయ్యాగతంబయి కొంతవడికి
మనసు మెలకువగన భక్తి మల్లడిగొన
పలికె గద్గదకంఠత పంచముండు.

"ప్రభుసాన్నిధ్యమునం దెటుల్ వలుకగా భావ్యమ్మొ నేనేర; గ
ర్దభ పృష్ఠమ్మునఁ బోలెకూలినది యేతద్భార మీయౌఁదలన్;
శుభయోగమ్ము నెఱుంగదీ బ్రతుకటంచున్ చింతలంగుంద దు
ర్లభ సౌఖ్యమ్మెటుగూడు? కాన మదినేర్పన్ ఖేద మావంతయున్"

భగవానుఁడు

"అంగీకారమటోయి! భంగభర దాస్యాంభోనిధిన్ నిస్తరిం
పంగన్, దుస్సహ దుఃఖసంసరణ సంబంధంబు సర్వంబు పా
యంగన్, మామక భిక్షుసంఘమున నెయ్యమ్మారగాఁజేరి శాం
తింగాంచంగ? భవన్మనోగతమెదో తెల్లమ్ముగావింపుమా!"

"పతితుని పూజ్యపాదులు కృపామతి శిష్యునిగా గ్రహింప స
మ్మతి దయసేసినప్పు డనుమానము వీని కిఁకేల? దుఃఖ సం
భృత జగతీ విముక్తి నొదవింతురె యీ కడజాతివాని" కం
చతులిత హర్షవేగమున నాతఁడు వ్రాలె ధరాతలమ్మునన్.

అనునయ మొప్పఁగా సుగతుఁడాతని మస్తకమంటి "పోదమా
తనయ," యటన్న వాఁడతిముదంబున తోఁజనుదేరఁగా శ్రమం
బున నపరాహ్ణవేళ మునుమున్ను కుటీరముసొచ్చి సెజ్జపైఁ
దనువును జేర్చె భిక్షుముఖ తామరసంబులు వాడఁబాఱఁగన్.

రూక్ష గ్రీష్మమున న్నగావతరణారోహమ్ములంజేసి యీ
దృక్షశ్రాంతికి శీర్ష మొగ్గుటలు భంతే! యేలమీ"కంచు నా
భిక్షుల్ వల్కఁ: "విహీన జన్మునకు సుప్రేమమ్ముగా నిప్పుడే
దీక్షాదానము సేయు కోస"మనియెన్ తీంద్రించి యానందుఁడున్.

"అనఁదగు మాటసేయనిరి యర్హతులెల్లరు; ఈ విహీన జ
న్ముని కొఱకిట్లు స్వామి శ్రమఁబొందుట యుక్తముగా" దటంచు సి
గ్గును భయమున్ విషాదమును గుబ్బటిలన్ మదిలో, సునీతుఁడా
ననమును వాంచినిల్చె దిగనాటిన పందిటిగుంజ కైవడిన్.

గౌతమదేవుఁ డాత్మ సుఖమ్మున కాతనిఁ జేరఁ బిల్చి త
చ్చేతము పల్లవింపఁ బ్రవచించె: సునీత, భయమ్ము మాని యీ
భూతదయార్ద్రి మానసుల ప్రోల భవచ్చరితమునెల్ల వి
ఖ్యాత మొనర్పుమింక నిఖిలాభ్యుదయమ్ములు నీకుఁ గల్గెడిన్.

సునీతుఁడు

"పత్తనపు బాహ్యచండాల వాటియందు
కాపురంబుందు నొక తెల్లి గడ్డిగుడిసె;
పూర్వపాప ఫలంబుగాఁ బుట్టినాఁడ
జనము దరియంగ రానట్టి జాతిలోన.

వలపు విరి పాన్పులందు మేనులను మఱచి
పుణ్యపురుషులు సుఖసుప్తిఁ బొంది యుండ
వారు తిని వీథిలోఁ బాఱవైచినట్టి
విస్తళుల ప్రోవు సేసిడి వృత్తివాఁడ

యాతాయాత జనౌఘ ధిక్కృతులకున్ హార్దమ్ముతో క్షాంతితోఁ
బ్రాతస్సంధ్యల దోసిలొగ్గుటకె యీపాపంపు జన్మంబు; న
న్నేతాదృక్కలుషాత్ముఁ దెచ్చె ప్రభు వెంతే ప్రేముడిన్ సంఘసం
స్థాతవ్యున్ బొనరించి సన్న్యసన దీక్షన్ సంప్రసాదింపఁగన్.

అవనీనాథ శిరః కిరీట నవరత్నాంకూర భాస్వత్పదుం
డవు శ్రీమద్భగవానుఁ డాదృతిని హస్తాబ్జమ్ముచే నాతలన్
నివురన్ మైగఱుపాటె; శోక భయముల్ నీఱయ్యె; దీనత్వమున్
దవులం జేరెను; శాంతినెక్కొనియె చిత్తమ్మందు చిత్రమ్ముగన్.

నాకు సమస్తజీవకరుణా పరతంత్రుఁడు బుద్ధదేవుఁడౌఁ
గాక శరణ్యు; మవ్యయ సుఖస్థితి మూలము బౌద్ధధర్మమౌఁ
గాక శరణ్య; మాతత జగచ్ఛుభదమ్మను బౌద్ధసంఘమౌఁ
గాక శరణ్యు; మీ త్రిశరణమ్ముల గాక భజింపనన్యమున్

ఆసునీతుని ముగ్ధవాగమృత లహరిఁ
దేలియాడె భిక్షు మనోమరాళవితతి;
సారిపుత్రుఁడు బుద్ధాను శాసనమున
వాని కిచ్చెనప్పుడు పరివ్రాజనంబు

కమ్యూనిటీ రేడియో సెట్లు

1962 మే నెలలో క్రింది గ్రామాలలో సాముదాయక రేడియో సెట్లను నెలకొల్పారు.

వ. క్రమం	కేంద్రం పేరు	తాలూకా పేరు	జిల్లా	నెలకొల్పబడిన తేదీ	వివరాలు
1.	నందనవనం	కందుకూరు	నెల్లూరు	3-5-1962	
2.	వెన్నూరు	,,	,,	2-5-62	
3.	కొండపి	,,	,,	2-5-62	
4.	జ్వాలదిన్నె	కావలి	,,	1-5-62	
5.	మద్దూరు	ఆళ్లగడ్డ	కర్నూలు	4-5-62	
6.	కౌకుంట్ల	ఆత్మకూరు	మహబూబునగరం	31-5-62	
7.	గద్వాల (మున్సిపాలిటీ)	గద్వాల	,,	29-5-62	
8.	గుడిపల్లి	—	నల్లగొండ	28-5-62	
9.	సోంపురం అగ్రహారం	సామర్లకోట	విశాఖపట్నం	11-5-62	
10.	కృష్ణదేవి పేట	నర్సీపట్నం	విశాఖపట్నం	25-5-62	
11.	యల్లమిల్లి	పెద్దాపురం	తూర్పు గోదావరి	9-5-62	
12.	పొవ్వాడ	కాకినాడ	,,	12-5-62	
13.	గొల్లవిల్లి	అమలాపురం	,,	2-5-62	
14.	తాడేపల్లిగూడెం (మునిసిపాలిటీ)	తాడేపల్లిగూడెం	,,	30-5-62	
15.	పొందూరు III	ఒంగోలు	గుంటూరు	7-5-62	
16.	యెంకిపాడు	ఒంగోలు	గుంటూరు	6-5-62	
17.	భూసురపల్లి	,,	,,	6-5-62	
18.	చెర్వుకొమ్ముపాలెం	,,	,,	17-5-62	
19.	వెంకటాచలంపల్లి	దర్శి	నెల్లూరు	7-5-62	
20.	వెల్లాలయేనాదికాలనీ	దర్శి	,,	24-5-62	
21.	రంజాలు	బోధన్	నిజామాబాదు	12-5-62	
22.	సదాశివనగర్	కామారెడ్డి	,,	15-5-62	
23.	కాతోర్యాల్	మెదక్	మెదక్	2-5-62	
24.	కనకమామిడి	చేవెళ్ల	హైద్రాబాదు	1-5-62	
25.	యేకమామిడి	వికారాబాదు	హైద్రాబాదు	24-5-62	
26.	కొత్తగాది	వికారాబాదు	హైద్రాబాదు	30-5-62	

వనమహోత్సవము

శ్రీ పాలా వేంకట సుబ్బయ్య

ప్రతిసంవత్సరము జూలై నెల మొదటి వారంలో మన రాష్ట్రమునందు వన మహోత్సవము జరుపబడు చున్నది. అన్ని రాష్ట్రములలో కూడ ఇది కొనసాగుచున్నదనుటలో సందేహము లేదు. మొదట దీనిని ప్రారంభించినవారు శ్రీ కె. యం. మున్షీ గారు, అడవులు లేనిదే వర్షాలు ఆకర్షింపబడవను ముఖ్యోద్దేశ మానాడు కార్యోత్సాహము కల్గించినది. కఱవులు నివారించుట కియ్యదొక తరుణోపాయముగా భావింపబడినది కేంద్రప్రభుత్వ మన్నిరాష్ట్రాలకు వనమహోత్సవము జరుపవలసిందిగా ఆదేశించింది. విధిగా వన మహోత్సవాలు ప్రతిసంవత్సరము జరుపబడు చున్నవి.

ప్రతి జిల్లా కేంద్రమునందును అధికారులు సభల కేర్పాటు గావించుట, కొందఱు ప్రముఖ వ్యక్తులు ప్రసంగించుట, ఆతర్వాత మొక్కలు నాటుట అను కార్యకలాపముతో వనమహోత్సవాలు సమాప్తమగుచున్నవి.

ఈ వనమహోత్సవాలు మానవ జీవితానికి అత్యవసరమై జీవితముతో పెనవేసికొనియున్న ముఖ్యవిషయాలను గుర్తుకు దెచ్చుచున్నవి. పచ్చనిచెట్లు, లతలు, పొదలు తమ పత్రములద్వారా సూర్యునికి జీవులకు మధ్య సంధానకర్తల వలె వెలయుచున్నవి. 'క్లోరోఫిల్' పచ్చని యాకులలో నుండి సూర్యుని కిరణముల తాకిడి సంభవించి నప్పుడు నీటి బొట్టులో వున్న ప్రాణ వాయువును, ఉదజనిని వేరుచేయుటయేగాక బొగ్గుపులుసువాయువును, బొగ్గుగాను ప్రాణవాయువుగాను వేరు చేయుచున్నది. ఈ విధముగా వేరు చేయబడిన ప్రాణవాయువు జీవరాసులకు లభ్యమగుచున్నది.

పగలంతయు సూర్యరశ్మి సహాయముతో విరమింపక క్లోరోఫిల్ పనిచేసి మానవుల మనికికి అత్యవసరమైన కొన్ని పదార్థములను తయారుచేయుచున్నది. వ్రేళ్ళద్వారా లభించిన లవణములను కూడా దీసికొని, ఆకులలో తయారుచేయబడు చక్కెర పిండి పధార్థములను కలుపుకొని, క్లోరోఫిల్ చెట్లను బలవత్తరము చేయుటయేగాక చెట్ల కణుపు లందును, వ్రేళ్ళయందును గడ్డలు, కాయలు రూపములతో మనకు ఆహారము లభించునట్లు చేయుచున్నది–ఉదాహరణకు, బంగాళాదుంపలు, కఱ్ఱపెండలము, ఉల్లిపాయ, బీటురూటు, చిరుగడము, ముల్లంగి మొదలైనవి. ఇదే విధంగా క్రింది వ్రేళ్ళనుండి వచ్చు ఆహారపధార్థములలోనుండి, వృక్షములోని సెల్లులు మాంస కృత్తులను. క్రొవ్వు పదార్థాలను తయారుచేయును. ఉదాహరణకు, బీన్సు, కాయ ధాన్యముల వంటివి,

వాతావరణమునుండి, మనము విడుచు బొగ్గుపులుసు వాయువును గ్రహించి, విడగొట్టి ప్రాణవాయువును మనకు వృక్షములు ప్రసాదించుచున్నవి–రోగముల బారిబడి తపించు నరులకు దివ్యౌషధములను ప్రసాదించుచున్నవి. మన యడవులలో అమూల్యమైన ఓషధులు గలవు.

ఆధునికప్రపంచానికి కావలసిన బొగ్గు, కిరోసిన్, పెట్రోలు, గ్యాసు, మొదలగునవి పూర్వ వృక్షసంపద భూమిలో పతనమై చేరియుండుట చేతనే నేడు లభ్యమగుచున్నవి.

అన్నియునిట్లు పొసగిన యనంతరము జనులకు మంద మారుతములు, మల్లి, మొల్ల, జాజి, పారిజాతము, గేదగిమొదలగు పుష్పవితానమునుండి వచ్చు సువాసనలు, వాటివలన తయారగు అత్తరు, పన్నీరు, మొదలగు సుగంధ ద్రవ్యములు, మనము నిత్యమూ శుచిగానుండుటకు వినియోగించు సబ్బులు వగైరా అన్నియు వృక్షములు ప్రసాదించునవి గావా? వృక్షములే లేనిచో మనకు వినోదమును గూర్చుకోయిలలు, తుమ్మెదలు, నెమళ్ళు మనగలవా? తరులతా గుల్మాది సంహతులు లేనియెడ మానవ జీవితము చీటికి కాసిన వెన్నెల వంటిదగును, ఇన్ని విధములుగా వృక్షములు మనకు జీవన ప్రదాతలగు చున్నవి.

చివురు జొంపముల్ నెత్తావి–సిరులతోడ
పుష్పగుచ్ఛముల ఫలసముచ్చయముల
తమిని నొడగూర్చు విమల కాంతారతలము
రంజిలమి ప్రాణులిద్ధర బ్రతుకగలవె?

లేమావి చివుళులు–లేదీవగములును
లేనగవు ముదము–బూనుచోటు,
పూదేనియలనాని–పుష్పంధయంబులు
శుభగీతములబాడి సొలయుచోటు,

శీతల తరమంద వాతమ్ము మిర్మర
సరస సల్లాపముల్–సలుపుచోటు,
పైకమత్యానంద పారవశ్యమ్మున
మృదుగానములతోడ మెలగుచోటు,

లెన్ని యేనియు వెలసి సమృద్ధిగాగ,
మానవవాళికి మనుగడ–మధురతరము
సేయు గావుత! జగములు–శ్రీలతోడ
నెసగి సౌఖ్యసంపదల వరించుగాత!

★

???? ప్రశ్నలు - సమాధానాలు !!!!!

శ్రీ కె. వెంకట్రామిరెడ్డి,
పాయసంపల్లి. (కడప జిల్లా)

ప్రశ్న: కోడూరు, పాయసంపల్లి, గడ్డంవారిపల్లె, ఇంకా కొన్ని ఇతర గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేయడానికి కడప జిల్లా ఎర్రగుంట్లలో ఒక థర్మల్ స్టేషన్ వుంది. ఈ స్టేషన్ నుంచి విద్యుచ్ఛక్తి 1963 మార్చి నెల నుంచి సరఫరా అవుతుందా ?

సమాధానం: కోడూరు, పాయసంపల్లి, గడ్డంవారిపల్లె ఇంకా ఇతర గ్రామాలకు విద్యుచ్ఛక్తి సరఫరా చేసే పథకం నిధులు కావలసివచ్చినందున 1962–63 బడ్జెట్‌లో చేర్చలేదు.

ప్రశ్న: ఎర్రగుంట్ల వద్ద ప్రైవేట్ రంగంలో ఒక సిమెంట్ ఫ్యాక్టరీని నెలకొల్పే ప్రతిపాదన ఒకటి వున్నది కాని ఇంత వరకు ఎట్టి చర్యలు తీసుకోలేదు. ఇది ప్రస్తుతం ఏ దశలో వుంది ? ఇందుకై లైసెన్సు పొందినవారెవరు ?

సమాధానం: గూడూరుకు చెందిన శ్రీ పి. వి. కృష్ణారెడ్డి, బొంబాయికి చెందిన శ్రీ యస్. సి. బోస్‌లు కడప జిల్లా ఎర్రగుంట్లలో సిమెంట్ ఫ్యాక్టరీ స్థాపించడానికి లైసెన్సు కోరుతూ దరఖాస్తులు పెట్టారు. అయితే భారత ప్రభుత్వం ఇంతవరకు ఎట్టి నిర్ణయాలు తీసుకోలేదు.

శ్రీ నల్లా దత్తాత్రేయులు,
మోరి. (రాజోలు తాలూకా)

ప్రశ్న: చేనేత పరిశ్రమాభివృద్ధికి ప్రణాళికా సంఘం ఎంత మొత్తం కేటాయించింది. ఇంకా ఎక్కువగా కేటాయించే అవకాశం వున్నదా ?

సమాధానం: తృతీయ ప్రణాళికాకాలంలో రాష్ట్రంలో చేనేత పరిశ్రమాభివృద్ధికి ప్రణాళికా సంఘం 5.40 కోట్ల రూపాయలను నిర్ణయించింది. అయితే ఈ మొత్తం 5.80 కోట్ల రూపాయలకు పెంచే అవకాశం వున్నది. తృతీయ ప్రణాళికాకాలంలో దేశం మొత్తంమీద చేనేత పరిశ్రమాభివృద్ధికై 32 కోట్ల రూపాయలను కేటాయించారు. ఈ మొత్తాన్ని 36 కోట్లవరకు పెంచే అవకాశం వున్నది. తృతీయ ప్రణాళికలో ఈ పెట్టుబడి మొత్తాన్ని 5.4 కోట్లను మించి అధికం చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.

శ్రీ జె.యం. సుబ్రమణ్యం,
మాదాపురం. (వయా), అనంతపూర్.

ప్రశ్న: అనంతపూర్ జిల్లా, రామగిరి వద్ద గల బంగారు గనులను ఎప్పుడు పునఃప్రారంభిస్తారు? అవి ఎంతకాలం పనిచేస్తాయ్?

సమాధానం: భారత గనుల సంస్థ (ఇండియన్ బ్యూరో ఆఫ్ మైన్స్) ప్రస్తుతం చేపట్టిన డ్రిల్లింగ్ కార్యక్రమం పూర్తయి సత్ఫలితాలనిచ్చిన తర్వాతనే అనంతపూర్ జిల్లాలోని రామగిరి వద్ద గల బంగారు గనులను పునఃప్రారంభించే విషయం తల ఎత్తుతుంది.

శ్రీ యస్. చెన్నకేశవులు,
బొటికలపాడు. (నెల్లూరు జిల్లా)

ప్రశ్న: రామచంద్రాపురం వద్ద నెలకొల్పే భారీ విద్యుత్పరికరాల కర్మాగారంలో ఏయే యంత్రాల ఉత్పత్తి జరుగుతుంది? ఉత్పత్తి ఎప్పుడు ప్రారంభమవుతుంది?

సమాధానం: ఈ భారీ విద్యుత్పరికరాల కర్మాగారాన్ని వార్షికంగా 0.62 మిలియన్ల కిలోవాట్ల స్టీమ్ టర్బైన్‌లను, 12 మిలియన్ల వాట్లు, 25 మిలియన్ల వాట్ల శక్తిగల టర్బో ఆల్టర్నేటర్లను తయారుచేయడానికి రూపొందించారు. 1964 మధ్య భాగం నుంచి ఉత్పత్తి ప్రారంభమవుతుంది.

శ్రీ ఆర్. నారాయణరాజు,
పాకలింగాయపల్లి. (నెల్లూరు జిల్లా)

ప్రశ్న: నెల్లూరు జిల్లా ఉదయగిరి తాలూకా విద్యుచ్ఛక్తి సరఫరా లైనులను కావలి నుంచి వింజమూరు వరకు వేసినట్లు తెలుస్తున్నది. ఉదయగిరి, సీతారాంపూర్‌లకు విద్యుచ్ఛక్తిని సరఫరా చేయడానికి ఇంకా ఎంతకాలం పడుతుంది? ఈ సందర్భంలో ప్రభుత్వం ఏమైనా నిర్ణయించిందా?

సమాధానం: ఉదయగిరి, వింజమూరు, ఆత్మకూరు, ఇంకా ఇతర గ్రామాలకు విద్యుచ్ఛక్తిని విస్తరింపచేసే పథకం కార్యకలాపాలు అభివృద్ధి దశలోవున్నాయి. సీతారాంపురం గ్రామానికి విద్యుచ్ఛక్తి సరఫరా చేసే విషయం గురించి పరిశీలించి అది లాభదాయకం కాదని నిర్ణయించారు. ఆ ప్రాంతంలో అదనంగా విద్యుచ్ఛక్తి లభించినపుడు, అక్కడ లాభదాయకంగా వుంటుందని భావిస్తే అప్పుడే పథకాన్ని అమలుజరుపుతారు.

ప్రత్యేక విద్యా సంచిక

"ఆంధ్ర ప్రదేశ్" 1962 అక్టోబరు సంచిక విద్యా విషయకమైన వ్యాసాలతో కూడిన ప్రత్యేక అనుబంధంతో వెలువడుతుంది.

కిలోలలో కొనండి

మెట్రిక్ తూనికలను ఇప్పుడు
దేశమంతటా విధిగా వాడితీరాలి.
పాత తూనికలను ఉపయోగించడం
చట్ట విరుద్ధముగా పరిగణింపబడుతుంది.

ధరల మారకపు పట్టీ (సేరునుండి కిలోగ్రాములు)

సేరు ధర నయాపైసల నుండి కిలోగ్రాము ధర నయాపైసలలో

న.పై/సేరు	న.పై/కి.గ్రా.	న.పై/సేరు	న.పై/కి.గ్రా.	న.పై/సేరు	న.పై/కి.గ్రా.	న.పై/సేరు	న.పై/కి.గ్రా.	న.పై/సేరు	న.పై/కి.గ్రా.
1	1	21	23	41	44	61	65	81	87
2	2	22	24	42	45	62	66	82	88
3	3	23	25	43	46	63	68	83	89
4	4	24	26	44	47	64	69	84	90
5	5	25	27	45	48	65	70	85	91
6	6	26	28	46	49	66	71	86	92
7	8	27	29	47	50	67	72	87	93
8	9	28	30	48	51	68	73	88	94
9	10	29	31	49	53	69	74	89	95
10	11	30	32	50	54	70	75	90	96
11	12	31	33	51	55	71	76	91	98
12	13	32	34	52	56	72	77	92	99
13	14	33	35	53	57	73	78	93	100
14	15	34	36	54	58	74	79	94	101
15	16	35	38	55	59	75	80	95	102
16	17	36	39	56	60	76	81	96	103
17	18	37	40	57	61	77	83	97	104
18	19	38	41	58	62	78	84	98	105
19	20	39	42	59	63	79	85	99	106
20	21	40	43	60	64	80	86	100	107

సేరు ధర రూపాయల నుండి కిలోగ్రాము ధర రూపాయలలో

రూ/సేరు	రూ/కి.గ్రా.	రూ/సేరు	రూ/కి.గ్రా.	రూ/సేరు	రూ/కి.గ్రా.	రూ/సేరు	రూ/కి.గ్రా.	రూ/సేరు	రూ/కి.గ్రా.
1	1·07	11	11·79	21	22·51	31	33·22	41	43·94
2	2·14	12	12·86	22	23·58	32	34·29	42	45·01
3	3·22	13	13·93	23	24·65	33	35·37	43	46·08
4	4·29	14	15·00	24	25·72	34	36·44	44	47·15
5	5·36	15	16·08	25	26·79	35	37·51	45	48·23
6	6·43	16	17·15	26	27·86	36	38·58	46	49·30
7	7·50	17	18·22	27	28·94	37	39·65	47	50·37
8	8·57	18	19·29	28	30·01	38	40·72	48	51·44
9	9·65	19	20·36	29	31·08	39	41·80	49	52·51
10	10·72	20	21·43	30	32·15	40	42·87	50	53·59

1 కిలోగ్రాం (1000 గ్రాములు)= 86 తులాలు

భారత ప్రభుత్వముచే జారీచేయబడినది

జైళ్ల సంస్కరణలు

శాసన సభలో

మంత్రి శ్రీ పి.వి. నరసింహారావు వివరణ

జైళ్లశాఖ గ్రాంట్లకొరకు, ఆంధ్రప్రదేశ్ శాసన సభలో 1962 జూలై 3వ తేదీన డిమాండును ప్రతిపాదిస్తూ న్యాయశాఖా మంత్రి శ్రీ పి. వి. నరసింహారావు రాష్ట్ర జైళ్లలో ప్రారంభించిన వివిధ పథకాలను గురించీ, కొత్తగా తలపెట్టిన జైలు సంస్కరణలను గురించీ యీ క్రింది విధంగా విశదీకరించారు:

ఆంధ్రప్రదేశ్ అవతరణ నాటికి ఆంధ్రప్రాంతంలో గల జైళ్ల సంఖ్యా వివరాలు ఈ విధంగా వున్నాయి:— సెంట్రల్ జైళ్లు 4; మహిళల స్టేట్ జైలు (రాజమండ్రి) 1; స్పెషల్ సబ్ జైలు (నెల్లూరు) 1; జిల్లా జైళ్లు 6; సబ్ జైళ్లు 125. తరువాత జిల్లా జైళ్ల సంఖ్యలోనూ, బోర్‌స్టల్ పాఠశాలలు. ధృవీకృత పాఠశాలల వంటి బాలనేరస్థుల సంస్కరణ సంస్థల సంఖ్యలోను పెరుగుదల ఏర్పడింది. విశాఖపట్నంలో ఒక బోర్‌స్టల్ పాఠశాలనూ, ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలలో బాలబాలికల కొరకు ధృవీకృత పాఠశాలలను నెలకొల్పారు. ప్రస్తుతం మొత్తం జైళ్ల సంఖ్యావివరాలు ఈ ప్రకారం వున్నాయి:— సెంట్రల్ జైళ్లు 4; జిల్లాజైళ్లు 6; మహిళల స్టేట్‌జైలు (రాజమండ్రి) 1; సబ్‌జైళ్లు 158; స్పెషల్ సబ్ జైలు (నెల్లూరు) 1.

బాలనేరస్థుల సంస్కరణ సంస్థలు

పైన పేర్కొన్న జైళ్లుగాక, నేరాలు చేసిన పిల్లలను సంస్కరించే ఉద్దేశంతో, దిగువ ఇచ్చిన బాల నేరస్థుల సంస్కరణ సంస్థలను కూడ తెరవడం జరిగింది:—

బోర్‌స్టల్‌స్కూలు, విశాఖపట్నం	1
రిసెప్షన్‌హోమ్, విజయవాడ	1
బాలుర సహాయకగృహం, హైదరాబాదు	1
బాలికల సహాయకగృహం, హైదరాబాదు	1
బాలికల ధ్రువీకృత పాఠశాల, హైదరాబాదు	1
జూనియర్ సర్టిఫైడ్‌స్కూల్, (బాలురు) హైదరాబాదు	1

బోర్‌స్టల్ పాఠశాలను 1960 వ. సంవత్సరంలో, ఆంధ్ర ప్రాంతంలో అమల్లోనున్న 1925వ సం.పు. బోర్‌స్టల్ పాఠశాలల చట్టం క్రింద తెరిచారు. 1960 ఫిబ్రవరి మొదటి తేదీనుంచి ఈ చట్టాన్ని తెలంగాణా ప్రాంతానికి వర్తింపజేయడం జరిగింది. బోర్‌స్టల్ స్కూల్స్ చట్టం క్రింద ఆధీనం చేసుకున్న 16—21 సంవత్సరాల మధ్య వయస్కులైన నేరస్థులను రెండు మొదలు అయిదు సంవత్సరాల పాటు ఈ సంస్థలో నిర్బంధిస్తారు. ప్రస్తుతం విశాఖపట్నంలోని బోర్‌స్టల్ పాఠశాలలో 76 మంది వున్నారు. 80 మందిని వుంచడానికి అక్కడ వసతివుంది. విద్యాతరగతులతోపాటు, బాలనేరస్థులు వడ్రంగంలోగాని లేదా దర్జీపనిలోగాని తర్ఫీదు పొందడానికివీలుగా వృత్తిపనుల శిక్షణా సౌకర్యాలు కూడా కల్పించబడతాయి. మరికొన్ని వృత్తులలో కూడా శిక్షణాసౌకర్యాలుకల్పించేవిషయం పరిశీలనలోవుంది. ఉదయం, సాయంత్రం వ్యాయామం చేయడం, సుమారు మూడు గంటల సేపు వృత్తిపనులలో శిక్షణ (వడ్రంగం, దర్జీపని) పొందడం, మరో మూడు గంటల పాటు విద్యాతరగతులకు హాజరు కావడం—ఇదీ వారి దైనిక కార్యక్రమం.

విచారణలో నున్న బాలనేరస్థులను, కోర్టులలో వారి కేసులు ముగిసే వరకు సహాయక గృహాలలోనూ, రిసెప్షను హోములలోనూ నిర్బంధిస్తారు.

ధ్రువీకృత పాఠశాలలు

లోగడ బాలురనూ, బాలికలనూ జైళ్లలో ఇతర ఖైదీలతోపాటు ప్రత్యేక సెక్షన్లలో నిర్బంధించే వారు. దానివల్ల 16 సంవత్సరాలకు లోబడిన బాలబాలికలు, నేరాలకు అలవాటుపడిన వయోజనఖైదీలతో పరిచయం ఏర్పర్చుకొని అ సాంఘిక దృక్పథాన్ని అలవర్చుకోవడం జరుగుతుండెడిది. చిరుత ప్రాయులైన బాలబాలికలను నేరస్థుల దుష్ప్రభావంనుంచి తప్పించివారిని వేరుగా వుంచే ఉద్దేశంతో ధ్రువీకృత పాఠశాలలను తెరిచారు. వీటిలో

వుంచేవారిని దిగువ విధంగా వర్గీకరిస్తారు:_ అనాధలు, అపరాధులు, అదుపులో పెట్టజాలని పిల్లలు.

బళ్ళారిలోని ధ్రువీకృత పాఠశాలలో నిర్బంధించబడిన సుమారు 300 మంది ఆంధ్ర బాలురను విస్తరింపబడిన సంస్థ అయిన బాలుర జూనియర్ సర్టిఫైడ్ స్కూల్ (హైద్రాబాద్)కు మార్చడం జరిగింది. (లోగడ దీనిని కుట్టి వెల్లోడి బాలల గృహం అని పిలిచేవారు. 1951 వ సంవత్సరంలో దీన్ని ప్రారంభించారు.) నేరస్థులైన బాలికలను చేర్చుకునే నిమిత్తం హైద్రాబాదులో ప్రత్యేకంగా ఒక సంస్థను తెరిచారు. ప్రస్తుతం ధ్రువీకృత పాఠశాలల్లో వున్నవారి సంఖ్య సుమారు 700. ఈ పాఠశాలల్లో దిగువ పేర్కొన్న సదుపాయాలు కలుగజేస్తారు:—

మంచి ఆహారం, వస్త్రాలు, పడక, వైద్య సహాయం, విద్య, వృత్తి పనులు (పిల్లల అభిరుచిని అనుసరించి)

బాలుర పాఠశాలల్లో వడ్రంగం, నేత, దర్జీపని, బూట్ల తయారీలోనూ, బాలికల పాఠశాలల్లో అల్లిక, దర్జీపని, నృత్యం, సంగీతంలోను శిక్షణ ఇస్తారు. విద్యార్థి, విద్యార్థినులను అప్పుడప్పుడు వారి కుటుంబంతోనూ, బాహ్య ప్రపంచంతోను సంబంధం కలిగివుండడానికై ఇండ్లకు పంపుతారు. వారు తమ తల్లిదండ్రులతోనూ, బంధువులతోను ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుకోవడానికీ, వారితో ముచ్చటించడానికి కూడా అనుమతి ఇస్తారు. సత్ప్రవర్తన గల బాలురను వారి తల్లిదండ్రులు దరఖాస్తు ఇచ్చినట్లయితే శిక్షా కాలం ముగియని పూర్వమే లైసెన్సుపై విడుదల చేస్తారు. ఇటువంటివారిని ప్రొబేషను అధికార్ల పర్యవేక్షణలో వుంచుతారు. ధృవీకృత పాఠశాలల నిర్వహణ వ్యవహారాలను, అధికార అనధికార సభ్యులతో ప్రభుత్వం నియమించే విజిటర్ల కమిటీలు చూస్తాయి.

ధ్రువీకృత పాఠశాలల మంచి బాలురను వెలుపల గల మామూలు పాఠశాలలకు పంపించడం ద్వారా వారి ఉన్నత విద్యాభ్యాసానికి కూడా సదుపాయాలు కల్పిస్తున్నారు. గడిచిన రెండుమూడు సంవత్సరాలలో 30 మొదలు 40 మంది విద్యార్థులను వివిధ పాఠశాలల్లో చదవడానికి అనుమతించడం జరిగింది.

జైళ్ళలో లోగడ అవలంబించబడిన పాత విధానాలు ఇప్పుడు మారాయి. నేరస్థులను బాగుపరిచే చర్యల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించబడుతున్నది. నృత్య, నాటక, సంగీతాది సాంస్కృతిక కార్యక్రమాలు ప్రోత్సహించబడుతున్నాయి. ఖైదీలు సమాజంలో తిరిగి ఉత్తమ పౌరులుగా మనకలగడానికి వీలుగా వారి ప్రవర్తనను సరిదిద్దడాన్నే ఈనాడు జైళ్ళ శాఖ లక్షిస్తున్నది.

పంచాయతీ విధానం

జైళ్లలో పంచాయతీ విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా మరో ముఖ్యమైన సంస్కరణను తెవడం జరిగింది. ఖైదీలు బాధ్యతాయుతమైన ప్రవర్తనకు అలవాటు పడునట్లు చేయడమే ఈ సంస్కరణ ధ్యేయం. దీనిననుసరించి ప్రతి జైలులోనూ ఒక పంచాయతీ బోర్డును స్థాపిస్తారు. వాటి ఎన్నికకై రూపొందించిన నియమావళిననుసరించి ప్రతి జైలులోనూ పంచాయతీబోర్డును నెలకొల్పుతారు.

పంచాయతీ అధికారాలూ, విధులూ ఖైదీల సంక్షేమానికి సంబంధించిన విషయాలు అంటే రేషను, పారిశుద్ధ్యం, వినోద కాలక్షేపం, పుస్తకాలు, వార్తా పత్రికలు ఇత్యాది అంశాలను గూర్చి చర్చించడానికి పరిమితమై వుంటాయి. ఎవరైనా ఖైదీల విషయంలో జైలు అధికార్లు నివేదించే స్వల్పమైన ఫిర్యాదులను పరిశీలించే అధికారం కూడా వీటికి వుంటుంది. ఈ ఫిర్యాదులపై తగు శిక్షలను అవి సూపరింటెండెంటుకు సూచించవచ్చు కూడా. సెంట్రల్ జైళ్లలోని పంచాయతీలు వంటశాలలను కూడా పర్యవేక్షించవచ్చు.

ప్రొబేషను

పారిశ్రామికీకరణవల్లా, తత్ఫలితంగా పట్టణాల జనాభా పెరగడంవల్లా అనేక సాంఘిక సమస్యలు ఉత్పన్నమయ్యాయి. బాలనేరాలు పెరగడం వీటిలో ప్రముఖమైనది. తరుచుగా కొద్ది కాలంపాటు జైలు శిక్ష అనుభవించడం వల్ల జైలు అంటే భయంపోయి నేరస్థ ప్రవృత్తి బలపడుతుంది. అంతేగాకుండా కారాగార వాసానికి సాంఘికంగా గల అపకీర్తివల్ల జైలునుంచి విడుదల అయిన తరువాత తన జీవితంలో నూతనాధ్యాయాన్ని ప్రారంభించడానికి నేరస్థుడు అధైర్య పడతాడు. అందుచేత నేరానికి ఖైదు శిక్షే పరిష్కారమార్గంకాదు. నిర్బంధించకుండా సంస్కరించే ఇతర మార్గాలు ఇంకా ఎక్కువగా సత్ఫలితాలు ఇవ్వగలుగుతాయి.

కాబట్టి "ప్రొబేషను పద్ధతి" అనే విధానం ప్రవేశ పెట్టబడిరి. దీనిననుసరించి మొదటి సారిగా నేరం చేసినవారిని నిర్బంధించడానికి బదులు ప్రొబేషనుపై విడుదల చేస్తారు. కోర్టు నిర్దేశించే గడువు ముగిసే వరకు అట్టి నేరస్థుడిని ప్రొబేషను ఆఫీసరు పర్యవేక్షణ క్రింద వుంచుతారు. ప్రొబేషను అధికారి అతని మిత్రునిగా, మార్గదర్శిగా సంచరించి నేరస్థుడు మామూలు జీవితం గడపడంలో సహాయపడతాడు. ఈ పద్ధతివల్ల ప్రభుత్వానికి చాలా ఖర్చు తగ్గుతుంది. నేరస్థులను నిర్బంధంలో వుంచినట్లయితే ప్రభుత్వానికి ఈ వ్యయం తప్పదు. దీని మూలంగా నేరస్థునికి అవమానం, అపకీర్తి కూడా తప్పుతుంది. అంతేగాక నేరస్థుడు ఉద్యోగంలోనున్నా లేదా విద్యాభ్యాసం చేస్తున్నా దానికి అంతరాయం కూడా కలుగదు నేరస్థుని కుటుంబానికి అవమాన స్థితి కూడా ఈ విధానంవల్ల తప్పుతుంది. అతనివల్ల కుటుంబానికి వచ్చే ఆదాయానికీ భంగం వుండదు. బహిరంగమూ, స్వాభావికమూ అయిన పరిసరాలలో నేరస్థుడిని సంస్కరించడాన్ని ఈ విధానం లక్షిస్తున్నది. నిర్బంధంలోకంటే ఇట్టి పరిస్థితిలో ఫలితాలను ఖచ్చితంగానూ, నమ్మకంగానూ తెలుసుకోడానికి వీలుంటుంది.

ప్రొబేషను విధానపు లక్ష్యాలను సాధించేందుకై రాష్ట్రమంతటా ఇందుకు సంబంధించిన వారిని సమాయత్తం చేయడం జరిగింది. ప్రతి జిల్లాకు ఒక జిల్లా ప్రొబేషను అధికారి వున్నాడు. కేసులు అధికంగా వుండే ప్రదేశాలలో అదనపు జిల్లా ప్రొబేషను అధికారిని నియమిస్తారు. ప్రొబేషను విధానం అమలును పరిశీలిస్తూ సహాయ పడేందుకై రాష్ట్రపు మూడు ప్రాంతాలలోనూ ప్రాంతీయ ప్రొబేషను ఇన్‌స్పెక్టర్లను నియమించారు. ఛీఫ్ ప్రొబేషను సూపరింటెండెంటు అధీనం క్రింద ఈ పూర్తియంత్రాంగం పని చేస్తుంది. ఆయన కార్యస్థానం హైదరాబాదు. ఒక అసిస్టెంటు ఛీఫ్ ప్రొబేషను అధికారికూడా అక్కడ పనిచేస్తారు. వీరంతా కూడా జైళ్ల ఇన్‌స్పెక్టరు జనరల్ అధీనంలో వుంటారు.

పైన వివరించిన ఈ విధానం వల్ల ఎంతమేరకు పొదుపు జరిగిందో ఈ క్రింద ఇచ్చిన అంకెలను బట్టి తెలుసుకోవచ్చు:—

రాష్ట్రం మొత్తంలో 1962 మార్చి 31 వ తేదీ నాటికి ప్రొబేషను అధికార్ల పర్యవేక్షణ క్రింద వున్న ప్రొబేషనర్ల సంఖ్య	1485
ఈ సంవత్సరం పర్యవేక్షణలో వుంచబడిన, విడుదల అనంతరం రక్షణ ఇవ్వబడిన మాజీ నేరస్థుల, మాజీ విద్యార్థుల సంఖ్య.	413

ప్రొబేషను విధానాన్ని ఇటీవల తెలంగాణా ప్రాంతానికి కూడా విస్తరింపజేశారు. ప్రయోజనాత్మకమైనదిగా ఈ విధానం సత్ఫలితాలనిస్తున్నది.

వృత్తిపనుల శిక్షణ

ఖైదీలకు వారి అభిరుచులనుబట్టి వృత్తిపనులలో శిక్షణ ఇస్తారు. శిక్షణ పూర్తయ్యాక ఉపయుక్తమైనదీ, లాభసాటియైనదీ అయిన పరిశ్రమలలో వారిని పనిలో ప్రవేశ పెడ్తారు. రాష్ట్రంలోని నాలుగు సెంట్రల్ జైళ్లలో ఈ క్రింద పేర్కొన్న పరిశ్రమలు వున్నాయి:—

1. నేత.
2. వడ్రంగం.
3. దర్జీ పని.
4. కమ్మరి పని.
5. గడ్డి పని.
6. జనుపనార చాపల తయారీ.
7. ఫినాయిల్ తయారీ.
8. వుతకడం, శుభ్రం చేయడం.
9. పాదరక్షల తయారీ.
10. పేము పని.
11. దుర్రీల నేత.
12. అద్దకం.
13. ఉన్ని బ్లాంకెట్ల నేత.
14. నవారు నేత.
15. చేపల పెంపకం (మౌలాలీ వ్యవసాయ కాలనీలో త్వరలో ప్రారంభించబడవచ్చు).

ఈ పరిశ్రమలపై అయ్యే ఖర్చు ప్రభుత్వ ఖజానాకు భారం కాదు. ఎందుకంటే వీటివల్లవచ్చేది ఏటా రూ. 5.00 లక్షలకుపైగా వుంటుంది. ఖైదీలు ప్రతిఫలం లభించే పనుల్లో శిక్షణ పొందటానికై సదుపాయాలు కల్పించి వారు విడుదలైన పిమ్మట గౌరవప్రదమైన జీవితం గడపటానికి ఈ పరిశ్రమలు అవకాశం కలుగజేస్తాయి. అన్ని పరిశ్రమల్లోనూ ఖైదీలకు పనిలో సహాయ పడటానికి బోధకులను నియమించారు. సాధ్యమైనంతవరకు దీర్ఘకాల శిక్ష అనుభవిస్తున్న ఖైదీలను జైలు పరిశ్రమల్లోనూ, స్వల్పకాల శిక్ష అనుభవిస్తున్న వారిని ఇతర జైలు పనుల్లోనూ ప్రవేశ పెడ్తారు. ఈ పరిశ్రమలవల్ల ఏటా సుమారు రూ. 5,35,000 లు

లభిస్తుంది.

ఖైదీలకు వారుచేసిన పనికి దిగువ విధంగా పారితోషికం కూడా చెల్లిస్తారు:—

	తెలంగాణా	ఆంధ్ర
పనులు చేయించబడిన సాధారణ ఖైదీలు (పరిశ్రమలో నియోగించబడి నిర్ణీత పని అప్పగించబడేవారు)	రూ. 1.00 నెలకు	0.06 నెలకు
రాత్రి కావలాదార్లుగా పనిచేసే ఖైదీలు	0.25	0.12
ఖైదీ ఓవర్సీర్లు ...	0.50	0.25
ఖైదీ వార్డర్లు ...	1.00	0.50

డిమాండు వివరాలు

క్రిందటి సంవత్సరపు (1961 — 1962) డిమాండు రూ. 54,69,700/— లు కాగా ఈ ఏడాది (1962—63) డిమాండు రూ. 61,74,900/— లు. దిగువ పేర్కొన్న వ్యయపు పద్దుల పెరుగుదలే ఈ బడ్జెటులో వచ్చిన మార్పుకు కారణం:

నాగార్జునసాగర్ వద్ద ఆరు బయలు కారాగార శిబిరం ...	రూ. 4,76,00
జీతంలో కరువు బత్తెం కలిపివేత	.. 1,17,000
పోలీసు గార్డుల స్థానే జైలు గార్డుల నియామకం ...	,, 93,700
ఉపపద్దులలో కొద్దిపాటి సర్దుబాట్లు ...	.. 17,900
మొత్తం	7,05,200

రాష్ట్రం వెలుపల జైళ్లలో నిర్బంధించబడిన ఖైదీలకై ఖర్చుల క్రింద చేసిన రూ. 3,00,000 ల కేటాయింపు విషయంలో ఒక సంగతి చెప్పాల్సి వుంది. ఖైదీల వసతి కొరకు ప్రభుత్వం మైసూరు, మద్రాసు, బొంబాయి రాష్ట్రాలకు గమనార్హమైన మొత్తాలు చెల్లిస్తుండేది. ప్రస్తుతం మన జైళ్లలో రద్దీగా వున్నప్పటికీ చెంగల్పట్ (మద్రాసు)లో కొంత మంది పిల్లలను అట్టిపెట్టడం మినహా ఇతర రాష్ట్రాలనుంచి బాలురు, ఖైదీలందరినీకూడా ఇక్కడికి రప్పించడం జరిగింది. కొత్తగా ధృవీకృత శాలలను తెరవడానికి మంజూరైన పథకాలు అమలు జరిగాక చెంగల్పట్‌లో వుంటున్న వారుకూడా రప్పించబడతారు. చెల్లింపకుండా వున్న మైసూరు, మద్రాసు రాష్ట్రాల తాలూకు కొన్ని బిల్లుల పరిష్కారానికికూడా ఈ కేటాయింపును వినియోగించడమవుతుంది. వచ్చే సంవత్సరం ఈ మొత్తం చాలావరకు తగ్గించబడుతుంది.

ఆరు బయలు కారాగార శిబిరం

జైళ్లలో రద్దీ ఎక్కువగా వుంటున్నది. రాష్ట్రంలో ముఖ్యంగా ఆంధ్రప్రాంతంలోని అన్ని సెంట్రల్ జైళ్లూ బ్రిటిష్ హయాములో నిర్మించినవి కావడంచేత వాటికి మరమ్మతులు అవసరం. కొత్త జైలు నిర్మాణానికి సుమారు రూ. 4 కోట్లు ఖర్చు అవుంది. కనుక జైలు జనాభాను తగ్గించడానికి, ఇతర ప్రాంతాల్లో ఆచరణలో వున్న విధానానికి అనుగుణ్యంగా వుండడానికి, నాగార్జునసాగర్ వద్ద రూ. 4,76,000 ల వ్యయంతో మూడు సంవత్సరాలలో ఒక ఆరు బయలు కారాగార శిబిరాన్ని నిర్మించడానికి ఒక పథకాన్ని రూపొందించారు. ఈ పథకం క్రింద 750 మొదలు 1000 మంది కార్మికులకు పనికల్పించి 2½ మైళ్ల పొడవున కాలువ నిర్మిస్తారు. ఆ వృత్తి అంశాలకు ఖర్చుచేసే మొత్తం పోను, జైలు కార్మికులు పొందే వేతనాలు, శిబిరంపై ఖర్చుచేసే మొత్తానికి సమంగా వుంటుందని అంచనా. లేదా ఒక లక్ష రూపాయిల నష్టం రావచ్చు. ఇప్పుడు ఈ పథకానికి సంబంధించిన వివరాలన్నీ సిద్ధంచేయబడినాయి. అమలు పరచడానికి ఇది దాదాపు సిద్ధంగా ఉంది.

జైళ్లలో 4771 మంది ఖైదీలను వుంచడానికి వసతివుండగా ప్రస్తుతం 5252 మంది ఖైదీలు వుంటున్నారు. అంటే వసతిని మించి 980 మంది అధికంగా వుంటున్నారు. మరమ్మతులకు స్వల్ప మొత్తాలు మినహా కొత్త భవనాల నిర్మాణానికి బడ్జెటులో ప్రత్యేక కేటాయింపు జరగలేదు. కరీంనగరం జిల్లాజైలు, వైజాగ్ సెంట్రల్ జైలుకు ప్రత్యేక మరమ్మతుల నిమిత్తం అదనంగా రూ. 90,000 లు కేటాయించడానికి జైళ్లశాఖ ఇనస్పెక్టరు జనరల్ ప్రతిపాదనలు అందజేశారు. అయితే జైలు భవనాల నిమిత్తం రూ. 3.00 లక్షల కేటాయింపు మాత్రం జరిగింది. ఇది ప్రణాళికలో చేరదు. నెల్లూరులో ప్రత్యేక సబ్ జైలు నిర్మాణానికి ఈ కేటాయింపును పూర్తిగా వినియోగిస్తారు.

రాయలసీమలో సెంట్రల్ జైలు

రాయలసీమలో ఎచ్చటనైనా ఒక సెంట్రల్ జైలును స్థాపిస్తే జైళ్లలో రద్దీ సమస్య పరిష్కారమవుతుందని సూచించబడింది. అనంతపురం వద్ద ఒకజైలు (వ్యవసాయకాలనీ) ను

తెరవడానికి గల అవకాశాలను ఆంధ్ర ప్రభుత్వం పరిశీలించి అనంతపురంకు సుమారు ఆరుమైళ్ల దూరంలోనున్న సిద్ద రామాపురం వద్ద 770.92 ఎకరాల స్థలాన్ని కూడా ఎన్నిక చేసింది. దీనికి రూ. 40.00 లక్షలకు పైగా (అనావృత్తి) ఖర్చవుతుంది. ఏటా జరిగే ఆవృత్తి వ్యయం రూ. 2.00 లక్షలకు పైగా వుంటుంది. వ్యయభారం చేత ఈ ప్రతిపాదనను 1957 వ సంవత్సరంలో విరమించుకున్నారు. జైళ్లలో రద్దీ పెరుగుతుండటం వల్ల ఈ ప్రతిపాదన పునఃపరిశీలనకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

ఇతర సదుపాయాలు

సెంట్రల్ జైళ్లన్నింటిలోనూ గ్రంథాలయాలను నెలకొల్పారు. వార్తాపత్రికలను కూడా సరఫరా చేస్తున్నారు. అన్ని సెంట్రల్ జైళ్లలోనూ, రెండు జిల్లా జైళ్లలోనూ రేడియో సెట్టులను నెలకొల్పారు. తెలంగాణా ప్రాంతంలో వివిధ రకాల క్రీడలకు సదుపాయాలు కల్పించారు. ప్రస్తుతం ప్రభుత్వం ఆమోదించినట్టి సమీకృత నియమావళి అమల్లోనికి వచ్చిన తరువాత ఈ సౌకర్యాలను ఆంధ్రప్రాంతానికి కూడా వర్తింపజేస్తారు. ఆదివారాల్లోనూ, జైలుకు సెలవుండే ఇతర దినాల్లోనూ సంగీతం. భజన కార్యక్రమాలను ఏర్పాటుచేసుకోవడానికి ఖైదీలకు అనుమతి ఇస్తారు. ప్రసిద్ధ ఏజెన్సీలు లేదా మేనేజిమెంట్ల సహాయంతో విద్యా విషయకంగా ప్రాముఖ్యతగల మాయాదీపం (మాజిక్ లాంతరు) ప్రదర్శనలను ఏర్పాటు చేస్తున్నారు.

జైళ్లలో పరిశుభ్రంగా వండిన ఆహార పదార్థాలను ఖైదీలకు సరఫరా చేస్తున్నారు. మంచిగా ఆరోగ్యం కాపాడడానికి అవసరసమైనఆహారవిలువ వాటిలో వుంటుంది. జైలునిబంధనల ననుసరించి తెలంగాణాలో 'సి'తరగతి ఖైదీలకు ప్రతిఆదివారం 6ఔన్సుల మాంసం ఇస్తారు. ఆంధ్ర ప్రాంతంలో 2 ఔన్సుల పప్పుకు బదులు 2 ఔన్సుల ఎండు చేపలు ఇస్తారు. రోజుకు ఒకపర్యాయం మజ్జిగ కూడా ఇస్తారు. దీపావళి, ఈ దుజ్జుహా మొదలైన పండుగల సందర్భంలో ప్రత్యేకమైన ఆహార పదార్థాలను వడ్డిస్తారు. ఆంధ్ర, తెలంగాణా స్కేళ్లలో వ్యత్యాసంవుంది. తెంగాణా స్కేలు మెరుగైనది. దీనిని ఆంధ్ర ప్రాంతానికి వర్తింపజేసే ఒక ప్రతిపాదన ప్రభుత్వ పరిశీలనలో వుంది.

"పెరోల్" విధానం

ఖైదీ కుటుంబ సభ్యుడు లేదా దగ్గరి బంధువు తీవ్రంగా జబ్బు పడినా, మరణించినా లేదా ఎవరి వివాహమైన జరిగినా లేక మరేదైనా అవసరం వచ్చినా అతను స్వయంగా హాజరు కావడానికి పెరోల్ విధానం (శిక్షను నిలుపుచేసి ఖైదీలను కొదికాలం పాటు విడుదల చేయడం) వల్ల వీలు కలుగుతుంది. గత రెండు సంవత్సరాలలో పెరోల్ పై విడుదలైన ఖైదీలు, పెరోల్ నిరాకరించబడిన ఖైదీల సంఖ్యా వివరాలు దిగువ ఇవ్వబడినాయి:—

	పెరోల్ అనుమతించబడినవారు		పెరోల్ నిరాకరించబడినవారు
1960 ...	125	...	154
1961 ...	115	...	148

ఆంధ్ర, తెలంగాణా ప్రాంతాలలోని జైళ్లలో రివిజన్ బోర్డుల సమావేశాలు వరుసగా ఆరు నెలలకూ. మూడు నెలలకు ఒక పర్యాయం జరుగుతాయి. ఈ బోర్డులు వరుసగా అయిదు సంవత్సరాలు అంతకంటే ఎక్కువ కాలం, రెండు సంవత్సరాలు అంతకంటే ఎక్కువ కాలం శిక్ష అనుభవిస్తున్న ఖైదీల కేసులను సమీక్షించి, శిక్ష గడువుకు పూర్వం వారిని విడుదల చేసే విషయంలో సిఫార్సులు చేస్తాయి.

రెమిషను

సత్ప్రవర్తనగలిగి ఒళ్లువంచి శ్రద్ధగాపనిచేసే ఖైదీలకు నెలవారీ రెమిషన్లు ఇచ్చే విధానం రాష్ట్రంలో దిగువ తెలిపిన విధంగా ఆచరణలో వుంది:

వర్గం	తెలంగాణా	ఆంధ్ర
పనులు చేయించబడే సాధారణ ఖైదీలు	5 రోజులు	4 రోజులు
రాత్రి కాపలాదార్లుగా పనిచేసే ఖైదీలు	6 ,,	5 ,,
ఖైదీఓవర్సీర్లు	7 ,,	6 ,,
ఖైదీ వార్డర్లు	8 ,,	8 ,,

ఖైదీలు దిగువ విధంగా వర్గీకరించబడతారు:

శిక్షవిధించబడిన ఖైదీలు; 'ఏ' 'బి' 'సి' తరగతులు

నేర విచారణలోనున్న ఖైదీలు; ప్రత్యేక తరగతి, సాధారణ తరగతి

డిటెన్యూలు; ఒకటవ తరగతి, రెండవ తరగతి

నేర విచారణలో నున్న లేదా స్వల్పకాల శిక్ష విధించబడిన

స్త్రీలు ఏదైనా జిల్లాజైలు, సెంట్రల్‌జైలు లేదా సబ్‌జైలులో చేర్చబడినట్లయితే వారిని స్త్రీ వార్డర్ల రక్షణ క్రింద ప్రత్యేక వార్డులో వుంచడానికి ఏర్పాట్లు చేస్తారు.

నూతన పథకాలు

అత్యవసరమైన సంస్కరణ చర్యలు ఇంకా అనేకం వున్నాయి. వాటి విషయంలో ప్రభుత్వం సత్వర చర్యలు గైకొంటున్నది. కొన్ని ముఖ్యపథకాలు ఇవి:—

వృత్తిపనుల శిక్షణ, జైలు ఉత్పత్తుల మేనేజిమెంటుల విషయంలో అనేక రకాలుగా అభివృద్ధి జరగవలసిన అవసరంవుంది. ముడి పదార్థాల సరఫరాను బాగా క్రమబద్ధం చేసి, సకాలంలో తగినంతగా సరఫరా అవునట్లు చేయాలి. ప్రస్తుతానికి జైళ్లలో తయారు చేసిన వస్తువుల విక్రయం ఒక సమస్యకాదు అయితే ఉత్పత్తిని హెచ్చించదలిచినప్పుడు మాత్రం ఈ సమస్య ఎదుర్కొంటుంది. ఉత్పత్తి ప్రమాణంతోపాటు ఖైదీల ఉత్పత్తిస్థాయికూడా విశ్చలంగా అభివృద్ధి జెందవలసిన అవసరం వుందనే విషయాన్ని కూడా ఈ సందర్భంలో గమనించాలి. జైళ్లలో వేతనాలకు అయ్యే వ్యయం స్వల్ప మాత్రమే కాబట్టి అక్కడ తయారుచేసే వస్తువులు ఇతర చోట్ల తయారైన వాటికంటే చౌకధరకు లభించాలి. ఈ అంశాన్ని మాత్రం చాలా వరకు ఉపేక్షించడం జరిగింది. జైలు పరిశ్రమలను లోపరహితంగా, లాభసాటిగా నిర్వహించడానికీ, జైలునుంచి విడుదలైన తరువాత ఖైదీలు బహిరంగ పోటీలో నిలబడగలగడానికై వారి ఉత్పత్తిస్థాయిని అభివృద్ధి పరచడానికి వీలుగా ఈ విషయాన్ని గురించి పరిశీలన జరపడానికి తలపెట్టబడింది.

జైళ్లలో ఖైదీలకూ, బోర్స్టల్ పాఠశాలలు మొదలైన వాటిలో బాలురకు కొన్నివృత్తిపనులలో శిక్షణఇచ్చినప్పటికీ, శిక్షణ సమయంలో నేర్చుకున్న పనులను తరువాత వారు ఆచరించడం ప్రస్తుతం తగినంతగా జరగడంలేదు. కాబట్టి విడుదల తరువాత వృత్తి పనులలో సహాయపడే కార్యక్రమాన్ని విస్తృత, శాశ్వత ప్రాతిపదికపై నిర్వహించవలసి వుంది. ఇది కేవలం అంకురోత్పత్తి దశలోనున్న ఒక ఆలోచన మాత్రమే. జైళ్లశాఖ దీనికో నిర్దిష్టమైన స్వరూపాన్నివ్వవలసివుంది. ఈ విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, సరైన మార్గంలో ఆచరణ యోగ్యమైన ఒక పథకాన్ని రూపొందించడానికి యోచించబడింది.

మరికొన్ని వృత్తిపనులు

జైళ్లలో శిక్షణ ఇచ్చేవృత్తిపనుల సంఖ్యను హెచ్చించాలనే ఆలోచన వుంది. శిక్షణ స్థాయిని కూడా పెంపొందించడం జరుగుతుంది.

ప్రస్తుతం ప్రాథమిక స్థాయివరకు మాత్రమే విద్యగరపడానికి ఏర్పాట్లు ఉన్నాయి. అవసరమైతే దశలవారీ కార్యక్రమాన్ననుసరించి ఉన్నత తరగతి శిక్షణ ఇవ్వడానికి కూడా సదుపాయాలు కల్పించడానికి తలపెట్టబడింది. ఉన్నత విద్యాభ్యాసం పట్ల ఖైదీకి ఆసక్తి వున్నట్లయితే అతనికి ఆ అవకాశం కూడా లభింప జేయడమే అంతిమ లక్ష్యం. నిధులను బట్టి దశల వారి కార్యక్రమ ప్రకారం ఇతోధికంగా గ్రంథాలయాలు, పఠనాలయాలు మొదలైన వాటిని కూడా ప్రారంభించడానికి ఉద్దేశించబడింది.

అనేక జైళ్లలో వైజ్ఞానిక కార్యక్రమాలు ఇదివరకే నిర్వహించబడుతున్నాయి. అన్నిజైళ్లలోనూ సాధ్యమైనంతవరకు వీటిని శాశ్వత కార్యక్రమంగా నిర్వహించడానికి తలపెట్టబడింది. సంగీత, నృత్య నాటకాది కళలలోనూ, కవిత్వం, కథారచన, నాటకరచన మొదలైన సాహితీ ప్రక్రియలలోనూ గల అభిరుచిని ప్రోత్సహించడానికి పూర్తి కృషి జరుగుతుంది. అన్ని జైళ్లలోనూ వీటిలో తగు నిపుణులు లభించి, వ్యవస్థీకరించబడిన తరువాత ఎప్పుడైనా రాష్ట్రజైళ్ల సాంస్కృతికోత్సవాలు జరపాలనే ఆలోచన వుంది. విద్యలో ప్రదర్శించే సామర్థ్యానికీ, సంగీతం, నృత్యం, రచన మొదలైన వాటిలో కనబరిచే సహజ సిద్ధమైన ప్రతిభకూ కొన్ని బహుమతులు ఇవ్వడానికి కూడా తలపెట్టబడింది. దీనిని కూడా ఆఖరుకు రాష్ట్రమంతటికీ వర్తింప జేయవచ్చు.

చివరన ఒక హెచ్చరిక చేయడం ఈ సందర్భంలో అప్రస్తుతం కాదు. జైళ్ల సంస్కరణలు అమలు పరచడానికీ, ఖైదీల బాధలు తగ్గించడానికీ మనకు ఎంత ఆసక్తి వున్నప్పటికీ ప్రధానమైన విషయాలలో మాత్రం జైలు జైలుగానే వుండాలనేది సుస్పష్టం. జైలులోవుండే ఖైదీలు, జైలు వెలుపలిప్రజలకు లభ్యం కాని సౌకర్యాలు, సదుపాయాలు కోరుకొరాదనే సంగతికూడా సుస్పష్టమే. కాబట్టి జైలులోపల వుండే పరిస్థితులకూ, బాహ్య ప్రపం

(మిగతా 44వ పేజీలో)

ప్రభుత్వ నిర్ణయాలు

ఇండియా స్టేటు బ్యాంకు, ఇండియా రిజర్వు బ్యాంకుల నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని సహకార బ్యాంకులు ఋణాలను పొందడానికి వీలుగా వాటికి ఆర్థికంగా హామీ వుండడానికి ప్రభుత్వం నిర్ణయించింది.

ఆంధ్ర ప్రాంతంలో చేనేత సహకార సంఘాలకు సహాయం చేయడానికి ఆంధ్రా కేంద్ర సహకార బ్యాంకుకు 132 లక్షల రూపాయలు, తెలంగాణా ప్రాంతంలో చేనేత సహకార సంఘాలకు సహాయం చేయడానికి హైదరాబాదు సహకార ఎపెక్స్ బ్యాంకుకు 67 లక్షల రూపాయలు ఋణాలుగా లభిస్తాయి.

తెలంగాణా ప్రాంతంలో సహకార సంఘాల ద్వారా రసాయనిక ఎరువుల పంపకానికి ఆర్థిక సహాయానికై హైదరాబాద్ సహకార ఎపెక్స్ బ్యాంకుకు 30 లక్షల రూపాయల ఋణం లభిస్తుంది. తీవ్రతర వ్యవసాయ కార్యక్రమాలకు ఏలూరు సహకార కేంద్ర బ్యాంకుకు 90 లక్షల రూపాయలు, వేరుసెనగ కొనుగోలుకు ఆంధ్రప్రదేశ్ సహకార మార్కెటింగ్ సంస్థకు ఎనిమిది లక్షల రూపాయలు, మచిలీపట్నం సహకార బ్యాంకుకు పది లక్షల రూపాయలు రాజమండ్రి సహకార బ్యాంకుకు 1.82 లక్షల రూపాయలు లభిస్తాయి.

రాష్ట్రంలోని వివిధ పట్టణాలలోని రాకపోకల సాధక బాధకాల, నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికై రిక్షా లైసెన్సుల విషయంలో ప్రస్తుతం అమలులో వున్న నిబంధనలను సడలించడానికి ప్రభుత్వం నిశ్చయించింది. రిక్షా డ్రైవర్లు స్వంత రిక్షాలను కొనుక్కోడానికి సహకార సంఘాలు సహాయం చేయడాన్ని ప్రోత్సహించడానికి కూడా ప్రభుత్వం నిర్ణయించింది.

రాష్ట్రంలో పంటల భీమా పథకాన్ని ప్రవేశ పెట్టడానికి గల అవకాశాలను పరిశీలించి, తగిన నివేదికను సమర్పించడానికి అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది.

(43వ పేజీ తరువాయి)

చంలో సాధారణ పౌరుడి జీవిత పరిస్థితులకూ కొంత సంబంధం వుండాలి. ఇంకా మన సమాజాన్ని వెంటాడుతున్న దారిద్ర్యం, వెనుకబడినతనం దృష్ట్యా, జైళ్లను ఆకర్షణీయంగా తయారు చేయడం ఇప్పటికే ప్రబలంగావున్న నేర స్వభావాన్ని మరింత పెంపొందించడమే అవుతుంది. అందుచేత జైలు సంస్కరణలను ప్రవేశ పెట్టాలనే మన అభిలాష సుస్పష్టమైన సత్యాలను మరుగుపరచరాదు. ఖైదీలను గర్హనీయులుగానూ, నీచులుగానూ చూడకూడదు. అలాగని వారిని వీరులు, ప్రభుత్వ అతిథులుగా భావించరాదు. విపరీతమైన ఈ రెండు దృక్పథాలను కూడా విడనాడాలి. ఖైదీ మూలతః నీతినిజాయితీగలవాడే. విపుణులైన సాంఘిక శాస్త్రజ్ఞుల సానుభూతి పూర్వకమైన ప్రవర్తనద్వారా నిర్ణీతకాలంపాటు అతని స్వేచ్ఛకు వాటిల్లిన అంతరాయం తొలిగిపోయిన పిమ్మట నాగరిక సమాజంలో అతడు మనగలుగునట్లు చేయవచ్చుననే వైఖరిని మనం వారిపట్ల ప్రదర్శించాలి.

పై లక్ష్యాలను సాధించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జైళ్ల శాఖ కృషిచేస్తున్నది. ఈ ఆధునిక ప్రపంచంలో, ఏదేని దేశంలో జైళ్ల సంస్కరణ రంగంలో సాధించిన అభివృద్ధి పరిమాణాన్ని ఆదేశపు నాగరితకు దాదాపు సూచికగా పరిగణించవచ్చు. సంక్షేమ రాజ్యం దృష్ట్యా ఈ విషయంలోగల బాధ్యతలు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి పూర్తిగా తెలుసు.

కథానిక:

స్వాతంత్ర్యం

మిక్కిలి సుందరరావు

మధురవాడ,
25 మే 1946

ప్రియమైన బావగారికి నమస్సులు!

వినీల నిర్మల ఆకాశంలో రెక్కలు విప్పుకుని స్వేచ్ఛగా విహరించి పావురంలా సంచరించే మిమ్మల్ని రాకాసి ప్రభుత్వం ఆ నాలుగు గోడల మధ్య బంధించి యమయాతన పెడుతున్నది కదూ ? నరకతుల్యమైన ఆ దుర్భర జీవితాన్ని ఎలా భరిస్తున్నావు బావా ? నీ కష్టాల్ని సగం పంచుకునే అవకాశం కలిగించమని భగవంతుని పాదసాక్షిగా వేడుకుంటున్నాను.

తల్లిదండ్రుల్నీ అన్నదమ్ముల్నీ సమస్తాన్నీ దేశసేవకోసం తృణప్రాయంగా చూసిన నీ పవిత్ర హృదయాన్ని యెలా వర్ణించగలను ?

ఎన్నాళ్ళ తపస్సు ఫలితంగానో నాజీవితంలో వసంతాన్ని రచించావు—ఆ జ్ఞాపకాలతోనే యీ గ్రీష్మ హేమంతాలను గడుపుతున్నాను. మళ్ళీనీవు వసంతంలా ఎప్పుడొస్తావు ?

మంచంమీద చావు బ్రతుకుల్లో వున్న మాఅమ్మ ఎప్పుడూ "జానకీ, రామం యెప్పుడొస్తాడమ్మా ? వస్తాడంటావా ?" అంటూ కన్నీరు పెడుతుంది. ఆమె నా జీవితం చూడలేకే మంచం పట్టిందని చాలా మంది అనుకుంటున్నారు.

సరోజ కనీసం రోజుకు ఒకసారైనా నావద్దకు వచ్చి యేవేవో చెప్పి నా దుఃఖ నివారణకు తోడ్పడిపోతుంటుంది. మనమిద్దరం ఆమెకు ఆజన్మాంతం ఋణపడి వున్నాం.

రెండుమూడు దినాల నుండి వళ్ళు తెములుతుంది.

వెంటనే జవాబు వ్రాస్తారు కదూ ?

మీ,
జానకి.

రాయవెల్లూరు,
10 జూన్ 1946

డియర్ జానకీ,

నీ వుత్తరంలో నాకేదో ఆప్యాయతా, ఆదరణ కనుపిస్తాయి. కనీసం మళ్ళీ వుత్తరం వ్రాసేలోపల పదిసార్లయినా చదువుతాను. ప్రతి వాక్యాన్ని గూర్చి ఆలోచించి తన్మయుడినౌతాను.

దూరంగా గంటలు వినబడ్డాయి. ఇప్పుడు రాత్రి 12 గంటలయ్యింది.

పున్నమిచంద్రుని పండు వెన్నెల సమస్త జీవుల్నీ అమృతవాహినిలో ముంచెత్తుతుంది కదూ ? ఆ శీతల కిరణకాంతులు కొద్దిగా యీ తలుపు సందుల్లోకి బలవంతంగా చొచ్చుకొస్తున్నాయి. ఈ కటకటాల నుండి పరుగుతీసి పచ్చని పొలాల్లోకి ఉరకలు తీసి గొంతెత్తి కమ్మనిగీతాలు నీ మీద పాడుకోవాలనిపిస్తుంది! ఆరోజు పున్నమి యెంత చిలిపిగా ఎంత త్వరగా మనిద్దరి మధ్య జారిపోయింది ! ఈసారి మన బ్రతుకులో వచ్చే పున్నమి మన కౌగిలింతల నుండి ఒక్క ఘడియ కూడా వ్యర్థం కాకూడదు ? తెలిసిందా ? ఏం ? సిగ్గేస్తుందా ? యీ వాక్యాలు చదువుతుంటే—

ఇక్కడ ఒక బెంగాలీ వ్యక్తికీ నాకూ పరిచయం యేర్పడింది. ప్రాణస్నేహితులమయ్యాం. అతడు బెంగాలీలో గొప్ప సాహిత్యవేత్త ! నీ వుత్తరం అతనికి చదివి అర్థం ఇంగ్లీషులో చెప్పాను—నిన్ను అభినందించాడు.

నేను తప్పకుండా కొద్ది రోజుల్లోనే జైలు నుంచి విడుదల అవుతాననీ, నిన్ను తప్పక వివాహమాడతానని మీ అమ్మతో చెప్పు—ఈ వుత్తరం చూపించు—

నీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో—

ఇక్కడ అనారోగ్యం అంతింతకాదు. నల్లులు, దోమలు రోజూ తీసుకునే జొన్న కూటిలో తెల్లని పొడుగాటి పురుగులుంటాయి. వాటిని చేత్తో తీసివేసి, ఆ గంజి త్రాగాలి. అసహ్యం వేసి గంజి పారబోశామంటే ఆకలి బాధకు మలమల మాడిపోతాం కాబట్టి అలాగే వూపిరి నిలుపుకోడానికి వాటిని త్రాగుతాం–

కొద్ది రోజుల నుండి దగ్గు యెక్కువగా వస్తుంది. బలహీనత వల్ల యీ వుత్తరం యెంతో ఓపిక కూడగట్టుకుని వ్రాస్తున్నాను.

నన్ను కొద్ది రోజుల్లో "బి" క్లాసు జైలుకు మారుస్తారట. అక్కడ నల్లులు, దోమలు తక్కువగా వుంటాయట! వరి గంజి దొరుకుతుందని కూడా విన్నాను.

ఒక మంచికోసం యీ బాధ పడుతున్నాను. ఈ లక్ష్యం సాధించడంలో ప్రాణం కోల్పోయినా నేను అమరవీరుణ్ణే కదా? ఈ అదృష్టం కూడా కావాలంటే రాదు సుమా!

నేను రావడంతోటే సరోజ వివాహ ప్రయత్నాలు చేద్దాం.

నిన్ను మరువలేని

మీ.

రామం.

మధురవాడ,

15 జూన్ 1946.

ప్రియమైన బావగారికి–

నమస్సుమనస్సులు–

మీ వుత్తరం చదివి పరమానందభరితురాల్ని అయ్యాను. చిక్కుపడ్డ చీకట్లవంటి నా సమస్యల్ని ఎంత అందంగా పరిష్కరించావో చెప్పలేను.

అమ్మ మంచంలోనే యింకా నీరసించిపోతుంది. నీ వుత్తరం చదివి వినిపించాను. ఆమె సన్నగా నవ్వి వూరుకుంది.

ఇప్పుడు నేను ఆరోగ్యంగానే వున్నాను. మీ ఆరోగ్య విషయం నన్ను బాగా బాధిస్తున్నది. మీ పాదసేవచేసి తరించే భాగ్యం యీ సమయంలో నాకు లేకపోయినందుకు చింతిల్లుతున్నాను.

మీ బెంగాలీ స్నేహితులకు నా నమస్కారాలు చెప్పండి. మీరు వ్రాసిన లేఖ సరోజకు చూపించాను. మీ జైలు జీవితం చదివి కన్నీళ్లు పెట్టుకుంది! ఎంత మెత్తని మనస్సు గల పిల్ల!

ఇక్కడ క్షణమొక యుగంగా గడుస్తుంది! మీ రాక కోసం క్షణక్షణం యెదురుచూస్తున్నాను.

మా యింటిప్రక్క కైకేయికీ నాకూ బావిదగ్గర చిన్న తగాదా వచ్చింది. ఆమె నానా దుర్భాషలాడింది. ఎంత కోపం వచ్చినా సహించుకుని వూరుకున్నాను. నోటి దురుసు మనిషి! ఏ విషయమూ కడుపులో దాచుకోలేని విచిత్ర వ్యక్తి!

తొలకరి వర్షాలు సాగాయి. అంతా పనుల్లో మునిగిపోతున్నారు. ఎంత చేసినా మన గ్రామాల్లో పొట్టకూటికే కరువుగదా. మళ్ళీ మీ విషయాలు తెలిసే వరకూ మనసు బాగోదు. వెంటనే వుత్తరం వ్రాయి బావా–

సెలవు–

మీ.

జానకి.

రాయవెల్లూరు.

10–7–1946

డియర్ జానకీ,

మాకు వుత్తరాలు త్వరగా అందవు. అందుకే కొంత ఆలస్యమౌతుంది.

మీ అమ్మ ఆరోగ్యాన్ని గూర్చి జాగ్రత్త తీసుకో–మన వుత్తరాలు సరోజకు చూపించకు–చిన్నపిల్ల కనుక మన దారుణ పరిస్థితులు ఆమెను కలవర పెడుతాయి.

కైకేయి విషయంలో నీవు చూపిన సహనాన్ని అభినందిస్తున్నాను. ఒక చెంప కొడితే యింకో చెంప త్రిప్పడం అనేది యెంత గొప్ప విషయం. గాంధి మహాత్ముని హరిజన పత్రికలో పై విషయం చదివి ఆశ్చర్యచకితుణ్ణయ్యాను.

బెంగాలీ స్నేహితుని పేరు ఋషితుల్య బెనర్జీ–నీ వుత్తరాన్ని, నీ సహనాన్ని అతడు ప్రశంసించాడు.

నా మీద నేరాలు యెక్కువగా వున్నందువల్ల నన్ను "బి" క్లాసుకు మార్చరట.

యీ తొలకరి వర్షాలు యెంత అందంగా ఎండిన బీళ్ళను చిగురింపచేస్తాయో—మళ్ళీ ఆ దృశ్యాలు యేనాడు చూస్తానో? చూడగలనా?

దగ్గు విపరీతమైపోయింది నన్ను ఆస్పత్రికి పంపారు. అక్కడ ఎక్సురే తీశారు. రేపు నా జబ్బేమిటో చెబుతారు.

త్వరలోనే మనం బానిసత్వంనుండి విముక్తి కాబోతున్నాం. తరతరాలనుండి పీడిస్తున్న నిరాశ, నిస్పృహ, దారిద్ర్యం అన్నీ సమూలంగా నిర్మూలించి మంచి రోజులు రాబోతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన తొలిరోజు నిన్ను చూసి మహదానందాన్ని పొందాలని వుంది. మనం చేసే యీ శ్రమ ముందు తరాలవారు పుట్టుకతోనే స్వేచ్ఛను అనుభవించడానికే గదా? ఇవ్వాళయిక వ్రాయలేను. దగ్గుతెర వచ్చింది. క్షమిం......చు.

నీ,

రామం.

మధురవాడ,

15—7—1946

ప్రియమైన బావగారికి,

మనఃపూర్వక వందనాలు.

మీ వుత్తరం చేరింది. మీ ఆరోగ్యం క్షణక్షణం దెబ్బతింటుందని అర్థమౌతుంది. ఈ సమయంలో మీ సేవ చేసి తరించే భాగ్యం నాకు లేకపోయింది.

ఒక ముఖ్య విషయం.

చెప్పలేక పోతున్నాను, నేను చెప్పాలనుకుని మీకు చెప్పలేక పోతున్నా విషయాన్ని అమ్మ తెలుసుకుంది. అప్పటి నుండి ఆమెకు భోజనమే లేదు. మరీ నీరసించి పోతుంది. నాకు చాలా భయంగా వుంది. అయితే యీ విషయం యిప్పటి వరకూ అతి రహస్యంగానే వుంది. నీకు యేలా చెప్పాలి? నీకు చెప్పక మరెవరికీ చెప్పను?

అర్థం కావడంలేదు. రోజులు యింత భయంకరంగా తయారవుతాయని కలలో కూడా అనుకోలేదు, అసలు విషయం వ్రాయలేక పోయినందుకు మన్నించు.

మనకు స్వాతంత్ర్యం వస్తుందా? ఎంత సంతోషమైనవార్త! అప్పుడు మీరంతా జైళ్లనుంచి బయటపడి స్వేచ్ఛగా తిరుగుతారు కదూ? మనదేశాన్ని మనమే పరిపాలించు కుంటాం కదూ? ఇక మనం ఒకరికి బానిసలం కామన్నమాట!

ఏదో వ్రాయాలని యేమీ వ్రాయలేక పోయాను.
సరోజ నీకు వుత్తరం వ్రాస్తుందట!

నన్ను మరచిపోవు కదూ?

మీ,

జానకి.

మధురవాడ,

1—8—46.

ప్రియమైన అన్నకు—

వందనాలు—

నీకు వుత్తరాలు వ్రాసే ధైర్యం నాకు యింతవరకూ లేదు. కాని యిప్పుడు వ్రాయవలసి వచ్చింది. జానకి వదిన త్వరలో తల్లి కాబోతుంది! ఈ విషయం మనకు సంతోషకరమే అయినా లోకానికి యెంత తప్పుగా కనుపిస్తుందో నీకు వివరించలేను. పల్లె అంతా యీ విషయం ప్రాకిపోయింది. ఎక్కడపడితే అక్కడ జనమంతా మీ విషయాన్ని గురించి కథలుగా చెప్పుకుంటున్నారు. కొంతమందికి రాత్రులు నిద్రలు కూడా వుండడంలేదు.

ఇంతమంచి జానకి వదినను కైకేయి మరీ తీవ్రంగా యెక్కడ పడితే అక్కడ దుయ్యపడుతుంది. వదిన యేమైనా చేసుకుంటుందేమో, యీ అవమానాలు భరించలేక అని భయపడుతున్నాను.

నీకు క్షయ రోగం వచ్చిందని యిక్కడ పుకార్లు లేచాయి. అవిషయం మాకు నమ్మకం లేదుగాని చాలా భయంగా వుంది—

నాకు వెంటనే వుత్తరం వ్రాస్తావుకదూ? అన్నయ్యా. నీవు వ్రాయకపోతే, యిక నీతో జన్మలోపలకను తెలుసా?

మనకు స్వాతంత్ర్యం వస్తుందని చెప్పుకుంటున్నారు— నిజంగా స్వాతంత్ర్యం వస్తే మాస్త్రీల స్థితిగతులు బాగు పడతా

యంటవా? ఏమో, నాకు నమ్మకం లేదు. ఇప్పుడు వదిన సంగతి చూడు—ఇలాంటి వాటికి విముక్తి యెప్పుడు?

ఇంతపెద్ద వుత్తరం వ్రాసినందుకు క్షమిస్తావుకదూ?

నీ చెల్లమ్మ—
సరోజ.

మధురవాడ,
5—5—47

ప్రియమైన అన్నకు—
వందనాలు—

ఇన్నాళ్లుగా యేలా వున్నావో యేం చేస్తున్నావో తెలియదు. వదిన యెన్ని వుత్తరాలు వ్రాసినా ప్రయోజనం లేకపోతుంది.

వదిన కొద్దిరోజుల క్రితం మగబిడ్డను ప్రసవించింది. ఎంత అందంగా ఉన్నాడనుకున్నావో? అచ్చంగా నీలాగే. ఆకోచేరు లాంటి ముక్కుతో పుట్టాడు—

పాపయి పుట్టినరోజే వదిన వాళ్ల అమ్మ స్వర్గస్థురాలయ్యింది, వదిన దిగులుతోనే ఆమె పోయిందని—అందరూ వదినను నానామాటలు అన్నారు—వదిన యెంత దుఃఖాన్ని భరిస్తుందో చెప్పలేను—

నీజబ్బు యెలా వుంది? అసలు నీవు, వున్నావా? లేవా? మా బాధనీకు అర్థంకాదు. వెంటనే వుత్తరం వ్రాయి—

ప్రేమతో నీచెల్లమ్మ—
సరోజ—

రాయవెల్లూరు,
10—8—1947

ప్రియమైన జానకీ—

ఇవ్వాళ నన్ను ఆసుపత్రినుండి విడుదల చేస్తున్నారు—భయంకరమైన జబ్బునుండి బయటపడ్డాను—ఇప్పుడు నాకు పూర్తి స్వస్థత చేకూరింది—

జైలునుండి నన్ను రేపే విడుదల చేస్తారు, అగస్టు 15 వ తేదీ మన భాగ్యదినం. భారత దేశం బానిసత్వంనుండి బయట పడబోతుంది. ఆరోజుకు నేను నీవద్ద వుంటాను—

నాకోసం యెన్ని బాధలకు లోనయ్యావో నాకుతెలుసు—నిజమైన భారత నారీమణివని నీవు నిరూపించుకున్నావు—


చిన్న రామం యెలా వున్నాడు? వాడు యెంత అదృష్ట వంతుడు—వాడి భవిష్యత్తు స్వతంత్ర భారతదేశంలో వైభవోజ్వలంగా వుంటుంది—

నా బెంగాలీ స్నేహితుడు కూడా విడుదల అవుతున్నాడు—ఉత్తమ భావాలు కల యువకుడు—మన సరోజతో అతనికి వివాహం యేర్పాటు చేద్దాం—


ఈ ప్రథమ మహోజ్వల స్వాతంత్ర్య శుభ సమయంలో మీ అందరికి నా శుభాకాంక్షలు—

నీ
రామం—






పిడుగుపాటువల్ల రోడ్డు అవతరణ: విశాఖపట్నంజిల్లా కొత్తవలస సమీపంలో ఒక కొండపై ఈ మధ్య పిడుగుపాటు ఫలితంగా చక్కని రోడ్డుమార్గం ఏర్పడింది (పై చిత్రంలో ఆ దృశ్యం చూడవచ్చు.)




శ్రీకాకుళం ప్రభుత్వ ఆర్ట్సు కళాశాల నూతనభవనం. ముఖ్యమంత్రి సెప్టెంబరు 8వ తేదీన దీనికి ప్రారంభోత్సవంచేశారు.

ఉపాధ్యాయులకు జాతీయ అవార్డులు


ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దిగువ అయిదుగురు ఉపాధ్యాయులకు 1961 అక్టోబరు 31వ తేదీన ఢిల్లీలో జాతీయ అవార్డులు లభించాయి:




శ్రీ ఎన్. సుందరమూర్తి, ఉపాధ్యాయుడు, ప్రభుత్వ బహూళార్థసాధక ఉన్నత పాఠశాల, జగిత్యాల, కరీంనగరం జిల్లా.




శ్రీ గాలాజీసింగ్ ఠాకూర్: ప్రధానోపాధ్యాయుడు, ప్రభుత్వ మాధ్యమిక పాఠశాల, నాంపల్లి, హైద్రాబాదు.




శ్రీ మున్షి బనార్సీదాస్ సక్సేనా "ఖమర్ పీలీభీతి", ఉపాధ్యాయుడు, వీరపుత్ర హిందీ విద్యాలయం, పురానా పుల్, హైదరాబాదు.



శ్రీ మొహమ్మద్ రఫియొద్దీన్ సిద్దీఖీ, ప్రధానోపాధ్యాయుడు, ప్రభుత్వ బాలుర ప్రాథమిక పాఠశాల, బజార్ నూరుల్ ఉమ్రా, హైద్రాబాద్.



శ్రీ పట్నాయకుని నరసింహం, ప్రధానోపాధ్యాయుడు, జిల్లాపరిషత్తు ప్రత్యేక హయ్యర్ ఎలిమెంటరీ పాఠశాల, తంగుడుబిల్లి, విశాఖపట్నం జిల్లా.




ఇటీవల రాష్ట్రంలోని వివిధ ప్రాజెక్టు ప్రాంతాలలో పర్యటించిన జర్నలిస్టుల బృందంవారు డిశంబరు 9వ తేదీన తుంగభద్ర హైడ్రో ఎలక్ట్రిక్ విద్యుత్కేంద్రాన్ని సందర్శించారు.



ఢిల్లీ భారత పారిశ్రామిక ప్రదర్శనంలోని ఆంధ్రప్రదేశ్ మంటపంలో ఉన్న ఆటోమేటిక్ కౌంటరును గురించి ఉపరాష్ట్రపతి డాక్టర్ ఎస్. రాధాకృష్ణన్ ప్రేక్షకులతో ముచ్చటిస్తున్న దృశ్యం.



హైద్రాబాదుజిల్లా మేడ్చల్‌లో నవంబరు 14 వ తేదీన బాలలదినోత్సవం
గింది. ఆ సందర్భంలో స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యా
లు "మాస్‌డ్రిల్" చేశారు.




ఆంధ్రప్రదేశ్ మంటపం ప్రవేశద్వారంవద్ద నిర్మించబడిన "వరంగల్‌గేటు" ప్రతిరూపం.



శ్రీకాకుళంజిల్లా శ్రీ ముఖలింగం పంచాయతీబోర్డు అధ్యక్షులు,
పాఠశాల కమిటీ అధ్యక్షులు శ్రీ తమ్మన్న చిన్నలింగన్న.
పాఠశాలకొరకు 5 ఎకరాల భూమినీ, రూ.
[illegible] వేలు [illegible] విరాళంగా ఇచ్చారు.



ప్రజాశిక్షా సప్తాహం సందర్భంగా నవంబరు 8 వ తేదీన అదిలాబాదు
లో బుర్రకథ జరిగింది.




హైద్రాబాదులోని [illegible] వ్యాయామం చేస్తున్న దృశ్యం



రాష్ట్రపతి డాక్టర్. యస్. రాధాకృష్ణన్ బేగంపేట విమానాశ్రయంలో 62 జులై 7వ తేదీన సైనికవందనాన్ని స్వీకరించినప్పటి చిత్రం.



హైద్రాబాదులోని బాలల జూనియర్ సర్టిఫయిడ్ పాఠశాల బాలురు ఫీల్డువర్కు చేస్తున్న దృశ్యం.



నైజీరియా వ్యవస్థాపక శాఖమంత్రి హెచ్. ఇ. అల్హాజి శేహుషాగరి, 1962 జూన్ 30వ తేదీన హైద్రాబాదుకు వచ్చారు.



భారత ప్రభుత్వ ఆరోగ్యశాఖ డిప్యూటి మంత్రి డాక్టరు డి. యస్. రాజు, 1962 జూన్ 23వ తేదీన హైద్రాబాదు, మెంటల్ ఆసుపత్రిలోని మనోవ్యాధి చికిత్సా సంస్థభవనాలు, బయటిరోగుల పరిపాలన శాఖ బ్లాకులను సందర్శించారు.

1925
1950
1962

రోజులు మారిపోయాయి

1925 లో ప్రొఫెసర్ రఘునాథ్ ధోండో కర్వే కుటుంబ నియంత్రణావశ్యకతను గురించి ప్రచారం చేశారు.

అప్పుడాయన విల్సన్ కళాశాలలో గణిత శాస్త్రములో ప్రొఫెసరుగా పనిచేస్తూ వుండేవారు. ఆయన అభిప్రాయాలను అనేకమంది తీవ్రంగా విమర్శించారు: కళాశాల అధికారులు ఆయనను సంతాన నిరోధానికి అనుకూలముగా ప్రచారం చేయరాదని నిషేధించారు. దాని ఫలితముగా ఆయన తన పదవికి రాజీనామా ఇవ్వవలసి వచ్చింది.

1950 నుండి 1962 వరకూ కుటుంబ నియంత్రణముపై ప్రజాభిప్రాయాన్ని సుమారు 27 పర్యాయములు సేకరించారు. దీనినిబట్టి కుటుంబ నియంత్రణముపై సాంఘికముగాకాని, మత విషయికముగా కాని సంఘటిత వ్యతిరేక భావం లేదనీ, 35 సంవత్సరాలకు మించిన వయస్సుకల స్త్రీలలో నూటికి 70 మంది కుటుంబ నియంత్రణానికి సుముఖులుగా వున్నారనీ తేలింది.

ఆరోగ్యానికీ ఆనందానికీ

కుటుంబ నియంత్రణం

మీకు సమీపములో వున్న ప్రభుత్వ పరిగణన పొందిన
కుటుంబ నియంత్రణ కేంద్రానికి వెళ్ళి
సలహా పొందండి

DA 62/242

పంచాయతీరాజ్య పురోగమనం

యువజన క్లబ్బు

వెంపల్లి పంచాయతీ సమితిలోని లోపుడ గ్రామంలో 1962 జూన్ నెలలో ఒక యువజన క్లబ్బును ప్రారంభించారు. ఇదే సమితిలోని క్రిష్ణగిరిపల్లిలో ఒక మహిళామండలిని తెరవడం జరిగింది.

మేలురకం విత్తనాల పంపిణీ

కర్నూలు జిల్లా ఆలూరు పంచాయతీ సమితిలో 1961_62వ సంవత్సరంలో రైతులకు అన్ని రకాల మేలు రకం విత్తనాలను 42.090 మణుగుల వరకు పంపిణీ చేశారు.

పరిషత్తుభవనానికి శంకుస్థాపన

రాష్ట్ర ముఖ్యమంత్రి జూన్ 30 వ తేదీన వరంగల్లు జిల్లా పరిషత్తు భవనానికి శంకుస్థాపన చేశారు. పంచాయతీ రాజ్యం, ప్రణాళికా శాఖల మంత్రి అధ్యక్షత వహించారు. భవననిర్మాణానికి రూ. 8 లక్షల ఖర్చవుతుంది.

పుండ్ల గ్రామంలో ప్రాథమిక పాఠశాల ప్రారంభం

బాపట్ల పంచాయతీ సమితిలోని పుండ్ల గ్రామంలో జూలై 6 వ తేదీన దొప్పలపూడి నారాయణ జిల్లా పరిషత్తు మాధ్యమిక పాఠశాలకు ప్రారంభోత్సవం జరిగింది. ఈ పాఠశాల స్థలం, భవనాలకు రూ. 50,000 లు ఖర్చయింది. ఈ వ్యయాన్ని పూర్తిగా శ్రీమతి డి. హనుమంతమ్మగారు భరించారు. తన భర్త అయిన శ్రీ. శే. నారాయణ గారి జ్ఞాపకార్థం ఆమె ఈ మొత్తాన్ని విరాళంగా ఇచ్చారు.

మధ్యాహ్న భోజన పథకం

మధ్యాహ్న భోజన పథకం ("కేర్") క్రింద నల్గొండ జిల్లా నకిరెకల్లు సమితిలో 18 కేంద్రాలను నెలకొల్పారు.

నకిరెకల్లు పంచాయతీ సమితిలో వ్యవసాయోత్పత్తిని పెంపొందించడానికి సహకార సంఘాల ద్వారా రూ. 2.05 లక్షల మేరకు ఋణాలు పంపిణీ చేశారు.

విమానాలనుంచి "ఎండ్రిన్" చల్లకం

బాపట్ల పంచాయతీ సమితి జూలై 9వ తేదీన జరిగిన సమావేశంలో, సమితి ప్రాంతంలోని 3,000 ఎకరాల వరిపైరుపై విమానం ద్వారా "ఎండ్రిన్" చల్లించడానికి నిశ్చయించింది. ఇందుకు అయ్యే ఖర్చులో సగం రైతులూ, మిగతా సగాన్ని సమితి, జిల్లా పరిషత్తులు చెరి సమంగా భరించాలని కూడా ఈ సమావేశంలో నిశ్చయించారు. గ్రామ సహాయకుల పర్యవేక్షణ క్రింద ఈ పని జరుగుతుంది.

ఈ ప్రాంతంలో మొదటి సారిగా 1960_61 వ సంవత్సరంలో విమానం నుంచి మందులు చల్లడం జరిగింది.

ఎలిమెంటరీ పాఠశాల ప్రారంభం

కడప జిల్లా, పెండ్లిమర్రి పంచాయతీ సమితిలోని బలుపల్లె గ్రామంలో జూన్ 24 వ తేదీన ఎలిమెంటరీ పాఠశాలా భవనానికి ప్రారంభోత్సవం జరిగింది. భవన నిర్మాణానికి అయిన రూ. 11, 400 ల వ్యయంలో నాల్గవ వంతును ప్రజలు భరించారు.

ఉత్తమ పంచాయతీ

పశ్చిమ గోదావరి జిల్లా తణుకు నాన్ బ్లాకు ప్రాంతంలో ఉత్తమ పంచాయతీగా వేల్పూరు మేజర్ పంచాయతీ ఎన్నిక అయింది.

కోళ్ల పెంపకం విభాగం

నెల్లూరు జిల్లా కొండపి పంచాయతీ సమితిలో పది కేంద్రా-

లలో ఉచిత మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు పరుస్తున్నారు. బీదవారు, అర్హులు అయిన సుమారు 250 మంది పిల్లలకు ఉచితంగా మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తున్నారు. బ్లాకులోని ఆరు గ్రామాలలో మంచినీటి బావులు త్రవ్వే కార్యక్రమం చురుగ్గా సాగుతున్నది. కామేపల్లిలో "కోళ్ల పెంపకం విభాగాన్ని" ప్రారంభించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీని కొరకు ప్రజలు రూ. 6,000 లు విరాళంగా ఇచ్చారు.

మురుగుపారుదల కాలువల నిర్మాణం

నల్గొండజిల్లా మిర్యాలగూడెంపంచాయతీసమితిలోని బొర్రాయపాలెం గ్రామంలో మాగాణీ సేద్యాన్ని ఇంకా ఎక్కువ విస్తీర్ణంలో సాగించడానికై మూడు సేద్యపు నీటి బావులను త్రవ్వారు. పత్తెం పహాడ్ తండా యువజనులు ప్రాథమిక పాఠశాల కొరకు ఒక సామాన్య గృహాన్ని నిర్మించారు. నిర్బంధ ప్రాథమిక విద్యా పథకం క్రింద దీన్ని తెరవడం జరిగింది. కొండ్రపోలు గ్రామస్థులు మురుగునీటి పారుదలకై 30 గజాల పక్కా కాలువలు నిర్మించారు.

కొత్త అప్రోచ్ రోడ్లు

మహబూబ్‌నగరంజిల్లా అచ్చంపేట పంచాయతీ సమితిలో 1960_61వ సంవత్సరంలో కొత్తగా మూడు ప్రాథమిక పాఠశాలలను తెరిచారు.మూడు మైళ్ల ఏడుఫర్లాంగుల అప్రోచ్ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. పరపతి సంఘాలు, బహుళార్థసాధక సంఘాలను పదింటిని నెలకొల్పారు. వీటి సభ్యత్వసంఖ్య 464. అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు రూ. 13,821.00 లు విరాళంగా ఇచ్చారు.

ప్రజల విరాళాలు

నిజామాబాదు జిల్లా బాన్స్‌వాడ పంచాయతీ సమితిలో 1961_62 వ సంవత్సరంలో వస్తు రూపేణా, శ్రమ రూపేణా రూ. 42,400 ల మేరకు ప్రజల నుంచి విరాళాలు లభించాయి.

శ్రమదానం

కృష్ణా జిల్లా ముసునూరు పంచాయతీ సమితివారు 1962 మే 7వ తేదీనుంచి 9 వ తేదీవరకు అయిదవ తరగతి విద్యార్థులకు ప్రయోగాత్మకంగా సమిష్టి (వార్షిక) పరీక్షలు నిర్వహించారు. ఆరవతరగతి ప్రవేశపరీక్ష సందర్భంలోవిద్యార్థి, విద్యార్థినులు సాధారణంగా భయం ప్రదర్శించడం జరుగుతుంటుంది కాబట్టి వారికి పరీక్ష అంటే భయంలేకుండా చేయడానికి పైవిధంగా పరీక్ష నిర్వహించడం జరిగింది. ఈ పథకాన్ని పిల్లల తల్లిదండ్రులూ, ఉపాధ్యాయులు శ్లాఘించారు.

ఉపకార వేతనాలు

వరంగల్లు జిల్లా పరిషత్తు సాంఘిక సంక్షేమ వ్యవహారాల స్థాయీసంఘం, జిల్లాలోని 24 మంది నిమ్నజాతి విద్యార్థులకు ఉపకారవేతనాలు ఇచ్చేందుకై రూ. 18,000లు మంజూరు చేయడానికి తీర్మానించింది. హన్మకొండలోని వెనుకబడిన తరగతులవారి హాస్టలుకు విద్యుచ్ఛక్తి, మంచినీటి సౌకర్యాలు కల్గించడానికి రూ. 655.78 న. పై. లు మంజూరు చేయడానికి కూడా ఈ స్థాయీ సంఘం తీర్మానించింది.



రాష్ట్ర బడ్జెటుపై చర్చ

విమర్శలకు

ఆర్థిక మంత్రి శ్రీ బ్రహ్మానందరెడ్డి

సమాధానం

ఆంధ్ర ప్రదేశ్ శాసన సభలో రాష్ట్ర బడ్జెటుపై 5రోజుల పాటు జరిగిన సాధారణ చర్చకు 1962 జూలై 2వ తేదీన ఆర్థిక మంత్రి శ్రీ కె. బ్రహ్మానందరెడ్డి సవివరంగా సమాధానమిస్తూ భూమశిస్తు (అదనపు) బిల్లును విమర్శించేముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గమనించాలని శాసనసభ అన్ని వర్గాలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రం తద్వారా దేశసంక్షేమానికై అమలుజరుపబడుతున్న ప్రణాళికా పథకాల ఖర్చుకు యెక్కువ ధనాన్ని సమకూర్చడానికి తలపెట్టబడిన కార్యక్రమాలను వ్యతిరేకించే విధంగా ప్రజలను ప్రోత్సహించవద్దనికూడా ఆయన అన్నారు. బిల్లులోఉన్న 'నూటికినూరుపాళ్ళు' అనే పదాలనుచూచి నూటికి నూరుపాళ్ళ శిస్తును పెంచుతున్నారని సభ్యులు అపోహ పడరాదని ఆయన విజ్ఞప్తి చేశారు. బిల్లును చర్చించే సమయంలో యీ సత్యాన్ని సభ్యులు గుర్తించగలరని మంత్రి అన్నారు. ప్రస్తుతం రైతులను తికమక పెడుతున్న సర్‌చార్జీలు, సెస్సులను తొలగించి, వాటిస్థానే సమమైన భూమిశిస్తును విధించడానికే యీ బిల్లు ఉద్దేశించబడింది. అంతేగాక మొత్తం ఆంధ్రప్రదేశ్‌లో ఒకే విధమైన భూమిశిస్తు విధానం ఉండాలనే కోరికకూడా యీ బిల్లువల్ల తీరుతుంది అని అన్నారు.

పారిశ్రామికీకరణ

రాష్ట్ర పారిశ్రామిక పరిస్థితి, యీ విషయంలో కేంద్ర ప్రభుత్వ దృక్పథం గురించి, ప్రస్తావించి రాష్ట్ర ప్రభుత్వం బలహీనంగా ప్రవర్తిస్తున్నదని ప్రతిపక్షంచేసిన ఆరోపణలను ఆర్థిక మంత్రి తీవ్రంగా ఖండిస్తూ, దేశంలోని వివిధ ప్రాంతాల్లో పరిశ్రమల అభివృద్ధిలోగల వ్యత్యాసాలను తొలగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా కోరామని ఆయన చెప్పారు. యీ విషయంలో సభ ఒక తీర్మానాన్ని చేసిందని జ్ఞాపకం చేస్తూ, జాతీయ అభివృద్ధి మండలి సమావేశంలో ముఖ్యమంత్రి స్వయంగా యీ విషయాన్ని ప్రస్తావించారని ఆర్థికమంత్రి అన్నారు.

"ప్రథమ, ద్వితీయ ప్రణాళికా కాలంలో పరిశ్రమల అభివృద్ధి విషయంలో ఆంధ్రప్రదేశ్‌కు న్యాయంచేకూరలేదు. ప్రస్తుతం కొన్ని పరిశ్రమలను నెలకొల్పుతున్నా ముఖ్యంగా ప్రభుత్వ రంగములో చెప్పుకోదగిన పని జరగలేదు"అని మంత్రి ప్రకటించారు.

మంత్రి తమ ప్రసంగాన్ని కొనసాగిస్తూ, ప్రతి పక్షసభ్యులు సూచించిన మద్రాసు ఉదాహరణను ప్రస్తావించారు. ప్రతిరాష్ట్రము తమ సహజ సంపద, అవసరాల ప్రాధాన్యక్రమాన్ని దృష్టిలో ఉంచుకొని వివిధ పథకాలకు సొమ్మును కేటాయిస్తుందని ఆయన పేర్కొన్నారు. నాగార్జునసాగర్, తుంగభద్ర ఎగువ కాల్వ మొదలైన బహుళార్థ సాధక ప్రాజెక్టులను వినియోగించుకునే అవకాశం ఆంధ్రప్రదేశ్‌కు ఉన్నది. యిటువంటి వాటిని ఉపయోగించుకునేందుకు వీలుగా వీటికి పెద్దమొత్తాలను కేటాయించకుండా, యితర పథకాలకు ప్రాముఖ్యం యివ్వాలనడం అసంబద్ధంగా ఉంటుంది. ప్రభుత్వం చేపట్టిన పెద్దనీటి పారుదల పథకాలు కొన్ని సంవత్సరాల కాలం తీసుకున్నా అంచనా వేసినా ఫలితాలను మాత్రం అవి యిస్తాయని మంత్రి హామీ యిచ్చారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు ఒక్కదానికే రూ. 50 కోట్లు ఖర్చు చేయాల్సి రావడంవల్ల పరిమితంగా ఉన్న రాష్ట్ర ఆదాయంపై యెక్కువ భారం పడుతున్నదని అందువల్ల విద్య, పరిశ్రమలు, సాంఘిక సంక్షేమ పథకాలకు యెక్కువ మొత్తాలను కేటాయించడానికి అవకాశంలేక పోతున్నదని ఆయన అన్నారు.

వ్యవసాయ ఉత్పత్తులు

రాష్ట్రం ప్రతి రంగంలో వెనుకబడి ఉన్నదన్న ప్రతిపక్ష సభ్యుల

వాదానికి సమాధానమిస్తూ సోదాహరణంగా లెక్కలు చూపుతూ రాష్ట్రం అన్ని రంగాలలో అమోఘమైన ప్రగతిని సాధించినదని ఆర్థిక మంత్రి అన్నారు. 1955 నుండి 1959 వరకు ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ పదార్థాలు దేశం మొత్తంలో కన్నా యెక్కువ ఉత్పత్తి అయ్యాయని ఆయన అన్నారు. యెకరా రాబడి కూడా అధికంగానే ఉన్నది. అఖిల భారత వరి రాబడి యెకరాకు సగటున 1020 కే.జీ.లు ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో వరి యెకరా రాబడి సగటున 1280 కే.జీ.లు వుంది. యిదే విధంగా పొగాకు, చెఱకు, రాగి, సజ్జ విషయంలోగూడా సగటు ఉత్పత్తి ఆంధ్రప్రదేశ్‌లో యెక్కువగా ఉంది

పెద్ద, మధ్యరకం ప్రాజెక్టులను గురించి ప్రస్తావిస్తూ ప్రణాళిక ఆఖరు వరకు వీటిపై రూ. 155 కోట్లు ఖర్చు వేయబడతాయని మంత్రి వెల్లడించారు. ద్వితీయ ప్రణాళికా కాలంలో అదనంగా 5 లక్షల యెకరాల భూమికి నీటి పారుదల సౌకర్యం కల్పించబడింది. రెండవ ప్రణాళికలో చిన్న తరహా నీటి వసరులకు రూ. 3 కోట్లు కేటాయించగా, దీనికై రూ. 8 కోట్లు ఖర్చు చేశారు. మూడవ ప్రణాళికలో చిన్నతరహా నీటి వసరులకు రూ 18,00 కోట్లు కేటాయించారు. అయితే ప్రణాళికా సంఘంతో సంప్రదించి, యితరత్రా సర్దుబాటుతో యీ పద్దుకు మరి రూ. 10 కోట్లు అదనంగా ఖర్చు చేస్తారని ఆయన వెల్లడించారు.

రాష్ట్రంలో పెరిగిపోతున్న విద్యుచ్ఛక్తి అవసరాలను గూర్చి ప్రస్తావిస్తూ రెండవ ప్రణాళిక ఆఖరుకు విద్యుచ్ఛక్తి ఉత్పాదనశక్తిని 2:3 యం.డబ్లు. నుండి 600 యం.డబ్లు.కు పెంచడానికి డబ్బును కేటాయించారని మంత్రి అన్నారు.

తుంగభద్ర జలవిద్యుచ్ఛక్తి పథకం క్రింద క్రొత్తగా నాలుగు సెట్లకు నెలకొల్పాల్సి ఉంది. నెల్లూరు థర్మల్ కేంద్రం ఉత్పాదన శక్తిని 30 యం.డబ్లు.కు పెంచాల్సి ఉంది. 1963–64వ సంవత్సరం వరకు యీ పథకం అమలు పూర్తి అవుతుందని ఆశించబడుతున్నది. యిరుగుపొరుగు రాష్ట్రాలతో రాజకీయ వివాదాల కారణంగా ఎగువ సీలేరు జల విద్యుచ్ఛక్తి ప్రాజెక్టు నిర్మాణంలో కొన్ని అనుకోని చిక్కులు తల యెత్తాయి. కొత్తగూడెం థర్మల్ స్టేషన్ విషయంలో 1962 జూన్ 6 వ తేదీన ఉన్నత స్థాయిలో చర్చలు జరిగాయి యీ ప్రాజెక్టుకు ప్రపంచ బ్యాంకు సహాయం పొందడానికి వీలుగా అమెరికాకు యింజనీర్లను రాష్ట్ర ప్రభుత్వం పంపుతుందని ఆయన అన్నారు.

విద్యుచ్ఛక్తి కొఱత నివారణ

విద్యుచ్ఛక్తి కొఱత నివారణకై తీసుకున్న చర్యలను మంత్రి వివరిస్తూ 11000 కిలోవాట్ల చొప్పున విద్యుచ్ఛక్తిని ఉత్పత్తిచేసే 2 టర్బో-గ్యాస్ జనరేటర్ల కొనగోలుకు అవసరమైన విదేశీమారకద్రవ్యం కోటాను కేంద్రప్రభుత్వం జారీ చేసిందని ఆయన అన్నారు. వచ్చే 6, 7 నెలలలో వీటిని నెలకొల్పగలమనే ప్రభుత్వం ఆశిస్తున్నదని ఆయన అన్నారు. దీనికితోడు 60,000 కిలోవాట్ల ఉత్పాదకశక్తిగల మరో జనరేటరును జపాను లేక యే యితర దేశంనుంచి అయినా కొనగోలు చేయడానికి కూడా చర్యలు తీసుకుంటున్నారు.

గోదావరి ఆనకట్ట షట్టర్ల యెత్తు పెంచే సమస్యపై రేకెత్తిన వివాదాన్నిగురించి ప్రస్తావిస్తూ కేంద్ర జలవిద్యుత్ కమీషను యీ ఆనకట్ట నిలిచి ఉండే విషయంలోనే తమ అనుమానాన్ని వ్యక్తపరిచిందని ఆయన అన్నారు. అయినా, యీవిషయం యీ వత్తు పరిశీలనలో ఉందని నుడినారు.

క్రొత్త యూనివర్సిటీ

రాష్ట్రంలో మరొక విశ్వవిద్యాలయాన్ని నెలకొల్పడానికి వీలుగా ప్రణాళికలో రూ 50 లక్షలభారీమొత్తాన్ని కేటాయించారని ఆయనవెల్లడించారు. మూడువిశ్వవిద్యాలయాల ఉపాధ్యాయులు వ్యతిరేకతచూపించినకారణంగా ఆదినిర్ణయంచేసేముందు యీప్రతిపాదనను పునరాలోచించాల్సిఉందని ఆయనఅన్నారు. ఆర్థికమంత్రి తమసమాధానాన్ని కొనసాగిస్తూ విశాఖపట్నం డ్రేనేజి పథకానికి, రాజమండ్రి, అమలాపురం మంచినీటి సరఫరాపథకాలకు అప్పులు యివ్వాలని ప్రభుత్వం జీవితభీమా కార్పొరేషన్‌కు సిఫారసు చేసిందని ఆయన అన్నారు. జీవితభీమా కార్పొరేషన్ రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీ కోరుతుంది కాబట్టి సిఫారసుచేసేముందు మునిసిపాలిటీల ఆర్థికపరిస్థితిని పరిశీలించాల్సి ఉంటుంది కాబట్టి యిటువంటి సహాయానికివచ్చే ప్రతిమునిసిపాలిటీ దరఖాస్తునుపంప వీలుపడదని ఆయన పేర్కొన్నారు. తెలివితేటలుగల బీద విద్యార్థులకు ఆర్థికసహాయంయిచ్చే ప్రతిపాదనకు శాసనసభ అన్నివర్గాలవారు హర్షం ప్రకటించినందుకు ఆర్థికమంత్రి తమకృతజ్ఞత తెలియజేశారు.

★

సంగ్రహ ప్రకటనలు

సహకార వ్యవసాయం

సహకార వ్యవసాయ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఈ క్రింది నిర్ణయాలు చేసింది.

సహకార వ్యవసాయ సంఘాన్ని ప్రభుత్వం ఈ క్రింది విధంగా నిర్వచించింది. "భూములన్నిటినీ ఒక చోట సమీకరించి మానవ శక్తితో లభించే వనరులను మరింతగా ఉపయోగించుకోడానికి ఏర్పడిన స్వచ్ఛంద సంస్థయే సహకార వ్యవసాయ సంఘం. వ్యవసాయోత్పత్తిని, ఉద్యోగావకాశాలను, ఆదాయాన్ని అధికం చేసే దృక్పథంతో అనేక మంది సభ్యులు ఈ వ్యవసాయ కార్య కలాపాలలో పాల్గొంటారు." ఈ సహకార వ్యవసాయ సంఘాల నిర్వహణలో ఏవిధమైన నిర్బంధం వుండరాదని కూడా ప్రభుత్వం ఆదేశించింది.

నిర్వహణ విధానం

భూములను సమీకరించి వ్యవసాయ కార్యక్రమాల సాధక బాధకాలను బాధ్యతలను సభ్యులందరూ భరించడం సహకార వ్యవసాయ సంఘం ముఖ్య లక్షణంగా ప్రభుత్వం ఆమోదించింది.

ఈ సంఘాలలో పని చేసే వారికి మాత్రమే సభ్యత్వం పరిమితం. అయితే ఈ నిబంధన అంగవైకల్యం గల వారికి, ప్రభుత్వోద్యోగులకు, వయోలింగ బేధాలున్నవారికి, ఇతర గ్రామాలలో పొలాలున్న వారికి వర్తించదు. ఇలా పని చేయలేని సభ్యుల సంఖ్య మొత్తం సభ్యుల సంఖ్యలో $\frac{1}{4}$ వ వంతుకన్నా మించకూడదు. అంతేగాక, ఇట్టి సభ్యుల భూములు మొత్తం సంఘపు భూములలో 50 శాతం మించకూడదు.

క్షేత్ర పరిమాణం

ఒక్కొక వ్యవసాయ క్షేత్రంలో 50 ఎకరాల మాగాణిగాని, నూరు ఎకరాల మెట్టగాని క్షేత్ర కనీస పరిమాణంగా వుండవచ్చునని రాష్ట్ర సహకార క్షేత్ర సలహా సంఘం చేసిన సిఫార్సును ప్రభుత్వం ఆమోదించింది. వీటిలో మెట్ట మాగాణి భూములు రెండూ వుండవచ్చు. అయితే ఒక ఎకరం మాగాణి భూమిని రెండెకరాల మెట్టభూమికి సమానంగా పరిగణిస్తారు.

ఈ సంఘాలలో చేరిన మూడేళ్ళ తర్వాత మాత్రమే ఇందులో సభ్యత్వాన్ని విరమించుకోడానికి వీలవుతుంది. భూములను సేకరించినందుకు సహకార సంఘాల నికరాదాయాన్ని, మొత్తం లాభాలను సభ్యులకు పంచే విషయాన్ని ఆయా సహకార వ్యవసాయ సంఘాల పరిశీలనకే వదలివేయాలని ప్రభుత్వం నిశ్చయించి ఈ విధంగా వచ్చే ఆదాయంనుంచి ఇచ్చే ప్రతిఫలం రాష్ట్రంలోని కౌలుదారీ చట్టాల క్రింద నిర్దేశించిన మొత్తాన్ని మించకూడదని నిర్ణయించింది.

సహకార వ్యవసాయ సంఘాలకు అవసరమైన మధ్య, దీర్ఘకాలిక ఆర్థిక సహాయాన్ని ఇవ్వడానికి సంఘం శ్రేయస్సు దృష్ట్యా సేకరించిన భూములను తనఖా పెట్టవచ్చునని ఆ సంఘం సభ్యులకు నచ్చచెప్పాలి.

ఋణాలు

ప్రతి సహకార సంఘానికీ సగటున నాయిగు వేల రూపాయల దీర్ఘ, మధ్యకాలిక ఋణాలు నివ్వడానికి ప్రభుత్వం ఆమోదించింది. పశువుల కొట్టం గోదాము నిర్మాణానికి ప్రది సంఘానికి 5 వేల రూపాయలు మించని ఆర్థిక సహాయం చేయడానికికూడా ప్రభుత్వం అంగీకరించింది. ఆ సంఘాల నిర్వహణకు మూడునుంచి ఐదు సంవత్సరాల వరకూ ప్రతి యేటా పన్నెండు వందల రూపాయలు మించకుండా సబ్సిడీ కూడా ప్రభుత్వం ఇస్తుంది.

భౌతిక లక్ష్యాలు

1961–62 సంవత్సరంలో అమలు జరుపని ఆరు పథకాలతో సహా 1962–63 సంవత్సరంలో పది పైలట్ పథకాలను ప్రారంభించడానికి ప్రభుత్వం నిశ్చయించింది. ప్రతి ఒక్క పైలట్

పథకం క్రింద ఐదు సహకార వ్యవసాయ సంఘాలుంటాయి. ఈ విషయంపై ప్రస్తుతం ఎట్టి ప్రత్యేక శాసనం చేయ నవసరం లేదని ప్రభుత్వం అనుకున్నది.

ఉద్యోగాలకు సరాసరి నియామకం

విద్యా శాఖలోని కొన్ని ఉద్యోగాలకు అభ్యర్థులను నేరుగా నియమించే విషయమై సందేహాలను నివారిస్తూ ప్రభుత్వం ఈ క్రింది పత్రికా ప్రకటన వెలువరించింది:

"ఈ పద్ధతి, తొలిదొల్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ప్రవేశపెట్టబడలేదు. స్వభావరీత్యా సాంకేతికముకాని రాష్ట్ర ఉద్యోగాల పెక్కింటిలో కొంతశాతం తప్పకుండా సరాసరి నియమాకాలకై కేటాయించబడుతున్నది. ఉదాహరణకు, ఆంధ్ర సివిల్ సర్వీసు (కార్యనిర్వాహకశాఖ) ఆంధ్ర వాణిజ్య పన్నుల సర్వీసు, ఆంధ్ర సహకార సర్వీసు, ఆంధ్ర ఫారెస్టు సర్వీసు, ఆంధ్ర పోలీసు సర్వీసు, ఆంధ్ర రవాణా సర్వీసు, ఆంధ్ర రెజిస్ట్రేషను సర్వీసు, ఆంధ్ర హిం. మ. మరియు ధ. సం. (పరి.) సర్వీసు, ఆంధ్ర విద్యా సంబంధమైన సర్వీసు మొదలైనవి.

"ఆంధ్ర ప్రదేశ్ విద్యాశాఖ సంబంధమైన ఉద్యోగాలలో, జిల్లా విద్యాధికారుల శిక్షణా కళాశాలల ముస్నగువాటి అధ్యాపకులకు సంబంధించినంతవరకు, ఆంధ్ర ప్రదేశ్ విద్యా సంబంధ సర్వీసు ప్రత్యేక నిబంధనల క్రింద, జిల్లా విద్యాధికార్లు మున్నగు తరగతిలో 50 శాతం భాయపుకే ఖాళీలు సరాసరి నియమకాలకు కేటాయించబడతాయి. రాష్ట్ర సర్వీసులలో ఉన్నతశ్రేణి ఉద్యోగాలకు, ఉన్నత విద్యార్హతలు, ప్రతిభగల యువకులను అకర్షించడమే యీసరాసరి నియమకాల ఉద్దేశం. ఆంధ్రప్రదేశ్ విద్యా సంబంధసర్వీసులో జిల్లావిద్యాధికార్లు మున్నగు తరగతిలో సరాసరి నియామకానికై రాష్ట్రంలో ఏదైనా ఒక విశ్వవిద్యాలయంలో ఎం. ఎ., బి. ఎ. (ఆనర్సు), ఎం. ఎస్‌సి., బి. ఎస్‌సి. (ఆనర్సు) ప్రథమలేక ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత అర్హతగా నిర్ణయించబడినది. ప్రొమోషనులు ఇచ్చేవారికి నిర్ణయింపబడిన అర్హతలకంటె—అనగా ఉపాధ్యాయ పట్టంతోపాటు రాష్ట్రంలోని విశ్వవిద్యాలయ పట్టం—కంటె ఇవి ఉన్నతమైనవి. జిల్లా విద్యాధికార్లుగా సరాసరి నియమించబడినవారు, వారి ఎన్నిక సమయంలో ఉపాధ్యాయ పట్టంలేని పక్షంలో 9 నెలలపాటు ఉపాధ్యాయ శిక్షణనూ, ఆరు నెలలపాటు పరిపాలనా సంబంధమైన శిక్షణనూ పొందవలసి ఉంటుంది. ఆటు పిమ్మటనే వారు పనిలో నియమించబడతారు.

"1956 నవంబరులో ఆంధ్రప్రదేశ్ ఏర్పడిననాటినుంచి క్రింది ఉద్యోగుల ప్రొమోషన్లద్వారా ఆంధ్రప్రదేశ్ విద్యాసంబంధ సర్వీసులో, జిల్లా విద్యాధికార్లు, ప్రధానోపాధ్యాయులు మున్నగు తరగతిలో దాదాపు 150 తాత్కాలిక నియమాలు చేయబడినవి. కాని, ఇదేకాలంలో, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీసు కమీషను, జిల్లా విద్యాధికార్లు, శిక్షణా కళాశాలల్లో అధ్యాపకుల ఉద్యోగాలలో సరాసరి నియామకానికై 16 మంది అభ్యర్థులను—1వ గ్రేడులో 4, 2వ గ్రేడులో 12— మాత్రమే ఎన్నిక చేసినది. ఈ విధంగా సరాసరి నియమాకంవల్ల, ప్రభుత్వ శాఖలో పనిచేస్తున్న అధికార్ల సమంజసమైన ప్రొమోషన్ అవకాశాలు పరిమితం కాలేదు."

సహాయసమస్య పరిశీలన

వృత్తిపనివారల శిక్షణసౌకర్యాలవిస్తరణ పథకాన్ని, అనుసరించి విజయనగరంలోని పి.ఎల్.ఎన్. పారిశ్రామికశిక్షణ సహకార సంస్థకు ప్రభుత్వ సహాయాన్ని అందజేసి తద్వారా ప్రయివేటు రంగంలోఉన్న ఈ సంస్థలను అభివృద్ధిపరిచే సమస్యను ప్రభుత్వం పరిశీలించింది. ఈ సంస్థ కార్యకలాపాలను, శిక్షణ సౌకర్యాలను తనిఖీచేశారు. ఈ సంస్థ అసంతృప్తికరంగా పనిచేస్తున్న కారణంగా ప్రస్తుతం సహాయాన్ని ఇవ్వకూడదని ప్రభుత్వం భావించింది.

కుటుంబ పింఛను నిధి

1—6—1951వ తేదీకి ముందు మరణించిన కుటుంబపింఛను నిధి పాలసీదార్ల వారసులు తమక్లెయిములను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత భీమాశాఖ కార్యదర్శివద్ద 1962 అక్టోబరు 31వ తేదీ లోపల నమోదు చేయించుకోవాలనీ, అలా చేయని పక్షంలో వారి క్లెయిములు పరిశీలించబడవనీ ప్రభుత్వం తెలియజేస్తున్నది. 1—6—1951కి ముందు నాలుగవతరగతి ఉద్యోగులుగావుండి ఆ తర్వాత మరణించిన పాలసీదార్ల వారసులకుకూడా ఇది వర్తిస్తుంది. 1—6—1951 కి ముందు నాలుగవ తరగతి ఉద్యోగులుగాలేని పాలసీదార్లు 1962 అక్టోబర్ 31వ తేదీకి ముందుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జీవిత భీమాశాఖ కార్యదర్శిని—తమ పాలసీలను ఇంకా అమలులో వుంచుకోగోరే పక్షంలో వారు తమ ప్రీమియంను చెల్లించే విషయంలో తగు నిబంధనలను పొందడానికి—సంప్రదించాలి.

శాసనమండలి ఎన్నికలు

శాసనమండలి ఎన్నికలకు పోటీచేసే అభ్యర్థులు ఈ ఎన్ని

కల సందర్భంగా జరిగే ఖర్చుల వివరాలను ప్రభుత్వ రిటర్నింగ్ అధికారికి అందజేయాలా అవి అభ్యర్థులు తెలుపగోరు తున్నందున శాసనమండలికి సంబంధించిన ఎన్నికల ఖర్చులవివరాలను అధికారులకు అందచేసే విషయంలో ఎట్టి చట్టబద్ధమైన నియమావళులు లేవని ప్రభుత్వం తెలియచేసింది.

హరిజనులకు ప్రాతినిధ్యం

హరిజనుల భయాన్ని తొలగించడానికి, అస్పృశ్యతను పూర్తిగా నిర్మూలించడానికై మున్ముందు రాష్ట్రంలోని దేవాలయాలకు ధర్మకర్తల సంఘాన్ని ఏర్పాటు చేసేటప్పుడు ఆ సంఘంలో కనీసం ఒక హరిజనుని నియమించాలని ప్రభుత్వం ఆదేశించింది. అలాగే దేవాలయాలకు ధర్మకర్తల సంఘాన్ని ఏర్పాటు చేసేటప్పుడు ఒక సభ్యురాల్ని కూడా మున్ముందు నియమిస్తారు.

వినోదపు పన్ను మినహాయింపు

ఆమోదింపబడి నమోదు అయిన సభలు, నాటక సంఘాలు ప్రదర్శించే నాటక కార్యక్రమాలకు వినోదపు పన్ను మినహాయింపును మద్రాసు వినోదపు పన్నుల చట్టం క్రింద 1–4–1962 నుంచి మరొక సంవత్సరంపాటు పొడిగిస్తున్నట్లు ప్రభుత్వం ఆదేశించింది. ఈ మినహాయింపు నృత్యనాటకాలకు కూడా వర్తిస్తుంది.

"యాదవ" కులం

అన్ని ప్రభుత్వ ప్రచురణలలోను, ఉత్తర ప్రత్యుత్తరాలలోను, "గొల్ల", "ఇదవన్", "గోపి", "గోప" లేక "గౌడ" అనే పదాలకు బదులు "యాదవ" పదాన్ని వాడాలని ప్రభుత్వం ఆదేశించింది.

రివెన్యూశాఖ పరీక్షలకు సాధారణ పాఠ్య ప్రణాళిక

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడకముందు రెండు ప్రాంతాలలోని రివెన్యూశాఖ అధికారులు. గుమాస్తాలు, ఆయా ప్రాంతాలలో అమలులో ఉన్న నిబంధనల ప్రకారం వివిధ శాఖల పరీక్షలలో ఉత్తీర్ణులు కావలసి ఉన్నది. కాని ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తానికి రివెన్యూశాఖకు డిపార్టుమెంటల్ పరీక్షలను నిర్ణయిస్తూ ప్రభుత్వం ఆదేశిస్తున్నది. (అ) రివెన్యూ పరీక్ష–పార్టు I, II, III (ఆ) సివిల్ జ్యుడిషియల్ పరీక్షలు–పార్టు I, (ఇ) క్రిమినల్ జ్యుడిషియల్ పరీక్షలు–పార్టు I, II (ఈ) సబార్డినేటు అధికారులకు అకౌంటు పరీక్ష–పార్టు 1. భవిష్యత్‌లో రివెన్యూశాఖ అధికారులు, గుమాస్తాలు అకౌంటు పరీక్ష రెండవ పార్టులో ఉత్తీర్ణులు కానవసరం లేదు. రాష్ట్రంలో పలు ప్రాంతాలలో అమలులో వున్న నిబంధనలను, ఉత్తర్వులను రద్దు చేస్తూ యీ ఉత్తర్వు 1962 జులై 1వ తేదీ నుంచి అమలులోకి వస్తుంది.

ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డు

ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డులో సభ్యుడైన డాక్టర్ సయ్యద్ అఖ్తార్ అహమ్మద్‌ను జులై 12వ తేదీనుంచి బోర్డునుంచి తొలగించారు. జనాభాలెక్కలు, గణాంకశాఖ డైరక్టరుగా పదవీవిరమణ చేసిన శ్రీ మజర్ హుస్సేన్‌ను డాక్టర్ సయ్యద్ అఖ్తార్ అహమ్మద్ స్థానంలో సభ్యునిగా నియమించారు. డాక్టర్ సయ్యద్ అఖ్తార్ పూర్తి సభ్యత్వకాలం వరకు శ్రీ మజర్ హుస్సేన్ బోర్డులో సభ్యులుగా ఉంటారు.

— "ఈ సంచికలోని "రాయలసీమ" వ్యాసం ఆలిండియా రేడియో హైదరాబాదు కేంద్రంవారి సౌజన్యంతో ప్రచురితమైనది." —

పారిశ్రామికాభివృద్ధి

శాసన సభలో మంత్రి శ్రీ లక్ష్మీనరసయ్య విశదీకరణ

"చక్కెర, సిమెంటు, వస్త్రాల వంటి భారీ పరిశ్రమల స్థాపనను ప్రోత్సహించడమే గాకుండా, అనేక ఉపపరిశ్రమలకు చేయూత నివ్వగల భారీరకం ఇంజనీరింగ్, తేలికరకం ఇంజనీరింగ్, రసాయనిక రంగాలలోని కీలక పరిశ్రమల అభివృద్ధి పట్ల కూడా ప్రభుత్వం శ్రద్ధవహిస్తున్నది. భారీ, మధ్యరకం పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారానే గాకుండా, ఎక్కువ పెట్టుబడి, ప్రత్యేక నిపుణత అవసరంలేకుండానే తక్కువ వ్యవధిలో పారిశ్రామికార్థిక ప్రయోజనాలను పొంద కలిగే లఘుపరిశ్రమలను కూడా నిర్వహించగల ప్రైవేటు పారిశ్రామికుల ద్వారా గొప్ప అభ్యుదయం సాధించవచ్చుననే అభిప్రాయంకూడా ప్రభుత్వానికి వుంది." అని రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి డాక్టర్ ఎం. ఎన్. లక్ష్మీనరసయ్య, 1962 జూలై 4వ తేదీన ఆంధ్రప్రదేశ్ శాసనసభలో పరిశ్రమలశాఖ గ్రాంట్లకు డిమాండును ప్రతిపాదిస్తూ అన్నారు.

అన్ని పరిశ్రమ రంగాల అభివృద్ధికీ, రూ. 483.60 లక్షలు ఖర్చయ్యే పథకాలను 1962–63 వ సంవత్సరానికి ప్రభుత్వం రూపొందించింది. ఆంధ్ర ప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధి సంస్థ, లఘుపరిశ్రమల అభివృద్ధి సంస్థ, గనుల అభివృద్ధి సంస్థల స్థాపనను గురించీ, ప్రస్తుత పరిశ్రమల పరిస్థితిని గురించీ ప్రస్తావించిన తరువాత ప్రభుత్వ పరిశీలనలోనున్న కొన్ని ప్రధాన పరిశ్రమల విషయమై చెప్తూ మంత్రి ఇలా అన్నారు:

రాష్ట్రంలో ఇనుము, బొగ్గు, సున్నపురాయి వనరులు విస్తారంగా వున్నాయి కాబట్టి ప్రభుత్వం, ఒక చిన్నతరహా దుక్క ఇనుము కార్మాగారాన్ని రాష్ట్రంలో నెలకొల్పవలసిందని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. భారత ప్రభుత్వం నియమించిన సాంకేతిక సంఘమువారు "లోషాఫ్టు" పద్ధతి ప్రాతిపదికపై ఒక దుక్క ఇనుము కర్మాగారాన్ని నెలకొల్పవచ్చునని అభిప్రాయపడ్డారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థిక విషయాలను ఇప్పుడు వారు పరిశీలిస్తున్నారు. ఈ లోగా ప్రైవేటు రంగంలో దుక్క ఇనుము కర్మాగారాన్ని నెలకొల్పుకోడానికై లైసెన్సులు ఇవ్వగోరుతూ వచ్చిన కొన్ని దరఖాస్తులను పరిశీలనార్థం భారత ప్రభుత్వానికి అందజేయడం జరిగింది. మనం సిఫార్సు చేసిన వాటిలో ఒక సంస్థకు లైసెన్సు లభించిందనీ, మరొక దానికి 1,00,000 టన్నుల యూనిటు స్థాపన విషయమై ఆలోచించబడుతున్నట్లు సమాధానం వచ్చిందని తెలిసింది.

లోటెంపరేచర్ కార్బొనైజేషన్ యంత్రాగారం

రోజుకు 800 టన్నుల లోటెంపరేచర్ కార్బొనైజేషను బొగ్గు ఉత్పత్తి కొరకు ఒక లోటెంపరేచర్ కార్బొనైజేషను యంత్రాగారం స్థాపనకు సంబంధించిన పథకాన్ని పరిశీలించిన పిమ్మట ఇటువంటి యంత్రగారాన్ని ప్రైవేరంగంలో స్థాపించడానికి అనుమతించడం ఉచితంగా వుంటుందని భావించబడింది. ఒక ప్రైవేటు సంస్థనుంచి అందిన దరఖాస్తు భారత ప్రభుత్వానికి పంపించబడింది. దానిని వారు శ్రద్ధగా పరిశీలిస్తున్నారు.

షక్కర్‌నగర్‌లో చెరకు పిప్పినుంచి కాగితము తయారీకి సంబంధించిన పథకం:— ఈ కర్మాగారాన్ని స్థాపించేందుకై ఒక ప్రైవేటు పార్టీ నుంచి రాష్ట్రప్రభుత్వానికి దరఖాస్తు రాగా దానిని

ప్రభుత్వం కేంద్రానికి పంపించింది. కేంద్రప్రభుత్వం ఇప్పుడా దరఖాస్తును శ్రద్ధగా పరిశీలిస్తున్నది. నిజాం చక్కెర ఫ్యాక్టరీ (లిమిటెడ్) కూడా ఇటువంటి ఫ్యాక్టరీ నొకదానిని తన అనుబంధ సంస్థగా స్థాపించుకోవాలనుకుంటున్నది. దీని స్థాపన జరిగిన మీదట అది రోజుకు 100 టన్నుల కాగితాన్ని ఉత్పత్తి చేయగలుగుతుంది. నిజాం చక్కెర ఫ్యాక్టరీనుంచి లభించే చెరకు పిప్పిని ఈ కర్మాగారం వినియోగించుకుంటుంది.

సమీకృత గాజు కర్మాగారం

గాజు తయారీకి ఉపయోగించే ముడివస్తువులు ఇక్కడ సమృద్ధిగా లభిస్తాయి కాబట్టి వాటివల్ల పూర్తి ప్రయోజనం పొందే తలంపుతో రాష్ట్ర ప్రభుత్వం ఇక్కడి పరిస్థితులను పరిశీలించే నిమిత్తం హంగరీ నిపుణుల బృందాన్నొక దానిని ఆహ్వానించింది. వీరు తమ నివేదికను సమర్పించారు. హైద్రాబాదు సమీపంలో సమీకృత గాజు కర్మాగారం స్థాపనకు సంబంధించిన ఒక పథకాన్ని ఈ నిపుణులు తమ నివేదికలో సూచించారు. ఈ నివేదిక రాష్ట్ర అధికార్ల పరిశీలనలో వుంది. ఈ లోగా ఆంధ్రప్రదేశ్ పారిశ్రామికాభివృద్ధి సంస్థ ఈ కార్మాగారం స్థాపనకు లైసెన్సు ఇవ్వగోరుతూ భారత ప్రభుత్వానికి దరఖాస్తు పెట్టుకున్నది. షీట్ గ్లాసు, కట్ గ్లాసు, వెళ్లే వీరు వేరే మొదలైనవాటి తయారీ సమీకృత గాజు కార్మాగారం ప్రాజెక్టుక్రింద ఉద్దేశించబడింది. దీనిని స్థాపించిన తరువాత భారతదేశం మొత్తంలో ఇదే ఇటువంటి మొట్టమొదటి కర్మాగారం కాగలదు.

లఘుపరిశ్రమలు

దేశంలోని భారీ, లఘు, గ్రామీణ పరిశ్రమల సమన్విత వృద్ధి ప్రణాళికలో లఘుపరిశ్రమల అభివృద్ధి ఒకభాగమై వున్నది. భారతప్రభుత్వ పారిశ్రామిక విధాన తీర్మానం ప్రకారం లఘుపరిశ్రమల రంగంలో అభివృద్ధిని ప్రాథమికంగా ప్రైవేటురంగానికి విడిచిపెట్టడం జరిగింది. అయితే ఈ పరిశ్రమల అభివృద్ధికి ప్రోత్సాహాన్ని, సలహాలను ఇవ్వడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ అనేక చర్యలు తీసుకుంటున్నాయి. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం గైకొంటున్న చర్యలలో దిగువ వాటిని ఉదహరించవచ్చు:—

(1) శిక్షణ కేంద్రాలు, పరిశోధన, సర్వీసింగ్ కేంద్రాలను నెలకొల్పడం, ప్రైవేటు రంగంలో లఘుపరిశ్రమల అభివృద్ధికి ప్రోత్సాహాన్నిచ్చే నిమిత్తం శాఖా పరంగా పైలట్ పథకాలను నిర్వహించడం.

(2) పరిశ్రమలను నెలకొల్పుకోడానికి వీలుగా ప్రైవేటు పారిశ్రామిక వేత్తలకు సాంకేతిక, ఆర్థిక తదితరమైన సౌకర్యాలు కలుగజేయడం.

(3) పరిశ్రమలు నెలకొల్పదలచిన వారికి ఫ్యాక్టరీకి అవసరమైన స్థలవసతినీ, ఇతర సదుపాయాలను సమకూర్చడం ద్వారా ప్రైవేటు రంగంలో లఘు పరిశ్రమలను ప్రోత్సహించే నిమిత్తం పారిశ్రామిక వాటికలను నెలకొల్పడం.

ప్రభుత్వం ఇప్పటి వరకు సనత్ నగర్, విశాఖపట్నం, విజయవాడ, సామర్లకోట, నంద్యాల, వరంగల్, కడప, చందూలాల్ బారాదరీ (హైద్రాబాదు)లలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం ఎనిమిది పారిశ్రామిక వాటికలను నెలకొల్పింది. ఫ్యాక్టరీ వసతి కేటాయింపు కొరకు సనత్‌నగర్ పారిశ్రామిక వాటికల్లో మంచి ప్రోత్సాహం లభించినందువల్ల ప్రభుత్వం అక్కడ 1959—60, 1960—61 వ సంవత్సరాలలో విస్తరణ కార్యక్రమాలు మంజూరుచేసింది. వరంగల్, విజయవాడ, విశాఖపట్నంలలో కూడా విస్తరణ కార్యక్రమాలు మంజూరయ్యాయి. పోతే మహబూబ్ నగరం, కరీంనగరం, నిర్మల్‌లో కూడా ఒక్కొక్కటి చొప్పున మరో మూడు పారిశ్రామిక వాటికలను మంజూరు జేయడానికి నిశ్చయించడం జరిగింది. గత సంవత్సరం, పారిశ్రామిక వాటికల స్థాపన, విస్తరణలకొరకు రూ. 39.69 లక్షలు ఖర్చుపెట్టడం జరిగింది. 1962—63 వ సంవత్సరానికి రూ. 50.70 లక్షల మొత్తం కేటాయించబడింది. తెలంగాణా నిధులనుంచి మరో రూ. 30.00 లక్షలు లభ్యమవుతాయి.

ఎనిమిది సాధారణ రకపు పారిశ్రామిక వాటికల్లో ఇంతవరకు 189 ఫ్యాక్టరీ భవనాలు నిర్మితమయ్యాయి. మరో 42 భవనాల నిర్మాణం సాగుతున్నది. నిర్మాణం పూర్తయిన ఫ్యాక్టరీ భవనాల్లో చాలా వాటిని పారిశ్రామిక వేత్తలకు కేటాయించడం, వారు వాటిలో ప్రవేశించడం జరిగింది. ఇతర సాధారణ రకపు వాటికల్లోనూ, సహాయం పొందేటటువంటి వాటికల్లోను ఫ్యాక్టరీ భవనాల నిర్మాణం చురుగ్గా సాగుతున్నది. పారిశ్రామిక వాటికల కార్యక్రమం క్రింద లభించే సౌకర్యాల పట్ల ఆకర్షణ పెరిగిన ఫలితంగా ఇలాంటి వాటికలను ఇతోధికంగా స్థాపించవలసిందిగా రాష్ట్రం నలుమూలలనుంచి అనేకంగా అభ్యర్థనలు అందుతున్నాయి.

అయితే ప్రభుత్వానికిగల పరిమితమైన వనరుల దృష్ట్యా అనేక ప్రదేశాలలో ఈ పథకాన్ని చేపట్టడం సాధ్యంకాదు. అందుచేత సహాయం పొందేటటువంటి ప్రైవేటు పారిశ్రామిక వాటికలను నెలకొల్పడానికై ఒక కొత్త పథకాన్ని రూపొందించడం జరిగింది. వీటిపై ప్రభుత్వం అంతగా ఖర్చుచెయ్యవలసిన అవసరంవుండదు. ఈ పథకం క్రింద వాటికను ప్రభుత్వమూ, వాటికలో పరిశ్రమలు స్థాపించబోయే పారిశ్రామిక వేత్తా కలిసి ఉమ్మడిగా నిర్మిస్తారు. ప్రభుత్వం భూమినికొని, నీటిసరఫరా, భూగర్భ కాలువలు, రోడ్లు మొదలైన సామాన్యసౌకర్యాలు కలిగిస్తుంది, పిమ్మట ఈ స్థలాలను వివిధ ఫ్యాక్టరీల నిర్మాణం నిమిత్తం పారిశ్రామిక వేత్తలకు కౌలుకు ఇస్తుంది. ఒక్కొక్క సహాయక ప్రైవేటు పారిశ్రామిక వాటిక అంచనా ఖరీదు రూ. 2.00 లక్షలు. ఇంతవరకు ప్రభుత్వం రాష్ట్రంలో 18 స యక పారిశ్రామిక వాటికలను స్థాపించడానికి మంజూరీ ఇచ్చింది.

గ్రామీణ పరిశ్రమలకు సహాయం చేసే తలంపుతో ప్రభుత్వం, నిజామాబాదు జిల్లాలోని కిసాన్ నగర్‌లోనూ, అనంతపురం జిల్లాలోని సద్దలపల్లెలోనూ రెండు గ్రామీణ పారిశ్రామిక వాటికలను నెలకొల్పడానికి చర్యలు తీసుకుంటున్నది. 1962_63 వ సంవత్సరానికి ఈ పథకాలకు లక్ష రూపాయలు కేటాయించబడినవి. తృతీయ ప్రణాళికా కాలంలో ప్రతిజిల్లాలోనూ గ్రామీణ పారిశ్రామిక వాటికలను నెలకొల్పడానికి కూడా ప్రతిపాదించడం జరిగింది.

ఖాదీ, గ్రామీణ పరిశ్రమలు

ఆంధ్రప్రదేశ్ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల బోర్డు (సవరణ) చట్టానికి 1962 ఫిబ్రవరి 7వ తేదీన గవర్నరు ఆమోదం లభించింది. కొత్త శాసనం ద్వారా సవరించబడిన ప్రధాన చట్టాన్ననుసరించి ఆంధ్రప్రదేశ్ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల బోర్డును పునర్నిర్మించడం జరిగింది. 15 జిల్లాలలో జిల్లా సిబ్బందిని నియమించాలనే ప్రతిపాదనకూడా పరిశీలనలో వుంది. ఇందుకు ఖర్చుకాగల రూ. 2,03,000 లలో సగం మొత్తాన్ని ఖాదీకమిషను భరించవలసి వుంటుంది.

చర్మకార మండలి

1961 అక్టోబరులో ప్రభుత్వం డా. వై. నాయుడమ్మ అధ్యక్షతన తాత్కాలిక చర్మకార మండలి (అడ్‌హాక్ లెదర్ బోర్డు) ని నియమించింది. తృతీయ ప్రణాళికా కాలంలో ఈ పరిశ్రమాభివృద్ధికి ఒక కోటి రూపాయలు కేటాయించబడినాయి చట్టబద్ధమైన చర్మకార మండలి స్థాపనకు ముసాయిదాబిల్లు సిద్ధం చేయబడుతున్నది. భారత ప్రభుత్వ దేశ వ్యవహారాల మంత్రిత్వ శాఖవారి అభిప్రాయాల దృష్ట్యా చట్టబద్ధమైన మండలిని స్థాపించడానికి శాసనం చేసే విషయం పరిశీలించబడుతున్నది.

చర్మపరిశ్రమాభివృద్ధి. కొరకు హైదరాబాదు, విజయవాడలలో రెండు కేంద్ర సంఘాలను రిజిస్టరు చేయడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ రెండు సంఘాలూ రిజిస్టరు కావడం కూడా జరిగింది. వీటికి నిధులను లభింపజేసే విషయమై పరిశీలన జరుగుతున్నది.

రాజనాథ్ సంఘం సిఫార్సులను పురస్కరించుకొని, వడ్రంగం, కమ్మరం మొదలైన పనుల్లో శిక్షణ ఇచ్చే నిమిత్తం 13 జిల్లాలలో ప్రాంతీయ గ్రామీణ పనివారల శిక్షణా కేంద్రాలను పదమూడింటిని నెలకొల్పడం జరిగింది. కొత్త కేంద్రాలను మంజూరు చేయలేదు.

కొబ్బరిపీచు పరిశ్రమ

రాష్ట్రంలో కొబ్బరిచెట్లు విస్తృతంగా పెంచబడే కోస్తా జిల్లాలలో కొబ్బరిపీచు పరిశ్రమను అభివృద్ధి పరుస్తున్నారు. కోస్తా జిల్లాలైన శ్రీకాకుళం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, నెల్లూరులలో 92,200 ఎకరాల విస్తీర్ణంలో కొబ్బరితోటలు వున్నాయి. పైజిల్లాలలో కొన్నిప్రదేశాలలో కొబ్బరిపీచును చెమ్మలో వుంచడానికి సౌకర్యాలువున్నాయి. కాబట్టి అక్కడ కొబ్బరిపీచు పరిశ్రమను అభివృద్ధి పరచడానికి మిక్కుటంగా అవకాశాలు కలవు. ఈ పరిశ్రమాభివృద్ధికి 1961_62 వ సంవత్సరంలో రూ. 4 లక్షలు కేటాయించబడినాయి. బారువ, మొగలతుర్రు, కొమరగిరిపట్నం, అంతర్వేది, తాళ్లరేవులలో రాష్ట్ర ప్రభుత్వం ఉత్పత్తి_శిక్షణ కేంద్రాలను తెరిచింది. పీచు తియ్యడంలోనూ, తాడు పేనడంలోనూ, పీచు చాపలు, బ్రష్ చాపలు, చీపుర్లు మొదలైన వాటిని తయారు చేయడంలోను ప్రతి సంవత్సరం అనేక మంది అభ్యర్థులు శిక్షణ పొందుతున్నారు. 1961_62 వ సంవత్సరంలో మంజూరు చేసిన పథకాలన్నింటినీ 1962_63 వ సంవత్సరంలో కూడా కొనసాగించడానికి ప్రతిపాదించబడింది. కొబ్బరి పీచు వస్తువుల ఫ్యాక్టరీని నెలకొల్పే ఒకే ఒక కొత్తపథకాన్ని అమలు పరచడానికి ప్రతిపాదించబడింది.

చేనేత పరిశ్రమ

చేనేత పరిశ్రమకు 1962-63 వ సంవత్సరానికి రూ. 67.71 లక్షలు కేటాయించబడినవి. ఈ మొత్తంలో గ్రాంటు రూ. 48.70 లక్షలు. కాగా ఋణం రూ. 19.01 లక్షలు. ఇది మూడవ పంచవర్ష ప్రణాళిక రెండవ సంవత్సరం. ఈ ప్రణాళికలో చేనేత పరిశ్రమాభివృద్ధికి రూ. 540 లక్షలు ఖర్చు చెయ్యడానికి తలపెటబడింది. కాగా రెండవ పంచవర్ష ప్రణాళికలో రూ. 437.86 లక్షలు ఖర్చు పెట్టడం జరిగింది. క్రిందటి సంవత్సరానికి రూ. 69.38 లక్షల కేటాయింపు జరిగింది.

రాష్ట్రంలో మొత్తం 823 చేనేతపనివారల సహకార సంఘాలు వున్నాయి. వీటిలో 688 ఆంధ్రలోనూ, 135 తెలంగాణాలోనూ, పనిచేస్తున్నాయి. ఇవిగాక ఆంధ్రప్రాంతంలో 3[illegible] ఉన్ని సహకార సంఘాలు, 5 పట్టు సహకార సంఘాలు, తెలంగాణా ప్రాంతంలో 65 ఉన్ని సహకార సంఘాలు, 17 పట్టు సహకార సంఘాలు కలవు. రాష్ట్రంలో సుమారు 4.50 లక్షల మగ్గాలున్నాయి. పోగా రిజిస్టరైన మగ్గాల సంఖ్య 4.1 లక్షలు. తృతీయ ప్రణాళికా కాలంలో మరో 35000 మగ్గాలను సహకార పరిధిలోనికి తేవడం జరుగుతుంది.

సహకార నూలు మిల్లులు

ప్రస్తుతం రాష్ట్రంలో మూడు సహకార నూలు మిల్లులున్నాయి. గుంతకల్లులో స్థాపించిన ఆంధ్ర సహకార నూలుమిల్లు 1954 వ సంవత్సరం నుంచి ఉత్పత్తి సాగిస్తున్నది. హైద్రాబాదులోని నేత సహకార నూలుమిల్లును ఇటీవలే ప్రారంభించారు. చీరాలలోని సహకార నూలుమిల్లు బహుశా 1962వ సంవత్సరానికి ఉత్పత్తి ప్రారంభిస్తుంది.

సహకార నూలుమిల్లులకు పెట్టుబడికై 1962-63వ సంవత్సరానికి రూ. 5 లక్షలు కేటాయించబడినాయి. ఈ మిల్లులన్నీ కూడా ఉత్పత్తి సాగించిననాడు ప్రాథమిక చేనేత పనివారల సహకార సంఘాలకు కావల్సిన నూలును చాలా వరకు సరఫరా చేయగలుగుతాయి. ఈ పథకాలు విజయవంతమైనందువల్ల ఇటువంటి సహకార నూలు మిల్లులను స్థాపించడానికి అనేక ప్రతిపాదనాలు అందాయి. రాజమండ్రిలో సహకార నూలుమిల్లును నెలకొల్పే విషయమై ప్రభుత్వం శ్రద్ధగా పరిశీలిస్తున్నది.


సహకార చక్కెర ఫ్యాక్టరీలు

రెండవ పంచవర్ష ప్రణాళిక క్రింద బకాయి పథకాలుగా, ఆముదాలవలస, చోడవరం, పాలకొల్లు, చిత్తూరు, నిజామాబాదులలో, ఒక్కొక్క దానికి రూ. 145.00 లక్షల అంచనా వ్యయంతో అయిదు సహకార చక్కెర ఫ్యాక్టరీలు స్థాపించబడుతున్నాయి. ప్రతి సహకార చక్కెర ఫ్యాక్టరీ రోజు 1000 టన్నుల చెరకును ఆడగలుగుతుంది.

ఆముదాల వలసలోని ఫ్యాక్టరీని 1961-62 లో చెరకు ఆడే ఋతువులో పరీక్షార్థం పనిచేయించడం జరిగింది. మిగతా ఫ్యాక్టరీల స్థాపన వివిధ దశల్లో వుంది. నిజామాబాద్‌లోని ఫ్యాక్టరీకి సంబంధించిన పని ఇంకా ప్రారంభించలేదు. చోడవరం, చిత్తూరు, పాలకొల్లు ఫ్యాక్టరీలకు అవసరమైన యంత్ర సామగ్రి సరఫరాలలో ఆలస్యం జరిగివుండకపోయినట్లైతే ఆ ఫ్యాక్టరీలు క్రిందటి చెరకు ఆడే ఋతువులోనే పరీక్షార్థం నడపబడి వుండేవి. 1962-63 చెరకుఆడే ఋతువులో ఇవి పని ప్రారంభిస్తాయని ఆశించబడుతున్నది.

పట్టు పురుగుల పెంపకం

మల్బరీ, టస్సార్, ఎరి-ఈ మూడింటిలోనూ ప్రభుత్వం పట్టు పురుగుల పెంపకపు పరిశ్రమ అభివృద్ధికి ప్రోత్సాహాన్నిస్తున్నది. క్రిందటి సంవత్సరం మంజూరై అమలు పరచబడిన పథకాలను ఈ ఏడాది కూడా కొనసాగించడానికి ప్రతిపాదించబడింది. ఇందుకుగాను బడ్జెటులో రూ. 5,75,300 లు కేటాయించడం జరిగింది. రెండవ పంచవర్ష ప్రణాళికా కాలంలో పట్టుపురుగుల పెంపకం పరిశ్రమపై రూ. 14 లక్షలు ఖర్చు చేయడం జరిగింది. కాగా మూడవ ప్రణాళికలో రూ. 15 లక్షలు కేటాయించబడినాయి.



ప్రగతి పథంలో

(జిల్లాలనుంచి అందిన వివిధ అభివృద్ధి కార్యక్రమాలను గురించిన సంక్షిప్త వార్తలు)

ఆదిలాబాదు

మధ్యాహ్న భోజన పథకం

నిర్మల్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో గత అక్టోబరు నెలనుండి ఉచిత మధ్యాహ్న భోజన పథకాన్ని విజయవంతంగా అమలు పరుస్తున్నారు. ప్రతిరోజూ 50 మంది బీద విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తున్నారు. స్థానిక వదాన్యుల విరాళాలతో యీ పథకం ప్రారంభించారు.

అనంతపురం

ధర్మవరంలో వస్తుప్రదర్శనం

ధర్మవరంలో జులై 5వ తేదీనుండి 11వ తేదీవరకు 'నవ భారత నిర్మాణం' వస్తు ప్రదర్శనను నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ పంచవర్ష ప్రణాళికల ద్వారా సాధించిన ప్రగతిని, ఆసక్తి కలిగించే నమోనాల ద్వారా ప్రదర్శించారు. ప్రజలలో ప్రణాళికా విషయాలను వ్యాప్తిచేయడానికే యీ ప్రదర్శన నిర్వహింపబడింది. మూడవ ప్రణాళిక లక్ష్యాలను తెల్పే నమోనాలను గూడా యిందులో ప్రదర్శించారు.

చిత్తూరు

రసాయనిక ఎరువులు

1962 జూన్ నెలలో నగరి పంచాయతీ సమితిలోని పురోగాములైన రైతులు 597 మణుగుల రసాయనిక యెరువులను వాడారు.

గుంటూరు

మాధ్యమిక పాఠశాల ప్రారంభం

బాపట్ల సమీపంలోని నరసాయెపాలెంలో జులై 6వ తేదీ నుండి ఒక మాధ్యమిక పాఠశాలను ప్రారంభించారు. శ్రీ పి. అంకమ్మ యీ పాఠశాల భవనాన్ని నిర్మించారు.

హైద్రాబాదు

మంజీరా బ్యారేజీ

హైద్రాబాదుకు 40 మైళ్ళ దూరంలో కలాబ్గర్ వద్ద రూ. 3.75 కోట్ల ఖర్చుతో నిర్మింపబడే మంజీరా బ్యారేజికి జులై 6వ తేదీన ముఖ్యమంత్రి పునాదిరాయి వేశారు. యీ పథకం మొదటి దశ 1963 అక్టోబరు నాటికి పూర్తి అయి, జంటనగరాలకు ప్రతిరోజూ 20 మిలియను గ్యాలనుల నీరు సరఫరా జరుగుతుంది.

కరీంనగరం

విద్యుచ్ఛక్తి విస్తరణ

సుల్తానాబాదు తాలూకాలోని రామగుండం గ్రామంలో 20 గృహావసరాలకు, 20 వీధి దీపాలకు విద్యుచ్ఛక్తిని సరఫరా చేసే ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదించి, దీని ఖర్చుకై రూ. 11,900.00 మంజూరు చేసింది.

ఖమ్మం

మార్కెటు నిర్మాణం

మార్కెటు నిర్మాణానికి వైరా పంచాయతీకి దీర్ఘకాలిక ఋణంగా రూ. 5000.00 లను ప్రభుత్వం మంజూరు చేసింది. వరి పంటకు కేంద్రంగా ఉన్న వైరాలో చిరకాలంగా మార్కెటుకొఱత ఉండేది.

కృష్ణా

స్కౌటు శిక్షణ శిబిరం

1962 జులైలో మచిలీపట్నంలో స్కౌటు మాస్టర్లు, గైడ్ కెప్టెనుల శిక్షణ శిబిరాన్ని పది రోజుల పాటు నిర్వహించారు.

మహబూబునగరం

ఐజాలో పూర్వవిస్తరణ బ్లాకు ప్రారంభం

గద్వాలకు 18 మైళ్ళ దూరంలో ఉన్న ఐజాలో పూర్వ విస్తరణ బ్లాకుకు, రివెన్యూ మంత్రి శ్రీ యన్. రామచంద్రారెడ్డి 1962 జులై 8వ తేదీన ప్రారంభోత్సవం చేశారు,

వన మహోత్సవం

జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ కె. రాంచంద్రారెడ్డి, జులై 10వ తేదీన కలెక్టరు కార్యాలయంలో మామిడి మొక్కను నాటి, వన మహోత్సవానికి ప్రారంభోత్సవం చేశారు.

9 వ తరగతి ప్రారంభం

ధన్వాడ పరిషత్తు ఉన్నత పాఠశాలలో జులై 6 వ తేదీ నుండి 9వ తరగతి ప్రారంభించారు.

మధ్యాహ్న భోజనపథకం

విద్యాశాఖ డైరెక్టరు కార్యాలయంలో ఉన్న 'కేర్' సంస్థ ఫీల్డు ప్రతినిధి, 1962 జూన్ 28వ తేదీనుండి జులై 10వ తేదీ వరకు మహబూబునగరం జిల్లాలోని 23 బ్లాకులలో పర్యటించి, మధ్యాహ్నభోజన పథకాన్ని విజయవంతంగా అమలు చేయడానికి వీలగా ప్రతి ప్రాంతం అవసరాలను స్వయంగా తెలుసుకున్నారు.

మెదక్

మధ్యాహ్న భోజన పథకానికి గాల్‌బ్రెత్ ప్రారంభోత్సవం

హైదరాబాదుకు 35 మైళ్ళలో ఉన్న నర్సాపూర్‌లో ఆంధ్రప్రదేశ్ కేర్ పాఠశాల పోషణ పథకానికి అమెరికా రాయబారి ప్రొఫెసరు జాన్ కెన్నెత్ గాల్ బ్రెత్, జులై 3వ తేదీన ప్రారంభోత్సవం చేశారు.

పెద్దాపురానికి విద్యుచ్ఛక్తి సరఫరా:—

1962 జులై 7వ తేదీన ప్రణాళిక, పంచాయితీ రాజ్యం శాఖలమంత్రి డాక్టరు యం. చెన్నారెడ్డి పెద్దాపురంలో విద్యుద్దీపాలకు ప్రారంభోత్సవం చేశారు.

నల్లగొండ

వార్షిక సమీక్ష

1961–62వ సంవత్సరంలో నల్లగొండ జిల్లాలోని వివిధ సమాజాభివృద్ధి బ్లాకులలో 1345 మంది సభ్యురాండ్రతో 159 మహిళా మండలాలు ప్రారంభించారు. గృహాభివృద్ధి పథకం క్రింద 365 పొగలేని పొయ్యిలను నిర్మించారు, 514 పెరటితోటలను వేశారు. స్త్రీలలో అవిద్యను నిర్మూలించేందుకు 102 స్త్రీ విద్యా కేంద్రాలను ప్రారంభించారు. యిందులో 657 మంది స్త్రీలకు విద్యగరిపారు.

వరంగల్

వన మహోత్సవం

జులై 7వ తేదీన వరంగల్లులో జరిగిన వనమహోత్సవం కార్యక్రమంలో అధికార, అనధికార సభ్యులు పాల్గొన్నారు. కలెక్టరు కార్యాలయంలో మామిడి మొక్కలను నాటారు. తర్వాత జరిగిన సమావేశంలో జిల్లా అంతటా లక్ష మొక్కలను నాటాలని నిశ్చయించారు.

హసనపర్తి సమితి ప్రారంభోత్సవం

ప్రణాళిక, పంచాయితీరాజ్య శాఖల మంత్రి జులై 1వ తేదీన హసనపర్తి పంచాయతికి ప్రారంభోత్సవం చేశారు.

మంచినీటి బావుల మంజూరీ

జిల్లాలోని మాదిపల్లి, తారపల్లి, ధర్మసాగరాలలో మూడు మంచినీటి బావులను మంజూరు చేయాలని 7వ తేదీన జరిగిన జిల్లా పరిత్తు స్థాయీ సంఘం సమావేశంలో నిశ్చయించారు.

పశ్చిమ గోదావరి

ఉత్తమ గ్రామీణ బ్యాంకు

జిల్లా మొత్తంలో తడికలపూడి గ్రామీణబ్యాంకును ఉత్తమ గ్రామీణ బ్యాంకుగా, ఏలూరు సహకార కేంద్ర బ్యాంకు నియమించిన ఉపసంఘం (సహకార సంఘాల కార్య నిర్వహణను పరిశీలించే నిమిత్తం) యెన్నిక చేసింది. ★

"ఆంధ్ర ప్రదేశ్"

(తెలుగు, ఇంగ్లీషు, ఉర్దూ, హిందీ) మాసపత్రిక ప్రకటన రేట్లు.

దిగువ రేట్లననుసరించి 'ఆంధ్రప్రదేశ్' మాసపత్రికలో ప్రకటనలు స్వీకరించబడగలవు:

వివరాలు	నాలుగు సంచికలలో			ఒక సంచికలో మాత్రమే		
	పూర్తి పేజీ	సగం పేజీ	పావు పేజీ	పూర్తి పేజీ	సగం పేజీ	పావు పేజీ
	రూ	రూ	రూ	రూ	రూ	రూ
లోపలి పేజీ	300	150	100	100	55	30
వెనుక అట్ట పేజీ (4)	400	—	—	150	—	—
అట్ట 2, 3 పేజీలు	350	—	—	125	—	—

ఒక సంవత్సరం కంట్రాక్టు ప్రకటనలకు 20 శతి రిబేటు ఇవ్వబడును.

నిబంధనలు

1. మెకానికల్ వివరాలు: 10¾" × 8½" డెమ్మీ.
2. ముందు అట్ట టైటిల్ పేజీపై ప్రకటనలు స్వీకరించబడవు.
3. పావుపేజీకి తక్కువగా ఉన్న ప్రకటనలు స్వీకరించబడవు.
4. వచ్చే సంచికలో ప్రచురించడానికి వీలుగా స్థలం వివరాలు, డబ్బుతో సహా ప్రకటన సమాచారాన్ని ప్రతినెల 8 వ తేదీలోపుగా యీ కార్యాలయానికి పంపాలి. క్రాస్‌చేయని డిమాండ్ డ్రాఫ్ట్‌ద్వారాగానీ, మనియార్డరుద్వారాగానీ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమాచార, ప్రజాసంబంధముల శాఖ డైరెక్టరు హైదరాబాదు పేర డబ్బునుసంపాలి.
5. బ్లాకుల విషయంలో అన్ని విధాలైన శ్రద్ధ తీసుకోబడుతుంది. అయితే మిషనుపై బ్లాకులు పగిలిన యెడల యీ శాఖ బాధ్యత వహించదు.
6. ప్రకటన విధం, స్థలం వివరాలను, ఒక సంచికలోనా (ఖాయన తెల్పాలి) లేక 4 సంచికలలో ప్రకటించాలా అనే విషయాలను స్పష్టంగా పేర్కొనాలి.
7. చెల్లింపు, యితర ప్రత్యుత్తరాలను దిగువ వారితో జరుపాలి:—

డైరెక్టర్,
సమాచార ప్రజాసంబంధాల శాఖ,
ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం
హైదరాబాద్—1

ప్రాచీనాంధ్ర కవితలో

కథా ఖండికలు

శ్రీమతి కె. విజయలక్ష్మి, ఎం.ఎ.

కథా ఖండికలనగా పద్యరూపమునున్న చిన్న కథలు. వీనినే ఆంగ్లభాషలో "Story Poems" అని అందురు. విద్యాబోధనములో వీనికాభాషలో విశేషమగు ప్రాముఖ్యము గలదు. ఈ ఖండికలు పరిమాణమున చిన్నవై, సర్వసాధారణముగా నీతి బోధకములై యుండుటయేగాక, సులభశైలిని రచితములై, బాల బాలికలుత్సాహముతో పఠించుట కనుకూలములై యుండును. ఆంగ్లభాషలోని 'Story Poems' ను అనుసరించి, ఎప్పుడో యేండ్ల క్రిందట గద్య తిక్కన-యుగ పురుషుడూ అయిన కందుకూరి వీరేశలింగం పంతులుగారు "నీతిదీపిక" యను పుస్తకము తెలుగులో ప్రప్రథమమున రచించిరి. అందులో కొన్నిటిని వారి వాచక పుస్తకములలో గూడ నిచ్చియున్నారు. ఆవెనుక కీ॥ శే॥ కొక్కొండ గోపాలరావుగారు ఇట్టి చిన్న పద్య కథలను "నీతి-కథా సంగ్రహ" మను పేర రచించిరి. ఈ యిరువురి వెనుక నిట్టి రచనలు చేసినట్టు కన్పట్టదు. కాని యింత మాత్రమున ఈ కథా ఖండికలు ఆంగ్ల భాషా ప్రభావము వలననే, మన సాహిత్యములోనికి వచ్చినవని చెప్పుటకు అవకాశము లేదు.

తెలుగున ప్రాచీన కథాసాహిత్యమునకు సంబంధించిన కావ్యములగు జక్కన విక్రమార్క చరిత్ర, కొఱవి గోపరాజు సింహాసనద్వాత్రింశిక, పంచతంత్రములందు ఇట్టి కథాఖండికలచ్చటచ్చట సందర్భానుసారముగ కన్పట్టుచున్నవి. కాని వానిని కొన్ని కారణముల వలన, కథా ఖండికల క్రింద పరిగణించుటకు వీలు కలుగదు. ఏలననగా నవి పరిమాణమున పెద్దవియై యుండుటయే గాక, వర్ణనాత్మకములై యుండి, శృంగార రసభార స్ఫూర్తి కలిగి యున్నవి. ఇంతేగాక, కొన్నిటియందు, మహావీరుల యొక్క సాహసౌదార్య దయాగుణముల ప్రకటనమే కవి యుద్దేశముగాని, నీతిబోధ యేమాత్రమును కాదు. జక్కన, గోపరాజుల గ్రంథము లిందులకుదాహరణములు. ఇరువురును వ్రాసిన "సపేమిరా" యను కథ నీతి దాయకమైనను, ఆ కథ చదువుచున్నప్పుడు, పాఠకుని దృష్టి కవుల రచనా నైపుణ్యమునందును, కథా సన్నివేశముల యందును, వర్ణనల యందును, శృంగార రస స్ఫురణమునందును నిమగ్నమై యుండునేగాని, నీతి ప్రబోధము పైకి ప్రసరింపదు. ఇక పంచతంత్రములోనివి నీతి కథలైనను, రాజకీయ పరిజ్ఞానమును పెంపొందించుటకే ప్రత్యేకముగా నుద్దేశింపబడినవి.

కాని, ప్రాచీన కథాసాహిత్యమునందే పై చెప్పిన గ్రంథములకన్న ముందు వెలసిన, మంచనకవి విరచిత కేయూరబాహు చరిత్రమున, కథాఖండిక సంపూర్ణముగా కలిగిన కథలు సందర్భానుసారముగా కూర్పబడినవి. ఇవి సంభాషణరూపమున నుండి, ఒకొక్కచో రెండు మూడు కథలు వరుసగా నున్నను, చదువుటకు విసుపు కలిగించవు సరిగదా; ప్రధాన కథా వృత్తమునకు భంగము కలిగించవు. అల్పాక్షరములలో అనల్పమగు నీతుల నిముడ్చి, సులభముగ మనస్సునకు హత్తుకొనునట్లుచేయు చక్కని రచనతో నున్న ఖండికలివియేయని చెప్పుట యతిశయోక్తిగాదు.

క్రీ. శ. 1430 ప్రాంతములో సమకూర్పబడిన "సకలనీతి సమ్మత" మను సంకలన గ్రంథమున (Anthology), యిందలి పద్యము లుదహరింపబడి యున్నవనిన, ఈ గ్రంథ ప్రశస్తినిగూర్చి వేరుగా చెప్పనవసరము లేదు. నేటి విద్యావిధానమున నియతమైన పఠనీయ గ్రంథముగా నుండవలసిన కేయూరబాహు చరిత్రకు, ఆంధ్ర వాఙ్మయ ప్రపంచమున ప్రచారము లేకపోవుట చింతింపదగిన విషయము.

"మరుగు పడిన మాణిక్యము"ల వంటి ఈ గ్రంథము నందలి కథాఖండికలను, పరిచయముచేసి పాఠకుల దృష్టిని కేయూరబాహుచరిత్ర వైపు మరల్చి, వాని ప్రాముఖ్యతను గుర్తింప జేయుటయే, ఈ చిన్న వ్యాసముయొక్క ప్రధానోద్దేశము. +

మతిలేనివాడు విద్యాన్వితుడయ్యును, మేలు పొందనేరడను నీతిని, ఈ క్రింది చిన్న పద్యములలో మంచన పొందు పరచెను. (2 ఆ-ప. 28-33)

క॥ గార్గ్యుఁడను విప్రుఁ డొకరుఁడు
దుర్గారాధనముఁ జెక్కు దొసఁగులఁ బడుచున్
దుర్గాటవిలోఁ జేయ ని
రర్గళ గతిఁ దన్నుఁ జూచి యా యంబికయున్॥

క॥ వర మడుగు మనిన మ్రొక్కుచు, సరభసమగు కాంక్షతోడ సంజీవిని ని
ర్భర కరుణ న్నాకొసఁగుము, పరమేశ్వరి యనినఁ గొన్ని పచ్చని యాకుల్॥

చ॥ తలఁచినమాత్ర నాత్మకరతామరసంబున నున్నవాని ని
మ్మలఁ గృప సేసి వీని రసము౦ బయిపైఁ జిలికింపగా శవ
మ్ములకును బ్రాణముల్ గలిగి మ్ముందటి రూపమువచ్చి తేజము౦
బలమును జెంది పూర్వగుణభంగిఁ జరించుట కల్గు నెల్లడన్॥

క॥ ఎండవు తఱిఁగ ననుచునిడి, చండికపొడిగానరాక చనుటయు మదిలో
నిండిన సంతసమున వి, ప్రుండవి కొని యాత్మపురము త్రోవ నొకరుడున్॥

చ॥ చనునెడ నిర్మనుష్య మగుచక్కటి నప్పెనుగాన నెండి పో
యిన యొక పుండరీకశవ మీరము వెల్పల నున్నఁ జేరఁగాఁ
జని తన కన్న యౌషధము శక్తి నిజంబుగఁ జూడ నెంచి చే
త నలఁపి యాకులం బసరు దానిపయిం బడిచెం గు బుద్ధియై॥

చ॥ పిడిచిన నేమిచెప్ప నతిభీకర దుస్సహ పుండరీక ము
ప్పడి తన నిద్ర మేల్కనిన పోలిక మ్రోఁగుచు నిటు లేచి యా
వ్వెడఁ గగు విప్రుఁ గూ యిడిఁగఁ జేసి మృతుం బొనరించి మ్రింగె మే
ల్వడిసియు బుద్ధి చాలని యభాగ్యుఁ తత్ఫల మందనేర్తురే ?॥

"బుద్ధి ఒకరి సొమ్ముగాదు" అను నీతిని ఒక వైశ్య బాలిక కథలో నిమిడ్చెను. (2 ఆ-8-16)

క॥ కాంచీపురమున నొకరుఁడు, కాంచనగుప్తుఁడను బుద్ధిగల వైశ్యుఁడని
ర్వంచనుఁడు సుతున కరయం, బంచెం బరిణయము సేయ బాలిక నొకతెన్॥

చ॥ పనిచిన వారు వైశ్యకుల బాలలఁ జూచుచు నప్పురాంగణం
బున గొక శ్రేవ నొక్కరుఁడు మూటెఁడు ప్రాలకు నూనె సంతలోఁ
గొనఁ జను దెంచి బియ్యమునకున్ సరితైలము వోయుమన్న నా
తనిపలు కెవ్వరున్ వినక తద్దయు నవ్వుచు గేలి సేయుచున్॥

క॥ ప్రాలేడు మానికెలకుం, దైలము మానెఁడు పురమ్ము ధారణ గలుగన్
బ్రాలసరితైల మడిగిన జాలియ యగుఁగాని నీకుఁ జమురేలబ్బున్ ?॥

క॥ అని పలుక మఱియు నడుగం, గని యచ్చట నున్న వైశ్యకన్య యొకతె యా
తనిఁ జీరి కలదు నూనియ, కొనియెదవే రమ్ము ప్రాలకును సరి లెక్కన్॥

వ॥ అని పలికి, చేరవచ్చిన మూట దింపించి బియ్యము లెన్నయనిగాఁ జూచి వానితో మఱియు నిట్లనియె.

+ పద్యములు సుబోధకములగుటచే అర్థము వివరింపలేదు.

క॥ ప్రా లొక్కటఁగొని దానన, తైలము దిగువాఱఁ
బోయుదానను నీకుం
బోలినఁ బ్రాలం గొలఁవుము, చాలము నీతోడఁ బిదప
జగడములాడన్॥

వ॥ అను పల్కులకు వాఁదోడఁబడుటయు.

గీ॥ పళ్ళెరంబుఁ దెచ్చి పటుబుద్ధి బియ్యంబు, దాని
నిండఁగొని ముదంబుతోడ
నంద వోసెఁ దైల ఘంచులు దిగువాఱ, నవ్విధంబు
మెచ్చు నావహింప॥

క॥ చని కాంచన గుప్తునకున్, వినిపించిరి యతని వారు
వేగమ యతఁడం
దునఁ దర్బుద్ధివిశేషము, గొనియాడుచు దానిఁ దనదు
కోడలిఁ జేసెన్ ॥

ఏ విధముగా జూచినను పోరు నష్టమును గలిగించును. అంతియేగాక అల్పులు పోరిన నది బలసి యంత బోవక, యితరులకు విపత్తును గలిగించును. అను నీతిని రెండు తొండలు కలహించి, నిరపరాధులగు జైనుల కెట్లు మరణము కల్గించెనో 8 పద్యములలోను (2 ఆ_99_107). కడు సన్నవు బనులకై మిక్కిలి రోసముతో బెనగిన, మూర్ఖులగు లాటనృపతి పౌరుల వలె ననింతురని, యా కథను 6 పద్యములలోను (2ఆ_111_116), మంచన రమ్యముగా చిత్రించెను.

రెండవది వివేకియైన చోరుడు శత్రువైన విప్రుని గాచిన విధము.

నందినీ గ్రామవాసి బంధుకుడను పేదబ్రహ్మణుడు, సోదరుడగు విపులుని వద్దనుండి ధనము దెచ్చుకొనుటకు చిత్రపర్ణి నగరమునకు బోయెను. కొంత కాలమునకు తిరుగు ప్రయాణమైన అన్నకొక యమూల్య మాణిక్యమును మ్రింగనిచ్చి, విపులుడు పయనమున కొడంబడెను. సోదరుల రహస్య సంభాషణము విన్న చోరుడొకడు, పారుని వధించి రత్నమును గొను నుద్దేశముతో మిత్రునివలె బ్రాహ్మణునకు తోడుగా బోవుచుండెను.

ఇంతలో కొందరు దొంగలు వారి నిద్దరిని పట్టికొట్టి, యెందును ధనము గానక, వారి యుదరములను వ్రయ్యసమకట్టిరి. వారిలో నొక దయామయుడు, ముందొకని గర్భమును ఛేదించి యందు కనకమున్న రెండవవానిని గోయుదము; లేకున్న విడిచి పుత్తమని బలుక, తక్కిన వారియ్యకొనిరి.

చోరుడప్పుడు తానొకటి తలచిన దైవ మొకటి తలచి నందులకు వెరగంది, తన మరణ మెట్లైనను నిశ్చయముగావున తన యుదరము ముందు వ్రచ్చిన నందేమియు గానక బ్రాహ్మణుని విడచి పుత్తురని, ముందు తన గర్భము కోయమని వారిని ప్రార్థించెను. దొంగ లాచోరుని యుదమునందేమియు గానక, బ్రాహ్మణుని విడచి పుచ్చిరి. అతడేగి ధనవంతుడై భార్యా పుత్రులతో సుఖముగానుండెను. నిష్కారణముగా విప్రుని ప్రాణములు హరింప దలచిన పాపమునకు నిష్కృతిగా తన ప్రాణముల నిచ్చి, యా బాపని ప్రాణముల గాపాడియా చోరుడు, వివేక మానస చోరుడు నాకమున కరిగి సుఖియై యుండెను.

ఈ తీరున 22 నీతికథలు, యెడనెడ సందర్భము కలిగినప్పుడెల్ల, ప్రధాన కథతో జోడించి, మంచన 4 ఆశ్వాసముల గ్రంథమును వ్రాసెను.

ఈ గ్రంథమున ప్రథమాశ్వాసములో 79 గద్య పద్యములు, ద్వితీయాశ్వాసములో 130 గద్య పద్యములు, తృతీయాశ్వాసమున 346 గద్య పద్యములు, చతుర్థాశ్వాసమున 212 గద్య పద్యములు, మొత్తము 767 గద్య పద్యములు గలవు. అందు నీతికథలు 482 గద్య పద్యము లాక్రమించినవి. ఇఁక అవతారిక ఆశ్వాసాంత పద్యములు కలసి 60. ఇవి పోగా ప్రధాన కథయగు కేయూర బాహు చరిత్ర 225 గద్య పద్యములు.

ఇంతటి అల్పమైన కథా వస్తువు గైకొని.

క॥ "స్థాయి రసము శృంగారం, బై యలవడఁ గథలు నీతులై
యెడనెడరాఁ
గేయూర బాహుచరితము, సేయుము నీవాంధ్రభాష శిల్పము
మెఱయన్"

అనుకృతి భర్త యాదేశానుసారముగ, మంచన కృతి రచించెను. ఇక నీ గ్రంథ ప్రశస్తిని గూర్చి కొలదిగ తెలిపి, యీ వ్యాసమును ముగింతును.

పోతన మహా కవిదిగా చెల్లుబడి యగుచున్న, "బాలరసాల సాల" పద్యమీ యవతారికలో కొలది మార్పుతో నిట్లున్నది.

ఉ॥ బాలరసాల సాల పుష్పనవ పల్లవ కోమల కావ్యకన్యకన్
గూళలకిచ్చి యప్పడుపుఁగూడు భుజించుటకంటె సత్కవుల్

హాలికులైన నేమి మఱి యంతకు నాయతి లేనివాఁడు కౌ
ద్దాలికులైన నేమి నిజదార సుతోదర పోషణార్థమై॥

పోతన కంటె నితడు పూర్వుడగుటచే, పోతన పద్యమితడు గ్రహించె ననుటకు వీలులేదు. ప్రక్షిప్తమనుటకు, తరువాతి పద్యముతో నన్వయము గలదు. కావున పోతనే ఈ పదశీ మాధుర్యమును బట్టి, యొక సందర్భమున దీనినే మరల చెప్పియుండును. పోతన చమత్కారమున చెప్పిన నాటినుండి, అసలు కవిని విస్మరించి, ఈ పద్యము నరస్తుతి విముఖుడగు పోతనదిగా లోకము విశ్వసించియుండును.

ఇట్లే అల్లసాని పెద్దన్న మనుచరిత్ర ప్రసిద్ధ గ్రంథము. అందలి కొన్ని రమ్యమగు పద్యములు పెద్దనకు శాశ్వతము కీర్తిని సంపాదించి పెట్టినవి. అట్టి వానిలో "ఎవ్వతె నీవు భీతహరిణేక్షణ" యను 2వ ఆశ్వాసములోని 39వ పద్యమొకటి. అట్టి పద్యములే ఈ కావ్యమున **4వ** ఆశ్వాసమున 21వ పద్యముగా కనుపించును.

ఉ॥ "ఎవ్వరివాన వీవు హరిణేక్షణ! యెయ్యది నీకుఁబేరుని
న్నెవ్వతెదెచ్చెఁ జెప్పుమిది యేర్పడ బంటుగ నన్ను నేలుమం
చవ్వసుధేశ్వరుండతివ హస్తము వట్టినఁ బట్టి ధైర్యమున్
ద్రవ్వెడు కన్నులంగొని యదల్చి వదల్చెఁ గరంబు చెయ్యనన్॥

కావున పూతన, పెద్దనల వంటి మహాకవుల కాదర్శప్రాయమైన మంచనకవి వందనీయుడు. అతని కృతియగు కేయూర బాహుచరిత్ర, ఆంధ్ర ప్రజల అభిమాన పాత్రము కాదగినది.



సవరణ

"ఆంధ్ర ప్రదేశ్" 1962 జూన్ సంచికలో "వెలుగు" నాటకంలోని ఒక సన్నివేశం ఫొటో క్రింద వ్రాసిన వాక్యంలో "మండల" అనే పదానికి బదులు "జిల్లా" అని గమనించాలి. ఈ నాటకానికి వరంగల్ జిల్లా పోటీలలో మాత్రమే ప్రథమ బహుమతి వచ్చింది. మండల పోటీలలో ప్రథమ బహుమతి ఖమ్మంలో బహుళార్థ సాధకోన్నత పాఠశాల బృందం ప్రదర్శించిన "ప్రతి ఫలం" నాటికకు వచ్చింది.

పారిశ్రామిక విశేషాలు

[రాష్ట్ర పారిశ్రామిక రంగంలో అనుదినం అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టబడుతున్నాయి. పారిశ్రామికవేత్తలు ప్రజలు వాటిని గురించి తెలుసుకొనటం అవసరం అనే దృష్టితో ముఖ్య పారిశ్రామిక విశేషాలు యీ శీర్షిక క్రింద యివ్వబడుతున్నవి.]

ప్రభుత్వ రంగం

సమీకృత గాజు ఫ్యాక్టరీ

ఒక సమీకృత గాజు ఫ్యాక్టరీని స్థాపించే విషయంలో హంగరీ నిపుణుల బృందం సిద్ధం చేసిన ప్రాథమిక నివేదికను రాష్ట్ర ప్రభుత్వ వాణిజ్య పరిశ్రమల డైరెక్టరు పరిశీలించుతున్నారు.

దుక్క ఇనుము ప్రణాళిక:– స్థానికంగా లభించే ముడి పదార్థాలతో ఒక దుక్క ఇనుము కర్మాగారాన్ని స్థాపించే విషయమై నేషనల్ మెటలార్జికల్ లేబొరెటరీ సమర్పించిన నివేదికను పరిశీలిస్తున్న సాంకేతిక సంఘం ఇటీవల (మే 1962) సమావేశమై దీనికి సంబంధించిన ఆర్థిక స్థితిగతుల పూర్తి సమాచారం సేకరించిన తరువాత ఈ విషయాన్నింకా పరిశీలించాలని నిర్ణయించింది.

ప్రైవేట్ రంగం

నూలు మిల్లులను నెలకొల్పడానికి భారత ప్రభుత్వం 18 లైసెన్సులను ఇచ్చింది. ఒక్కొక్క నూలుమిల్లులో 12 వేల కదురులు వుంటాయి. ఈ మిల్లులను రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో నెలకొల్పుతారు. బెంజాల్ ఆల్కహాలు, ఫినాయిల్ ఎసిటేట్ బెంజాయిల్ క్లోరైడు, ఫినాయిల్ ఇథియల్ ఆల్కహాలు మొదలైనవి తయారు చేయడానికి ఒక స్థానిక సంస్థకు కూడా భారత ప్రభుత్వం లైసెన్సు ఇచ్చింది.

ఆంధ్ర పేపరు మిల్లు

రాజమండ్రిలోని ఆంధ్రా పేపరు మిల్లును ఇండియన్ కంపెనీల చట్టంక్రింద జాయింట్ స్టాక్ కంపెనీగా ఏర్పరచడానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కంపెనీ డైరెక్టర్ల బోర్డులో కొందరు అనధికారులను కూడా నియమిస్తారు. మైనారిటీ ప్రాతిపదికపై ఏర్పరచమన్న ఈ నూతన సంస్థలో ప్రైవేటు పారిశ్రామికులు ముందడుగు వేసేట్లయితే వారు కూడా పాల్గొనే అవకాశం ఇవ్వడానికి కూడా ప్రభుత్వం నిర్ణయించింది. క్రొత్తగా ఏర్పరచనున్న ఆంధ్రా పేపరు మిల్లు కంపెనీకి–భారీ పరిశ్రమ శక్తివంతంగా పనిచేయడానికి వీలుగా–అవసరమైతే యాజమాన్యాన్ని మార్చడానికి వీలుంటుంది. ఇందువల్ల అది కేంద్రం ఆర్థిక సహాయాన్నికూడా వినియోగించుకోవచ్చు. ఈ ఆంధ్రా పేపరు మిల్లు ప్రస్తుతం శాఖల వారిగా రాష్ట్ర ప్రభుత్వం క్రిందనే వుంది. గూడూరులోని ప్రభుత్వ పింగాణీ ఫ్యాక్టరీని, ప్రభుత్వ బ్లాక్ గాజు వర్క్సు నిర్వహణను ప్రస్తుతానికి శాఖల వారీగా కొనసాగించడానికి కూడా ప్రభుత్వం నిర్ణయించింది. ఆ కంపెనీని వెంటనే నమోదు చేయడానికి వీలుగా సత్వర చర్యలను తీసుకోవలసిందని వాణిజ్య పరిశ్రమల డైరెక్టరును కోరారు.

బొగ్గు పరిశ్రమ

సింగరేణీ బొగ్గుగనులలో (ప్రభుత్వ కంపెనీ) బొగ్గు ఉత్పత్తి చెప్పుకో దగినవిధంగా అభివృద్ధి చెందుతున్నది. ఆ గనులలో 1961 మే నెలలో బొగ్గు ఉత్పత్తి 2,09,636 టన్నులు కాగా

(మిగతా 69వ పేజీలో)

మధ్యాహ్న భోజన పథకం

మూడవ ప్రణాళికా కాలంలో నిర్బంధ ఉచిత ప్రాథమిక విద్యా పథకాన్ని విజయవంతంగా అమలు జరుపడానికి ప్రాథమిక చర్యగా బీద బాలబాలికలకు మధ్యాహ్నం ఉచితంగా భోజనంపెట్టే యేర్పాట్లు చేసి తద్వారా వారు పాఠశాలలకు వెళ్లడాన్ని ప్రోత్స హించాలని నిశ్చయించారు. ఈ లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొనే రాష్ట్ర ప్రభుత్వం, భారతదేశంలోని 'కేర్' సంస్థ బహుమతిగా అందజేసే పాలపొడి, కాయధాన్యాలు, నూనెలను స్వీకరించింది. విశ్వవ్యాప్తంగా అసహాయులైన ప్రజలకు సహాయ పడడానికి వీలుగా అమెరికా దేశస్థులు 'కేర్' సంస్థను ప్రారంభించారు. భారతదేశంలోని అమెరికారాయబారి ప్రొఫెసర్ జె.కె. గాల్‌బ్రెత్ 1962 జులై 3వ తేదీన మెదక్ జిల్లా నర్సాపూర్‌లో 'కేర్'సంస్థ సహాయక కార్యక్రమానికి ప్రారంభోత్సవం చేశారు. యీ సందర్భంలో ఆయన ప్రసంగిస్తూ విజ్ఞాన శాస్త్రం వ్యవసాయానికి యే విధంగా తోడ్పడుతుందనే విషయాన్ని యీ పథకం ప్రత్యక్షంగా రుజువు పరుస్తుంది. సామాన్య మానవుడు తన జీవనోపాధికి చేసే ప్రయత్నం మినహా యితర యే పనీ అంత ప్రాముఖ్యత వహించదు. ఇది పెద్దల విషయంలో నిజమైనప్పుడు, పిల్లల విషయంలో అంతకన్నా నిజమైనదని ఆయన పేర్కొన్నారు. భారత దేశంలో యీ కార్యక్రమం 40 లక్షల మంది బాలబాలికలకు వర్తిస్తుంది. అందులో ఆంధ్రప్రదేశ్‌లో 2 లక్షల మందికి వర్తిస్తుంది. తెలంగాణలో 1,50,000 మందికి, సర్కారుజిల్లాల్లో 50,000 మందికి యీ పథకం వర్తిస్తుంది. ఆంధ్ర ప్రదేశ్‌లో యీ కార్యక్రమాన్ని విద్యాశాఖ ద్వారా అమలు పరుస్తారు.

అమెరికా నుండి అందిన ఆహార పదార్థాలను ఓడరేవు నుండి ఉచిత రవాణాతో ఆయాజిల్లా విద్యా శాఖాధికారులకు పంపుతారు. అక్కడినుంచి జిల్లా విద్యాశాఖాధికారి జిల్లాలోని వివిధ రేంజ్ హెడ్ క్వార్టర్సుకు పంపుతారు. ఎన్నికైన పాఠశాల కేంద్రాల ప్రధానోపాధ్యాయులు తమకు నిర్దేశించిన మొత్తాన్ని అక్కడి నుంచి స్వీకరిస్తారు. ఆహార పదార్థాల సక్రమ నిల్వలకు, సత్వర రవాణాకు అవసరమైన చర్యలను తీసుకున్నారు. పాఠశాల స్థాయిలో మధ్యాహ్న భోజనం సరఫరాను సక్రమంగాను, సమర్థవంతంగాను, జరపడానికి వీలుగా స్థానిక వ్యక్తులతో మధ్యాహ్న భోజన కమిటీలను యేర్పాటు చేస్తున్నారు. పౌరుల పిల్లలకు పుష్టికరమైన ఆహారం యితర సౌకర్యాలను కలిగించే యీ పథకానికి పాత్ర సామగ్రి, వంటచెరకు, యితర సామాగ్రిని సహాయంగా యిచ్చి యీ పథకాన్ని విజయవంతంగా అమలు పరచడంలో ప్రజలు తోడ్పడాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

ఆహార పదార్థాలు చెడిపోకుండా ఉండడానికి వీలుగా వాటిని ప్యాక్ జేసి సరఫరా చేస్తారు.

ప్రతి విద్యార్థి విద్యార్థినులకు ప్రతి మధ్యాహ్నం యిచ్చే 'కేర్' ఆహారం దిగువ పరిమాణంలో యిస్తారు.

కాయధాన్యాలు	...	1 ఔన్సు
పాలపొడి	...	1 ఔన్సు
నూనె	...	$\frac{1}{2}$ ఔన్సు

ఈ విద్యా సంవత్సరంలో 200 రోజులు మధ్యాహ్న భోజనంగా ఉప్మా, పాలు యిస్తారు.

వర్తమాన సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ దిగువ విధంగా ఆహార పదార్థాలు స్వీకరిస్తుంది.

కాయ ధాన్యాలు	...	2[illegible],00,000 పౌండ్లు
పాలపొడి	...	25,00,000 ,,
నూనె	...	12,50,000 ,,

'కేర్' సంస్థ అందజేసే మొత్తం పదార్థాల విలువ దాదాపు రు. 62,50,000 లు. 1962_63వ సంవత్సరంలో యీ పథకం అమలు చేయడానికి ప్రభుత్వం రూ. 6,16,026 లు కేటాయించింది.

ఆంధ్ర ప్రదేశ్‌లో యీకార్యక్రమాన్ని అమలు జరపడానికి శ్రీ జె. యస్. లీవిస్ నిర్వహణాధికారిగా ఉన్నారు. వీరి కార్యాలయాన్ని విద్యాశాఖ డైరెక్టరు కార్యాలయంలో నెలకొల్పారు.

విద్యాశాఖ డైరెక్టరు అధ్వర్యంలో యీపథకం అమలు పరుస్తారు. దీనికై ప్రత్యేక అధికారి నియామకం కూడా జరిగింది.



(67[illegible] పేజీ తరువాయి)

1962 ఏప్రిల్ నెలలో 2,37,480 టన్నుల బొగ్గు ఉత్పత్తి అయింది. 1962 మే నెలలో ఆ ఉత్పత్తి 2,40,547.0 టన్నులకు పెరిగింది.

బొగ్గుగనుల టెక్నాలజీలో ప్రముఖమైన పని సాధించినందుకు సింగరేణి బొగ్గుగనుల కంపెనీ జనరల్ మేనేజరు శ్రీయస్. కె. నర్గుండ్కర్‌కు గనులు భూగర్భ, మెటలర్జికల్ భారతీయ సంస్థ (ది మైనింగ్ జియోలాజికల్ అండ్ మెటలర్జికల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా) డి. డి. ఠేకర్ కోల్ మైనింగ్ పతకాన్ని బహూకరించింది.

కొత్త గూడెంలోని బేరియం కెమికల్స్ లిమిటెడ్ సంస్థ మాంఛెస్టర్‌లోని యల్.ఎ. మిచ్చెల్ లిమిటెడ్ సంస్థ సహకారంతో ఒక ఫ్యాక్టరీని నెలకొల్పడానికై ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వానికి 30 ఎకరాల భూమిని ఇవ్వడానికి అంగీకరించింది. ఆ ప్రాంతంలో నీరు, విద్యుచ్ఛక్తి, రైలు రోడ్డు రవాణా సౌకర్యాలు లభ్యమవుతాయి. ఈ ఫ్యాక్టరీకి అవసరమైన బొగ్గును ఆ కంపెనీ సరఫరా చేస్తుంది. ఈ ఫ్యాక్టరీ బెరైట్‌ను సరఫరా చేస్తుంది. ఫ్యాక్టరీ స్థలానికి 20 మైళ్ళ దూరంలో వున్న గార్లరైలు స్టేషన్ వద్దగల ఏడు వందల ఎకరాలను కౌలుకు తీసుకోడానికి కూడా ఈ కంపెనీ దరఖాస్తు చేసింది.

చక్కెర పరిశ్రమ

నిజాం చక్కెర ఫ్యాక్టరీ 1962 మేనెలలో 79,395 టన్నుల చక్కెర గడలను ఆడింది. 1961_62 ఆడింపు సీజన్‌లో 6,00,280 టన్నులను పిండింది. 5,76,414 బస్తాల చక్కెర ఉత్పత్తి అయింది.

మేజారోజా

శ్రీ శివశంకరస్వామి



బహుకాలముక్రిందట నొక
ప్రభాత సమయమ్మునందు
అస్మన్నూతన మిత్రుని
ఆరామము లోని కేగి
విచరింపం జొచ్చి నాను
వీక్షించుచు సూనమ్ముల

బాలభాను కిరణమ్ముల
బంగరు సూదుల పోలిక
ఆకుపచ్చ జొంపంబుల
అంత రాంతరముల నుండి
అవని మీద వాలుచుండె

బహువిధకుసుమమ్ముల మృదు
పరిమళ మాఘ్రాణించుచు
పరిచయము లేని క్రొత్త
విరుల యొక్క చాలు దరిసి
అక్షి యుగము నిలిపి అచట
వీక్షింపం జొచ్చి నాను

శోణకాంతి పుంజములో
సూనము లాకర్షించెను
నామనస్సు:
"వీనిపేరు
నాచుపూవు"లని తెలిపెను
తోటమాలి అనుగు బిడ్డ

తోడనె స్పృశియించినాను
మృదువుగ ఆప్రసవంబుల
మెత్తగ చేతికి తాకెను
పట్టు కుచ్చు లట్లు పూలు

మరు దినాన నెందులకో
మధ్యాహ్నము గడచినంత
ఆరామములోని కరిగి
యాదృచ్ఛికముగ మెల్లన
కనుగొంటిని పూలచాలు
వెనుకటి నాటి విధంబున
వికాసమ్ము లేక విరులు
ముకుళీ భావము నొందెను

అవలనేను కరతలముల
అలరుల గొన్నింటి దాకి
చూచినాను: తరగలేదు
శోణ కాంతి మార్దవములు
"అస్తమించలేదు సూర్యు.
డంధ కారమలమలేదు
అపరాహ్ణమునందె ఇటు
లయిననేమి లతాంతములు."
అను వాక్కులు నానోటను
అప్రయత్నముగను వెడలె



అంతలోనె పూలనుండి
వింతగ నీ భాషితములు
వెలువడినవి మందముగ:
"ప్రియశిః నిర్గంధ
ప్రసవములము మేము: మమ్ము
మేజారోజాలందురు
మిమ్ము బోలు సహృదయులు
నాచుపూవు లనెడి యొక్క
నామాంతరముండు మాకు
మాకు వికాసంబు నిలుచు
మధ్య వయసు వరకె. అవల
గౌడదేశ వనితలట్లు
క్లాంతిగాంచి ముకుళింతుము".

ముఖ్యవార్తలు

రాష్ట్రంలో

జూన్ 23: నీటి పారుదల, విద్యుచ్ఛక్తి శాఖల మంత్రి మహబూబ్‌నగర్ జిల్లాలో ముక్త్యాల్ వద్ద పూర్వ విస్తరణ (ప్రీ-ఎక్స్‌టెన్షన్) బ్లాకును ప్రారంభించారు.

జూన్ 24: భూస్వాములకు, కౌలుదార్లకు మధ్య సంబంధాలను క్రమబద్ధంచేస్తూ, కొన్ని తరగతుల కౌలుదార్లకు రక్షణ నిచ్చే ఒక బిల్లును గెజెట్‌లో ప్రచురించారు.

జూన్ 25: తెలంగాణా ప్రాంతంలోని 54 పట్టణాల పురపాలక సంఘాల ఎన్నికలు అక్టోబరు-నవంబరు నెలలో జరుగుతాయని స్థానిక పరిపాలనా మంత్రి ప్రకటించారు.

జూన్ 26: ఆంధ్రప్రదేశ్ భూమిశిస్తు (అదనపు పన్ను) బిల్లును సెలెక్టు కమిటీకి నివేదించారు.

జూన్ 28: హైదరాబాద్‌లోని ఆంధ్రమహిళా సభ ట్రస్ట్‌బోర్డు అధ్వర్యాన గల కుటుంబ నియంత్రణ చికిత్సశాలకు శ్రీమతి లలితా నచార్ ప్రారంభోత్సవం జరిపారు.

జూలై 3: మెదక్ జిల్లా నర్సాపూర్ ప్రాథమిక పాఠశాలలో ఉచిత మధ్యాహ్న భోజన పథకాన్ని ఇండియాలో అమెరికా రాయబారి ప్రారంభించారు. ఈ పథకం కేర్ (CARE) సంస్థ సహాయంతో రూపొందించ బడింది.

జూలై 5: ఆంధ్రప్రదేశ్‌లో పంటల భీమా పథకాన్ని ప్రవేశపెట్టే అవకాశాన్ని పరిశీలించడానికి అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది.

జూలై 6: మెట్ట భూములకు నీటి తీరువను నూరు శాతం అధికం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిది.

జూలై 7: శ్రీ వి. కె. నాయక్ శాసన సభ డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికయ్యారు.

జూలై 8: హైదరాబాద్ నగరానికి నీటి సరఫరాను అధికం చేయడానికి నిర్మించబడిన మంజీరా బ్యారేజికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.

జూలై 9: ఆర్థిక మంత్రి సహకార శాఖ గ్రాంటుల డిమాండును శాసన సభలో ప్రతిపాదించారు.

జూలై 10: ప్రణాళికల మంత్రి ప్రణాళికాశాఖ గ్రాంటుల డిమాండును శాసనసభలో ప్రతిపాదించారు.

జూలై 12: భారత రాష్ట్రపతి డాక్టర్ యస్. రాధాకృష్ణన్‌కు హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ పౌర సన్మానం చేసింది.

జూలై 14: ఆంధ్రప్రదేశ్ కౌలుదారీ బిల్లును జాయింట్ సెలెక్టు కమిటీకి సమర్పించారు.

జూలై 18: రెండు రోజుల పాటు నగరంలో వుండడానికి భారత ప్రధాని హైదరాబాద్‌కు వచ్చారు.

జూలై 19: హైదరాబాద్ ఎగ్జిబిషన్ గ్రౌండ్సులో బాలికల పాలిటెక్నిక్ భవనాలకు ప్రధాన మంత్రి పునాది రాయి వేశారు.

జూలై 20: న్యాయ, సమాచార శాఖల మంత్రి మెదక్ జిల్లా సంగారెడ్డి వద్ద సమాచార కేంద్రాన్ని ప్రారంభించారు.

భారతదేశంలో

జూన్ 21: అమెరికా భారత దేశానికిచ్చే 135.8 కోట్ల రూపాయల విలువగల ఋణాలకు సంబంధించిన నాలుగు ఒప్పందాలపై న్యూఢిల్లీలో సంతకాలు జరిగాయి.

జూలై 1: పశ్చిమ బెంగాల్ ముఖ్య మంత్రి డాక్టర్ బి. సి. రాయ్ అస్తమించారు.

జూలై 2: 250 కోట్ల రూపాయల కొత్త ఋణాలను భారత ప్రభుత్వం ప్రకటించింది.

జూలై 4. అల్జీరియా తాత్కాలిక ప్రభుత్వాన్ని గుర్తించినట్లు భారత ప్రభుత్వం ప్రకటించింది.

జూలై 7: ఆంధ్ర రాజధానిలో నాలుగు వారాల పాటు గడపడానికి భారత రాష్ట్రపతి డాక్టర్ యస్. రాధాకృష్ణన్ హైదరాబాదు వచ్చారు.

జూలై 9: శ్రీ పి. సి. సేన్ నాయకత్వాన ఏర్పడిన పశ్చిమ బెంగాల్ నూతన మంత్రి వర్గం ప్రమాణ స్వీకారం చేసింది.

జూలై 10; గాల్వాన్ నదీలోయలోని భారత గస్తీ శిబిరాన్ని నాలుగు వందల సైనికులు గల చైనీస్ సైనిక దళం చుట్టు ముట్టింది.

కేంద్ర ప్రభుత్వ యాజమాన్యానికి చెందిన మద్రాసులోని హిందూస్తాన్ టెలి ప్రింటర్ ఫ్యాక్టరీ భవనాలకు కేంద్ర ప్రభుత్వ కమ్యూనికేషన్ల మంత్రి శంఖుస్థాపన చేశారు.

జూలై 14; బెంగుళూరులోని డాక్టర్ విశ్వేశ్వరయ్య పారిశ్రామిక, సాంకేతిక ప్రదర్శనశాలకు ప్రధాన మంత్రి ప్రారంభోత్సవం చేశారు.

జూలై 18: విశ్వవిద్యాలయ విద్యాభివృద్ధికై 12 మంది సభ్యులతో ఒక స్థాయీ సంఘాన్ని భారత ప్రభుత్వం నియమించింది. ఈ సంఘానికి డాక్టర్ పి. పి. రామస్వామి అయ్యర్ నాయకత్వం వహిస్తారు.

విదేశాలలో

జూన్ 24: అత్యవసర విదేశ మారక ద్రవ్యం కోసం కెనడా ప్రధాన మంత్రి ప్రభుత్వ ఋణాలకు, మిత వ్యయానికి సంబంధించిన ఒక కార్యక్రమాన్ని ప్రకటించారు.

జూలై 2: అల్జీరియా ప్రజలు స్వయం నిర్ణాయక జనవాక్య సేకరణలో స్వాతంత్ర్యాన్ని కోరుతూ దిగ్విజయంగా ఓటు చేశారు.

జూలై 4: ప్రభుత్వక్లిష్ట సమస్యను పురస్కరించుకొని బ్రెజిల్ ప్రధాన మంత్రి ఆరోడిమౌరి తమ పదవికి రాజీనామా ఇచ్చారు.

జూలై 6: ప్రఖ్యాత అమెరికన్ రచయిత, నోబుల్ బహుమాన గ్రహీత అయిన విలియం ఫాక్నర్ అస్తమించారు.

జూలై 9: బ్రహ్మాండమైన ఒక అణ్వస్త్రాన్ని అమెరికా, జాన్‌స్టన్ దీవికి కొన్ని మైళ్ళ దూరంలో ప్రయోగించింది.

జూలై 13: బ్రిటన్ ప్రధాన మంత్రి తన మంత్రి వర్గాన్ని పునర్నిర్మించారు,

జూలై 17: మంత్రి వర్గ పునర్నిర్మాణాన్ని సుగమం చేయడానికై జపాను ప్రధాన మంత్రి తన మంత్రివర్గ సభ్యులు ఇచ్చిన రాజీనామా అన్నిటినీ ఆమోదించారు.

"కోకిలకంటే కాకి చాలా గొప్పది. అది మన నిత్యజీవితంలో యెప్పుడూ తొంగిచూస్తూనే ఉంటుంది. ఏడాదికొకసారి కుహూ కుహూ అని కూసిపోయే కోకిల్ని గొప్పగా పొగడక్కర్లేదు."

"ఏమిటో! మీరు చెప్పేది. రెండుసార్లు చెప్పినా వినపడలేదు"

"ఒరేయ్ రఘూ! సురేశ్! సుశీ! శారదా! ఏంగోలరా వెధవ గోల. ఒకటేకాకిగోల—పొండి బైటికి పోయి ఆడుకోండి!!

అభ్యుదయ పథంలో......

పంటల భీమా పథకం, పంచాయతీరాజ్య కమీషనర్ పదవి ఉపసంహరణ, ఆస్పత్రులన్నిటిలో పడకల సంఖ్యనధికం చేయడం, నాగర్జునసాగర్ సహకారాభివృద్ధికి సంబంధించిన ఒక బృహత్ ప్రణాళిక, వెనుకబడిన కులాల వారికి కొత్త ప్రాతిపదికపై కొన్ని మినహాయింపులను గ్రాంటు చేయాలనే సూచనవంటి కొన్ని అంశాలు ఈసారి జరిగిన రాష్ట్రఅసెంబ్లీ బడ్జెట్ సమావేశంలోని ముఖ్య విషయాలు.

రాష్ట్రంలో పంటల భీమా పథకాన్ని ప్రవేశపెట్టడానికి గల అవకాశాలను పరిశీలించే నిమిత్తం అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యవసాయశాఖమంత్రి వ్యవసాయశాఖ గ్రాంటుల డిమాండును ప్రవేశపెడుతూ జూలై 5వ తేదీన శాసనసభలో ప్రకటించారు. రివెన్యూ బోర్డులో నీటి పారుదల శాఖను చూస్తున్న సభ్యుడు (మెంబర్ ఇన్-ఛార్జి) ఈ సంఘానికి అధ్యక్షులుగా వుండగలరని, వ్యవసాయశాఖ ప్రత్యేక కార్యదర్శి రాష్ట్రగిడ్డంగుల సంస్థకుచెందిన మేనేజింగుడైరెక్టరు, వ్యవసాయడైరక్టరు, రెవెన్యూ కార్యదర్శులతో ఈ కమిటీ ఏర్పడగలదని కూడా మంత్రి తెలిపారు.

పశ్చిమ గోదవరి జిల్లాలోని "ప్యాకేజి" కార్యక్రమము అమలును ఆయన ప్రస్తావించి ఆ కార్యక్రమం తృప్తికరంగా సాగుతున్నదని, 1960-61 రాబిపంటలో వరిపంట నూటికి 38 శాతం అదనంగా పెరిగిందని, మిరపపంట 21.5 శాతం అధికమైందని తెలిపారు. ఏజన్సీప్రాంతంలో వ్యవసాయాభివృద్ధిని గురించి మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరం నుంచి ఒకప్రత్యేక పథకాన్ని అమలుజరుపుతున్నారని, ఇందువల్ల విత్తనాలు, ఎరువుల పంపకంతో పాటు పైలట్ క్షేత్రాలు, ప్రత్యేక ప్రదర్శన యూనిట్లు పనిచేయడం ప్రారంభించాయని అన్నారు. మొక్కల రక్షణ ప్రాముఖ్యతను గురించి వివరిస్తూ తగిన సమయంలో తడవకు 40 నుంచి 50వేల ఎకరాలచెరకు విమానం నుంచి మందులు చల్లడానికి కావలసిన సాధన సంపత్తిని చేకూర్చుకొనడానికి ప్రభుత్వ దృష్టిలో ఒక ప్రతిపాదన వున్నట్లు మంత్రి వెల్లడించారు.

చిన్నతరహా నీటిపారుదల పథకాలకు ప్రాముఖ్యత

నీటిపారుదలశాఖ గ్రాంటులకు సంబంధించిన డిమాండు నీటిపారుదల విద్యుచ్ఛక్తి శాఖలమంత్రి జూలై 18వ తేదీన శాసనసభలో ప్రతిపాదిస్తూ, నదీజలాల వివాద విషయంలో 1951 ఒప్పందానికి కట్టుబడి ఉండాలన్న రాష్ట్రప్రభుత్వ నిర్ణయాన్ని పునరుద్ఘాటించారు. "ఇదే సరియైన, న్యాయసమ్మతమైన నిర్ణయం" అని అన్నారాయన.

తృతీయ ప్రణాళికలో నీటిపారుదల కార్యక్రమాన్ని ప్రస్తావించి, ప్రథమ, ద్వితీయ ప్రణాళికలో అసంపూర్తిగా నిలిచిపోయి తృతీయప్రణాళికలో చేర్చబడిన పథకాలతోసహా తృతీయప్రణాళికలో కొన్ని కొత్త పథకాలను చేర్చడంవల్ల తృతీయప్రణాళికలో 5.21లక్షల ఎకరాలు సాగుకు రావచ్చునని మంత్రి అన్నారు.

అధిక ప్రాముఖ్యత

మంత్రి తమ ప్రసంగాన్ని కొనసాగిస్తూ చిన్నతరహా నీటిపారుదల ప్రాజెక్టులకు అధికప్రాముఖ్యత నివ్వటం జరిగిందని, అటువంటివాటికి పబ్లిక్‌వర్క్సుశాఖక్రింద 1,250 లక్షలరూపాయలు ప్రత్యేకించబడినవని, అభివృద్ధి సక్రమంగా జరిగేట్లు చూడడానికి ప్రస్తుత సంవత్సరంలో చిన్నతరహా నీటిపారుదల కార్యక్రమానికి అదనంగా నూరులక్షల రూపాయలు కావలసి వుంటుందని, ఆమేరకు అదనపు నిధులను సాధ్యమైనంతవరకు సాధించడానికి కృషి జరుగుతుందని అన్నారు.

ఆయన నాగార్జునసాగర్ విషయం మాట్లాడుతూ ప్రస్తుత సంవత్సరపు బడ్జెట్ అంచనాలలో దానికి తొమ్మిది కోట్ల రూపా

యలు కేటాయించారని, ఆ మొత్తం పది కోట్లకు పెంచబడుతుందని అన్నారు. తుంగభద్ర హై లెవెల్ కాలువ గురించి ప్రస్తావించి మైన్ కాలువపని 68వ మైలునుంచి 116వ మైలు వరకు. ఉరవకొండ కట్టమీద పని ప్రారంభమైందని ప్రస్తుత సంవత్సరంలో దానికి ఖర్చు పెట్టదలచిన మొత్తాన్ని 40 లక్షల రూపాయలకు పెంచడానికి ప్రతిపాదించబడిందని. ఈ పథకం మొదటి దశవల్ల ఆంధ్రలో స. 1.19 లక్షల ఎకరాలకు ఆయకట్టు సౌకర్యం కలుగుతుందని అన్నారు.

విద్యుచ్ఛక్తి ప్రాజెక్టులు

ఆయన విద్యుచ్ఛక్తి ప్రాజెక్టుల విషయం ప్రస్తావించి ఆంధ్రప్రదేశ్‌లో జలవిద్యుచ్ఛక్తి అభివృద్ధికేగాక, థర్మల్ విద్యుచ్ఛక్తి అభివృద్ధికి కూడా పెక్కు అవకాశాలున్నాయని అన్నారు. ద్వితీయ ప్రణాళికలో విద్యుచ్ఛక్తి వినియోగం రాష్ట్రంలో తల ఒకటికి 15 యూనిట్లకు పెరిగింది. అఖిలభారత సగటు 45 యూనిట్లకు పెరిగింది. తృతీయ ప్రణాళికాంతానికి అఖిలభారత సగటు 95 కు పెరగగలదని, రాష్ట్రంలో తల ఒకటికి విద్యుచ్ఛక్తి వినియోగం సగటున 40 యూనిట్లకు పెరగగలదని మంత్రి అన్నారు.

రాష్ట్రంలోని వివిధ విద్యుచ్ఛక్తి పథకాల అభివృద్ధిని గురించి మంత్రి క్లుప్తంగా ఇలా వివరించారు:— మాచ్‌ఖండ్ ప్రాజెక్టుకు చెందిన ఆరుయూనిట్లు విద్యుదుత్పాదకశక్తి కలవే. తుంగభద్ర జల విద్యుచ్ఛక్తి పథకానికి సంబంధించిన ఐదవ విద్యుదుత్పాదక యంత్రాన్ని ఇంకా నెలకొల్పవలసి వుంది. దానికి సంబంధించిన యంత్ర సామగ్రికి 1961 ఏప్రిల్‌లోనే ఆర్డరు ఇచ్చారు. తుంగభద్ర—నెల్లూరు—హైడ్రోథర్మల్ పథకానికి సంబంధించిన జలవిద్యుత్ యంత్రాలన్నీ 1963వ సంవత్సరాంతం నుంచి పనిచేయడం ప్రారంభిస్తాయి. ఎగువ సీలేరు జల విద్యుచ్ఛక్తి పథకం స్టేషన్ 1964—65లో పని ప్రారంభిస్తుంది. ఇప్పుడున్న 37.5 మిలియన్‌వాట్ల థర్మల్ స్టేషన్‌కు విస్తరణగా రామగుండం వద్ద 60 మిలియన్‌వాట్ల యంత్రాన్ని నెలకొల్పారు. ఈ కొత్త విద్యుదుత్పాదక యంత్రం 1965వ సంవత్సరం మొదటి మూడు మాసాల కాలంలో ఉత్పత్తి ప్రారంభిస్తుంది. 1961 లో రూ. 1,239.60 లక్షలు కేటాయించబడిన కొత్తగూడెం థర్మల్ స్టేషన్‌ప్లాంట్‌కు, యంత్రాలకు గ్లోబల్ టెండర్లను త్వరలో ఆహ్వానిస్తారు. ఈ యంత్రాల స్థాపన 1965 చివరకు పూర్తి కావాలని ఉద్దేశించారు.

అక్టోబరునాటికి రాష్ట్రం అంతటా సమాజాభివృద్ధి కార్యక్రమం విస్తరణ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తృతీయ ప్రణాళికలో ఆహార ధాన్యాల ఉత్పత్తిని 4,32,000 టన్నుల వరకు అధికం చేయవలసిందిగా భారత ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి సూచించి, చిన్నతరహా నీటి పారుదల సౌకర్యాలకై ఏడు కోట్ల రూపాయల ఆర్థిక సహాయాన్ని ఇచ్చిందని ప్రణాళికల మంత్రి జులై 10వ తేదీన శాసనసభలో సమాజాభివృద్ధి, స్థానికాభివృద్ధి కార్యక్రమాల గ్రాంట్లకు డిమాండులను ప్రతిపాదిస్తూ వెల్లడించారు.

ఆగస్టునెలనుంచి పంచాయతీరాజ్ కమిషనర్ పదవిని రద్దుచేస్తూ, ప్రణాళికల కార్యదర్శి, పంచాయతీరాజ్ కమిషనర్‌ల విధులను ఒక్కరే నిర్వర్తించాలని ప్రభుత్వం నిర్ణయించిందని. అందువల్ల ప్రభుత్వానికి ప్రతి సంవత్సరం రూ. 1,50,000 లు మిగులుతాయని ప్రణాళికల మంత్రి తెలిపారు.

ఆయన తమ ప్రసంగాన్ని కొనసాగిస్తూ, జిల్లా పరిషత్తులు, పంచాయతీ సమితులు, గ్రామ పంచాయతీల ద్వారా అనేక కార్యక్రమాలు అమలుజరగడానికి ప్రణాళికలో కేటాయించిన 6.96 కోట్ల రూపాయలకు తోడు, ప్రణాళికలో చేర్చని వివిధ పథకాలకు ఈ సంవత్సరంలో 17.83 లక్షల రూపాయలను వెచ్చిస్తారని అన్నారు. ఈ మొత్తాలను వివిధ శాఖలు ఖర్చు చేస్తాయి. వాటి కార్యక్రమాలను సమన్వయం చేసే బాధ్యత ప్రణాళికా శాఖది.

పెక్కు గ్రామాలకు సౌకర్యం

మంత్రి అంతకు ముందు సమాజాభివృద్ధి, జాతీయ విస్తరణ సర్వీసు, స్థానికాభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన విధానాలను తెలుపుతూ అక్టోబర్‌లో 33 పూర్వ విస్తరణ బ్లాకులు (పీ—ఎక్స్టెన్షన్) ప్రారంభించబడడంతో రాష్ట్రం అంతటికీ సమాజాభివృద్ధి కార్యక్రమాలను వర్తింపచేయడం పూర్తవుతూంది ప్రస్తుతం ఈ కార్యక్రమం 85 శాతం 96 శాతం గ్రామ ప్రాంతాలలోను విస్తరింపబడి వుందని అన్నారు.

దాదాపు అన్ని బ్లాకులు వ్యవసాయోత్పత్తి నధికంచేయడానికి నిర్దేశించిన కుటుంబ ప్రణాళికల నాధారంగా చేసుకొని ఇప్పుడు తమ ప్రణాళికలకు తుదిరూపాన్నిస్తున్నాయని మంత్రి అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని "ప్యాకేజి" కార్యక్రమం వల్ల ఆ జిల్లాలో ఎకరానికి 54 శాతం ఉత్పత్తి అధికం అయింది. ప్రతి జిల్లాలోని ఒక బ్లాకులోగల పది గ్రామాలలో ఇదే విధమైన కార్యక్రమాన్ని పరిమితంగా ప్రవేశపెట్టారు.

ఆసుపత్రులలో పడకల సంఖ్యా పెంపుదల

ఆసుపత్రులలో పడకల సంఖ్యపెంచి. వైద్యం, శస్త్రచికిత్స మొదలైనవాటికి ప్రత్యేకనిపుణులను నియమించడం ద్వారా జిల్లా కేంద్ర ఆసుపత్రులను పటిష్ఠం చేయడం తృతీయ ప్రణాళికలోని ముఖ్యాంశాలని ఆరోగ్యశాఖామంత్రి జూలై 21వ తేదీన దేశీయ వైద్యం, వైద్య సౌకర్యాలు, 1962_63లో ఉద్యోగుల రాష్ట్రభీమా పథకంతో సహా వైద్యసౌకర్యాలకై గ్రాంటులకొరకు డిమాండును ప్రతిపాదిస్తూ తెలిపారు.

ఆయన తమ ప్రసంగంలో వైద్య సౌకర్యాల అభివృద్ధి పథకాలను ముఖ్యాంశాలను ఇలా వివరించారు. ప్రతిజిల్లా కేంద్రం ఆస్పత్రిలో పడకల సంఖ్యను 250కి పెంచుతారు. మొత్తం మీద అన్ని ఆస్పత్రులలో 628 కొత్త పడకలను ఏర్పాటు చేస్తారు. ప్రస్తుతం తాలూకా కేంద్ర ఆస్పత్రులలోవున్న 1,361 పడకలసంఖ్యను 3523 కు పెంచుతారు. తృతీయ ప్రణాళికలో జిల్లా ఆస్పత్రులకు 66.89 లక్షల రూపాయలను, తాలూకా ఆస్పత్రులకు 72.37 లక్షల రూపాయలను కేటాయించారు.

ఉద్యోగుల రాష్ట్రభీమా (ESI) పథకం

ఆరోగ్య సౌకర్యాల విషయంలో గ్రామీణ ప్రాంతాలతో సహా పట్టణ ప్రాంతాలలోని స్త్రీలకు, పిల్లలకు అధిక సౌకర్యాలను విస్తరింప చేయడానికి అధిక ప్రాముఖ్యత ఇవ్వబడింది. ఉద్యోగుల రాష్ట్ర భీమాపథకం క్రింద తృతీయ ప్రణాళికలో డిస్పెన్సరీలకు 40 లక్షల రూపాయలను కేటాయించారు. ప్రస్తుత సంవత్సరానికి ఆరు లక్షల రూపాయలను కేటాయించారు. ఖైరతాబాద్, చిక్కడపల్లి, సీతానగరం, గుంటూరులలో ఉద్యోగుల రాష్ట్ర భీమా పథకం డిస్పెన్సరీలను ప్రారంభిస్తారు.

మంత్రి వైద్యవిద్యను గురించి ప్రస్తావించి వైద్యకళాశాలలో ప్రతియేటా చేర్చుకునే విద్యార్థుల సంఖ్యను 250 నుంచి 495 కు పెంచారని అన్నారు. కర్నూలు, తిరుపతిలలో రెండు కొత్త కళాశాలలు, కాకినాడ, వరంగల్లులలో రెండు ప్రైవేట్ కళాశాలలను నెలకొల్పడంతో ఇంకా 350 మందికి వైద్య కళాశాలలో ప్రవేశం లభించింది. అందువల్ల రాష్ట్రంలోని వైద్య కళాశాలలో ప్రతియేటా చేర్చుకునే విద్యార్థులసంఖ్య 845కు పెరిగింది. తృతీయ ప్రణాళికా కాలంలో ఈ సీట్ల సంఖ్యను ఇంకా పెంచే ప్రతిపాదన ఒకటి వున్నది. నర్సింగ్ శిక్షణ కేంద్రాలను నెలకొల్పి, ప్రస్తుతం వున్న కేంద్రాలను 39 లక్షల రూపాయల ఖర్చుతో విస్తరింప చేయాలని ప్రతిపాదించారు.

సహకార సంఘాలలో సభ్యుల పెరుగుదల

ప్రస్తుత సంవత్సరాంతానికి రాష్ట్రంలోని గ్రామ సహకార సంఘాలలో సభ్యులసంఖ్య 25 లక్షలవరకు పెరగగలదని. దీర్ఘ స్వల్పకాలిక ఋణాల విలువ 30 కోట్ల రూపాయల వరకు అధికం కాగలదని ఆర్థిక. సహకార శాఖలమంత్రి జూలై 9వ తేదీన శాసన సభలో సహకార శాఖ గ్రాంటుల డిమాండును ప్రతిపాదిస్తూ అభిభాషించారు.

పంచవర్ష ప్రణాళికలో తల పెట్టిన అధిక వ్యవసాయోత్పత్తి కార్యక్రమాలదృష్ట్యా, రైతులకు కావలసిన ఋణాల సౌకర్యాలను నాలుగవ ప్రణాళిక చివరకు సహకార సంఘాలు కనీసం నూటికి 50 శాతం మేరకు కల్పించాలని మంత్రి తమ ప్రసంగంలో అన్నారు. సహకార శాఖలో ప్రాథమిక వ్యవసాయ ఋణాల సంఘసభ్యులసంఖ్య 15.89 లక్షలనుంచి 40 లక్షల వరకు పెరగాలని. 1960_61లో వార్షికంగా 16.50 కోట్ల రూపాయలను మధ్య, స్వల్పకాలిక ఋణాలుగా ఇచ్చే సహకార సంఘాల ఋణాలు తృతీయ ప్రణాళిక ఆఖరు సంవత్సరం నాటికి 60 కోట్లు కావాలని తృతీయ ప్రణాళిక లక్ష్యం. ఈ లక్ష్యాలు నూటికి 66 వ్యవసాయ కుటుంబాలకు, వారికి కావలసిన 33 శాతం ఋణాల అంచనాలకు వర్తిస్తవని. 25 లక్షల మందిని సభ్యులను చేయడం. 30 కోట్ల రూపాయల మేరకు మధ్య, స్వల్పకాలిక ఋణాల నివ్వడం అనే ఒక బృహత్ లక్ష్యాన్ని ప్రస్తుత సంవత్సరంలో సాధించడానికి ప్రతిపాదించారని మంత్రి తెలిపారు.

గ్రామ సహకార సంఘాలు

గ్రామాలలోని సహకార సంఘాలు ప్రణాళిక క్రింద ఋణాల కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వర్తించడానికి. వాటి ఆర్థికాదాయాన్ని పెంపొందించే దృక్పథంతో వాటా పెట్టుబడి, డిపాజిట్లను అధికంచేసే లక్ష్యం ఒకటి వున్నది. 1961_62 నాటికి గ్రామీణ సహకార సంఘాలలోని సభ్యుల వాటాపెట్టుబడి, డిపాజిట్ల విలువవరుసగా రూ. 4.07 కోట్లు, రూ 0.87 కోట్లు. ప్రస్తుత సంవత్సరం చివరకు ఈ మొత్తాన్ని వరుసగా 6 కోట్లు, రెండు కోట్ల రూపాయల వరకు పెంచాలని ప్రతిపాదించారు.

నాగార్జునసాగర్ ప్రాంతంలో సహకారాభివృద్ధికై ఒక "బృహత్ ప్రణాళిక"ను రూపొందించడానికి ప్రతిపాదించబడిందనీ, ఆ ప్రాంతంలో వ్యవసాయదార్ల పరపతి అవసరాలను గురించి తెలుసుకోడానికి రిజర్వు బ్యాంకు ప్రత్యేకాధికారి ఒకరు ప్రాజెక్టు ప్రాంతాన్ని సందర్శించవలసి వుందనీ మంత్రి వెల్లడించారు. మూసీ ప్రాజెక్టు క్రింద అమలులో వున్నట్లుగానే, నాగార్జున సాగర్ ప్రాజెక్టు క్రింద కూడా రైతులకు పూర్తి ఆర్థిక సహాయం అందజేసే పథకాన్ని రూపొందించడం జరుగుతుంది.

1962 మార్చి నెలాఖరు వరకు అన్ని స్థాయిలలోని వ్యవసాయ పరపతి సహకార సంఘాలకు ప్రభుత్వం రూ. 2.42 కోట్ల మేరకు వాటాధనంగా ఇచ్చిందని కూడా ఆయన తెలియజేశారు. కేంద్ర భూమి తనఖా బ్యాంకుతో సహా అన్ని స్థాయిలలోని సహకార పరపతి సంఘాలకు వాటాధనం క్రింద ప్రభుత్వం ఇతోధిక మొత్తాలు ఇవ్వడానికి వీలుగా 1962_63 బడ్జెటులో రూ. 65 లక్షలు కేటాయించ బడినాయి.

మధ్య కాలిక ఋణాలు

మార్కెటింగ్ సహకార సంఘాలు ఇనుము, ఉక్కు, ఎరువులు పంపిణీ పథకాలను చేపట్టడానికై వాటికి పెట్టుబడి పెట్టే నిమిత్తం రాష్ట్రంలోని రెండు కేంద్ర సహకార బ్యాంకులు స్టేట్ బ్యాంక్ అఫ్ ఇండియా నుంచి రూ. 2.70 కోట్ల వరకు ఋణం పొందడానికి అవకాశంవుంది. బావులు త్రవ్వడం ద్వారా భూములలో కొద్దిపాటి అభివృద్ధి పనులు పూర్తి చేయడం ద్వారా వ్యవసాయోత్పత్తిని పెంపొందించడానికై మధ్య కాలిక ఋణాల అవసరం పెరగడం దృష్ట్యా సహకార సంఘాలు ఇలాంటి ఋణాలను ఇతోధికంగా లభింపజేస్తున్నాయి. రిజర్వు బ్యాంకు వారి ఆర్థిక సహాయంతో 1961_62 వ సంవత్సరంలో రూ. 125 లక్షల మేరకు మధ్య కాలిక ఋణాలు ఇవ్వడం జరిగింది. వర్తమాన సంవత్సరంలో మరో రూ. 300 లక్షల మేరకు ఈ ఋణాలు ఇవ్వడానికి ప్రతిపాదించబడింది.

ప్రాథమిక విద్యారంగంలో సత్వరాభివృద్ధి

రాష్ట్ర శాసన సభలో జూలై 7వ తేదీన సాధారణ, సాంకేతిక విద్యలకై గ్రాంట్ల కొరకు డిమాండ్లను ప్రతిపాదిస్తూ 1662_63వ సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్‌లో నిర్బంధోచిత ప్రాథమిక విద్యా పథకాన్ని మరో 1.7 లక్షల మంది పిల్లలకు వర్తింపజేయడం జరుగుతుందనీ, ఇందు నిమిత్తం అదనంగా 3,500 మంది ఉపాధ్యాయులు నియమించ బడతారనీ విద్యామంత్రి తెలియజేశారు. ఇంతేగాక క్రొత్తగా 90 మాధ్యమిక పాఠశాలలు తెరవబడతాయనీ, 11_14 సంవత్సరాల మధ్య వయస్కులైన పిల్లలను 46, 000 మందిని మాధ్యమిక పాఠశాలల్లో ఈ సంవత్సరం చేర్చుకొనడం జరుగుతుందనీ ఆయన అన్నారు.

తొమ్మిది మొదలు పన్నెండవ తరగతి వరకు అదనంగా 10, 000 మంది పిల్లలను చేర్చుకోడానికి వీలుగా ఉన్నత పాఠశాలల్లో సౌకర్యాలను విస్తృత పరచడానికి రూ. 82.33 లక్షలు కేయించబడినాయనీ, ప్రస్తుతపు మాధ్యమిక పాఠశాలలను పై గ్రేడుకు పెంచడంద్వారా 88 ఉన్నత పాఠశాలలను తెరవడానికి ప్రతి పాదించబడిందనీ, ఎనిమిది ఉన్నత పాఠశాలలను హయ్యర్ సెకండరీ పాఠశాలల క్రింద మార్చడానికి కూడా తలపెట్టబడినదనీ మంత్రి తెలిపారు. "కేర్" సహకారంతో రూ. 6.61 లక్షలు ఖర్చు కాగల మధ్యాహ్న భోజన కార్యక్రమం ప్రారంభించబడింది. ఎలిమెంటరీ పాఠశాలలకు వెళ్లే 2 లక్షల మంది పిల్లలకు ఈ పథకం వల్ల లాభిస్తుంది.

విశ్వవిద్యాలయాలకు గ్రాంట్లు

విశ్వవిద్యాలయ విద్యను గురించి చెప్తూ ఆంధ్రప్రదేశ్‌లోని మూడు విశ్వవిద్యాలయాలకు గ్రాంట్లు ఇవ్వడంతో పాటు, సైన్సు పట్టభద్రుల కొరతను తీర్చే నిమిత్తం ప్రస్తుత కళాశాలలలో సైన్సు విద్యా బోధనకు సౌకర్యాలను పెంపొందించడానికి ప్రతిపాదించబడినదనీ, ఈ సంవత్సరం హైదరాబాదులోని సిటీ కళాశాలను, సైన్సు సబ్జెక్టులు బోధించే డిగ్రీ కళాశాలగా పై గ్రేడుకు పెంచడానికి కూడా తలపెట్టబడిందనీ మంత్రి వెల్లడించారు.

ఇంజనీరింగ్ సిబ్బంది అవసరం పెరిగినందున, ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనూ ఆంధ్ర విశ్వవిద్యాలయంలోను కెమికల్ టెక్నాలజీ కోర్సులలో అదనంగా 30 మంది విద్యార్థులను చేర్చుకోడానికి ప్రభుత్వం మంజూరీ ఇచ్చింది. దీనితో ఈ కోర్సులో స్థానాల సంఖ్య ప్రతి విశ్వవిద్యాయంలోనూ 60 కు పెరిగింది. అనంతపురంలోని ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలో కూడా మరో 30స్థానాలను హెచ్చించడానికి ప్రభుత్వం మంజూరు చేసింది. విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, నెల్లూరు, వరంగల్లులోని పారిశ్రామిక శిక్షణ సంస్థలలో ఒక్కొక్క దానిలో అదనంగా 120 స్థానాలను పెంచడం ద్వారా ఈ శిక్షణ సంస్థలను విస్తృత పరిచే రెండవ దశ కార్యక్రమం ప్రస్తుత సంవత్సరం అమలు పరచ బడుతుంది. కొత్తగూడెం, తణుకు, తెనాలిలలో కొత్తగా మూడు శిక్షణ సంస్థలను తెరవడం జరుగుతుంది. 1962–63వ సంవత్సరానికై సాంకేతిక విద్యకు రూ. 37. 79 లక్షలూ, వృత్తి పనుల శిక్షణ కార్యక్రమాలకు రూ. 11. 13 లక్షలు ప్రణాళికలో కేటాయించబడినాయని అయన అన్నారు.

వెనుకబడిన తరగతులకు రాయితీలు

హరిజనులకు కేవలం వారికుల ప్రాతిపదికపై ప్రత్యేక సౌకర్యాలు కలుగజేసే విషయాన్నీ, కులప్రాతిపదికపై మాత్రమే సాంఘిక సంక్షేమ చర్యలను అమలుపరిచే పద్ధతి, జాతీయసమైక్యతను సాధించాలనే లక్ష్యానికి ఎంతవరకు అనుగుణ్యమైన దనేవిషయాన్నీ పరిశీలించడానికి సమయం ఆసన్నమైనదని ముఖ్యమంత్రి, నిమ్నజాతులు, నిమ్న తెగలు మొదలైనవారి సంక్షేమ పథకాలకై జూలై 12వ తేదీన శాసనసభలో గ్రాంట్లకు డిమాండు ప్రతిపాదిస్తూ అన్నారు.

విద్యాతదితర రాయతీలను లభింపజేయడానికి వాటినిపొందగోరే వ్యక్తుల ఆర్థికస్థితినే ప్రమాణంగా పరిగణించాలనీ, లేనట్లయితే కులతత్వాన్ని కొనసాగిస్తూ, భావితరాలవారికి అన్యాయంచేసిన వారమవుతామని ఆయన ఉద్ఘాటించారు. ఆర్థికసహాయం తదితర రాయతీలను కలుగజేయడానికి దారిద్ర్యాన్ని ప్రాతిపదికగా తీసుకున్నప్పుడు ప్రభుత్వం చాలఎక్కువమొత్తాలను ఖర్చు పెట్టవలసి వుంటుందనీ, అందుకు తమకు అభ్యంతరం వుండదని ముఖ్యమంత్రి అన్నారు,

భోజన గృహాలు

తృతీయప్రణాళికా కాలంలో అమలు పరచబడుతున్న పథకాలను గురించి ప్రస్తావిస్తూ భోజవగృహాలను తెరవడం ద్వారానేమి, 28 మధ్యాహ్న భోజన కేంద్రాలను ప్రారభించడం ద్వారానేమి విద్యాసౌకర్యాలను లభింపజేయడానికి 1961–62వ సంవత్సరంలో రూ. 1.53 లక్షలు ఖర్చు పెట్టబడినట్లు ముఖ్య మంత్రి తెలిపారు. ఈపథకాలను కొనసాగించడానికి, ఏజన్సీప్రాంతాలలో ఉపాధ్యాయులకు నివాసగృహాలను నిర్మించడానికీ, ప్రీ–మెట్రిక్ రెసిడెన్షియల్ స్కాలర్‌షిప్పులను మంజూరు చేయడానికి 1962-63వ సంవత్సరానికి రూ, 6.10 లక్షలు కేటాయించబడినాయి.

గిరిజనులశిక్షణ, మూడుపైలట్ క్షేత్రాలస్థాపన, ఐదువ్యవసాయ ప్రదర్శన విభాగాల స్థాపనకొరకు 1961–62వ సంవత్సరంలో రూ, 0. 95 లక్షలు ఖర్చు పెట్టబడినాయనీ 1962–63వ సంవత్సరంలో కూడా ఈపథకాలన్నీ కొనసాగించ బడుతున్నాయనీ, అందునిమిత్తం రూ, 1.79 లక్షలు కేటాంచ బడినాయనిఆయన తెలియజేశారు. బొంబాయి పద్ధతిలో అటవీ కార్మికసహకార సంఘాలను ప్రారంభించడానికి కూడా ప్రతిపాదించబడిందనీ, అందుకు రూ. 20.36 లక్షలు ప్రత్యేకించ బడినాయని ముఖ్యమంత్రి చెప్పారు,

అడవుల పెంపకం

అరణ్యాలతో గాకుండా పడావాపడివున్న పెద్ద పెద్ద భూఖండాలను సాధ్యమైనంతవరకు అడవుల పెంపకానికి శాశ్వతంగా వినియోగించే ఉద్దేశంతో వాటి సమగ్ర పరిశీలన జరుగుతున్నదని పశుపోషణ, అటవీ. మత్స్య శాఖలమంత్రి రాష్ట్ర శాసనసభలో జూలై 6వ తేదీన పశుపోషణ, అటవీ మత్స్య శాఖల గ్రాంట్లకు డిమాండ్లను ప్రతిపాదిస్తూ ప్రకటించారు. ఈ విధానం వల్ల రాష్ట్రంలో అటవీ ప్రాంతాల విస్తీర్ణం పెరుగగలదని మంత్రి ఆశాభావం ప్రకటించారు.

అటవీ శాఖ ఆదాయం గతకొన్ని సంవత్సరాలలో పెరిగినదని ఆయనతెలిపారు. 1957–58వ సంవత్సరంలో ఆదాయం రూ. 246.89లక్షలు, ఖర్చు రూ. 84.68 లక్షలు కాగా క్రిందటి సంవత్సరం ఆదాయ, వ్యయాలు వరుసగా, రూ. 386.32లక్షలు, రూ. 12.31

లక్షలు అని మంత్రిఅన్నారు. వర్తమాన సంవత్సరంలో ఆదాయం రూ. 345 లక్షలు, వ్యయం రూ. 143 లక్షలు వుండవచ్చునని ఆయనవెల్లడించారు. అటవీశాఖ ఈ సంవత్సరం 2429 ఎకరాలలో టేకు, 750 ఎకరాలలో కెసోరినా689, ఈ ఎకరాలలో ఈక్విలిప్టస్, 300ఎకరాలలో అగ్గిపెట్టల పరిశ్రమకు ఉపయోగించేట్లు 140 ఎకరాలలో రక్తచందనపు చెట్లను పెంచదలచిందనీ ఇందుకు రూ. 5.89 లక్షలు ఖర్చవుతాయనీ ఆయన అన్నారు.

కాఫీతోటలు


పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాల ఏజెన్సీ అడవులలో నివసించే కొండజాతులవారిని "పోడు" సేద్యపు అలవాటు నుంచి మాన్పించే నిమిత్తం క్రిందటి సంవత్సరం 400 ఎకరాల విస్తీర్ణంలో రూ. 8లక్షల వ్యయంతో కాఫీ తోటలను పెంచే పథకాన్ని అమలుపరచడం జరిగిందనీ, ఈ సంవత్సరం మరో 130 ఎకరాలలో కాఫీతోటలు పెంచడానికి ప్రతిపాదించబడనీ అటవీ వనరుల సమగ్రపరిశీలన రూ. 4 లక్షలు కార్యక్రమాన్ని అద్యతన భావిలో చేపట్టడానికి తలపెట్టబడినదనీ కూడా మంత్రి తెలిపారు. వన్యమృగాల సంరక్షణార్థం, వన్యమృగాల సమీకృత బిల్లును శాసనసభలో త్వరలో ప్రవేశపెట్టడానికి ప్రతిపాదించబడినట్లు కూడా ఆయన తెలియజేశారు.

మత్స్య పరిశ్రమాభివృద్ధిని గురించి చెప్తూ, ప్రస్తుత సంవత్సరంలో, 30 యాంత్రికనావలనూ, 20,000 పౌనుల సింథటిక్ నారతాళ్లనూ, 50 తెప్పలకొరకు కొయ్యమొద్దులనూ, 10,000 కొక్కెలను పంపిణీచేయడానికి ప్రతిపాదించబడినట్లు మంత్రి తెలియజేశారు, తృతీయప్రణాళిక మిగిలిన కాలంలో అయిదు ప్రాంతీయ మత్స్యక్షేత్రాల (సీడ్)ను కూడా తెరవడం జరుగుతుంది. ఇంతేకాకుండా నిజామాబాదు, సూర్యాపేట, కాకినాడ, ఆకివీడు, కృష్ణపట్నంలలో సీతల గిడ్డంగి సౌకర్యాలు కూడా చేకూర్చబడుతాయి. మత్స్య పరిశ్రమాభివృద్ధికి సంబంధించిన ప్రాతిపదిక, సహాయక పరిశ్రమలు అంటే నైలాన్ ఫిలిమెంట్ ప్లాంట్, మారీన్ డీజెల్ ఇంజన్ ఫ్యాక్టరీ, షార్క్-లివర్ ఆయిల్ ప్లాంట్ వంటి వాటిని స్థాపించడంలో ప్రైవేటు సంస్థల వారికి మత్స్యశాఖ సహాయ సహకారాలు లభింపజేస్తుంది.

ఒంగోలుజాతి నాణ్యత అభివృద్ధి

"పశుపోషణ" పద్దుక్రింద చేసిన డిమాండ్లను ప్రస్తావించి, ఒంగోలు జాతి నాణ్యతను పెంపొందించడానికై ఒక పథకాన్ని ప్రారంభించడానికి భారత ప్రభుత్వం అంగీకరించిందనీ, ఈ పథకానికి మొదటిదశలో రూ 14 లక్షలు ఖర్చవుతాయనీ మంత్రి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఏటా 1.55 మిలియన్ టన్నుల పాల ఉత్పత్తి జరుగుతుంది. దీనిలో చాలా భాగం వెన్న, నెయ్యికొరకు వినియోగమవుతుంది. సుమారు రూ. 3 కోట్లువిలువచేసే నెయ్యి మనరాష్ట్రం నుంచి ఇతరరాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నదనీ, కృష్ణాజిల్లా నుంచి అత్యధికంగా నెయ్యి ఎగుమతి జరుగుతున్నదనీ ఆయనచెప్పారు.

సమీకృత పాల ప్రాజెక్టు ఉచితముగ్గా కొనసాగుతున్నదనీ నిర్మాణాలపని ఇటీవలి నెలల్లో త్వరితగతిన అమలు జరిగిందని కూడా మంత్రి తెలిపారు, పామర్రు, హనుమాన్ జంక్షన్, వీరంకి లాకులలో మూడు శీతల యంత్రాలను నెలకొల్పే పని ప్రాథమిక దశదాకు ముగిసి దని మంత్రి అన్నారు.



వైయక్తి కాభివృద్ధివల్ల సంఘానికి జరిగే మేలు అల్పం
సంఘాభివృద్ధివల్ల వైయక్తికంగా జరిగే మేలు యింతా అంతా కాదు.

గ్రంథ సమీక్ష

భౌతికాధ్యాత్మిక విజ్ఞానాలు

గ్రంధకర్త శ్రీ వసంతరావు వెంకటరావు పేజీలు—158, వెల రూ. 2—50, ప్రచురణ— శ్రీ వల్లూరి సూర్యనారాయణరావు గారి గ్రంధనిధి, ఆంధ్రగీర్వాణ విద్యా పీఠం— కొవ్వూరు, పశ్చిమ గోదావరిజిల్లా.

ఇది వైజ్ఞానిక గ్రంథము. సతీపతుల సంవాదరూపమున శ్రీ వెంకటరావు గారు, భౌతిక విజ్ఞానాభివృద్ధి అయిన కొలది మానవుని అధ్యాత్మిక విశ్వాసములు నశించు చుండుట గమనించి, ఆధ్యాత్మిక విజ్ఞానము శాస్త్రయుక్తమని అందలి సత్యాసత్యముల గ్రహించుట అవసమని, ఆత్మశక్తి మిధ్యగాదని నిరూపించుట గ్రంథమందలి ప్రధానాంశము. హేతువాద ప్రాధాన్యాన్ని గుర్తించిన వారికి మూఢ విశ్వాసాలకు తావులేదని నిరూపించుచున్నది. సాంప్రదాయాలను తృణీకరించు శక్తి లేని ఒక లావణ్యవతి వాటిని ఆచరించడానికి మనస్కరించక భర్త సలహానొందగా భర్త అమె మనోభాధ నెరిగి ఆమెతో చర్చకు పూనుకొంటాడు. భౌతిక విజ్ఞానం వస్తుగతమైనది. ఆధ్యాత్మజ్ఞానం ఆత్మగతమైనది. ఈ భేధముల నెరగుటకు మనస్సు ప్రధానం. బుద్ధి అవసరం, చిత్తం ఆగత్యం దానికి సహేతకంగా మనః శక్తి ప్రభావం రెండవ అధ్యాయంలో తెలుపబడింది. మునుల శక్తి గారడివారి శక్తిని పోలియున్నదా యను సందేహం. భౌతిక విజ్ఞానంలోవలె ఆధ్యాత్మిక విషయాలు నిర్వివాదాంశములుగావు. దీనికి కారణంమనో బలహీనత. జగత్తు ఆత్మగతమా? వస్తుగతమా? పంచేంద్రియాలకు వ్యక్తమైన జ్ఞానం సంకలనం చేయుటవలన మానవుడు జగద్విషయ మెంతవరకు గ్రహింపగలడు. మనకన్న అనేకరెట్లు బృహత్ పరిమాణం గల ఒక విపరీత జీవిదృష్టికి మన జీవితాలేవిధంగా గోచరిస్తాయి. మనదృష్టి పధంలోనున్న జగత్తుకు, సత్యజగత్తుకు భేధమేమి, అనునది ముఖ్యాంశము విశ్వరూపం అను అధ్యాయంలో విశదీకరింపబడింది,

విజ్ఞాన విప్లవం మానవుని అహంకారాన్ని ఎట్లు తగ్గించింది, అహంకారపూరితులైన వారికి విజ్ఞానం జ్ఞానమార్గం ఎట్లా జూపగలిగింది? వివిధ జ్ఞానాలలోని సహజ వ్యత్యాస ఫలితాలేమిటి? విజ్ఞాన పెంపుకు మానవ హృదయాంతరంగ రహస్యముల నన్వేషించు శక్తి గలదా? మానవజ్ఞానం ఎందువలన అభివృద్ధి నొందలేదు? విజ్ఞాన ధన ఫలితములు విజ్ఞానమందు ఏల సక్రమ విశ్వాసంలేదు? విషయములు మానవతత్వమను భాగమందున్నది. ఇంద్రియాతీతజ్ఞానానికి ప్రాధాన్యమిస్తే మానవ జ్ఞానసంపాదనకు అట్టి అవకాశముంది, మానవుని శారీరిక ప్రవృత్తులు చక్కగా వివరింపబడినవి. భౌతిక విజ్ఞానానికి నియామికాలున్నవి. అది పంచేంద్రియాల కందినంతవరకు నియమింపబడినవి. కంటికగుపడని శక్తి తరంగాలు చెవులకు వినుపించని ప్రకంపనాలు అనేకములున్నవి. కాలభావజనిత వివరాలు, గ్రహ, ఉప గ్రహ వివరాలు చదువ శ్రద్ధ గలిగించుచున్నవి. సమన్వయభాగమందు చెప్పిన గీతా రహస్యములు సామాన్య మానవునికి కూడా అందుబాటులోనున్నవి.

భౌతిక విజ్ఞాన సంపత్తి సర్వసృష్టి రహస్యములను తెలిసికొనుటకు ఉపయుక్తముగాను. శాస్త్ర జ్ఞానముతో సర్వ ప్రపంచమును గ్రహింప శక్తి చాలదు. అనంతమగు జ్ఞానసాగరంలో శాస్త్ర విజ్ఞానం ఒక అణువనుచెప్పిన గ్రంధకర్త గారి అభిప్రాయం ప్రశంసనీయం. శాస్త్రజ్ఞాన అవధుల పరిశీలించిన అది నిరూపించవీలుగాని విషయము లనేకములున్నవని ఒప్పుకొనక తప్పదు. ఇది సందేహించి అనంత శక్తిని తృణీకరించుట మూర్ఖత్వము. చక్కని విషయములలో సుబోధకముగ యీ గ్రంధమును రచియించిన గ్రంధకర్త అభినందనీయులు.

శ్రీ డి వి. యస్

భూమి

గ్రంధకర్త— డాక్టర్ యస్. బాలక్రిష్ణ వెల రూ. 0—75 ప్రచురణ— శాస్త్రవిజ్ఞానము, చరిత్ర, తెలుగు, ఉర్దూ అకాడమీ, హైదరాబాదు. పుటలు—46.


ధారాళమైన శైలిలో భూమిని గూర్చిన పరిశోధనలు ఈ గ్రంధమందు వివరింపబడినవి. ఈ గ్రంధమునకు సంబంధించిన పరిశోధనలు అనేక దేశములందు జరుపబడినవి. జరుపబడు చున్నవి. ఇందలి సమస్యలు అనేకములు. పరిశోధన కష్టతరము. గ్రహ ఆకార పరిమాణములు, భ్రమణ విషయములు. సూర్య కుటుంబమందలి ఇతర గ్రహములతో భూమికి గల సంబంధ బాంధవ్యములు ప్రధాన విషయములు, భూమ్యంతర నిర్మాణ రహస్యములు. భూకంపము, అగ్నిపర్వతముల హేతువులు మొదలుగాగల అంశములు ఊహాసిద్ధాంతములని కొందరు సహేతుకములని కొందరు అభిప్రాయపడుచున్నారు. ఈ సందేహములే పరిశోధనా కారణములు. వీని పరిశీలనము సంగ్రహముగా ఇందు పొందుపరుపబడినది. భూమి వయస్సు మరియొక వివాదాంశము. ప్రాచీన భారతీయుల అభిప్రాయము సహేతుకరమని ఋజువగు చున్నది. భూమ్యుపరితల విషయముల వివరణ ప్రశంసనీయముగా నున్నది.

భూమికి సంబంధించిన విషయములు

వ్యాసము సుమారు 8000 మైళ్లు. భూపరిమాణము 26 × 10[illegible] మైళ్లు. ఉపరితల విస్తీర్ణము 51×10^{7} చదరపు మైళ్లు. భూభారము 67×10^{21} కి. గ్రాములు. సాంద్రత 5.5. పై పొరలోని సాంద్రత 2.7 భ్రమణతలము 66½° వాలి యున్నది. భూమి ఏటవాలు చలన పరిమితి 2600 సంవత్సరములు సూర్యునివద్దకు భూమి చేరు అల్పతమ దూరము [illegible].1 కోట్ల మైళ్లు. అధికతమ దూరము 9.4 కోట్ల మైళ్లు. ఒక భ్రమణ కాలములో సుమారు 365¼ పరిభ్రమణములు జరుగుచున్నవి. సెకనునకు 18.[illegible] మైళ్లు తీవ్ర వేగము. భూమి అండాకార గోళము. ఇందలి పొరలు నాలు భాగములుగా వివరింపబడినవి. (1) సి[illegible]డిన పలుచని ఉపరితల మట్టిపొర, (2) భారీ సిలికెట్ల మండలము. (3)సిడరైటులను పోలియున్న నికెల్—ఇనుముల [illegible] మండలము, (4) పూర్తిగా ఇనుముండు హే[illegible]ము. 2,3 మండలముల మధ్య భాగమున లోహపు, గంధకిద అమ్లజనిదముల యొక్క మరియొక మండలముండునని ప్రొఫెసర్ గోల్డుష్మిట్ అభిప్రాయము. భూమి వయస్సు 400 మొదలు 1,000 కోట్ల సంవత్సరముల వరకు నుండునని నిరూపించు పలువుర అభిప్రాయ[illegible]లు విశదీకరింపబడినవి. గాని ఇట్టి నిర్ణయము త[illegible]యము గాదు. గణిత శాస్త్రవేత్తలు భూమి వయస్సు 5—6 బిలియన్ల సంవత్సరములని ఋజువు చేసియున్నారు.

ఈ గ్రంధము చిన్నదగుటవలన గ్రంధకర్త వ్రాయదగిన సర్వవిషయముల పరిపూర్ణముగా వ్రాయనంవిగా లేదని స్పష్టమగు చున్నది. ఆంధ్రభాషయందు భూమిని గూర్చిన పుస్తకములు చాల తక్కువగా నున్ననూ, ఈ పుస్తకము చిన్నదైననూ గ్రంధకర్త ఇందు వ్రాసిన ముఖ్యాంశములు వెల లేనివి, ప్రశస్తములు. శ్రీ బాలక్రిష్ణగారు ఈ విషయముల విస్తరించి సమగ్ర గ్రంధమును తయారు చేయగల సమర్థులు. వారు ఆ కృషికి పూనుకొన్న ఆంధ్రదేశమునకు గొప్ప సేవ చేసినవారు గాగలరు.

శ్రీ డి. వి. యస్.



సంపూన్ని కాదని సుఖంగా జీవించడమంటే సాధారణమైన విషయంకాదు.

Edited & Published by the Director of Information & Public Relations, Andhra Pradesh, Hyderabad-1
Printed at Vir Milap Press: Mukarramjahi Road, Hyderabad.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం

విస్తీర్ణం, సివిల్ డివిజన్లు
(1961 జనాభా లెక్కలు)

వైశాల్యం ...	1,06,052 చదరపు మైళ్ళు
జనాభా ...	359.8 లక్షలు
జిల్లాలు ...	20
తాలూకాలు ...	189
పట్టణాలు, నగరాలు	223
జనసాంద్రత (చదరపు మైలుకు)	340 మంది

పంచవార్షిక పశుగణన -- 1961

(వేలలో)

పశువులు ...	123,45
గేదెలు ...	69,49
గొర్రెలు ...	83,63
మేకలు ...	42,47
గుర్రాలు ...	71
ఇతర జంతువులు ...	6,76

సమాజాభివృద్ధి కార్యక్రమం

వివరాలు:_	1959_60	1960_61	1961_62
బ్లాకులు ...	282	326	378
సగటున వేయిగ్రామాలకుగల బ్లాకులు ...	10.66	16	17
సగటున పదిలక్షల జనాభాకు గల బ్లాకులు	7.72	16	16
బ్లాకులక్రింద వున్న గ్రామాలు ...	178,87	20,901	245 02
బ్లాకు ప్రాంతాల్లో నివసించే ప్రజలు	187,31	205,73	235,65

ఖనిజోత్పత్తి

	1959_60	1960_61
	టన్నులు	టన్నులు
బొగ్గు ...	2296,000	2596,000
ముడిఇనుము ...	203,000	233,000
మాంగనీస్ ...	16,000	24,000
అభ్రకం ...	3,000	3,000
సున్నపురాయి ...	776,000	1,036,000

